ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
హైదరాబాద్ 1-10-2024 మంగళవారం సిటీ సంపుటి 51. సంచిక 52
రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



# కొలువుల దసరా

## 9న ఉపాధ్యాయ నియామక పత్రాలు

- డీఎస్సీ ఫలితాల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్
- 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



డీఎస్సీ ఫలితాల సీడీని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, బుర్రా వెంకటేశం, ఆకునూరి మురళి, పొంగులేటి, కేశవరావు, దామోదర్ రాజనరసింహ, సురేఖ, శాంతికుమారి, తుమ్మల, వేం నరేందర్‌రెడ్డి

ఈనాడు - హైదరాబాద్


తెలంగాణలో దసరాకు ఎంతో ప్రాధాన్యముంది. ఎంత పేదవారైనా ఆ పండగను సంతోషంగా జరుపుకొంటారు. ఈ ప్రాధాన్యం దృష్ట్యా డీఎస్సీలో ఎంపికైన వారికి అక్టోబరు 9న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలు అందజేస్తాం. కేవలం 55 రోజుల్లో డీఎస్సీ ఫలితాలు వెల్లడించాం. మరో 10 రోజుల్లో నియామక పత్రాలు అందించి, దసరాలోపే అభ్యర్థుల కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొనేలా చేస్తాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. డీఎస్సీ జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను (జీఆర్‌ఎల్) పలువురు మంత్రులు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో కలిసి సోమవారం ఆయన విడుదల చేశారు. ...మిగతా 2లో

## బహుళ ప్రయోజనాలతో డిజిటల్ కార్డులు

- 238 ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టు
- కుటుంబ సభ్యులందరూ అంగీకరిస్తేనే ఫొటో తీయాలి
- మార్పులు, చేర్పుల్లో పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్దు: సమీక్షలో సీఎం

ఈనాడు, హైదరాబాద్: బహుళ ప్రయోజనాలు చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా, పక్కా కార్యాచరణతో ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ కార్డుల జారీ కోసం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 238 ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టును సమర్థంగా చేపట్టాలన్నారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదు, మార్పులు.. చేర్పుల అంశంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వొద్దని అధికారులకు స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుపై ఉమ్మడి జిల్లాలవారీగా ఉన్న నోడల్ అధికారులు ...మిగతా 2లో

## కూల్చివేతల్లో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనలు



- స్టే ఉన్నా ఎలా చర్యలు చేపడతారు?
- సర్వేకు ముందు నోటీసులు ఇవ్వరా?
- హైడ్రా కమిషనర్, అమీన్‌పూర్ తహసీల్దార్‌లను నిలదీసిన హైకోర్టు
- ఇలాగైతే జీవో 99పై స్టే ఇస్తామని హెచ్చరిక
- కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: "పొలిటికల్, అధికారంలోని బాస్‌లు చెప్పినట్లు వింటే బలయ్యేది మీరే. ప్రస్తుత పోస్టులోనే ఎప్పటికీ ఉండరు. బాస్ అసంతృప్తికి గురైతే మరోచోటికి బదిలీ చేస్తారు. నిబంధనలను ఉల్లంఘించి బాస్‌లు చెప్పినట్లు వింటే ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది" అని హైకోర్టు హెచ్చరించింది. హైడ్రా ఏర్పాటు లక్ష్యాలు ఉన్నతంగా ఉన్నప్పటికీ ...మిగతా 6లో

> శని, ఆదివారాలతోపాటు సూర్యాస్తమయం తర్వాత కూల్చివేతలు ఉండరాదని ఈ హైకోర్టు తీర్పు ఉన్నా ఎలా ఉల్లంఘిస్తారు? జైలుకు పంపితే తెలుస్తుంది. ఉరి వేసేముందు కూడా చివరి కోరిక ఏమిటని అడుగుతారు. ఇది సహజ న్యాయసూత్రం. అది కూడా పాటించరా? నోటీసులకు ఇచ్చిన వివరణ పరిశీలించరా? కోర్టు ఉత్తర్వులనూ పట్టించుకోరా? స్టే ఉన్నా ఎలా చర్యలు చేపడతారు?
>
> తహసీల్దార్ లేఖ రాస్తే నిబంధనను పట్టించుకోకుండా మనుషులు, యంత్రాలను పంపి కూల్చివేతలు చేపడతారా? చార్మినార్ తహసీల్దార్ లేఖ రాస్తే చార్మినార్, హైకోర్టు భవనాలను కూల్చివేయడానికి కూడా యంత్రాలను పంపిస్తారా? చెరువుల పరిరక్షణ లక్ష్యం అభినందనీయం. అలాగని రాత్రికి రాత్రే పరిస్థితుల్లో మార్పు సాధ్యమా?
>
> -హైకోర్టు

## మిథున్ దాదా..

### లెజెండరీ నటుడికి ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం



దిల్లీ, కోల్‌కతా: హీరోగా, సహాయ నటుడిగా, ప్రతినాయకుడిగా పోషించిన పాత్రలకు వన్నె తెచ్చి భారతీయ చిత్రసీమలో లెజెండరీ నటుడిగా గుర్తింపు పొందిన మిథున్ చక్రవర్తిని ప్రతిష్ఠాత్మక 'దాదాసాహెబ్ ఫాల్కే' పురస్కారం వరించింది. ఈ విషయాన్ని కేంద్ర, సమాచార ప్రసార శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం 'ఎక్స్' వేదికగా తెలియజేశారు. "మిథున్ చక్రవర్తి అద్భుతమైన సినీ ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలు గుర్తించి ఈ ఏడాది దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం ఆయనకు అందించాలని జ్యూరీ నిర్ణయించింది" అని పేర్కొన్నారు. ...మిగతా 2లో

## అమెరికాకు పోదాం పద..

### వీసా దరఖాస్తుదారుల కోసం 2.5 లక్షల అదనపు స్లాట్ల విడుదల



దిల్లీ: అమెరికా వీసాల కోసం దరఖాస్తు చేసి ఇంటర్వ్యూ స్లాట్ల కోసం ఎదురు చూస్తున్న వారికి శుభవార్త. భారతీయుల కోసం 2.5 లక్షల అదనపు వీసా స్లాట్లను విడుదల చేసినట్లు సోమవారం అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. ఇందులో పర్యాటకులు, వృత్తి నిపుణులు, విద్యార్థుల స్లాట్లు ఉన్నాయని తెలిపింది. ఫలితంగా భారతీయులు సమయానికి వీసాలను పొందే సౌకర్యం కలుగుతుందని వివరించింది. 'ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు బైడెన్‌లు వీసాల జారీలో వేగం పెంచేందుకు నిర్ణయించిన లక్ష్యంలో భాగంగా స్లాట్లను విడుదల చేశాం. ఈ హామీని నెరవేరుస్తున్నామని చెప్పడానికి గర్వపడుతున్నా. ...మిగతా 2లో


రైతు దీక్షలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న భాజపా నాయకులు హరీశ్‌బాబు, నగేశ్, విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, అర్వింద్, రఘునందన్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, రామారావు పటేల్

## ఓట్లేసిన రైతులను మోసం చేసిన కాంగ్రెస్

- రైతు దీక్షలో ప్రభుత్వ తీరును ఎండగట్టిన భాజపా నేతలు
- వెయ్యి మంది అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారన్న ఏలేటి
- ఎంత రుణమాఫీ చేశారో పోర్టల్‌లో పెట్టాలని ఈటల డిమాండ్

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, రాంనగర్: రైతులు ఓట్లేస్తేనే గెలిచిన కాంగ్రెస్.. వారిని మోసం చేస్తోందంటూ భాజపా నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రైతాంగానికి భాజపా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతు హామీల సాధన కోసం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద సోమవారం చేపట్టిన 24 గంటల దీక్షకు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు ...మిగతా 5లో

## మూసీ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం

- 2400 కి.మీ. గంగా ప్రక్షాళన ఖర్చే రూ.40 వేల కోట్లు
- 55 కి.మీ. మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లా?: కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్‌కు తాగునీటిని అందిస్తోంది. మరి మూసీ ప్రాజెక్టుతో ఒక్క ఎకరానికైనా కొత్తగా నీళ్లు వస్తాయా అని మాజీ మంత్రి కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'యమునా నది ప్రక్షాళనకు రూ.1,000 కోట్లు అయింది. సబర్మతి సుందరీకరణకు ఖర్చు రూ.7 వేల కోట్లు. ...మిగతా 5లో



అత్తాపూర్‌లో మూసీ బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

## సిట్‌ను కొనసాగించాలా? స్వతంత్ర సంస్థను వేయాలా?



### తిరుమల లడ్డూ వివాదంపై సొలిసిటర్ జనరల్ అభిప్రాయం కోరిన సుప్రీంకోర్టు

- తదుపరి విచారణ గురువారానికి వాయిదా
- దేవుళ్ల విషయంలో రాజకీయాలు తగవని వ్యాఖ్య

ఈనాడు, దిల్లీ: శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిని వినియోగించారనే ఆరోపణలపై దర్యాప్తునకు ఏపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్నే(సిట్) కొనసాగించాలా? లేదంటే స్వతంత్ర సంస్థను ఏర్పాటుచేయాలా? అని సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది. దీనిపై ఏ విషయాన్నీ గురువారం చెప్పాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది. కోట్లమంది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ వివాదంపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ జరిపించాలని కోరుతూ... మాజీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి, తితిదే బోర్డు మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, విక్రమ్‌సంపత్ అనే భక్తుడు, సుదర్శన్ టీవీ ఎడిటర్ సురేష్ దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై విచారణ చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతోకూడిన ధర్మాసనం ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

'లడ్డూ తయారీలో జంతుకొవ్వుతో కూడిన నెయ్యిని వాడారనే అంశంపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని, ధార్మిక కార్యకలాపాలు నిర్వహించే ట్రస్ట్‌లు, ప్రసాదం తయారీదారులను నియంత్రిస్తూ స్పష్టమైన ఆదేశాలు జారీచేయాలని నాలుగు పిటిషన్లు దాఖలయ్యాయి. తితిదే తరఫున విచారణకు హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థలూథ్రా తన వాదనను వినిపించారు. జులై 4 వరకు సరఫరా చేసిన నెయ్యి ట్యాంకర్లను పరీక్షలకు పంపలేదని, జులై 6, 12 తేదీల్లో సరఫరా చేసిన నాలుగు ట్యాంకర్ల నమూనాల్నే నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ) పరీక్షలకు పంపామని, ఆ నాలుగింటిలోనూ కల్తీ ఉన్నట్లు తేలిందని చెప్పారు. జులై 4 వరకు సరఫరా అయిన నెయ్యిని లడ్డూ తయారీకోసం ఉయోగించామని, ...మిగతా 2లో

## దసరాకు ఆరు వేల ప్రత్యేక బస్సులు

5లో

- నేటి నుంచి 15 వరకు నడుపుతాం: ఆర్టీసీ ఎండీ

## 'స్థానికత'ను వచ్చే ఏడాది నుంచి అమలు చేయొచ్చేమో పరిశీలించండి

- వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించి జీవో 33పై రాష్ట్రానికి సీజేఐ చంద్రచూడ్ సూచన

14లో

## కాన్పూర్‌లో రికార్డుల మోత

- భారత్‌కు గెలుపు ఆశలు
- బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు

-వివరాలు ఛాంపియన్ లో

## ఇదీ సంగతి!



సరే! ఇంతకీ మీరు నిజం పోలీసులేనని నమ్మకం ఏంటి?

## దోపిడీ కొండంత.. దొరికేది గోరంత

- ఈ ఏడాది ఆగస్టు వరకు రూ.1300 కోట్లు దోచుకున్న సైబర్ నేరగాళ్లు
- పోలీసులు రికవరీ చేసింది రూ.114 కోట్లే

ఈనాడు, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు కొండంత సంపద కొల్లగొడుతుంటే.. పోలీసులు అతికష్టం మీద గోరంత రికవరీ చేయగలుగుతున్నారు. బాధితుల్లో 90 శాతం మందికి న్యాయం దక్కడం లేదు. ఒక్క తెలంగాణ నుంచే ఈ ఏడాది మొదటి ఎనిమిది నెలల్లో సైబర్ మోసగాళ్లు రూ.1300 కోట్లు దోచుకున్నారు. ఇందులో పోలీసులు ఇప్పటివరకు రూ.114 కోట్లు మాత్రం రికవరీ చేయగలిగారు. ఇది పోయిన సొమ్ములో 10 శాతం కూడా కాదు. ప్రజలు సైబర్ నేరాల పట్ల కొద్దిపాటి అవగాహన పెంచుకుంటే వాటిని నియంత్రించడంతోపాటు బాధితులు పోగొట్టుకున్న సొమ్ములో చాలావరకు తిరిగి రాబట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. ఉదాహరణకు ఒక ప్రముఖ బహుళజాతి సంస్థలో ఎకౌంట్స్ విభాగం ఉన్నతాధికారికి ముంబయి పోలీసుల పేరుతో ఓ ఫోన్ కాల్ వచ్చింది. మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని, వీడియో కాల్ ద్వారా సీబీఐ విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాల వివరాలు చెప్పాలని హడావుడి చేశారు. ఆయన భయంతో అన్ని వివరాలు ఇచ్చేశారు. ...మిగతా 2లో

## కబ్జాల కట్టడికి కావాలో చట్టం



### ఆక్రమణదారులను శిక్షించేలా ఉండాలంటున్న నిపుణులు

- 2016లో రద్దయిన 'ల్యాండ్ గ్రాబింగ్' యాక్ట్
- ప్రత్యేక కోర్టు కూడా..
- కొత్త రెవెన్యూ చట్టం తయారీ నేపథ్యంలో చర్చ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూముల ఆక్రమణలు.. చెరువులు, కుంటల శిఖాల్లో కబ్జాలు యథేచ్ఛగా పెరిగిపోతున్నా ఎందుకు అడ్డుకట్ట పడటం లేదన్నది ప్రస్తుతం అన్నిచోట్లా జరుగుతున్న చర్చ. ఈ క్రమంలో ప్రభుత్వ భూముల రక్షణకు రెవెన్యూ శాఖ మొదట నడుం బిగించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే ఏ శాఖ పరిధిలోని భూములను ఆ శాఖ అధికారులు రెవెన్యూశాఖ సహకారంతో పరిరక్షించుకోవాలని అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్ నగరంలో ప్రభుత్వం ప్రత్యేకంగా హైడ్రాను ఏర్పాటు చేసింది. కూల్చివేతలు, కబ్జాదారులపై కేసుల నమోదు జరుగుతున్నా.. ఆక్రమణలకు సంబంధించి చట్టపరమైన శిక్షలకు ప్రత్యేకంగా కోర్టులు లేవు. రాష్ట్రంలో 2016 జూన్ 1న ప్రభుత్వం జీవో నం.113 ద్వారా భూ ఆక్రమణల నిరోధక చట్టం 'ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) యాక్ట్, 1982'ను రద్దుచేసింది. దీంతో ప్రత్యేక కోర్టు కూడా రద్దయింది.

### కొత్త రెవెన్యూ చట్టంతో పాటే..

రాష్ట్రంలో భూ సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పట్టా భూముల యాజమాన్య హక్కులకు పక్కాగా రక్షణ కల్పించడం, అప్పీళ్లకు అవకాశం కల్పించేందుకు ఆర్వోఆర్-2024 పేరుతో కొత్త రెవెన్యూ చట్టాన్ని త్వరలోనే తీసుకురాబోతోంది. ...మిగతా 15లో



## పిల్లల్ని అలా పెంచడం తల్లిదండ్రుల తప్పే

మీ పిల్లలు ఏం అడిగినా అతి(ప్రేమతో ఇస్తూ వెళ్లకండి. దానివల్ల తాము కోరుకున్న ప్రతిదాన్నీ పొందే హక్కు తమకు ఉందన్న పొగరుతో పెరుగుతారు. ఇరుగుపొరుగు వారితో, ఉపాధ్యాయులతో, తోటి పిల్లలతో అమర్యాదగా ప్రవర్తించినప్పుడు మీ పిల్లల పక్షాన మాట్లాడకండి. అలా చేస్తే తాము ఏం చేసినా సరైనదేనని, తల్లిదండ్రులు తమకే వత్తాసు పలుకుతారన్న నమ్మకంతో నిర్భీతిగా వ్యవహరిస్తారు. ఈ ధోరణితో వారు భవిష్యత్తులో బాధ్యత లేని పౌరులుగా మారితే అది ముమ్మాటికీ తల్లిదండ్రుల తప్పే. - **అవినాశ్ శరణ్, ఐఏఎస్ అధికారి**

# కొలువుల దసరా

(మొదటి పేజీ తరువాయి)

1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించి తుది నియామకాలు చేపడతామన్నారు.

### ప్రక్షాళన చేస్తున్నాం

"గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒకే ఒక్క డీఎస్సీ నిర్వహించింది. 7,857 ఉద్యోగాలనే భర్తీ చేసింది. ఏ కోశానా విద్యారంగాన్ని ప్రక్షాళన చేసి విద్యను పేదలకు అందుబాటులో ఉంచాలన్న ఆలోచన చేయలేదు. మేం వచ్చాక గత ఫిబ్రవరిలో పోస్టులు పెంచి.. నోటిఫికేషన్ ఇచ్చాం. విద్యకు బడ్జెట్ పెంచాం. ఇంకా పెంచుతాం. ఈ రంగంపై పెట్టే ఖర్చును పెట్టుబడిగా.. భవిష్యత్తు తరాలకు ప్రయోజనం కలిగించేదిగా భావిస్తున్నాం. బోధన వృత్తి ఉద్యోగం కాదు.. అది భావోద్వేగం. పదేళ్లుగా ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించకపోతే మేం ఆ ప్రక్రియను పూర్తిచేశాం. గ్రూపు-1 ఫలితాలను కూడా త్వరలో ప్రకటిస్తాం. గ్రూపు ఉద్యోగాలను గత ప్రభుత్వం అంగడి సరకుగా మార్చగా.. మా సర్కారు టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసింది. అనుభవమున్న, నిపుణులైన వారిని నియమించాం. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోపు 60 వేల నుంచి 65 వేల పోస్టులను భర్తీ చేస్తాం. వివిధ శాఖల్లో ఖాళీలను భర్తీ చేస్తూ.. నిరుద్యోగ సమస్యను పరిష్కరించి.. గతంలో పేరుకుపోయిన చెత్తను అంతా ప్రక్షాళన చేసుకుంటూ పరిపాలన చేస్తున్నాం.

### పిట్టగూళ్లలో.. కోళ్ల ఫారాల్లో గురుకులాలు పెట్టారు

కేసీఆర్.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను వేరు చేసి గురుకులాలను మంజూరు మాత్రమే చేశారు. పిట్టగూళ్లలో.. కోళ్ల ఫారాల్లో వాటిని పెట్టారు. ఎక్కడా కనీస మౌలిక వసతులు కల్పించలేదు. అందుకే మేం హైదరాబాద్‌ను మినహాయించి రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం 100 యంగ్ ఇండియా.. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నాం. ఆ నియోజకవర్గంలోని గురుకులాలను అక్కడికి చేర్చుతాం. ఒక్కో దాన్ని రూ.100-125 కోట్ల వ్యయంతో 20-25 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పుతాం. మొత్తం రూ.10 వేల నుంచి రూ.10,500 కోట్లు ఖర్చవుతాయి. విశ్వవిద్యాలయాల స్థాయిలో క్రీడా మైదానాలు, ల్యాబ్‌లు, వసతులు కల్పిస్తాం. పైలట్ ప్రాజెక్టుగా మధిర, కొడంగల్‌లో నిర్మాణాలు చేపడుతున్నాం.

### గత ప్రభుత్వ బాధ్యతారాహిత్యం వల్లే

రాష్ట్రవ్యాప్తంగా 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు తక్కువగా ఉన్నాయి. శౌచాలయాలు లేవని, విద్యార్థులు బారులు తీరారని కొన్ని టీవీలు, పత్రికలు రాశాయి. ఆ బడులను మేం కొత్తగా పెట్టామా? పదేళ్లు పాలించిన గత ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్లే ఈ ఉపద్రవం వచ్చింది. గత సర్కారు ఏకోపాధ్యాయ పాఠశాలలను మూసివేస్తే మేం పేద పిల్లల కోసం వాటిని తెరుస్తున్నాం. అన్ని పాఠశాలల్లో వసతులు పెంచడమే మా లక్ష్యం" అని సీఎం వివరించారు.

### ఉపాధ్యాయ ఖాళీల భర్తీ నిరంతర ప్రక్రియ

ఉపాధ్యాయ ఖాళీల భర్తీ నిరంతర ప్రక్రియని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా సీఎం చెప్పారు. 'ఉద్యోగ క్యాలెండర్ ప్రకారం ఏటా పోస్టులు భర్తీ చేస్తాం. దానిప్రకారం వచ్చే ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం. ఇప్పుడు 11,062 పోస్టులకు ఎంత మంది చేరతారు? ఎన్ని మిగులుతాయి? పదవీ విరమణలు.. తదితర వివరాల ఆధారంగా పోస్టుల సంఖ్యపై నిర్ణయానికి వస్తాం. విద్యార్థులు లేరని పాఠశాలలను మూయబోం' అని వెల్లడించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ దానిపై కమిటీ వేసే ఆలోచన ఉందన్నారు. మంత్రులు దామోదర్ రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, సీఎస్ శాంతికుమారి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నరసింహారెడ్డి, అదనపు డైరెక్టర్ లింగయ్య పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్: **2024 ఫిబ్రవరి 29**
మొత్తం ఉపాధ్యాయ పోస్టులు: **11,062**
పరీక్ష నిర్వహణ: **జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు**
పరీక్ష రాసిన వారు: **2,46,584**

**పోస్టుల వారీగా ఖాళీలు...**
స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ): **2,629**
సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ): **6,508**
భాషా పండితులు: **727**
వ్యాయామ విద్య ఉపాధ్యాయులు (పీఈటీ): **182**
స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేటర్స్): **220**
సెకండరీ గ్రేడ్ టీచర్స్ (స్పెషల్ ఎడ్యుకేటర్స్): **796**

## దిల్లీ వెళ్లిన సీఎం

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి దిల్లీ వెళ్లారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కశ్మీర్ ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురికావడంతో పరామర్శ కోసం సీఎం వెళ్లినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ ముఖ్యనేతలను రేవంత్‌రెడ్డి కలిసే అవకాశాలున్నాయని సమాచారం. పార్టీ అగ్రనేతలంతా హరియాణా ఎన్నికల హడావుడిలో ఉన్నందున మంగళవారం రాత్రికి సీఎం తిరిగి హైదరాబాద్‌కు వచ్చే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## నేటి నుంచి డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన

### ●అర్హులకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం

**ఈనాడు, హైదరాబాద్:** డీఎస్సీ జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ (జీఆర్ఎల్) మేరకు.. ఆయా జిల్లాల్లో 1:3 నిష్పత్తిలో ఎంపికైన వారికి ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి తెలిపారు. ఆ తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. జిల్లాలు.. రోస్టర్ పాయింట్ల ఆధారంగా 1:3 నిష్పత్తిలో అర్హులైన అభ్యర్థులకు ఎస్ఎంఎస్, ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందిస్తామని తెలిపారు. ఈ జాబితాలు డీఈఓ వెబ్‌సైట్లలోనూ ఉంటాయన్నారు. అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, టెట్, డీఎస్సీ, కుల, 1-7 తరగతుల స్టడీ సర్టిఫికెట్ (ఒరిజినల్)లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్లో ఉంచిన ఫారాన్ని నింపి తెచ్చుకోవాలన్నారు.

**సమయమేదీ?:** టీజీపీఎస్సీలో జీఆర్ఎల్ ఇచ్చిన తర్వాత 15 లేదా 30 రోజులకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ప్రకటిస్తారు. డీఎస్సీలో మాత్రం జీఆర్ఎల్ ఇచ్చిన మరుసటి రోజు నుంచే ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని ప్రకటించారు. దీంతో పలు రకాల ధ్రువపత్రాలను ఎలా తెచ్చుకోవాలో తెలియక అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. కుల తదితర సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 2000 సంవత్సరంలోపు 1-7 తరగతులు చదివిన వారికి స్టడీ సర్టిఫికెట్ తెచ్చుకోవడం కూడా ఇబ్బందికరంగా మారింది. ఆనాడు ఉన్న పలు స్కూళ్లు ఇప్పుడు లేనందున తహసీల్దార్ల నుంచి స్థానికత సర్టిఫికెట్ తెచ్చుకోవాల్సి ఉంటుంది.

## సత్తా చాటిన తండ్రీకొడుకులు, అన్నదమ్ములు

**మరికల్ కూడలి, కోస్గి న్యూటౌన్- న్యూస్‌టుడే:** డీఎస్సీ ఫలితాల్లో నారాయణపేట జిల్లా మరికల్ మండలం రాకొండ గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు, కోస్గి మండలం ముక్తిపహాడ్ గ్రామానికి చెందిన అన్నదమ్ములు సత్తాచాటారు. రాకొండకు చెందిన 50 ఏళ్ల జంపుల గోపాల్.. తెలుగు పండిట్ కేటగిరిలో జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో మూడో ర్యాంకు పొందారు. ఆయన కుమారుడు భానుప్రకాశ్ నారాయణపేట జిల్లా స్థాయిలో గణితంలో స్కూల్ అసిస్టెంట్ 9వ ర్యాంకు సాధించారు. ◆ ఇదే జిల్లా కోస్గి మండలం ముక్తిపహాడ్ గ్రామానికి చెందిన ఈడ్గి కృష్ణయ్య స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించగా.. ఆయన సోదరుడు ఈడ్గి రమేశ్ ఎస్జీటీ విభాగంలో జిల్లాలో 11వ ర్యాంకు కైవసం చేసుకున్నారు.

## రెండు ప్రమాదాల్లో ఏడుగురి దుర్మరణం

### ఆదిలాబాద్, నల్గొండ జిల్లాల్లో ఘటనలు

**ఆదిలాబాద్ నేర విభాగం, కోదాడ, వేములపల్లి, చిలుకూరు, న్యూస్‌టుడే:** ఆదిలాబాద్, నల్గొండ జిల్లాల్లో సోమవారం అర్ధరాత్రి జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద జాతీయ రహదారిపై ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను రాసుకుంటూ వెళ్లి బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న ఆదిలాబాద్‌కు చెందిన మోయిజ్ (60), అలీ (8), ఖాజా మోయినుద్దీన్ (40), మహ్మద్ ఉస్మానుద్దీన్ (10) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆయేషా ఆఫ్రీన్, ఫరీద్‌కు తీవ్రగాయాలవగా.. వారిని చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. మరో ఘటనలో.. నల్గొండ జిల్లా త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారం గ్రామానికి చెందిన మల్లికంటి దినేశ్ (22).. కొత్త కారు కొనేందుకని తన స్నేహితులు వేములపల్లి మండలం మొలకపట్నం గ్రామానికి చెందిన వలపుదాసు వంశీ (22), మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన అభిరాళ్ల శ్రీకాంత్ (21)తో కలిసి సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి వెళ్లారు. అక్కడ కొంత డబ్బు చెల్లించి ద్విచక్రవాహనంపై స్వగ్రామాలకు తిరిగి వెళ్తుండగా.. చిలుకూరు మండలంలోని మిట్స్ కళాశాల వద్ద లారీని ఢీకొట్టారు. దీంతో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు.

## దోపిడీ కొండంత.. దొరికేది గోరంత

(మొదటి పేజీ తరువాయి)

ఎకౌంట్‌లోని మొత్తం సొమ్ము పోయాక మోసం అర్థమైనా ఆ తర్వాత ఏమి చేయాలో ఆయనకు తెలియలేదు. ఆలస్యంగా 1930కి ఫిర్యాదు చేశారు. అప్పటికే ఆయన ఖాతా నుంచి మాయమైన డబ్బు దేశవ్యాప్తంగా వేర్వేరు ఖాతాల్లోకి మళ్లించిన నేరగాళ్లు ఎక్కడికక్కడ డ్రా చేసుకున్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఉన్నత ఉద్యోగస్థుడైన ఆయనకు దర్యాప్తు సంస్థలేవీ వీడియో కాల్ ద్వారా విచారణ చేయవని అవగాహన లేకపోవడం. తాను ఏ తప్పు చేయలేదన్న విషయం తెలిసినా సీబీఐ అనగానే భయపడటం. కనీసం డబ్బు పోగొట్టుకున్న వెంటనే 1930కి ఫోన్ చేస్తే ఇతర ఖాతాల్లోకి బదిలీ కాకుండా నిలువరిస్తారని తెలియకపోవడం. బాధితులు ఆలస్యంగా ఫిర్యాదు చేస్తుండటంతోనే రికవరీ 10% కూడా మించడం లేదని పోలీసులు అంటున్నారు.



# బహుళ ప్రయోజనాలతో డిజిటల్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్లకు మార్గనిర్దేశం చేయాలని సీఎం తెలిపారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పైలట్ ప్రాజెక్టు సందర్భంగా గుర్తించిన అంశాలు, సానుకూలతలు, ఎదురైన ఇబ్బందులతో నివేదిక రూపొందించాలని సీఎం సూచించారు. ఆ నివేదికపై సమగ్రంగా చర్చించి, లోపాలను సరిదిద్ది.. రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కార్యక్రమం చేపడదామన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులో 'ఫొటో' అనే అంశం ఆప్షనల్‌గా మాత్రమే ఉండాలని సీఎం స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులందరూ సమ్మతిస్తేనే ఫొటో తీయాలని.. లేకుంటే అవసరం లేదని చెప్పారు. "ప్రతి నియోజకవర్గం పరిధిలో పైలట్ ప్రాజెక్టుకు ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకోవాలి. ఒకవేళ పూర్తిగా పట్టణ లేదా నగర నియోజకవర్గమైతే రెండు వార్డులు లేదా రెండు డివిజన్లను ఎంపిక చేయాలి. పూర్తిగా గ్రామీణ నియోజకవర్గమైతే రెండు గ్రామాల్లో చేపట్టాలి. రాష్ట్రంలో 238 ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి. జనాభా ప్రాతిపదికగా పరిశీలన బృందాలను, సిబ్బంది సంఖ్యను నియమించుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో జనాభా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి" అని సీఎం సూచించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### అక్టోబరు 3 నుంచి 7 వరకు..

పైలట్ ప్రాజెక్టును అక్టోబరు 3 నుంచి 7వరకు చేపట్టనున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ప్రభుత్వం వద్ద ఉన్న వివరాల మేరకు ఇప్పటికే కుటుంబాల గుర్తింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని వివరించారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని నిర్ధారించుకోవడంతో పాటు ఆ కుటుంబంలో కొత్త సభ్యుల పేర్లు జతచేయడం, మృతి చెందినవారి పేర్లు తొలగించడం వంటివి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, సీఎం కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, అజిత్‌రెడ్డి, సంగీత సత్యనారాయణ, మాణిక్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సిట్‌ను కొనసాగించాలా? స్వతంత్ర సంస్థను వేయాలా?

(మొదటి పేజీ తరువాయి)

జులై 6, 12వ తేదీల్లో సరఫరా అయిన నెయ్యిని వాడలేదని ఈవో చెప్పినట్లు సిద్ధార్థలూథ్రా కోర్టు దృష్టికి తెచ్చారు. పాత సంస్థ సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగినట్లు కనిపించడంతో నమూనాలను ఎన్‌డీడీబీ ద్వారా పరీక్షించినట్లు చెప్పారు. అందులో వచ్చిన ఫలితాలను అనుసరించి దీనిపై దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వం భావించినట్లు పేర్కొన్నారు. దానికి అనుగుణంగా తితిదే సెప్టెంబరు 25న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన ఎఫ్ఐఆర్‌పై దర్యాప్తు కోసం ప్రభుత్వం 26న సిట్‌ను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సెప్టెంబరు 18న ఈ అంశంపై బహిరంగంగా మాట్లాడారు. కోట్లమంది ప్రజల మనోభావాలపై ప్రభావం చూపే అంశాలపై ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు బహిరంగ ప్రకటనలు చేయడం సరికాదన్నది మా ప్రాథమిక అభిప్రాయం. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగించాలా? లేదంటే స్వతంత్ర సంస్థ చేత కొనసాగించాలా? అన్న విషయంలో నిర్ణయం తీసుకొనే అంశంలో సొలిసిటర్ జనరల్ సహకారం కోరడాన్ని సబబుగా భావిస్తున్నాం' అని జస్టిస్ బీఆర్ గవాయి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### వాదనలు సాగిందిలా...

తొలుత సుబ్రహ్మణ్యస్వామి తరపున సీనియర్ న్యాయవాది రాజశేఖరరావు వాదనలు వినిపించారు. లడ్డూ తయారీలో కల్తీనెయ్యి వినియోగించినట్లు ప్రభుత్వం చెబుతున్నా, ఆ నెయ్యిని వాడలేదని ఈవో పేర్కొన్నారని.. దీనిపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతున్నామన్నారు.

### మేం ప్రసాదం స్వచ్ఛతను కోరుకుంటున్నాం

సిద్ధార్థలూథ్రా వాదనలు వినిపించే సమయంలో న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి పలు ప్రశ్నలు వేశారు. 'నెయ్యిలో జంతుకొవ్వు కలిసినట్లు చెప్పడానికి మీవద్ద ఏమైనా ఆధారాలు ఉన్నాయా? సిట్ దర్యాప్తు నివేదిక రాకముందే ఈ విషయంపై మీడియా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చింది? రాజకీయాల నుంచి కనీసం దేవుళ్లనైనా పక్కనపెట్టాలి కదా. కల్తీ నెయ్యిని లడ్డూ తయారీలో ఉపయోగించారనడానికి ఆధారమేంటి? కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చినప్పుడు ప్రతి ఒక్క ట్యాంకర్ నమూనానూ తీసుకొని ఉండాల్సింది. మేం అక్కడి ప్రసాదం స్వచ్ఛతను కోరుకుంటున్నాం' అని పేర్కొన్నారు.

◆ మరో న్యాయమూర్తి జస్టిస్ కేవీ విశ్వనాథన్ కూడా పలు ప్రశ్నలు సంధించారు. 'ఎన్‌డీడీబీ నివేదిక జులైలో వచ్చింది. సెప్టెంబరు 18న మీరు (ముఖ్యమంత్రి) మీడియా ముందుకెళ్లి దర్యాప్తును ఆదేశించినట్లు చెప్పారు. సిట్‌ను ఏర్పాటు చేశారంటే ఆ రోజుకు విషయంలో స్పష్టత లేదని అర్థం. అలాంటప్పుడు సెప్టెంబరు 18న సీఎం మీడియా ముందుకు వెళ్లడంలో జస్టిఫికేషన్ ఎక్కడుంది? కల్తీ నెయ్యిని లడ్డూకోసం వాడినట్టు నివేదికలో ఎక్కడా స్పష్టంగా లేదు. ఎన్‌డీడీబీ నివేదికపై రెండో అభిప్రాయం తీసుకోవాల్సిన అవసరం కనిపించలేదా? మా అభిప్రాయం ప్రకారం... ఆ నెయ్యిని ఉపయోగించినట్లు చూపే స్పష్టమైన ఆధారాలు ఏమీ లేవు' అని పేర్కొన్నారు.

### నాణ్యతపై ఫిర్యాదులు రావడంతో...

సిద్ధార్థలూథ్రా బదులిస్తూ 'లడ్డూ నాణ్యతపై ఫిర్యాదులు రావడంతో నెయ్యి నమూనాల్ని గుజరాత్‌లోని ల్యాబ్‌కు పంపారు. నివేదిక అందాక నెయ్యి సరఫరా చేసిన సంస్థకు షోకాజు నోటీసులిచ్చారు. దీనిపై ఎఫ్ఎస్ఎస్ఏఐ దర్యాప్తు ప్రారంభించింది. నెయ్యిని ఎలా సేకరించారన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. 50 ఏళ్లుగా కర్ణాటక మిల్క్‌ఫెడరేషన్ నుంచి తప్పితే మరెక్కడి నుంచీ నెయ్యి సేకరించలేదు. గత ప్రభుత్వ హయాంలో కొన్నేళ్లుగా ప్రైవేటు వ్యాపారుల నుంచి సేకరించడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో లడ్డూ నాణ్యతపై ఫిర్యాదులొచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక నెయ్యి నమూనాలను ఎన్‌డీడీబీ ద్వారా పరిశీలన చేయించాం. నెయ్యి సరఫరా టెండర్లను ఈ ఏడాది ఏప్రిల్‌లో ఖరారుచేశారు. జూన్ 12, 20, 25, జులై 4, 6, 12 తేదీల్లో నెయ్యి ట్యాంకర్లు వచ్చాయి. జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడింది. నెయ్యి వచ్చినప్పుడు తితిదే అందులోని ఫ్యాట్‌కంటెంట్‌పై పరిశీలన జరుపుతుంది. అది ప్రమాణాల ప్రకారం లేదని తేలింది. టెండర్ నిబంధనల ప్రకారం రెండో పరీక్ష చేయించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్‌డీడీబీ ద్వారా పరీక్షలు చేయించారు. జులై 6, 12 తేదీల్లో వచ్చిన ట్యాంకర్లలోని నెయ్యిని లడ్డూ తయారీకోసం వాడలేదు. అంతకుముందు వచ్చిన ట్యాంకర్లను వినియోగించారు. లడ్డూను తీసుకున్న భక్తులు ప్రసాదం రుచి సరిగా లేదని ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా లోపం ఉన్నట్లు భావనకు వచ్చాం. ఎన్‌డీడీబీ నివేదిక ప్రకారం జులై 23న మేం నెయ్యి సరఫరా సంస్థకు షోకాజ్ నోటీసు జారీచేశాం. దానికి వాళ్లు సమాధానం ఇచ్చారు. దాన్ని అనుసరించి మిమ్మల్ని బ్లాక్‌లిస్ట్‌లో ఎందుకు పెట్టకూడదని అడిగాం. దానికి వాళ్లు సెప్టెంబరు 4న సమాధానం ఇచ్చారు. ఈ విషయం బాహ్యప్రపంచానికి తెలియడంతో ప్రభుత్వం ప్రకటన చేయాల్సి వచ్చింది' అని సిద్ధార్థలూథ్రా బదులిచ్చారు. ఇంతకంటే ముందు నుంచీ కల్తీ జరిగి ఉండొచ్చని, ప్రభుత్వం మారాకే పరీక్షలు చేయించినట్లు చెప్పారు.

◆ ఈ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ... 'ఇది విశ్వాసానికి సంబంధించిన అంశం. ఒకవేళ కల్తీ నెయ్యిని వాడి ఉంటే దానికి బాధ్యులెవరు? నిర్లక్ష్యంగా జరిగిందా? ఉద్దేశపూర్వకంగా చేసిందా? ఇంకా ఏదైనా కారణం ఉందా? అన్నది చూడాలి' అని అన్నారు. ముకుల్‌రోహత్గీ జోక్యంచేసుకుంటూ కావాలంటే దర్యాప్తునకు కేంద్ర ప్రభుత్వ అధికారిని నియమించవచ్చని సూచించారు. జస్టిస్ గవాయి స్పందిస్తూ దీనిపై కేంద్ర ప్రభుత్వం అభిప్రాయం చెప్పనివ్వండి అని పేర్కొన్నారు. అనంతరం ధర్మాసనం ఈ కేసును గురువారానికి వాయిదా వేసింది.

# అమెరికాకు పోదాం పద..

(మొదటి పేజీ తరువాయి)

డిమాండుకు అనుగుణంగా వీసా ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాం' అని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ వెల్లడించారు.

అమెరికా వీసాలకు ఇటీవలి కాలంలో భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో పర్యాటక వీసాల స్లాట్లకు కొన్ని చోట్ల ఏడాదికిపైగా సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా రాయబార కార్యాలయం చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

◆ ఈ ఏడాది ఇప్పటిదాకా అమెరికాకు 12 లక్షల మంది భారతీయులు ప్రయాణించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 35శాతం అధికం.

◆ వలసేతర వీసా దరఖాస్తుల్లో ఇప్పటికే 10 లక్షల ఇంటర్వ్యూలను అమెరికా రాయబార కార్యాలయం నిర్వహించింది. గత ఏడాదిలోనూ 10లక్షలకుపైగా ఇంటర్వ్యూలను చేసింది.

◆ విద్యార్థి వీసాల ప్రాసెసింగ్‌లోనూ ఈ ఏడాది రికార్డు సృష్టించామని రాయబార కార్యాలయం వెల్లడించింది. తొలిసారి వీసాలకు దరఖాస్తు చేసిన విద్యార్థులందరికీ ఇంటర్వ్యూలు నిర్వహించామని వివరించింది.

### 60 లక్షల మందికి వలసేతర వీసాలు

కుటుంబాలను మమేకం చేయడం, వ్యాపారాల వృద్ధి, పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి ప్రాధాన్యమిస్తున్నామని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది. ప్రస్తుతం 60 లక్షల మంది భారతీయులకు వలసేతర వీసాలున్నాయని వెల్లడించింది. ప్రతి రోజూ వేల వీసాలను జారీ చేస్తున్నామని వివరించింది.

◆ 2023లో భారతీయ విద్యార్థులకు 1.4 లక్షల వీసాలను జారీ చేశామని అమెరికా రాయబార కార్యాలయం గతంలో తెలిపింది. ఇది ప్రపంచంలోనే ఏ ఇతర దేశం కన్నా అధికమని వివరించింది. వరుసగా మూడేళ్లపాటు విద్యార్థి వీసాల జారీలో రికార్డు సృష్టించామని వెల్లడించింది.

# మిథున్ దాదా..

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబరు 8న జరగనున్న జాతీయచలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. మిథున్ చక్రవర్తిని ఈ ఏడాది ఆరంభంలో 'పద్మభూషణ్' పురస్కారంతో సత్కరించిన కేంద్రం తాజాగా ఆయనకు 'దాదాసాహెబ్ ఫాల్కే' పురస్కారాన్ని ప్రకటించింది.

### మూడుసార్లు జాతీయ పురస్కారాలు..

పశ్చిమబెంగాల్‌కు చెందిన మిథున్ చక్రవర్తి.. హిందీలో వందల చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. 1976లో 'మృగయ'తో నటుడిగా పరిచయమైన ఆయన 370కుపైగా చిత్రాల్లో నటించారు. పాత్ర ఏదైనా అందులో పరకాయ ప్రవేశం చేసి మెప్పించే అతి కొద్దిమంది నటుల్లో ఒకరు. 'ఐ యామ్ ఎ డిస్కో డ్యాన్సర్...'అంటూ 80ల్లో ప్రేక్షకలోకాన్ని తన స్టెప్పులతో ఉర్రూతలూగించారు. మూడుసార్లు జాతీయ పురస్కారాలు అందుకున్నారు. తెలుగులో 'గోపాల గోపాల' చిత్రంలో నటించి మెప్పించిన మిథున్ కన్నడ, ఒడియా, భోజ్‌పురి చిత్రాల్లోనూ నటించారు. సినీ రంగంలో నటుడిగా ప్రశంసలు అందుకుంటూనే.. రాజకీయాల్లోనూ రాణించారు. తృణమూల్ కాంగ్రెస్‌లో చేరి 2014లో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2016లో ఆ పదవికి రాజీనామా చేసి 2021లో భాజపాలో చేరారు.

### ప్రేక్షకుల ప్రేమే ఈ పురస్కారానికి కారణం

"చిత్రపరిశ్రమలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ నేను ఉదాహరణగా ఉండాలనుకుంటున్నా" అని పేర్కొన్నారు మిథున్ చక్రవర్తి. 'దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చిందని తెలియగానే ఎలా స్పందించాలో మాటలు రాలేదు. నేను పడిన కష్టాలు ఒక్కసారిగా కళ్లముందు కదిలాయి. ఈ పురస్కారాన్ని నా కుటుంబం, అభిమానులకు అంకితం ఇస్తున్నా. నేను ఇంత దూరం చేరుకోగలిగానంటే దానికి కారణం అంకితభావం. నేను భాజపాలోనే ఉన్నాను. కానీ.. అంతకు ముందు నుంచే చిత్రపరిశ్రమలో ఒక కుటుంబ సభ్యుడిలా ఉన్నా. అందువల్ల నాకు ఈ పురస్కారం రావడానికి ఏ పార్టీలు కారణం కాదు. ప్రేక్షకులు నాపై చూపిస్తున్న ప్రేమే ఈ పురస్కారానికి కారణం' అని చెప్పారు.

### ఆయన సేవలు అపారం: ప్రధాని మోదీ

మిథున్ చక్రవర్తికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. "భారతీయ సినిమాకు మిథున్ చక్రవర్తి చేసిన అపారమైన సేవలను గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. ఆయన భిన్నమైన నటనతో, పాత్రలతో ఎంతో మంది అభిమానుల్ని సొంతం చేసుకున్నారు. ఎన్నో తరాల ప్రేక్షకులను అలరించిన ఆయనకు అభినందనలు" అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

## గ్రహం అనుగ్రహం

1-10-2024 మంగళవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం;
వర్ష రుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం

**చతుర్దశి:** రా. 8-49 తదుపరి అమావాస్య; **పుబ్బ:** ఉ. 9-59 తదుపరి ఉత్తర; **వర్జ్యం:** సా.5-33 నుంచి 7-39 వరకు; **అమృత ఘడియలు:** తె. 4-27 నుంచి; **దుర్ముహూర్తం:** ఉ. 8-18 నుంచి 9-07 వరకు; తిరిగి రా. 10-44 నుంచి 11-32 వరకు; **రాహుకాలం:** సా. 3-00 నుంచి 4-30 వరకు

**సూర్యోదయం:** ఉ. 5.54; **సూర్యాస్తమయం:** సా.5.48; శస్త్ర మహాలయం

## వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| రాజమహేంద్రవరం | 39.5 | 26.5 |
| ఒంగోలు | 36.5 | 27.5 |
| నెల్లూరు | 36.4 | 26.6 |
| తిరుపతి | 36.0 | 26.0 |
| కర్నూలు | 35.5 | 28.0 |
| ఆదిలాబాద్ | 35.3 | 25.2 |
| విశాఖపట్నం | 35.0 | 27.0 |
| రామగుండం | 35.0 | 26.5 |
| ఖమ్మం | 35.0 | 25.6 |
| నిజామాబాద్ | 34.9 | 24.9 |
| నరసాపురం | 34.7 | 27.2 |
| విజయవాడ | 34.4 | 26.5 |
| గుంటూరు | 34.0 | 27.0 |
| సూర్యాపేట | 34.0 | 26.0 |
| హనుమకొండ | 34.0 | 24.0 |
| మెదక్ | 33.2 | 20.8 |
| హైదరాబాద్ | 33.1 | 24.7 |
| కరీంనగర్ | 33.0 | 24.0 |
| నల్గొండ | 31.0 | 24.6 |
| మహబూబ్‌నగర్ | 30.3 | 25.0 |

# 30 శాతం అధికంగా వర్షాలు

- ముగిసిన వానాకాలం
- సాధారణం: 738.7 మి.మీ., కురిసింది 962.6 మి.మీ.
- నైరుతి తిరోగమనంలో అక్టోబరు 15 వరకు వర్షాలకు అవకాశం



వానాకాలం ముగిసింది. రాష్ట్రంలో నాలుగు నెలల (జూన్ నుంచి సెప్టెంబరు) కాలంలో 30 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. ఈ ఏడాది ముందుగానే తొలకరి రాష్ట్రంలోకి ప్రవేశించింది. భారీ వర్షాలకు కృష్ణా, గోదావరి నదులు ఉప్పొంగాయి. పలుమార్లు జలాశయాల గేట్లు తెరుచుకున్నాయి. చెరువులు, కుంటలు నిండటంతో భూగర్భ జలాలు పైకి వచ్చాయి. వానాకాలంలో రాష్ట్ర సాధారణ వర్షపాతం 738.7 మి.మీ.కు గాను 962.6 మి.మీ. నమోదయింది. ఆగస్టులో మాత్రం స్వల్పంగా (3 శాతం) లోటు వర్షపాతం నమోదయింది. ఆగస్టు చివరి వారం, సెప్టెంబరు నెల మొదట్లో కురిసిన అత్యంత భారీ వర్షాలు చాలా జిల్లాల్లో లోటును భర్తీ చేశాయి.

## 100 మండలాల్లో 60 శాతం అధికం..

రాష్ట్రంలోని 5 జిల్లాల పరిధిలోని 100 మండలాల్లో అత్యధికంగా (60 శాతానికి మించి), 20 జిల్లాల పరిధిలోని 291 మండలాల్లో అధికంగా (20 నుంచి 59 శాతం) 8 జిల్లాల పరిధిలోని 216 మండలాల్లో సాధారణం (+/-19), 5 మండలాల్లో లోటు వర్షపాతం నమోదయింది. ఎక్కువగా నారాయణపేట జిల్లాలో 94 శాతం, అతి తక్కువగా మంచిర్యాల జిల్లాలో 6 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. ప్రస్తుతం దేశం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ కొనసాగుతోంది. తిరోగమనంలో భాగంగా అక్టోబరు రెండో వారం వరకు రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు.

**రాష్ట్రంలో వర్షపాతాలు.. (మి.మీ.)**

| | జూన్ | జులై | ఆగస్టు | సెప్టెంబరు | మొత్తంగా 4 నెలల్లో |
|---|---|---|---|---|---|
| కురవాల్సింది (సాధారణం) | 129.4 | 229.1 | 217.4 | 162.8 | 738.7 |
| కురిసింది | 159 | 294.8 | 209.9 | 298.9 | 962.6 |

### ఇకపై తుపాన్లు వస్తేనే వానలు

– వైవీ రామారావు, ఐఎండీ మాజీ శాస్త్రవేత్త

రాష్ట్రంలో జూన్ నుంచి సెప్టెంబరు వరకు వర్షాల సీజన్ ముగిసింది. ప్రస్తుతం కొనసాగుతున్న నైరుతి నిష్క్రమణతో అక్టోబరు 15 వరకు ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఇకపై అల్పపీడనాలు, తుపాన్ల కారణంగానే వర్షాలు కురవాల్సి ఉంటుంది. సాధారణంగా ఈశాన్య రుతుపవనాలతో తెలంగాణలో పెద్దగా వర్షపాతం నమోదయ్యే అవకాశాలు లేవు.

### దేశంలో 8% ఎక్కువగా..

దిల్లీ: నైరుతి రుతుపవనాల కాలంలో దేశంలో సగటున 934.8 మి.మీ. వర్షపాతం నమోదైందని, దీర్ఘకాలిక సగటు (ఎల్‌పీఏ)లో ఇది 108% అని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. 2020 తర్వాత ఇదే అత్యధికమని, 2023లో 820 మి.మీ. కురిసిందని సోమవారం తెలిపింది. ఎల్‌పీఏ కంటే మధ్య భారతంలో 19%, దక్షిణ ద్వీపకల్పంలో 14%, వాయవ్య భారత్‌లో 7% ఎక్కువ వర్షాలు పడ్డాయని వెల్లడించింది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో మాత్రం 14% లోటు ఉందని తెలిపింది. ఒక్క జూన్‌లో దేశంలో వర్షలోటు ఏర్పడగా జులై-సెప్టెంబరు మధ్య మాత్రం ఎక్కువగా వానలు కురిశాయి.

- ఈనాడు, హైదరాబాద్

**మోదీ 3.0 సర్కారు తమ తొలి 100 రోజుల పాలనలో విదేశాల్లో ఐదు దౌత్య మిషన్లను ఏర్పాటు చేసినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది.**



# 9999 నంబరుకు రూ.20లక్షలు

### ఫ్యాన్సీ నంబర్లతో రవాణాశాఖకు కాసుల వర్షం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఫ్యాన్సీ నంబర్లతో రవాణా శాఖకు కాసుల వర్షం కురుస్తోంది. 9999 నంబరుకు ఏకంగా రూ.20 లక్షల ధర పలికింది. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ రవాణా కార్యాలయంలో సోమవారం టీజీ 09బీ సిరీస్ పూర్తయ్యి, 09సీ సిరీస్‌లోకి చేరింది. ఈ క్రమంలో అధికారులు ఫ్యాన్సీ నంబర్ల వేలం వేయగా సంస్థకు ఒకే రోజు రూ.47,12,265 రాబడి వచ్చిందని జేటీసీ రమేశ్ తెలిపారు. బీ సిరీస్ ముగింపు నంబరు టీజీ 09బీ9999ను లాట్ మొబైల్స్ సంస్థ రూ.20,01,111లకు సొంతం చేసుకుంది. ఇదే సిరీస్‌లో టీజీ 09బీ9909 నంబరును మేధా విస్టారిన్ సంస్థ రూ.1.35లక్షలకు దక్కించుకుంది. కొత్త సిరీస్‌లో మొదటి నంబరు 09సీ 0001 నంబరును యోధ్‌స్టోర్ (రూ.10,27,777లక్షలు) 0006 పోరస్ ఆగ్రో ఫుడ్ ప్రొడక్ట్స్ (రూ.3.85లక్షలు), 0009 దండు ఎనర్జీ (రూ.2.75లక్షలు), 0007 సుబ్బాయమ్మ వెంపటి (రూ.1,77,777) 0005 గణేశ్‌కుమార్ మామిడిపల్లి (రూ.1.13లక్షలు), 0011 జీపీఆర్ మాల్, మల్టీప్లెక్స్ రూ.1,04,999లకు పొందినట్లు అధికారులు వెల్లడించారు.

# హరియాణా ఎన్నికల బరిలో 52% మంది కోటీశ్వరులే

చండీగఢ్: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో 1,031 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, వీరిలో 538 మంది (52%) కోటీశ్వరులేనని 'ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం' (ఏడీఆర్) విశ్లేషించింది. కోటీశ్వరులైన అభ్యర్థుల్లో 184 మంది స్వతంత్రులు. భాజపా 85 మంది, కాంగ్రెస్ 84, జేజేపీ 46, ఐఎన్ఎల్‌డీ 34, ఆప్ 52, బీఎస్పీ 18 మంది చొప్పున కోటీశ్వరుల్ని బరిలో దింపాయి. నార్నౌండ్ నుంచి భాజపా అభ్యర్థిగా పోటీ చేస్తున్న కెప్టెన్ అభిమన్యు అత్యంత సంపన్న అభ్యర్థిగా నిలిచారు.

### గెలవలేకపోతే ఓడినట్లు కాదు



ఈ ప్రపంచంలో ఓటమన్నదే లేదు. మీరు ఏ పని చేసినా అందులో విజయమైనా వరిస్తుంది లేదా మీకు అనుభవమైనా వస్తుంది. అలాంటి అనుభవాల ద్వారా మీరు నేర్చుకొనే విలువైన పాఠాలే తదుపరి ప్రయత్నంలో గెలుపు తీరాలకు చేర్చుతాయి. విజేతలందరూ ఇదే సూత్రంతో తమ విజయగాథను లిఖించుకున్నారు.

– గ్యారీ కెల్లర్, రచయిత

# ఈనాడు

## సురక్షిత ఆహారం... అందరి హక్కు!

ఒంటికి శక్తినివ్వాల్సిన ఆహారం అక్రమార్కుల కాసుల కక్కుర్తి పుణ్యమా అని విషతుల్యమవుతోంది. పప్పుదినుసులు, పాలు, నెయ్యి, టీపొడి తదితరాలన్నీ కల్తీమయమవుతున్నాయి. నాసిరకం పదార్థాలతో తయారైన తినుబండారాలూ పెద్దయెత్తున మార్కెట్లోకి చొరబడుతున్నాయి. వాటికి తోడు అనేక హోటళ్లు, రెస్టారెంట్లలో పాడైపోయిన, ప్రమాదకర రసాయనాలు కలగలిసిన ఆహార పదార్థాలను జనానికి అంటగడుతున్నారు. వాటన్నింటి మూలంగా క్యాన్సర్లతో పాటు అనారోగ్య సమస్యలెన్నో తలెత్తుతున్నాయి. నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఈ దురవస్థను రూపుమాపడంలో యంత్రాంగం వైఫల్యాన్ని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) తాజా నివేదిక కళ్లకుకడుతోంది. ఆహార పరీక్షలు, నిఘా తదితరాలను పరిగణనలోకి తీసుకుని ఎఫ్ఎస్ఎస్ఏఐ రూపొందించిన సూచీలో ఎనిమిది రాష్ట్రాలు, జమ్మూకశ్మీర్ మినహా మిగిలినవేవీ వంద మార్కులకుగాను సగం స్కోరునూ దాటలేదు. తెలంగాణ 35.75, ఏపీ 27 మార్కులతో వరసగా 23, 28 ర్యాంకులకు పరిమితమయ్యాయి. 2018-19 సూచీలో ఆంధ్రప్రదేశ్ 47 మార్కులు రాబట్టింది. తరవాత కాలంలో అవి మరీ తెగ్గోసుకుపోవడం- జగన్ జమానాలో నెలకొన్న అవ్యవస్థకు ప్రత్యక్ష నిదర్శనం!

సురక్షితమైన ఆహారాన్ని పొందడం... జీవించే హక్కులో అంతర్భాగమని సుప్రీంకోర్టు ఏనాడో అభివర్ణించింది. దానికి మన్నన దక్కని వాతావరణంలో- కల్తీల కారణంగా ఏటా పది కోట్ల మంది భారతీయులు నానారకాల వ్యాధుల గుప్పిట చిక్కుతున్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 2030 నాటికి ఈ సంఖ్య 17.7 కోట్ల దాకా చేరుతుందన్న అంచనాలు భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. బాధితుల్లో అయిదేళ్లలోపు చిన్నారులే ఎక్కువగా ఉండటం మరింతగా కలవరపరుస్తోంది. ఆహార తనిఖీలకు జిల్లాకు ఒక అధికారి (డీవో) తప్పనిసరి. దేశీయంగా ఉండాల్సిన 855 మంది డీవోల్లో నిరుడు జనవరి నాటికి 656 మందే విధులు నిర్వర్తిస్తున్నారు. అందులోనూ 247 మంది తాత్కాలికంగా పనిచేస్తున్నవారే. దేశవ్యాప్తంగా 4029 ఆహార భద్రతా అధికారుల పోస్టులు మంజూరైతే- భర్తీ అయినవి 2,527 మాత్రమే. నిరుడు జనవరి నాటికి ఏపీ, తెలంగాణల్లోనూ డీవోల పోస్టుల్లో ఖాళీలు భారీగా పేరుకుపోయినట్లు కథనాలు వెలువడ్డాయి. ఆహార పరీక్షలకు ల్యాబులూ తగినంతగా లేకపోవడంతో శాంపిళ్ల పరిశీలన త్వరగా తెమలడం లేదు. సర్కారీ సిబ్బంది అవినీతి, అలక్ష్యం వంటివీ హేయ దందాసురులకు అయాచిత వరాలవుతున్నాయి!

అనారోగ్యకర ఆహారం వల్ల తలెత్తే వ్యాధుల మూలంగా ఇండియా ఏటా 2800 కోట్ల డాలర్ల మేర నష్టపోతున్నట్లు పరిశీలనలు చాటుతున్నాయి. ఆహారశాలలపై అధికారుల దాడుల సందర్భంగా దిగ్భ్రాంతికర వాస్తవాలెన్నో వెలుగుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో హోటళ్లు, ధాబాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. విస్తృత తనిఖీలు, ల్యాబుల్లో అత్యాధునిక పరికరాలు, సంచార కేంద్రాలు తదితరాల విషయాల్లో కేరళ, తమిళనాడు ముందున్నాయి. అందుకే తాజా ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచీలో అవి అగ్రభాగాన నిలిచాయి. మిగిలిన రాష్ట్రాలూ వాటి స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి. తూతూమంత్రంగా కేసుల నమోదు, వాదనల్లో పస లేకపోవడం వల్ల ఆహార కల్తీ కేసుల్లో చాలావరకు కోర్టుల్లో వీగిపోతున్నాయి. లేదా అరకొర జరిమానాలతో కొట్టుకుపోతున్నాయి. ప్రజలకు విషాహార విపత్తును తొలగించాలంటే- కల్తీరాయుళ్లపై పకడ్బందీగా కేసులు నమోదు చేసి, కఠిన శిక్షలు విధించాలి. ఆ మేరకు చట్టాల అమలును పదునుతేల్చాలి!



**సంపన్నులకోసం, పదవుల్లో ఉన్న గొప్పవాళ్లకోసం, పెద్ద పెద్ద భవనాలకోసం, సైన్యాల కోసం డబ్బును విచ్చలవిడిగా ఖర్చుచేస్తాం. పేదల విద్యకో, వాళ్లకి నీడనిచ్చే మంచి ఇల్లు కట్టించడానికో చిల్లిగవ్వ ఖర్చుపెట్టినా బాధపడిపోతాం.**

– అనీ బిసెంట్

## త్రికరణ శుద్ధి

చెట్టు మీద పిట్ట గూడు అల్లి గుడ్లు పెడుతుంది. వాటినుంచి వచ్చిన పిల్లలు రెక్కలొచ్చి ఆహారం కోసం దూరతీరాలకు ఎగిరిపోతాయి. మనిషి జీవన స్థితీ అంతే. చైతన్యం సృష్టించిన గూడే శరీరం. అందులో పుట్టే భావాలు పక్షులు. అవి తొడుక్కునే రెక్కలే ఆలోచనలు. అవీ ఎగురుతాయి. జీవితం విస్తరించిన మేర సంచరిస్తాయి. విన్నవి, కన్నవి అనుభవాలవుతాయి. వీటన్నింటి సమాహారమే- మనసు. అది అత్యంత శక్తిమంతమైనదీ, చంచలమైనదీ. ఎంత దూరాన్నైనా క్షణాల్లో చేరగలదు. తలచుకుంటే నిశ్చలంగానూ ఉండగలదు.

పంచభూతాలతో శరీరం తయారవుతుంది. ఆ తరవాతే మనసు. కానీ, 'ముందొచ్చిన చెవులకన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి' అన్న చందంగా 'మనసు' ముందుండజూస్తుంది. 'శరీరానిదేముంది? అది ఉత్త కట్టె. ఎలా చెబితే అలా వింటుంది' అన్న భావనతో ఆధిపత్యం చలాయిస్తుంది. కానీ, శరీరం లేకుండా మనసు మనగలదా? లేదు. మనిషి ఉనికిని తెలిపేది రూపం- అంటే, శరీరమే కదా. మనసు- అనుసంధాన కర్త. అనగా, ఒక వైపు చైతన్యం మరో వైపు శరీరం ఉంటేనే కదా 'మనసు' ఆ రెండింటి మధ్య వంతెనలా ఉండగలిగేది. వాటిలో ఏ ఒక్కటి లేకపోయినా 'మనో వంతెన' కూలిపోతుంది.



శరీరం నిండా చైతన్యం పరచుకొని ఉంటుంది. మనసూ చైతన్యాంశమే. కానీ, దేహం నుంచి వీడిపోయిన మనసు తెగిన గాలిపటం లాంటిది. దాని పయనం అగమ్యగోచరం.

ఇంటి కాపలాదారు ఇంటివద్దే ఉండాలి. కానీ, బాధ్యతలు మరచి షికార్లు చేయొచ్చా! మనసులేని మనిషి యంత్రంతో సమానం. మనిషి ఆలోచనలతో ఉన్నపుడు మనసు బయట ఉంటుంది. గమనింపుతో, ఎరుకతో ఉన్నపుడు మనిషి లోపల ఉంటుంది. మనసున్న మనిషే 'మనీషి'గా మారుతాడు. అందువల్ల 'మనసు' మనిషి దగ్గరే ఉండాలి. అతడికి సేవలందించాలి. అందువల్లే కఠోపనిషత్తు 'శరీరం రథం లాంటిది, మనసు ఆ రథాన్ని నడిపే సాధనం' అని చెబుతోంది.

మనసు ప్రమేయం లేకున్నా శరీరం తన విధులు చక్కగా నిర్వర్తిస్తుంది. లయ తప్పకుండా గుండె కొట్టుకుంటుంది. ఊపిరితిత్తులు శ్వాసక్రియలు జరుపుతాయి. మూత్రపిండాలు వాటి పని అవి చేస్తాయి. ఇలా శారీరక క్రియలన్నింటికీ చైతన్యం పునాదిగా పనిచేస్తుంది. ఆ రెండింటికీ మనసూ తోడైతే మూడూ ఒక్కటవుతాయి. అప్పుడు, 'త్రికరణ శుద్ధి' నెలకొంటుంది. 'ధ్యానం' పురివిప్పుకొంటుంది. ఆ స్థితిలో చేపట్టే ప్రతి పనీ ఒక 'ప్రార్థన' అవుతుంది.

నిలువ ఉన్న నీరు చెడిపోతుంది. పారే నది ప్రయోజనకారి అవుతుంది. మనసు మంచిగా ఉండాలన్నా, ప్రజాశ్రేయస్సు కోరే ఆలోచనలు కలగాలన్నా ముందు శరీరం బాగుండాలి. దానితో రోజూ వ్యాయామం చేయించాలి. అప్పుడు మనసులో మలినశుద్ధీ జరుగుతుంది. అలాంటి పరిశుద్ధ మనసే ధ్యానానికి సిద్ధపడుతుంది.

అంతర్యామి

– మునిమడుగుల రాజారావు

# బీఎస్ఎన్ఎల్ పయనమెటు?

**స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో 35 కోట్ల జనాభాకు టెలీసాంద్రత 0.023 మాత్రమే. 2000 అక్టోబరు 1న భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఏర్పాటైంది. స్వతంత్ర భారత వజ్రోత్సవాల సమయానికి టెలీసాంద్రత 85 శాతాన్ని దాటినా బీఎస్ఎన్ఎల్ మార్కెట్ వాటా ఎనిమిది శాతానికి కుదించుకుపోయింది. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ రజతోత్సవ వేళ దాని మార్కెట్ వాటా ఏడుశాతం దగ్గర తచ్చాడుతోంది. వందో స్వాతంత్ర్య దినోత్సవం నాటికి బీఎస్ఎన్ఎల్ పరిస్థితి ఏం కానుందో మరి!**

మొన్న మార్చినాటికి బీఎస్ఎన్ఎల్‌కు దేశమంతటా 67,340 మొబైల్ టవర్లు ఉన్నాయి. తమ సేవలను వేగవంతం చేసుకోవడానికి 2024 ఆర్థిక సంవత్సరంలో జియో 8408 టవర్లను, ఎయిర్‌టెల్ 2415, వీఐ 1568 టవర్లను బీఎస్ఎన్ఎల్ నుంచి లీజుకు తీసుకున్నాయి. మరోవైపు, బీఎస్ఎన్ఎల్ మాత్రం 4జీ సేవలను ప్రారంభించడంలో ప్రైవేటు ఆపరేటర్లకన్నా ఎనిమిదేళ్లు వెనకబడటం గమనార్హం. 5జీగా ఆధునికీకరించడానికి అనువైన 4జీ టెలికాం సాధనాలను ఆత్మనిర్భరత కింద స్వదేశంలో ఉత్పత్తి చేయడం అవసరమని ప్రధాని మోదీ 2022లో పేర్కొన్నారు. 2023 ఆగస్టు నుంచి దేశంలో లక్ష స్థలాల్లో ఆ సామగ్రిని సరఫరా చేయాలని ఆర్డరు పెట్టినా పరిస్థితి అంతంతే. తాజాగా కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చేసిన ప్రకటన ప్రకారం- 2024 అక్టోబరు చివరికల్లా బీఎస్ఎన్ఎల్ 80వేల టవర్లను, 2025 మార్చికల్లా 21 వేల టవర్లను సిద్ధం చేయనుంది. 4జీ సేవలను ఆరంభించడంలో జరిగిన జాప్యం వల్ల బీఎస్ఎన్ఎల్ చాలామంది ఖాతాదారులను కోల్పోయింది.

### సామాజిక ఆర్థిక సేవలు

బీఎస్ఎన్ఎల్ దేశ ప్రజలకు సామాజిక, ఆర్థిక సేవలు అందించే కీలకమైన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అని టెలీకమ్యూనికేషన్ల విభాగం ప్రకటించింది. అడవుల్లో, పర్వతాల్లో, దుర్గమ ప్రాంతాల్లో, ప్రకృతి ఉత్పాతాలు సంభవించిన సమయాల్లో, సరిహద్దులు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో, లాభదాయకంకాని చోట్లసైతం బీఎస్ఎన్ఎల్ సేవలు అందిస్తోంది. ఉదాహరణకు నిరుడు సియాచిన్‌లో 15,500 అడుగుల ఎత్తులో ఉన్న కొన్ని గ్రామాలకు, లద్దాఖ్‌లోని లక్సంగ్ గ్రామానికి సెల్‌ఫోన్ సేవలు అందించడానికి సైన్యం సహకారంతో బీఎస్ఎన్ఎల్ బేస్ ట్రాన్సీవర్ స్టేషన్ (బీటీఎస్)ను నెలకొల్పింది. గతేడాది ఉత్తరాఖండ్‌లోని సిల్క్యారా సొరంగంలో కొంత భాగం కూలి 41 మంది కార్మికులు 17 రోజులపాటు చిక్కుకుపోయినప్పుడు వారిని రక్షించే కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ముఖ్య పాత్ర పోషించింది. ఒక పైపుద్వారా 200 మీటర్ల కేబుల్‌కు ఒక హ్యాండ్‌సెట్ తగిలించి సొరంగంలోని కార్మికులకు పంపింది. దాని సాయంతో వారు కుటుంబ సభ్యులతో, తమను రక్షించడానికి వచ్చిన భద్రతా బలగాలతో మాటామంతీ జరపగలిగారు. చివరికి ఆ కార్మికులను క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. తెలంగాణలో ఈ ఏడాది




ఫిబ్రవరిలో మేడారం జాతర జరిగినప్పుడు బీఎస్ఎన్ఎల్ 16 తాత్కాలిక టవర్లను ఏర్పాటుచేయడంతో యాత్రికులు 50 లక్షల కాల్స్ చేయగలిగారు. కేరళలోని వయనాడ్‌లో ఇటీవల కుండపోత వర్షాలకు మట్టి పెళ్లలు విరిగిపడి ప్రజలు పెద్దసంఖ్యలో మరణించారు; వేలమంది నిరాశ్రయులయ్యారు. బీఎస్ఎన్ఎల్ రంగంలోకి దిగి బాధిత ప్రాంతాల్లో సత్వరమే 4జీ సేవలను పునరుద్ధరించింది. హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందుబాటులోకి తెచ్చి సహాయ కార్యక్రమాలు వేగంగా, నిరాటంకంగా జరగడానికి వీలుకల్పించింది. వయనాడ్ జిల్లాలోని బీఎస్ఎన్ఎల్ ఖాతాదారులందరికీ మూడు రోజులపాటు ఉచితంగా అపరిమిత కాల్స్, డేటా, ఎస్ఎంఎస్ సేవలను సమకూర్చింది. ఈ ఏడాది జూన్‌లో అమర్‌నాథ్ యాత్ర సమయంలో యాత్రికులకు 196 రూపాయల రీఛార్జితో సిమ్‌కార్డులను పంపిణీ చేసింది. అది 10 రోజులపాటు అపరిమిత వాయిస్, డేటాతో 4జీ కనెక్టివిటీని అందించింది.

### ప్రైవేటు సంస్థల హవా

- ప్రైవేటు రంగంలో టెలికాం సంస్థలు అంతకంతకూ ఎదిగిపోతున్నాయి. ఎయిర్‌టెల్ దిల్లీలో 1995లో సేవలు మొదలుపెట్టింది. 2014లో 4జీ సర్వీసు ప్రారంభించి 2019నాటికి 22 సర్కిళ్లకు విస్తరించింది. 2022లో 5జీ సేవలకు శ్రీకారం చుట్టింది. 2024 జూన్‌కల్లా 33.23 శాతం మార్కెట్ వాటాతో రెండోస్థానంలో నిలుస్తోంది.
- 2016లో సేవలు ప్రారంభించిన రిలయన్స్ జియో 2017 నాటికి 10 కోట్లమంది ఖాతాదారులను సంపాదించింది. 2022లో 5జీ సేవలు ప్రారంభించింది. తక్కువ ధరలతో ఖాతాదారులను ఆకట్టుకుని 2023నాటికి దేశమంతటికీ విస్తరించింది. ఇప్పుడు 40.71 శాతం వాటాతో మార్కెట్‌లో అగ్రస్థానం ఆక్రమిస్తోంది.
- వొడాఫోన్ ఇండియా 2017లో, ఐడియా సెల్యులర్ 2018లో సేవలు ప్రారంభించాయి. 2018లో వొడాఫోన్, ఐడియాలు విలీనమై వీఐగా అవతరించి 2019నాటికి 4జీ సేవలు అందించాయి. 18.56 శాతం వాటాతో మార్కెట్‌లో మూడో స్థానంలో ఉన్న వీఐ- వచ్చే డిసెంబరు నుంచి 5జీ సేవలు అందించడానికి సన్నద్ధమవుతోంది.

### వెసులుబాటు దక్కితే...

రక్షణ, నౌకా రవాణా, పౌర విమానయానం, విద్యుత్, పెట్రోలియం తదితర విభాగాల్లోని ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు) పోటీ లేకుండా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఆదాయం, లాభాలతో నిమిత్తం లేకుండా ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లిస్తున్నాయి. అందుకు ప్రత్యేక నిబంధనలు పాటిస్తున్నాయి. బీఎస్ఎన్ఎల్ కూడా ప్రభుత్వ రంగ సంస్థే అయినా ప్రైవేటు సంస్థల పోటీని ఎదుర్కోవాల్సి వస్తోంది. ఫలితంగా ఆదాయం కోల్పోతోంది. అయినాసరే ఉద్యోగుల జీతభత్యాల విషయంలో ఇతర పీఎస్‌యూలకు ఇస్తున్న వెసులుబాటునే బీఎస్ఎన్ఎల్‌కూ ఇవ్వాలి. ప్రైవేటు టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల వ్యాపారం వర్ధిల్లుతున్నట్లే- బీఎస్ఎన్ఎల్ కూడా తన వ్యాపారాన్ని నిలబెట్టుకునే వెసులుబాటును కల్పించాలి.




ఎం.ఆర్. పట్నాయక్
టెలికాం రంగ నిపుణులు



## అవాంతరాల నడుమ...

**'స్టెమ్' (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమెటిక్స్) కోర్సుల్లో అమ్మాయిలు విరివిగా చేరుతున్నారు. అబ్బాయిలకు దీటుగా రాణిస్తున్నారు. కానీ, ఆయా రంగాల్లో భిన్న స్థాయుల్లో పనిచేస్తున్న వారిలో స్త్రీల సంఖ్య తక్కువగా ఉంది. 146 దేశాల 'స్టెమ్' ఉద్యోగుల్లో మహిళలు 28.2 శాతమే. ప్రపంచ వ్యాప్తంగా స్టెమ్, నాన్-స్టెమ్ రంగాల్లో కొన్నేళ్లుగా ఉద్యోగినుల వాటా ఎంతంటే... (శాతాల్లో)**




(ఆధారం: గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ - 2024)

## సై అంటే...



సై అంటే మీరేమంటారు? సై అంటారు! అచ్చమైన తెలుగు వాళ్లం కదా. అదీ మన పౌరుషం అంటే! ఇది చెప్పండి. మీరెప్పుడైనా పరిందకాయ తిన్నారా? తినలేదా?

సై అంటే స్పానిష్ భాష (వాళ్లు 'సి' అని పలుకుతారు)లో 'అవును' అని అర్థం. పోర్చుగీస్‌లో 'నేను', ఇటాలియన్‌లో రెండూనూ. ఈ ఒక్క మాట.. సై అంటే సై... అవునంటే అవును... లేదా.. నేనంటే నేను.

సై అన్న మాట మూలాలు మనల్ని క్రీస్తు పూర్వపు గ్రీకు రోమన్ వాణిజ్యకాలాల్లోకి, సమీప పోర్చుగీసు, డచ్ తదితర వర్తక వాణిజ్యాల కాలాల్లోకి తీసుకెళ్తాయి. ఒక్కో తెలుగుమాట తీగను లాగితే, ఏ డొంక కదులుతుందో... ఎటు పోయి ఏ ఖండాన తేలుతుందో... అని ఆశ్చర్యపోతుంది 'నీలంపు రాశి' నవలలోని ఓ పాత్ర.

మన గురించి డచ్ జానపదాల్లో ఏమని చెప్పుకొనేవారో తెలుసా? మన తీరప్రాంతం గురించి స్లావనిక్ దేశాల్లో ఎన్నో సామెతలు, కథలు ప్రచారంలో ఉన్నాయి. ఇండిజా కోరమండీజా... అనే స్లావనిక్ కథలో 'ఇండియా కోరమండల ప్రాంతమనే అద్భుతలోకం ఉంది. అదొక ఉటోపియా. అక్కడ పాలు, పెరుగు వెల్లువలై పారుతాయి. అక్కడి ఇళ్లను కేకులతో కడతారు, గోడలకు జున్నుతో వెల్లవేస్తారు' అని ఉంటుంది. ఈ దేశం ఎంతో సమృద్ధి గల అద్భుతమైన ప్రాంతమనీ, ఆదర్శ ప్రాయమైనదనీ చెబుతారు.

వారు కలగన్న ప్రాంతం పులికాట్‌కి అటూఇటూగా విస్తరించి ఉంది. పులికాట్ డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీకి ముఖ్యపట్టణం. వారి ప్రధానమైన ఫ్యాక్టరీ ఇక్కడే ఉండేది. ఇప్పటికీ నెల్లూరు ప్రాంతంలో పేనాతో రాస్తున్నానని అనడం వింటాం. కక్కసు నుంచి తపాలా దాకా ఎన్నెన్ని డచ్ పదాలు మన వాడుకలో ఉన్నాయో. మనం వాటన్నిటినీ మోటుపదాలు, పల్లెటూరి చదువుసంధ్యలు లేనివారు మాట్లాడేవని అనుకొంటాం. కానీ, అది అనాదిగా మన భాషమీద పడిన ప్రపంచవ్యాప్త వాణిజ్య వ్యవహార ప్రభావ చిహ్నం. సై అన్న పదం ఒక సజీవ ఉదాహరణ.

సరే, పరిందకాయ సంగతికొద్దాం. అంటే మరేం లేదు- బొప్పాయే. పరింద అనే మాటను కురవలకోటలో ఇరవయ్యేళ్ల క్రితం విన్నాను. ఇలాంటివే ఎన్నో మాటలను అప్పట్లో మాట్లాడేవారు. ఇంతలో వాళ్ల ప్రాంతాలకు కేబుల్ టీవీ వచ్చింది. ఈ పదం మోటు పదమయ్యింది. స్మార్ట్ ఫోన్ వచ్చింది. నాటుమాట కాస్తా ప్రాచీనమైపోయింది. అలా, పరిందకాయతో సహా ఎన్నెన్ని పల్లె తెలుగు పదాలను మాటల్లో వాడటం మానేశారో. ఈ రోజు మాట్లాడుతున్న తెలుగుమాటలను మనం మాట్లాడకపోతే, పరింద అన్న పదం లాగా అదృశ్యమవుతాయి. సై లాగా ప్రతిపదం గురించి తెలుసుకోకపోతే, మన తరతరాల మనుగడలోని మర్మాలు తెలియకుండాపోతాయి. ప్రతి పదం పరింద లాగా మన మూలాలను చెబుతుంది. సై లాగా కాలగమనంలో మన ప్రాపంచిక మనుగడను వివరిస్తుంది. భాష మన వారసత్వ సంపద. దాంతో ముడిపడిన అనేక అంశాలను పదిలపరుచుకోవాలి. సై .. అంటారా మరి?!

– చంద్రలత

# పండుటాకులపై 'పైసా'చికం!

**ఉమ్మడి కుటుంబాలు కనుమరుగయ్యాయి. చిన్న కుటుంబాలు... కలతలు పెరిగాయి. ఆస్తులు, ఇళ్ల పంపకాలతోపాటు ప్రతి విషయంలో వృద్ధులను వేధించడం, నిరాదరణకు గురిచేయడం సర్వసాధారణం అవుతోంది. నేడు 'అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం' సందర్భంగా...**

సుమారు 85 ఏళ్ల వృద్ధురాలు ఇచ్చిన పిటిషన్ ప్రకారం... ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కొడుకులు ఇద్దరూ కలిసి తల్లికి తెలియకుండా ఆమె ఇంటిస్థలాన్ని అమ్మేశారు. ఆమె సంతకం అవసరమైనప్పుడు అభ్యంతరం పెట్టడంతో, కొట్టి ఇంటి నుంచి గెంటేశారు. కుమార్తె సాయంతో ఆమె సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. విచారణ అనంతరం స్థలం అమ్మిన సొమ్ములో అయిదోవంతు బ్యాంకులో డిపాజిట్ చేయించి... ప్రతినెలా దానిపై వచ్చే వడ్డీని, ఫించను సొమ్ములను ఆ వృద్ధురాలు ఖర్చు పెట్టుకొనేలా ఏర్పాటు చేశారు.



ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారి జైలుశిక్ష పడి సంచలనం సృష్టించిన కేసు ఇది. ఓ వృద్ధురాలి పేరిట ఉన్న స్థలంలో కుమారుడు కోడలూ ఇల్లు నిర్మించుకున్నారు. అందులోని ఓ పోర్షన్‌లో ఉంటున్న పెద్దావిడకు నీళ్లు, కరెంటు ఇవ్వకుండా, బాత్రూమ్‌కు తాళాలు వేసి రకరకాలుగా హింసించారు. ప్రశ్నించినందుకు ఆమెను గెంటేశారు. బాధితురాలు నర్సాపురం ట్రైబ్యునల్‌లో ఫిర్యాదు చేయడంతో నీరు, కరెంటు ఇవ్వకుండా బాత్రూమ్‌కు తాళం వేయడాన్ని తీవ్ర నేరంగా పరిగణించి... కొడుకూ, కోడలికి 15రోజుల జైలుశిక్ష అమలు చేశారు. ఆమె జీవించి ఉన్నంతకాలం ఒక పోర్షన్‌లో ఉంటూ, మిగతా ఇంటిని అద్దెకు ఇచ్చుకొనేలా తీర్పు వెలువడింది.

### అంతిమ న్యాయం కోసం...

దేశంలో పండుటాకులకు సొంత బిడ్డలు, బంధువుల నుంచి వేధింపులు, నిరాదరణ పెరిగి పోతుండటంతో కేంద్రం 2007లో తల్లిదండ్రులు, వయోవృద్ధుల రక్షణ, పోషణ చట్టం తీసుకొచ్చింది. దీనిప్రకారం ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 2011లో ఒక నియమావళిని రూపొందించింది. 2019లో కేంద్రం వృద్ధుల సంక్షేమం మరింత మెరుగ్గా ఉండటానికి చట్టానికి సవరణలు చేసింది. వాటి ప్రకారం ప్రతి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఒక ట్రైబ్యునల్ ఏర్పాటైంది. దానికి ఆర్డీఓ లేదా సబ్‌కలెక్టర్ స్థాయి అధికారి ఛైర్మన్‌గా, స్వచ్ఛంద సంస్థల నుంచి ఒకరు లేదా ఇద్దరు సభ్యులుగా ఉంటారు. బాధిత వృద్ధులకు ఉచితంగా వారి బిడ్డల నుంచి రక్షణ, పోషణ కల్పిస్తారు. బాధితులకు తీర్పు నచ్చకపోతే జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఏర్పాటయ్యే అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను 60 రోజుల్లో ఆశ్రయించి అంతిమ న్యాయం పొందవచ్చు.

వృద్ధుల రక్షణకు సంబంధించిన చట్టంలో కొన్ని మార్పులు చేయాల్సిన అవసరముంది. 2007 నాటి కేంద్ర చట్టంలో నిబంధనలతో కూడిన ఆస్తి బదలాయింపును చేర్చారు. తల్లిదండ్రులు తాము నిరాదరణకు గురైనప్పుడు తమ బిడ్డలకు రాసిచ్చిన ఆస్తిని బేషరతుగా తిరిగి పొందే హక్కును నియమావళిలో చేర్చాలి. వృద్ధులకు రక్షణ కల్పించే విషయంలో ట్రైబ్యునల్, పోలీసులు సమన్వయంతో వ్యవహరించేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం, ప్రతి డివిజన్‌కీ కేసుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించడం అవసరం. ప్రతి జిల్లాలో 150 పడకలతో సౌకర్యవంతమైన వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయడం, డే కేర్ సెంటర్లు, రవాణా ఛార్జీల్లో రాయితీ, ప్రయాణాల్లో ప్రత్యేక సీట్లు, సంతానం నుంచి రక్షణ, పోషణ ఖర్చులు ఇప్పించే ఉత్తర్వుల అమలులో కఠినంగా వ్యవహరించడమూ అత్యావశ్యకమే. ప్రభుత్వాలు పేద వృద్ధులకు ఇచ్చే పింఛను సొమ్మును కొంతమంది బిడ్డలు తీసుకెళ్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కన్నబిడ్డలు ఆస్తుల కోసమో, బ్యాంకులో ఉండే సొమ్ముల కోసమో తల్లిదండ్రులను మానసికంగా శారీరకంగా హింసించడం ఎక్కువైపోతోంది. వయోవృద్ధుల ధన ప్రాణాలకు రక్షణ కల్పించాలంటే నిపుణుల సలహాల ప్రకారం 2011 నియమావళిలో సమూల మార్పులు తీసుకురావాలి. ప్రతివాదుల ఫిర్యాదులను కోర్టులు స్వీకరించడం, రక్షణ వ్యవస్థ పూర్తిస్థాయిలో సహకరించకపోవడం వంటి అంశాలు చట్టానికి ప్రతిబంధకాలుగా ఉన్నాయి. తమ ఉన్నతికి కారకులైన తల్లిదండ్రుల పట్ల బిడ్డలు బాధ్యతగా వ్యవహరించాలి. తల్లిదండ్రులు, వృద్ధులు సైతం ప్రతిదానికీ తీవ్ర నిర్ణయాలు తీసుకోకూడదు. ఓర్పు, నేర్పుతో, పెద్దమనసుతో మసులుకోవాలి. రాజీమార్గమే రాజమార్గంగా వ్యవహరించడం ఉభయకుశలోపరిగా ఉంటుంది.

– మేళం దుర్గాప్రసాద్
వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేట్ ట్రైబ్యునల్ కమిటీ సభ్యులు

## పాపా.. ఎవరు నువ్వు?

ఒక పాత ఇంటి గోడకు కందిరీగ మట్టితో గూడు కట్టి గుడ్లు పెట్టింది. వాటిలో ఒకటి మాత్రమే పిల్లగా తయారైంది. రోజూ ఎండ రాగానే తల్లి కందిరీగ ఆహారం కోసం వెళ్లేది. పిల్ల కందిరీగకు రెక్కలు సరిగ్గా రాలేదు. అందుకే గూడులోనే ఉండేది. అమ్మ ఎప్పుడు ఆహారం తెస్తుందోనని ఎదురు చూసేది. ఒక్కోసారి ఆకలికి తట్టుకోలేక ఇబ్బంది పడేది. ఒకరోజు ఎప్పటిలా అమ్మ కోసం గూడు బయటకు తల పెట్టి పైకి చూసింది.

ఇంటి గోడకు దగ్గరలో మిద్దెకు పెద్ద తేనెపట్టు కనబడింది. తేనెటీగలు కొన్ని తేనెపట్టు నుంచి ఎగిరి వెళ్తుంటే, మరికొన్ని వచ్చి చేరుతున్నాయి. ఆకలితో అమ్మకోసం ఎదురు చూస్తున్న, చిన్న కందిరీగ వాటిని విచిత్రంగా చూస్తోంది. ఇంతలో గూడుకు దగ్గర నుంచి వెళ్తోన్న ఒక తేనెటీగ, పిల్ల కందిరీగను చూసింది. దాని అందానికి మెచ్చి ఆగింది. 'పాపా, ఎవరు నువ్వు? ఇక్కడ ఏం చేస్తున్నావు' అని అడిగింది.

'నేనెవరో నాకు తెలియదు. అమ్మ ఇంకా రాలేదు. నాకు ఆకలి వేస్తోంది' అని ఏడుపు మొదలెట్టింది. 'అయ్యో, ఆకలేస్తోందా? మీ అమ్మ నీకు బువ్వ తేవడం కోసం ఎంత దూరం పోయిందో, ఎప్పుడొస్తుందో! ఈ లోపు నా దగ్గర తేనె ఉంది. అది తాగు' అని పిల్ల కందిరీగకు అందించింది. 'భలే.. భలేగుంది' అంటూ పిల్ల కందిరీగ చప్పరించింది.




ఇంతలోనే బాగా ఆలస్యమైందని తల్లి కందిరీగ చాలా కంగారుగా వచ్చింది. అది తన గూటి ముందున్న తేనెటీగను చూసి.. 'మీరు ఎదురుగా తేనెపట్టులో ఉండే మధుపం కదూ!' అంది ఆప్యాయంగా. 'ఔను, నేను ఆ తేనెపట్టులో ఉండే మధుపాన్నే. మీ పాపకు ఆకలేస్తోందంటే నా దగ్గరున్న తేనె తాగించాను' అంది. తన బిడ్డ ఆకలి తీర్చిన తేనెటీగకు తల్లి కందిరీగ కృతజ్ఞతలు చెప్పింది. 'అయ్యో! దీనిలో ఏముంది' అని మధుపం ఎగిరిపోయింది. అప్పటి నుంచి అది అప్పుడప్పుడు వచ్చి పిల్ల కందిరీగను పలకరించి వెళ్లిపోతుండేది.

– కందర్ప మూర్తి

## పట్టికలో పదాలు!

ఈ పదాలు పట్టికలో ఉన్నాయి. కనుక్కోండి?

అలసట, అల, అలక, అరకులోయ, లోకువ, వలయం, నిలయం, ఆశ్రమం, ఆలయం, కరుణ

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ప్ర | శ | యం | శ | ప్ర | వ | ల | ని |
| క | రు | ణ | య | కు | ను | ల | ల |
| అ | శ | అ | లో | ను | చి | ట | యం |
| అ | మె | శ | కు | చి | స | ను | చి |
| శ | ల | ఇ | ర | ల | మే | చి | ను |
| ని | యం | శ | అ | ప | డ | డ | అ |
| ల | ల | ఇ | మే | డ | ప | డ | ల |
| ని | ఆ | శ్ర | మం | అ | ర | క | క |

# పెరిగిన కనీస వేతనం రోజుకు రూ.3-4

- అసంఘటిత కార్మికులకు నెలకు అత్యల్పంగా రూ.11,752 జీతం
- 8 ఏళ్లలో 50% దాటని 'పెరుగుదల'

ఈనాడు, హైదరాబాద్: రోజురోజుకూ పెరుగుతున్న సగటు కుటుంబ జీవన వ్యయం మేరకు అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు పెరగడం లేదు. తాజాగా కేంద్ర ప్రభుత్వం సవరించిన వేతనాల ప్రకారం.. వివిధ రంగాల్లోని అసంఘటిత కార్మికుల రోజువారీ వేతనం (గడిచిన ఆరు నెలలతో పోలిస్తే) రూ.3-4 మాత్రమే పెరిగింది. దీనిప్రకారం వివిధ రంగాలు, జోన్లవారీగా కార్మికుల వేతనాలు అత్యల్పంగా నెలకు రూ.11,752, అత్యధికం రూ.26,910గా ఉంది. నలుగురు సభ్యులున్న పేదలు, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు నెలకు చేతిలో కనీసం రూ.30 వేలు లేకుంటే బతుకు బండి నడవడం కష్టమవుతున్న ఈ రోజుల్లో.. పెంచిన కనీస వేతనాలు కుటుంబ అవసరాలకు సరిపోని దుస్థితి నెలకొంది. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలను ఖరారు చేస్తూ 2017లో కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. వ్యవసాయం, గనులు, రోడ్డు రవాణా, ప్రైవేటు భద్రత, మురుగుశుద్ధి తదితర రంగాల్లో పనిచేస్తున్నవారికి మూల వేతనం ఖరారు చేసింది. ఈ నోటిఫికేషన్ వెలువడి దాదాపు ఎనిమిదేళ్లు అవుతున్నా.. ఆరునెలలకోసారి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాల పెంపు (వీడీఏ-వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్స్)తో కలిపి ఇప్పటివరకు కనీస వేతనాల పెరుగుదల 50 శాతం కూడా దాటలేదు. ఎనిమిదేళ్ల క్రితం వ్యవసాయ రంగంలో నైపుణ్యలేమి కార్మికుడికి రోజువారీ వేతనం రూ.300గా ఉంటే.. ఇప్పుడు రూ.452కు పెరిగింది. ఇటీవల సవరణల ప్రకారం రైల్వే గోదాములు, విమానాశ్రయాల్లోని సరకు రవాణా కేంద్రాల్లో పనిచేస్తున్న కార్మికులకు రోజుకు రూ.4 నుంచి రూ.5 పెరగడంతో ఈ మొత్తం రూ.526 నుంచి రూ.783కి చేరింది.



**వివిధ రంగాల కార్మికులకు కనీస వేతనాలు ఇలా.. (నెలకు)**

| రంగం | 2017 | 2024 |
|---|---|---|
| వ్యవసాయం (నైపుణ్య) | 9,464 | 14,196 |
| వ్యవసాయం (సాధారణ) | 7,800 | 11,752 |
| భూగర్భమైనింగ్ (నైపుణ్య) | 17,758 | 20,400 |
| భూగర్భమైనింగ్ (సాధారణ) | 11,362 | 17,030 |
| నిర్మాణ రంగం (నైపుణ్య) | 18,018 | 26,910 |
| నిర్మాణ రంగం (సాధారణ) | 13,598 | 20,358 |
| ఎయిర్‌పోర్టులు, రైల్వే, గోదాములు | 13,598 | 20,358 |
| సెక్యూరిటీ, కాపలాదారులు (సాధారణ) | 16,562 | 24,084 |

- వ్యవసాయం మినహా మిగతావి జోన్-ఏ (మెట్రో నగరాలు) కేటగిరీ వేతనాలు

# రాష్ట్రానికి తగ్గిన కేంద్ర సాయం

- పడిపోయిన పన్నేతర ఆదాయం
- వడ్డీలు, జీతాలకు పెరిగిన చెల్లింపులు
- ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ రాష్ట్ర ఆదాయ, వ్యయాల తీరు

ఈనాడు, హైదరాబాద్: కేంద్రం నుంచి రాష్ట్రానికి గ్రాంట్ల రూపంలో రావాల్సిన నిధులు భారీగా తగ్గాయి. గత ఆర్థిక సంవత్సరం(2023-24) తొలి 5 నెలల(ఏప్రిల్ నుంచి ఆగస్టు)లో కేంద్రం నుంచి రూ.3,009.26 కోట్లు రాగా ఈ ఏడాది రూ.562 కోట్లు తగ్గిపోయాయి. పన్నేతర ఆదాయం కింద గతేడాది.. భూముల అమ్మకాలు, ఔటర్ రింగురోడ్డు టెండర్లతో తొలి 5 నెలల్లో రూ.14,482 కోట్లు రాగా ఈ ఏడాది రూ.13,033 కోట్లకు తగ్గిపోయిందని 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్'(కాగ్) నివేదిక వెల్లడించింది. ఇంకా ఏం చెప్పిందంటే..



- జీఎస్టీ, రిజిస్ట్రేషన్లు, వ్యాట్, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా పద్దుల కింద ఆదాయం గణనీయంగా పెరిగింది. కానీ కేంద్రం నుంచి గ్రాంట్లు, ఎక్సైజ్ సుంకం, పన్నేతర ఆదాయం తగ్గిపోవడంతో మొత్తమ్మీద ద్రవ్యలోటు విస్తరించి రూ.29,449.94 కోట్ల కొత్త రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- ద్రవ్యలోటు రూ.49,255 కోట్లు ఉండవచ్చని ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో అంచనా వేసింది. తొలి 5 నెలల్లోనే ఈ అంచనాలో 59.79 శాతం నమోదైంది. గతేడాది ఆర్థిక ద్రవ్యలోటు అంచనా రూ.56,062 కోట్లు కాగా అందులో తొలి 5 నెలల్లో 46.66 శాతం నమోదైంది. రిజిస్ట్రేషన్ల ద్వారా గతేడాదితో పోలిస్తే ఈసారి రూ.538 కోట్లు అదనపు ఆదాయం వచ్చింది.

### సంక్షేమానికి పెరిగిన వ్యయం

- పాత బాకీలపై వడ్డీల కింద గతేడాది తొలి 5 నెలల్లో రూ.8,851.71 కోట్లు చెల్లించగా ఈ ఏడాది రూ.10,497.52 కోట్లు విడుదల చేయాల్సి వచ్చింది. ఉద్యోగుల జీతభత్యాలు రూ.16,937 కోట్ల నుంచి రూ.18,152 కోట్లకు, వారి పింఛన్ల చెల్లింపులు రూ.6,973 కోట్ల నుంచి రూ.7,165 కోట్లకు చేరాయి. కీలకమైన సంక్షేమ పథకాలకు విడుదల చేసిన రాయితీల సొమ్ము రూ.4,014 కోట్ల నుంచి రూ.5,398 కోట్లకు పెరిగింది.

**5 నెలల రాష్ట్ర ఆదాయ, వ్యయాలు (రూ.కోట్లలో)**

| అంశం | 2023 | 2024 |
|---|---|---|
| జీఎస్టీ | 18,754 | 20,500 |
| రిజిస్ట్రేషన్లు | 5,852 | 6,390 |
| వ్యాట్ | 12,386 | 13,487 |
| ఎక్సైజ్ సుంకం | 10,149 | 7,806 |
| కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా | 5,064 | 6,220 |
| ఇతర పన్నులు | 3,234 | 3,316 |
| కేంద్రం నుంచి గ్రాంట్లు | 3,009 | 2,447 |
| పన్నేతర ఆదాయం | 14,482 | 1,449 |
| కొత్తగా తీసుకున్న రుణాలు | 26,158 | 29,449 |
| ఇతరాలతో కలిపి మొత్తం ఆదాయం | 99,106 | 91,085 |
| మొత్తం వ్యయం | 95,081 | 85,467 |

# ప్రాభవం కోల్పోతున్న తెలుగు విశ్వవిద్యాలయం

- మంజూరైన పోస్టులు 72... ఖాళీలు 61
- పదేళ్ల కిందటే మూడు విభాగాల మూసివేత

ఈనాడు, హైదరాబాద్: తెలుగు భాష నిరంతరం ఘనంగా వెలుగులు విరజిమ్మాలన్న లక్ష్యంతో ఉమ్మడిరాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రారంభించిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాభవాన్ని కోల్పోతోంది. 39 సంవత్సరాల కిందట హైదరాబాద్‌లో ప్రారంభమైన విశ్వవిద్యాలయంలో తెలుగు, ఆంగ్ల, సంస్కృత భాషలతో పాటు వివిధ కోర్సుల్లో విద్యార్థులు వందల సంఖ్యలో చేరుతున్నా.. వారికి పాఠాలు చెప్పేందుకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరు. పదకొండేళ్ల నుంచి నియామకాలు చేపట్టకపోవడం.. పదవీ విరమణలతో భారీగా ఖాళీలు ఏర్పడటంతో ప్రస్తుతం ఉభయ రాష్ట్రాల్లో విశ్వవిద్యాలయానికంతటికీ నలుగురు మాత్రమే శాశ్వత ఆచార్యులున్నారు. మరో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఐదుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు నిర్వహిస్తున్నారు. 72 పోస్టులకు గాను 61 ఖాళీలున్నాయి. తాత్కాలిక పద్ధతిలో చేస్తున్నవారు 32 మంది. శాశ్వత ఆచార్యులు లేక పదేళ్ల క్రితం ఆంగ్ల, సంస్కృత విభాగాలు, తులనాత్మక అధ్యయన కేంద్రాన్ని మూసేశారు.



### ఒప్పంద ఆచార్యులతో కొనసాగింపు

తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ, అభివృద్ధికి పదిహేనేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయాన్ని బాచుపల్లికి తరలించింది. సాయంకాలం కోర్సులు మాత్రం నాంపల్లిలోనే జరుగుతున్నాయి. తెలుగు, ఆంగ్ల, సంస్కృత భాషల్లో మరిన్ని పరిశోధనలు చేసేందుకు వీలుగా ఆయా విభాగాలను పెంచి పదుల సంఖ్యలో శాశ్వత ఆచార్యులను నియమించాలని నిర్ణయించింది. కార్యాచరణలో జాప్యంతో యూజీసీ మార్గదర్శకాల అమలుకు ఉన్నతాధికారులు ఒప్పంద ఆచార్యులను నియమించారు. తెలుగు, జ్యోతిషం, జర్నలిజం, యోగా, డిజైన్ కోర్సుల విభాగాలకు వారే అధిపతులుగా ఉన్నారు.

### నియామకాలు చేపట్టాకే అనుమతుల పునరుద్ధరణ అన్న కేంద్రం

దూరవిద్య విధానంలో ఉమ్మడి రాష్ట్రంలోని వేలమంది విద్యార్థులు బీఏ, ఎంఏ కోర్సుల్లో చేరారు. ప్రయోగాత్మక పరీక్షలు, ప్రత్యేక తరగతులున్నప్పుడు హైదరాబాద్‌తో పాటు తెలుగు విశ్వవిద్యాలయ పీఠాలున్న శ్రీశైలం, రాజమహేంద్రవరం, వరంగల్‌లలో తరగతులకు హాజరయ్యేవారు. ఎంఏ ఆంగ్లం, జ్యోతిషం, జర్నలిజం సహా మరికొన్ని విభాగాల్లో శాశ్వత ఆచార్యులు లేకపోవడంతో కేంద్ర విద్యాశాఖ.. దూరవిద్యలో డిగ్రీ, పీజీ కోర్సుల ప్రవేశాలను నాలుగేళ్ల కిందట నిలిపేసింది. శాశ్వత పద్ధతిలో ఆచార్యులను నియమిస్తామంటూ అభ్యర్థించినా.. నియామకాలు చేపట్టాకే అనుమతులు పునరుద్ధరిస్తామని కేంద్ర విద్యాశాఖలోని దూరవిద్య మండలి ప్రతినిధులు రాష్ట్రానికి తేల్చిచెప్పారు.

# విశ్రాంత ఐఏఎస్ అధికారిణి చందనా ఖన్ కన్నుమూత



జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: విశ్రాంత ఐఏఎస్ అధికారిణి చందనా ఖన్(69) గుండెపోటుతో కన్నుమూశారు. సోమవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. 1979 బ్యాచ్‌కు చెందిన చందనా ఖన్ 2014లో పర్యాటక శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా విరమణ పొందారు. ఆమె భర్త అజోయేంద్ర ప్యాల్ సైతం విశ్రాంత ఐఏఎస్ అధికారి కాగా.. కుమారుడు అంజన్ ప్యాల్ వైద్యుడిగా కొనసాగుతున్నారు. ఐఏఎస్‌కు ముందు ఆమె కొంతకాలం అధ్యాపకురాలిగా పనిచేశారు. ఐఏఎస్‌గా ఎంపికైన అనంతరం ఆమెకు చిన్ననాటి నుంచి ఇష్టమున్న కవిత్వం, చిన్న కథలను రాయడాన్ని కొనసాగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలోనూ పర్యాటకాన్ని పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారు. చందనా ఖన్ మృతి విషయం తెలుసుకున్న పలువురు విశ్రాంత ఐఏఎస్ అధికారులు సోమవారం ప్రశాసన్‌నగర్‌లోని నివాసానికి వచ్చి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తిచేశారు. చందనా ఖన్‌కు హైదరాబాద్ కళలు, కళాకారులపై ఎక్కువ మక్కువ. ఆమె నగరాన్ని సంస్కృతుల సమ్మేళనంగా వర్ణించేవారు.

# నేడు కలెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్

ఈనాడు, హైదరాబాద్: స్మార్ట్ కార్డుల పంపిణీకి సంబంధించిన అంశంపై జిల్లా కలెక్టర్లతో మంగళవారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయనున్న నియోజకవర్గాలు, ఎలాంటి కార్యాచరణ చేపట్టాలనే అంశాలపై కలెక్టర్లతో చర్చించనున్నారు. దీనిపై పలు సూచనలు చేయనున్నారు. ఇందిరమ్మ గృహ లబ్ధిదారుల ఎంపికకు కమిటీలు, అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో అర్హుల ఎంపిక తీరు తదితర అంశాలపై కూడా మంత్రి చర్చించే అవకాశాలున్నట్లు సమాచారం.

# తెలంగాణ భవన్‌ను ముట్టడించిన కాంగ్రెస్ నేతలు

### భారాస కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత

ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌ను సోమవారం కాంగ్రెస్ నేతలు ముట్టడించారు. అక్కడే కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం పేరిట ఆందోళనకు యత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్, భారాస శ్రేణుల మధ్య తోపులాట జరిగి పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. రఘునందన్‌రావు, కొండా సురేఖను సన్మానిస్తున్న ఫొటోను భారాస నేతలు ట్రోల్ చేయడాన్ని కాంగ్రెస్ నేతలు ఖండించారు. మంత్రికి భారాస నేతలు, కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం బంజారాహిల్స్ పోలీసులు చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు.. ఉద్దేశపూర్వకంగా ఆయుధాలతో దాడి చేయడం, బలవంతంగా అడ్డుకోవడం తదితర నేరాల కింద గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రాము, కార్తీక్, హరి తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు.



**కఠిన పరిస్థితులతోనే గొప్ప విజయాలు**

మీకు ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులే మీ జీవితంలో గొప్ప విజయాలకు దారి చూపొచ్చు. అందుకే సవాళ్లకు భయపడి ప్రయాణాన్ని ఆపొద్దు. కఠిన సమయాలే మనుషులను శక్తిమంతులను చేస్తాయి. ప్రతి విషయమూ మీకు ప్రతికూలంగా జరుగుతోందని మీకు అనిపిస్తే, విమాన ప్రయాణాన్ని గుర్తుకు తెచ్చుకోండి. అది గాలి దిశకు వ్యతిరేకంగా వెళ్తేనే ముందుకు పోతుంది తప్ప గాలివాటుగా వెళ్తే కాదు.

– స్టీఫెన్ లాబొస్సియర్, రిలేషన్‌షిప్ అడ్వైజర్

# రైతు సంక్షేమ కాంగ్రెస్ ప్రభుత్వంపై భాజపా అక్కసు

- రాష్ట్రంలో విజయవంతంగా రుణమాఫీ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో రుణమాఫీని విజయవంతంగా అమలుచేస్తూ రైతుల సంక్షేమానికి కృషిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై భాజపా అక్కసు వెళ్లగక్కుతోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వమే రైతుకూలీలకు భరోసా, కౌలురైతులకు ఆర్థికసాయం ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండగా కేంద్రపెద్దలు పెద్దమనసుతో సహకరించాల్సింది పోయి విమర్శలు చేయడం స్థాయిని దిగజార్చుకోవడమేనన్నారు. సోమవారం తన నివాసంలో మంత్రి తుమ్మల విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో మాదిరిగా భాజపా పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రుణమాఫీ చేసే ధైర్యం ఉందా.. అని ప్రశ్నించారు. "ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా రైతులకు భరోసా కల్పించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఇంతవరకు 22 లక్షల మందికి రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశాం. రుణమాఫీ కానివారికి సంబంధించి కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే చేపట్టాం. ఆధార్ వివరాలు సరిగాలేని ఖాతాలను కూడా సరిచేశాం. వీరిలో రూ.2 లక్షలలోపు రుణం ఉన్న కుటుంబాలన్నింటికీ మాఫీచేసి, తర్వాత రూ.2 లక్షలకు పైన ఉన్నవారికి మాఫీ చేస్తాం. పంటలకు మద్దతుధర కల్పించేందుకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇప్పటికే సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించాం. 2022 కల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి ప్రధాని మోదీ మాట తప్పారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల అమలునూ పట్టించుకోలేదు. కేంద్రం సరైన మద్దతుధరను ప్రకటించకపోవడం వల్ల తెలంగాణ రైతులు గత తొమ్మిదేళ్లలో రూ.2 లక్షల కోట్లు నష్టపోయారు. ఇప్పటికైనా రైతు ఉద్యమం సందర్భంగా అమరులైన 708 మందికి పైగా అన్నదాతల కుటుంబాలకు పరిహారం చెల్లించి, రైతుల డిమాండ్లు నెరవేర్చేందుకు కృషి చేయాలి. కేంద్రం పీఎం కిసాన్ కింద అందించే సాయాన్ని రూ.6,000 నుంచి రూ.7,500కు పెంచాలి. తెలంగాణలో ఉన్న భాజపా నేతలు కూడా మాతోపాటు కలిసికట్టుగా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి నిధులు వచ్చే విధంగా పని చేయాలి" అని తుమ్మల సూచించారు.

# ఓట్లేసిన రైతులను మోసం చేసిన కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

హాజరై.. ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 1000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, 'రాహుల్ గాంధీ సమక్షంలో వరంగల్ డిక్లరేషన్‌లో రైతులను ఆదుకుంటామని రేవంత్ హామీ ఇచ్చారు. ఏటా దాదాపు రూ.81 వేల కోట్లు రైతులకు కేటాయిస్తామని చెప్పిన మాట మరిచిపోయారు. 70లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. అందుకు రూ.40వేల కోట్లు అవసరం అవుతాయని చెప్పి, బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు ఇచ్చి.. రూ.17వేల కోట్లు విడుదల చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతు ఆత్మహత్యల సంఖ్య జులై 30 వరకు 870కి, సెప్టెంబరు 30కి 1000కి చేరింది' అని ఆరోపించారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ 'ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మినహా.. మిగిలిన 5అమలు కాలేదు. రేవంత్‌కు దమ్ముంటే ఎంత రుణమాఫీ చేశారో ప్రజాపోర్టల్‌లో పెట్టాలి. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలుస్తున్నారు. వారి కన్నీళ్లలో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయం. హైడ్రాపై నిర్ణయం తీసుకున్నప్పుడు సీఎం కనీసం సొంత పార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయాలను కూడా తీసుకోలేదు. రూ. వేల కోట్లు వసూలు చేసి హైకమాండ్‌కు పంపడానికే దీనికి తెరతీశారు' అని విమర్శించారు.

### మహిళలకిచ్చిన హామీలు ఏమయ్యాయి?

మహబూబ్‌నగర్ ఎంపీ, భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలు అరుణ మాట్లాడుతూ 'రైతు భరోసా ఏమైంది? మహిళలకిచ్చిన హామీలు ఏమయ్యాయి? చేతకాకపోతే కాంగ్రెస్ నేతలు ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణలు చెప్పండి. కేసీఆర్ కంటే నియంత పాలన కాంగ్రెస్ ప్రభుత్వంలో చూస్తున్నాం' అని విమర్శించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ 10 ఏళ్లలో భారాస ఎంత అపఖ్యాతి మూటకట్టుకుందో, పది నెలల్లో కాంగ్రెస్ అంత మూటకట్టుకుందని విమర్శించారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు వ్యవసాయ విధానం లేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు హైదరాబాద్‌లో సీట్లు రాలేదని, అందుకే ఇక్కడ పేదల ఇళ్లు కూలుస్తోందని ఆరోపించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ రాష్ట్ర సంపదంతా కాళేశ్వరంలో గుమ్మరించారని.. ఆ విధానాలే రేవంత్‌రెడ్డి అవలంబిస్తున్నారన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందని.. ముఖ్యమంత్రి కుర్చీని శుద్ధి చేయడం భాజపాతోనే సాధ్యమని చెప్పారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి దీక్షను ప్రారంభించారు. ఎంపీ నగేశ్, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, పాల్వాయి హరీశ్‌బాబు, పైడి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు అంజయ్యయాదవ్, జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మారుతి కిరణ్, శ్రీనివాస్, మాజీ ఎంపీ బీబీ పాటిల్ తదితరులు దీక్షలో కూర్చున్నారు. మంగళవారం ఉదయం 11 గంటల వరకు దీక్ష కొనసాగుతుంది.



దీక్షా వేదికపై సోమవారం రాత్రి నిద్రకు ఉపక్రమించిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తదితరులు

# భాజపా దీక్ష ఆశ్చర్యకరం

### ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: రైతుల కోసం భాజపా దీక్ష చేయడం ఆశ్చర్యంగా ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. మొదట భాజపా పాలిత రాష్ట్రాల్లో రైతు సంక్షేమ పథకాలు అమలు చేసి తెలంగాణలో అడగాలని హితవు పలికారు. సోమవారం అసెంబ్లీలోని సీఎల్పీ మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పెట్టుబడిదారుల పార్టీ అయిన భాజపాకు రైతులతో ఏం సంబంధం అని ప్రశ్నించారు.

# దసరాకు 6 వేల ప్రత్యేక బస్సులు



ఈనాడు, హైదరాబాద్: దసరా సందర్భంగా ఆర్టీసీ ఆరు వేల ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిందని సంస్థ ఎండీ సజ్జనార్ తెలిపారు. ట్రాఫిక్ నేపథ్యంలో ప్రయాణ సమయం వృథా కాకుండా శివారు ప్రాంతాల నుంచి ఈ బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు. మహాలక్ష్మి పథకం అమలుతో గత ఏడాదితో పోల్చితే ప్రయాణికుల రద్దీ ఎక్కువయ్యే అవకాశముందని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రజలకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా యాజమాన్యం ఏర్పాట్లు చేసింది. అక్టోబరు 1 నుంచి 15 వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. వీటిలో ముందస్తు రిజర్వేషన్లు ఉంటాయి. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రలకు ప్రత్యేక బస్సులు నడుపుతాం. ఇవి ఎంజీబీఎస్, జేబీఎస్, ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, సంతోష్‌నగర్, కేపీహెచ్‌బీ తదితర శివారు ప్రాంతాల నుంచి అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కుర్చీలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు సమకూర్చుతున్నాం. ఐటీ కారిడార్ ఉద్యోగుల సౌకర్యార్థం గచ్చిబౌలి, ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరు తదితర ప్రాంతాలకు బస్సులు నడిపేలా ఏర్పాటు చేశాం. దసరా రద్దీ నేపథ్యంలో 9, 10, 11 తేదీల్లో మరిన్ని బస్సులు నడుపుతాం. జాతీయ రహదారుల విభాగంతో మాట్లాడి టోల్‌ప్లాజాల వద్ద ప్రత్యేక లైన్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటాం' అని వివరించారు.

### ఏపీలో కూడా..

ఈనాడు, అమరావతి: దసరాకు సొంతూళ్లకు వచ్చి వెళ్లే వారి కోసం ఏపీఎస్ ఆర్టీసీ అదనంగా 6,100 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాల నుంచి ఏపీకి వెళ్లేవాళ్లు, రాష్ట్రంలో ఓ జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే వారి రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకుంది. పండగకు వచ్చే వారి కోసం ఈ నెల 4 నుంచి 11 వరకు 3,040 బస్సులు, తిరుగు ప్రయాణమయ్యే వారికి ఈ నెల 12 నుంచి 20 వరకు 3,060 బస్సులు నడపనున్నారు. హైదరాబాద్ నుంచి 990, బెంగళూరు నుంచి 275, చెన్నై నుంచి 65 బస్సులు రాకపోకలు సాగించనున్నాయి.



# మూసీ బాధితులకు అండగా భారాస

- రేవంత్ అసమర్థ ముఖ్యమంత్రి: కేటీఆర్

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: మూసీ బాధితులకు అండగా భారాస ఉంటుందని, వారి ఇళ్ల ముందుకు బుల్డోజర్లు వస్తే.. తమ పార్టీ ఎమ్మెల్యేలు వాటికి అడ్డంగా పడుకుంటారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అత్తాపూర్ లక్ష్మీనగర్‌కాలనీలో మూసీ బాధితులతో సోమవారం సమావేశమయ్యారు. కేటీఆర్ మాట్లాడుతూ.. దిల్లీకి రూ.25 వేల కోట్లు పంపడానికే రేవంత్‌రెడ్డి మూసీ ప్రాజెక్టు తెరపైకి తెచ్చారని ఆరోపించారు. ఆయన అసమర్థ ముఖ్యమంత్రి అని తేలిపోయిందని విమర్శించారు. ఇళ్లు కూల్చడం అంటే ఒక కుటుంబాన్ని నాశనం చేయడమేనన్నారు. అత్తాపూర్ పరిధిలోని మూసీ పరీవాహకంలో నిర్మించిన ఇళ్లకు కాంగ్రెస్ ప్రభుత్వమే అనుమతులిచ్చిందని, మళ్లీ అదే సర్కారు కూల్చేస్తామని బెదిరిస్తోందన్నారు. ఆరు గ్యారంటీల అమలులో సీఎం విఫలమయ్యారని.. తొలుత వాటిని అమలు చేయాలని.. తర్వాతే మూసీ జోలికి రావాలని డిమాండ్ చేశారు. అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ భూసేకరణ విషయంలో కొత్తచట్టం చేశారని, ఏదైనా భూమిని ప్రజల నుంచి సేకరిస్తే.. ప్రభుత్వం బాధితులకు మూడురెట్ల నష్టపరిహారం చెల్లించాలని అందులో పొందుపర్చారన్నారు. దీనికి సంబంధించిన కాపీలను బాధితులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భారాస నేతలు మహమూద్ అలీ, మధుసూదనాచారి, శంభీపూర్‌రాజు, నవీన్‌రెడ్డి, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాధవరం కృష్ణారావు, కౌశిక్‌రెడ్డి, బాల్క సుమన్, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

# మూసీ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

లండన్‌లో థేమ్స్ నదికి కూడా రూ.40 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 2,400 కి.మీ. 'నమామి గంగే' ప్రాజెక్టు మొత్తం ఖర్చు రూ.40 వేల కోట్లు. అలాంటిది మూసీ ప్రాజెక్టుకు రూ.1.50 లక్షల కోట్లా? దీని వెనక ఉన్న మతలబు ఏంటి? ఇది దేశంలోనే అతి పెద్ద కుంభకోణం. దేశంలో వచ్చే ఎన్నికలకు అవసరమైన నిధుల కోసం కాంగ్రెస్ పార్టీ ఈ ప్రాజెక్టును రిజర్వు బ్యాంకులా వాడుకోవాలని చూస్తోంది' అని ఆరోపించారు.

### అవసరమైతే సుప్రీంకోర్టుకు...

'రాష్ట్రంలో నడుస్తున్న బుల్డోజర్ అరాచకాలను పరిగణనలోకి తీసుకొని.. చట్టప్రకారం ముందుకెళ్లాలని ప్రభుత్వానికి సూచించిన హైకోర్టుకు ధన్యవాదాలు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కనపెట్టి.. ప్రజలకు అక్కరకు రాని అంశంపై ఇంత ఖర్చు చేయడం ఎవరి కోసం? ఖజానా ఖాళీగా ఉన్న ఈ పరిస్థితుల్లో ఎందుకు ఇప్పుడు ఈ ప్రాజెక్టును పెట్టుకున్నారు? తమ స్థలాలకు 1994లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే పట్టాలు వచ్చాయని ప్రజలు చెబుతున్నారు. మరి ఆనాడు రిజిస్ట్రేషన్లు చేసి, కరెంటు, మంచినీటి బిల్లులు తీసుకున్నప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకు వచ్చింది? పేద, మధ్యతరగతి ప్రజలకు తమ ఆస్తులతో భావోద్వేగ బంధముంటుంది. అది మీకు తెలియదు. ఇళ్లు కూల్చుతుంటే, చిన్న పిల్లలతో రోడ్డెక్కి ఏడుస్తుంటే.. వాళ్లు పైసల కోసమే ఏడుస్తూ, తిడుతున్నారంటూ ఓ మంత్రి అంటున్నారు. అలా అనటానికి మంత్రికి మనసెలా వచ్చింది? లక్షలాది మంది జీవితాలను అంధకారం చేస్తామంటే ఊరుకోం. బాధితుల పక్షాన సుప్రీంకోర్టుకైనా వెళతాం. రేవంత్‌రెడ్డి ఏం చేసినా సరే.. కాంగ్రెస్ ఎంపీల కన్నా భాజపా ఎంపీలే భజన చేస్తున్నారు' అని కేటీఆర్ విమర్శించారు. విలేకర్ల సమావేశంలో భారాస నేతలు వద్దిరాజు రవిచంద్ర, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, గోపీనాథ్, జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, గంగుల కమలాకర్, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మూసీ ప్రాజెక్టు గురించి వివరిస్తున్న కేటీఆర్. చిత్రంలో పార్టీ నేతలు గోపీనాథ్, జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, గంగుల కమలాకర్

# మూసీ వరదెంత? ప్రవాహమెలా?

- 1.50 లక్షల క్యూసెక్కులు వెళ్లేలా చర్యలు చేపట్టాలి
- నీటిపారుదల శాఖ నివేదిక
- సంరక్షణ చర్యలు తప్పనిసరన్న కేంద్ర జలసంఘం



ఈనాడు హైదరాబాద్: మూసీకి వచ్చే గరిష్ఠ వరదను పరిగణనలోకి తీసుకొని కనీసం 1.50 లక్షల క్యూసెక్కుల నీటిప్రవాహం వెళ్లేలా చర్యలు చేపట్టాలని నిపుణుల కమిటీ పేర్కొంది. ఎంత ప్రవాహం ఉంటుంది, నీటిమట్టం ఎంత, గరిష్ఠ వరద ఉన్నప్పుడు ఎంత వెడల్పు వరకు ప్రవహిస్తుందన్న వివరాలతో కూడిన నివేదికను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్)కు నీటిపారుదలశాఖ అందజేసింది. మూసీలో వరద ప్రవాహాన్ని పరిగణనలోకి తీసుకొని.. గరిష్ఠ వరద మట్టం (ఎంఎఫ్ఎల్) నిర్ణయించేందుకు నీటిపారుదలశాఖ గతంలో నిపుణుల కమిటీని నియమించింది. మూసీ-ఈసీ నదులు కలిసే ప్రాంతం నుంచి నాగోల్ వరకు కనీస వరద 1.50 లక్షల క్యూసెక్కులు వెళ్లేలా క్రాస్ సెక్షన్స్ ఇవ్వాలని కోరుతూ ఎంఆర్‌డీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ 2019 ఏప్రిల్ 26న నీటిపారుదలశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు లేఖ రాశారు. ఈఎన్సీ ఈ లేఖను హైడ్రాలజీ-ఇన్వెస్టిగేషన్ విభాగం సీఈకి పంపి ఈమేరకు అవసరమైన వివరాలను ఎంఆర్‌డీసీఎల్‌కు ఇవ్వాలని కోరారు. సీఐఎస్‌టీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కన్సల్టెన్సీ సంస్థ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి తీసుకొన్న క్రాస్ సెక్షన్స్ వివరాల ఆధారంగా నిపుణుల కమిటీ ఓ నివేదికను రూపొందించింది. ఈ వివరాలతో హైడ్రాలజీ విభాగం చీఫ్ ఇంజినీర్ శంకర్‌నాయక్ 2019 మే 15న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీకి లేఖ రాశారు. 'మూసీ నది వికారాబాద్ సమీపంలోని అనంతగిరి కొండల నుంచి ప్రారంభమై.. నల్గొండ జిల్లాలోని వడపల్లి వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. 250 కి.మీ. దూరం ప్రవహించే ఈ నది హైదరాబాద్ నగరాన్ని రెండుగా విభజించుకొని వెళ్తుంది. మూసీ-ఈసీ వాగులు వచ్చి గోల్కొండ ప్రాంతంలోని టిప్పుఖాన్ బ్రిడ్జి వద్ద నదిలో కలుస్తాయి. ఈ రెండూ కలిసే ప్రాంతం నుంచి నాగోల్ వరకు ప్రవాహం, నీటిమట్టం వివరాలను నీటిపారుదల శాఖ ఎంఆర్‌డీసీఎల్‌కు అందజేసింది. దీనిప్రకారం 1.50 లక్షల క్యూసెక్కుల ప్రవాహానికి నీటిమట్టం అత్యధికంగా 504.81 మీటర్ల నుంచి 471.64 మీటర్ల వరకు ఉంది. ప్రవాహం పూర్తిస్థాయిలో ఉన్నప్పుడు నీరు విస్తరించే ప్రాంతం 237.48 మీటర్ల నుంచి 128.33 మీటర్ల వరకు ఉంది' అని మొత్తం 45 ప్రాంతాలకు సంబంధించిన వివరాలను నీటిపారుదలశాఖ అందజేసింది.

### పెరుగుతున్న పూడిక....

మరోవైపు మూసీ ప్రాజెక్టులో పూడిక వేగంగా పెరుగుతోందని, ఇప్పటికే డెడ్ స్టోరేజీ మొత్తం పూడిక చేరడంతో పాటు నీటి వినియోగ సామర్థ్యాన్ని భారీగా కోల్పోయిందని కేంద్ర జలసంఘం తన అధ్యయనంలో తేల్చింది. ఈ మేరకు ప్రాథమిక నివేదికను ఇటీవల అందజేసింది. ఇప్పటికే సుమారు 0.75 టీఎంసీ నీటినిల్వను కోల్పోయిందని పేర్కొంది. 1962లో మూసీ ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయడం ప్రారంభించారని, ఆ సమయంలో మొత్తం నిల్వ సామర్థ్యం 4.83 టీఎంసీలు కాగా, ఇప్పుడు 4.09 టీఎంసీలకు తగ్గిందని వెల్లడించింది. డెడ్ స్టోరేజీ 0.24 టీఎంసీ నుంచి 0.017 టీఎంసీకి తగ్గిపోయిందని, సంరక్షణ చర్యలు తీసుకోకుండా ఇలాగే వదిలేస్తే నీటినిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందని నివేదిక పేర్కొంది.



జపాన్‌లోని హనేడా విమానాశ్రయంలో భట్టితో మధుసూదన్, రోనాల్డ్‌రాస్, బలరాం

## జపాన్‌కు ఉపముఖ్యమంత్రి భట్టి

ఈనాడు, హైదరాబాద్: వారం రోజుల పాటు అమెరికాలో పర్యటించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం జపాన్‌కు చేరుకున్నారు. ఆ దేశంలో మూడు రోజులు పర్యటించనున్నారు. జపాన్‌లోని హానేడా విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు భారత రాయబార కార్యాలయ ప్రతినిధులు అజయ్‌సేథి, మధుసూదన్, అమన్ ఆకాశ్ స్వాగతం పలికారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రాస్, సింగరేణి సీఎండీ బలరాం ఉప ముఖ్యమంత్రి వెంట ఉన్నారు. ఉప ముఖ్యమంత్రి గౌరవార్థం భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన విందులో భట్టి పాల్గొన్నారు. అక్టోబరు 4న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అధికారులు హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

## హైడ్రాతో ప్రజల హాహాకారాలు

- మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి విమర్శలు

ఈనాడు, హైదరాబాద్: హైడ్రా చర్యల కారణంగా కొన్ని రోజులుగా హైదరాబాద్ ప్రజలు హాహాకారాలు చేస్తున్నారని, దీనికి కర్త, కర్మ, క్రియ సీఎం రేవంత్‌రెడ్డేనని శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. అసెంబ్లీ మీడియాహాలులో సోమవారం భారాస ఎమ్మెల్సీలు ఎల్.రమణ, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ప్రభుత్వమే అనుమతులిచ్చి.. హైడ్రా పేరిట ప్రభుత్వమే కూల్చితే ఎలా? అందరూ ఈ చర్యలను వ్యతిరేకిస్తున్నారు. హైకోర్టు కూడా హైడ్రా దూకుడును తప్పుపట్టింది. రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా కూల్చివేతలు బంద్ చేసి ప్రజలకిచ్చిన హామీల అమలుపై దృష్టిపెట్టాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

## రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

- రాహుల్‌కు హరీశ్‌రావు బహిరంగ లేఖ



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో రాజ్యాంగం దుర్వినియోగమవుతోందని, సీఎం రేవంత్‌రెడ్డి నిరంకుశ పాలనకు బుల్డోజర్ ప్రతీకగా మారిందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మూసీ రివర్ ఫ్రంట్, హైడ్రా ప్రాజెక్టులపై సోమవారం హైకోర్టు వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ అంశాలపై దృష్టి సారించి తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి సోమవారం హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. "తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుల పేరుతో పేద, మధ్య తరగతి కుటుంబాలను రోడ్డున పడేస్తోంది. చట్టాలను గౌరవించేలా మీ సీఎంకి సలహా ఇవ్వాలని మిమ్మల్ని కోరుతున్నా" అని ఆ లేఖలో హరీశ్ పేర్కొన్నారు. పశువైద్య సంచార వాహన సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం శోచనీయమని, ఆ వాహనాల్లో మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

## ఆ కన్వెన్షన్‌లో హరీశ్‌కు వాటాలు

- ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఆనంద కన్వెన్షన్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వాటాలు ఉన్నాయని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన ట్వీట్ చేశారు. ఈ కారణంగానే హరీశ్‌రావుతోపాటు సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డిలు మూసీ పర్యటన, హైడ్రాపై సమావేశాల పేరిట రాజకీయ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. హరీశ్‌రావు తన అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకే సామాన్య ప్రజలను అడ్డుపెట్టుకున్నారని ఆరోపించారు.

*లీగల్ నోటీసులు పంపిస్తున్నా: హరీశ్‌రావు*

ప్రజాసమస్యలు పరిష్కరించాలని పోరాడుతున్న తనపై కాంగ్రెస్ ప్రభుత్వం బురద జల్లుతోందని హరీశ్‌రావు విమర్శించారు. "ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను పక్కకు మళ్లించడానికి గోబెల్స్ ప్రచారాలను ఆశ్రయిస్తున్నారు. గోల్కొండ కోట, చార్మినార్‌లో కూడా హరీశ్‌రావుకు వాటాలున్నాయి అంటారేమో.. అబద్ధాలు ప్రచారం చేస్తున్నందుకు లీగల్ నోటీసులు పంపిస్తున్నా" అని హరీశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## జస్టిస్ సిర్పుర్కర్ కమిషన్‌పై పిటిషన్లు తేలేదాకా విచారణను వాయిదా వేయండి

- దిశ కేసులో హైకోర్టుకు పోలీసుల నివేదన

ఈనాడు, హైదరాబాద్: దిశ నిందితుల ఎన్‌కౌంటర్ వ్యవహారంలో జస్టిస్ సిర్పుర్కర్ కమిషన్‌ను సవాల్ చేస్తూ సింగిల్ జడ్జి వద్ద దాఖలు చేసిన పిటిషన్లు తేలేదాకా దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసు విచారణను వాయిదా వేయాలంటూ పోలీసు అధికారులు హైకోర్టులో మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటరు దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశిస్తూ విచారణను హైకోర్టు వాయిదా వేసింది. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసును సీబీఐకి అప్పగించాలని, పోలీసులపై కేసు నమోదు చేయాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలతోపాటు ఇతర పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణను కొనసాగించింది. విచారణను వాయిదా వేయాలన్న పోలీసు అధికారుల మధ్యంతర పిటిషన్‌లో కౌంటరు దాఖలు చేస్తామని పిటిషనర్ల తరఫు న్యాయవాది వసుధా నాగరాజ్ కోరడంతో ధర్మాసనం అనుమతిస్తూ విచారణను దసరా సెలవుల అనంతరానికి వాయిదా వేసింది.



**తప్పులను త్వరగా అంగీకరిస్తేనే మంచిది**

తప్పులు చేయడం మానవ సహజం. అయితే మన తప్పులను ఒప్పుకోవడానికి రెండు సందర్భాలు ఉంటాయి. తప్పు జరిగిన వెంటనే చెప్పడం; తప్పు గురించి చెప్పక తప్పని పరిస్థితి వచ్చినప్పుడు ఒప్పుకోవడం. ఆరంభంలోనే తప్పును అంగీకరించి సరిదిద్దుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయి. అదే ఆలస్యంగా తప్పును ఒప్పుకొంటే సమస్యలు సృష్టించినవారమవుతాం. కాబట్టి పరిస్థితి సంక్లిష్టం కాకముందే తప్పులను సరిదిద్దుకోండి.

– మోతీలాల్ ఓస్వాల్, వ్యాపారవేత్త

## ఆక్రమణల తొలగింపుపై విధానం ఉందా?

- ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న
- ఏ చర్య చేపట్టినా చట్ట ప్రకారమే వెళ్లాలని ఆదేశం
- ఇప్పటికిప్పుడు మూసీ ఆక్రమణలను తొలగించడం లేదన్న ప్రభుత్వం



ఈనాడు, హైదరాబాద్: మూసీ, దాని పరీవాహక ప్రాంతంలో ఆక్రమణల తొలగింపునకు ఏదైనా విధానం రూపొందించారా? అని ప్రభుత్వాన్ని హైకోర్టు సోమవారం ప్రశ్నించింది. 1999లో సర్వే చేసి ఎఫ్‌టీఎల్ నిర్ధారించిన తర్వాత దానికి ఆవల నిర్మించుకున్నవాటికి ఇప్పుడెలా నోటీసులు ఇస్తారని అడిగింది. మూసీ అభివృద్ధిలో భాగంగా ఏ చర్య చేపట్టినా చట్ట ప్రకారమే వెళ్లాలని ఆదేశించింది. మూసీ పరీవాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాల గుర్తింపునకు సంబంధించి అధికారులు మార్కింగ్ చేయడంతో.. అత్యవసరంగా భోజన విరామ సమయంలో(లంచ్ మోషన్) విచారణ చేపట్టాలంటూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఇప్పటికిప్పుడు యుద్ధప్రాతిపదికన ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టడం లేదని చెప్పారు. ఇప్పటికే ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటైందని, బాధితులతో చర్చలు జరుపుతోందని అన్నారు. అంతేకాకుండా ఇళ్లు కోల్పోయిన పేదలకు ప్రత్యామ్నాయం చూపిస్తామని తెలిపారు. ఇలాంటివారు సుమారు 2,100 మంది దాకా ఉన్నట్లు కలెక్టర్ గుర్తించారన్నారు. ప్రస్తుతానికి ఎలాంటి తొలగింపు చర్యలు చేపట్టడం లేదన్నారు. ఈ వాదనను నమోదు చేసిన న్యాయమూర్తి.. చెరువులన్నింటి ఎఫ్‌టీఎల్ నిర్ధారించి, చర్యలు చేపట్టేలా పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శికి సూచించాలన్నారు. ప్రజలకు నమ్మకం కలిగించాలని, లేదంటే చరిత్ర పునరావృతమవుతుందని, ఇంతకంటే ఎక్కువ చెప్పలేమన్నారు. ఏ చర్య చేపట్టినా చట్టప్రకారమే వెళ్లాలని సూచిస్తూ విచారణను అక్టోబరు 16కు వాయిదా వేశారు.

## పేదల ఇళ్లను కూల్చివేస్తామంటే ఒప్పుకోం!

- హైడ్రా దాడులపై భాజపా ఉద్యమం
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్



కరీంనగర్ కార్పొరేషన్, న్యూస్‌టుడే: హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తామంటే ఒప్పుకొనేది లేదని.. కచ్చితంగా హైడ్రా దాడులను అడ్డుకుంటామని.. ఈ విషయంలో భాజపా ఒంటరిగా ఉద్యమిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం ఉదయం కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రాణాలను అడ్డుపెట్టి అయినా ప్రజల ఆస్తులను కాపాడుకుంటామన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి జమ్మూ-కశ్మీర్ ఎన్నికల ప్రచారం ముగించుకుని రాగానే భాజపా రాష్ట్రస్థాయిలో కార్యాచరణ రూపొందించి.. వారం రోజుల్లో ప్రజల్లోకి వెళ్తుందన్నారు. తెలంగాణలో నాడు భారాస, నేడు కాంగ్రెస్ పార్టీలు అవినీతికి పాల్పడుతున్నాయని.. ఈ పరిస్థితిని అరికట్టాల్సిన బాధ్యత భాజపాపై ఉందన్నారు. "మూసీ ప్రక్షాళన పేరుతో రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తున్నారు. నాడు కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లు ఖర్చుచేసి ప్రజలపై భారం మోపారు. రాష్ట్రంలో జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఆరు గ్యారంటీలు అమలు చేసేలా లేరు. మూసీ పేరుతో అప్పుతెచ్చి దోచుకోవడానికి సిద్ధమయ్యారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు హైడ్రాను తీసుకొచ్చారు. దానిపై ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది. హైడ్రాను రాష్ట్రమే కాదు దేశమే అసహ్యించుకుంటోంది. అన్ని అనుమతులు తీసుకొని పేదలు ఇళ్లను నిర్మించుకుంటే గంటలోనే కూల్చడం ఎంతవరకు సమంజసం? ఇందిరమ్మరాజ్యం అంటే ఇదేనా? ఫాంహౌస్‌లు మాత్రం కూల్చడం లేదు. మంచి ఆలోచనతో హైడ్రా తీసుకొచ్చారని మొదట భావించాం. కానీ పేదల ఉసురు పోసుకుంటారని అనుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా కూల్చివేయడం ఏమిటి? కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో బడా సంస్థల నుంచి వసూళ్లు చేసి దిల్లీకి పంపుతోంది. కుటుంబ పార్టీలన్నీ ఇలాగే ఉంటాయి. తమిళనాడులో ముఖ్యమంత్రి కుమారుడిని డిప్యూటీ సీఎంను చేశారు. భారాస, కాంగ్రెస్ రెండూ కుటుంబ పార్టీలే. పేరుకే గాంధీ తప్ప లక్షణాలేవీ గాంధీవి లేవు. వారసత్వ, కుటుంబ పాలనకు భాజపా వ్యతిరేకం. స్థానికసంస్థల ఎన్నికల్లో రెండు పార్టీలకూ గుణపాఠం తప్పదు. ప్రజల సమస్యలను మాజీ సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదు" అని బండి సంజయ్ విమర్శించారు. అనంతరం ఆయన కరీంనగర్ మహాలక్ష్మి ఆలయంలో భవానీ దీక్ష మాల వేసుకున్నారు.

## సంబంధంలేని విషయాల్లోకి హైడ్రాను లాగొద్దు

- మూసీ పనులు మా పరిధిలోవి కావని వెల్లడి: రంగనాథ్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ ఇంటిని కూలగొట్టినా హైడ్రా పేరు వినిపిస్తోందని, బాధితులు, సామాజిక మాధ్యమాల్లో పలు వేదికలు తమనే నిందిస్తున్నాయని, వాటితో ఎలాంటి సంబంధం లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సోమవారం స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆక్రమణలతో కుంచించుకుపోతున్న చెరువులను సంరక్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు. విపత్తుల నుంచి ప్రజలను రక్షించడం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, చెరువుల్లోని పూడిక తొలగింపు వంటి అనేక కార్యక్రమాలను హైడ్రా చేపడుతోందన్నారు. ఇప్పటివరకు తొలగించినవన్నీ నకిలీ పత్రాలు, చెల్లుబాటుకాని అనుమతులతో ప్రభుత్వ భూములు, చెరువుల్లోని కొత్త నిర్మాణాలని వివరించారు. హైడ్రా పరిధి ఓఆర్‌ఆర్ వరకేనని చెప్పారు. రెవెన్యూ, నీటిపారుదలశాఖ, జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం, ఇతరత్రా సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, ఇప్పటివరకు పేదల నివాసాలను హైడ్రా ఎక్కడా తొలగించలేదన్నారు. మూసీ నది అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) ఎప్పుడో ఏర్పాటైందని, హైడ్రాకు అందులో ఎలాంటి పాత్ర లేదని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య వార్తలను ప్రచారం చేస్తున్నారంటూ రంగనాథ్ తప్పుబట్టారు.

# కూల్చివేతల్లో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనలు

(మొదటి పేజీ తరువాయి)

పనితీరు మాత్రం అసంతృప్తికరంగా ఉందని ఆక్షేపించింది. కేవలం కూల్చివేతలు తప్ప మరో పని చేయడంలేదని, విపత్తుల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ లాంటివి పట్టించుకోవడంలేదని వ్యాఖ్యానించింది. అక్రమ నిర్మాణాల కూల్చివేతల వ్యవహారంలో వ్యక్తిగతంగా హాజరైన అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ, ఆన్‌లైన్ ద్వారా హాజరైన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌లపై సోమవారం హైకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. కూల్చివేతల వ్యవహారంలో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని పేర్కొంది. కూల్చివేతలకు మనుషులు, యంత్రాలను పంపాలని తహసీల్దార్ అడిగితే ఆదివారం నాడు కూల్చివేతలకు మద్దతు ఇవ్వబోమని చెప్పాల్సిన హైడ్రా.. దానికి విరుద్ధంగా ఆదివారం ఉదయం 7.30 గంటలకే కూల్చివేతలు చేపట్టిందని, ఇది హైకోర్టు ఫుల్‌బెంచ్ తీర్పునకు విరుద్ధమని పేర్కొంది. ఇప్పటికే నిర్మాణాలను కూల్చివేసినందువల్ల స్థలాన్ని స్వాధీనం చేసుకోవాల్సి ఉందంది. పిటిషనర్లకు తెలియకుండా జరిగిన చర్య మొత్తం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పేర్కొంది. అమీన్‌పూర్‌లోని సర్వే నం.164 లోని ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను 48 గంటల్లో తొలగించాలంటూ సెప్టెంబరు 20న తహసీల్దార్ ఇచ్చిన నోటీసును సవాల్ చేస్తూ డాక్టర్ మహమ్మద్ రఫీ, అమీన్‌పూర్‌కు చెందిన గణేష్ కన్‌స్ట్రక్షన్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. దీంతోపాటు పటేల్‌గూడలో విల్లాల కూల్చివేతలపై ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ కె.శ్రీనివాసరావు మరో పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు.

### సర్వే విధానం తెలుసా?

పిటిషనర్లు 2021లో స్థలం కొనుగోలు చేశాక.. ఆ విషయం 2024 మార్చిలో తెలిసిందని, ఏప్రిల్ 1న సర్వే చేశామంటున్నారని, సర్వేకు ముందు పిటిషనర్లకు నోటీసులు ఇవ్వరా అంటూ తహసీల్దార్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. అసలు సర్వే చేసే విధానం ఏమిటో తెలుసా అని నిలదీశారు. కలెక్టర్ ఆదేశాలతో అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే చేశారని తహసీల్దార్ తెలపగా.. నోటీసులు ఇవ్వకుండా ఎలా చేశారని ప్రశ్నించారు. భవన నిర్మాణ అనుమతుల రద్దు.. విద్యుత్తు కనెక్షన్ రద్దుపై పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించి స్టే పొందారన్నారు. పిటిషనర్లు ఈ ఏడాది ఏప్రిల్ 15న లేఖ రాస్తూ 15 రోజుల గడువు కోరారని, ఏప్రిల్ 18న వివరణ ఇచ్చారని.. దాన్ని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని నిలదీశారు. 48 గంటల్లో భవనాన్ని ఖాళీ చేయాలని ఏప్రిల్ 20న నోటీసు ఇచ్చినపుడు 48 గంటల సమయమూ ఇవ్వకుండానే ఆదివారం కూల్చివేతలు ఎలా చేపడతారన్నారు. ఆదివారం సెలవు అయినపుడు కుటుంబంతో గడపకుండా కూల్చివేతలకు వెళ్లాల్సిన అవసరం ఏముందన్నారు. శని, ఆదివారాల్లో కూల్చివేతలు చేపట్టరాదన్న ఉత్తర్వులను పట్టించుకోరా? అసలు కోర్టు ఉత్తర్వులను చదివారా? అని ప్రశ్నించారు. అన్ని రకాలుగా స్టేలున్నపుడు.. వాటిని తొలగించకముందే మీరెలా చర్యలు తీసుకుంటారన్నారు. 'అన్ని నోటీసులు ఒకేరోజు ఇచ్చి చర్యలు చేపడతారా? ఇదేనా మీకు తెలిసిన చట్టం? ఇన్ని ఉల్లంఘనలకు ఎందుకు పాల్పడాల్సి వచ్చింద'ని నిలదీశారు. 'నిబంధనలకు విరుద్ధంగా వెళ్లాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారా? అలాగైతే చెప్పండి.. ఆయన్ని పిలిపించి వివరణ అడుగుతా'మన్నారు.

### గుడ్డిగా యంత్రాలను పంపుతారా..

తహసీల్దార్ లేఖ రాస్తే నిబంధనలను పరిశీలించకుండా గుడ్డిగా యంత్రాలను పంపేస్తారా.. చార్మినార్, హైకోర్టు భవనాలను కూల్చివేయడానికి కూడా యంత్రాలను పంపిస్తారా? అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. పంపబోమని ఆయన చెప్పగా హైకోర్టు, చార్మినార్‌లను కూల్చివేయడానికి యంత్రాలను పంపని మీరు.. మిగిలిన వారి విషయంలో అనుసరించిన విధానాన్ని పరిశీలించరా అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ మంచి కార్యక్రమమని, అయితే అనుసరించే విధానం ఇది కాదన్నారు. 'ఆదివారం కూల్చివేతలు చేపట్టరాదన్న విషయం ఉన్నతాధికారిగా మీకు తెలియదా' అంటూ నిలదీశారు. ఈ దశలో కమిషనర్ జోక్యం చేసుకుంటూ.. తమది కోఆర్డినేటింగ్ ఏజెన్సీ మాత్రమేనని, తహసీల్దార్ లేఖ రాయడంతో మనుషులు, యంత్రాలను పంపామని చెప్పారు. 5 నెలలు ఆగినవారు.. రెండు రోజులు ఆగకుండా కూల్చివేస్తారా? ఇది సబబేనా అని రంగనాథ్‌ను న్యాయమూర్తి అడిగారు. మీడియా సమావేశాలు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఓ కేసులో తనను ఆందోళనకు గురిచేశారని ఓ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారని, దాని వివరాలను సమర్పించాలని ఆయనను ఆదేశించామన్నారు. హైడ్రా పనితీరు సంతృప్తికరంగా లేదని, ఇలాగైతే జీవో 99 అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుందన్నారు. కూల్చివేతలపై తప్ప జీవోలోని ఇతర విధులపై దృష్టి సారించడం లేదన్నారు. కమిషనర్ సమాధానమిస్తూ 70 శాతం చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, హైదరాబాద్ నగరంలో 2,500 దాకా చెరువులున్నాయని, వాటినైనా పరిరక్షించాలన్నదే లక్ష్యమని తెలిపారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ఎన్ని చెరువులకు ఎఫ్‌టీఎల్ ధ్రువీకరించి నోటిఫికేషన్ జారీ చేశారని ప్రశ్నించారు. చెరువుల ఎఫ్‌టీఎల్ గుర్తించిన తర్వాత చర్యలు చేపట్టాలని గత, ప్రస్తుత ప్రభుత్వ న్యాయవాదులను ఆదేశించినా.. ఇప్పటివరకు ఒక్క చెరువుకూ ఎఫ్‌టీఎల్ నిర్ధారించలేదన్నారు. చెరువుల్లో ఆక్రమణలను తొలగించరాదని, అక్రమ నిర్మాణాలను కూల్చివేయరాదని తాము చెప్పడం లేదని.. నిబంధనల ప్రకారం చేయాలనే చెబుతున్నామన్నారు. ఇదే అమీన్‌పూర్‌లో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసి నివేదిక సమర్పించాలంటూ 45 రోజులు గడువు ఇచ్చామన్నారు. ప్రస్తుతానికి అమీన్‌పూర్‌లోని సర్వే నం.164లోని స్థలంపై యథాతథ స్థితి కొనసాగించాలని ఇరుపక్షాలను ఆదేశించారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని తహసీల్దార్, హైడ్రా కమిషనర్లను ఆదేశిస్తూ విచారణను అక్టోబరు 15కు వాయిదా వేశారు. తదుపరి విచారణకు వారు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపారు.

## దాతృత్వ పరిమళం.. బాధితులకు ఉపశమనం

వరద బీభత్సానికి జీవనాధారం కోల్పోయిన అభాగ్యులు ఎందరో. ఇళ్లతో పాటు కష్టార్జితంతో కొనుక్కున్న వస్తువులను కోల్పోయిన శ్రమజీవులు మరెందరో. కట్టుబట్టలతో మిగిలి ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న వారికి అండగా నిలిచేందుకు పలువురు ముందుకు వస్తున్నారు. వారి దాతృత్వపు పరిమళాలతో బాధితుల జీవితాలకు భరోసా కల్పిస్తున్నారు.



కండెపి నాగమల్లేశ్వరి, డైరెక్టర్, అతులిత ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్
విరాళం: రూ.1,00,116



అల్లూరి రామరాజు, హైదరాబాద్
విరాళం: రూ.1,00,000

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

### ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

| వ్యక్తులు / సంస్థలు | సాయం (రూ.లలో) |
|---|---|
| శ్రీ సత్యసాయి హైస్కూల్, వెల్లటూరు, వైయస్‌ఆర్ జిల్లా | 56,000 |
| పెట్లా వెంకట కిశోర్, విశాఖపట్నం | 50,000 |
| దొప్పలపూడి సురేశ్‌కుమార్, కర్నూలు | 25,000 |
| పోతురెడ్డి వెంకట్రావు, విజయవాడ | 25,000 |
| గూడపాటి రుక్మిణి, తాడితోట కాల్దారి, తూర్పుగోదావరి జిల్లా | 11,111 |
| కొరుపు కైలాస నాగ హైమావతి (జ్యోతి), మల్లవరం, తూర్పుగోదావరి జిల్లా | 10,116 |
| వెనిగళ్ల సుభాషచంద్రబోస్, అమీన్‌పూర్, సంగారెడ్డి జిల్లా | 10,001 |
| ఎం.వెంకటేశ్వరరావు, ఖమ్మం | 10,000 |
| గంధం శశికళ, హైదరాబాద్ | 10,000 |
| తాడేపల్లి రవీంద్రబాబు, విజయవాడ | 10,000 |
| నీలి ఆంజనేయ ప్రతాప్, వడాలి, ఏలూరు జిల్లా | 10,000 |
| శ్రీ బాలాజీ డ్రెస్సెస్, మెదక్ | 10,000 |
| మొగలపు శ్యామలలక్ష్మి, వెంకటకృష్ణారావు, తణుకు | 10,000 |
| వల్లభనేని సంజన, శ్రావణి, గుడ్లవల్లేరు, కృష్ణా జిల్లా | 5,116 |
| ఐ.జయంతరావు, ప్రసూన, రాజమహేంద్రవరం | 5,116 |
| సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జంగారెడ్డిగూడెం | 5,116 |
| బత్తుల సత్తయ్య, హైదరాబాద్ | 5,005 |
| ముదిగంటి శివాజీ, హైదరాబాద్ | 5,001 |
| డుంగి నర్సింగరావు, విశాఖపట్నం | 5,001 |
| కోన కృష్ణమోహన్, హైదరాబాద్ | 5,001 |
| రేపాక రమేష్, పోతుగల్, రాజన్న సిరిసిల్ల జిల్లా | 5,000 |
| బి.ప్రభాకరరావు, గొట్టుముక్కల, ఎన్టీఆర్ జిల్లా | 5,000 |
| ఆర్.మల్లిక, బెంగళూరు | 5,000 |
| ఎన్.రామలింగేశ్వర ప్రసాద్, హైదరాబాద్ | 5,000 |
| కురువ లక్ష్మణరావు, కొత్తకోట, కర్నూలు జిల్లా | 5,000 |
| డా.సి.వెంకట సుబ్బయ్య, కొల్లాపూర్, నాగర్‌కర్నూలు జిల్లా | 5,000 |
| ఆళ్ల తాతారావు, విశాఖపట్నం | 5,000 |
| బి.లలిత ప్రసాద్, హైదరాబాద్ | 5,000 |

**వరద మిగిల్చింది వేదన.. చేయిచేయి కలిస్తే సాంత్వన**

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.

- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

**విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు**

ఈనాడు రిలీఫ్ ఫండ్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

## సౌర వెలుగు నీడలో..



వాహనాలకు ఎండ, వాన నుంచి రక్షణతో పాటు సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది మహేశ్వరం మండలం రావిర్యాలకు చెందిన ఓ సంస్థ. వందలాది కార్లకు నీడను కల్పించడమే కాకుండా షెడ్లపై ఏర్పాటు చేసిన సౌర ఫలకల ద్వారా ఎనిమిది కిలోవాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. - ఈనాడు, హైదరాబాద్

## సర్వాంగ సుందరంగా బాపూఘాట్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అనుదీప్ దురిశెట్టి

మెహిదీపట్నం: గాంధీ జయంతి వేడుకలకు లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని, బాపూఘాట్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అక్టోబరు 2న ఉదయం 6గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, 10కి సీఎం రేవంత్‌రెడ్డి బాపూజీకి నివాళులర్పిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రొటోకాల్ తప్పకుండా పాటించాలన్నారు. డీసీపీ చంద్రమోహన్, ఆర్డీవో మహిపాల్, డీఈవో రోహిణి, తహసీల్దార్ అహల్య ఉన్నారు.

## నాగోల్, మియాపూర్ స్టేషన్లలో.. 6 నుంచి పార్కింగ్ రుసుం వసూలు



ఈనాడు, హైదరాబాద్: నాగోల్, మియాపూర్ మెట్రోస్టేషన్లలో ఈ నెల 6 నుంచి వాహనాల పార్కింగ్‌కు నామమాత్రపు రుసుం వసూలు చేయనున్నట్లు హైదరాబాద్ మెట్రో సోమవారం ప్రకటించింది. ఈ స్టేషన్లలో పార్కింగ్ ఫీజు వసూలు చేయాలని గతంలోనే యాజమాన్యం నిర్ణయించింది. ప్రయాణికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడం, నాగోల్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగడంతో నాడు తాత్కాలికంగా వాయిదా వేసింది.

**ఆఫర్ల పొడిగింపు :** ప్రయాణికులకు అందిస్తున్న అన్ని రకాల ఆఫర్లను 2025 మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు హైదరాబాద్ మెట్రో ఓ ప్రకటనలో పేర్కొంది. సూపర్ సేవర్ 59, స్టూడెంట్ పాస్, సూపర్ సేవర్ ఆఫ్ పీక్ వంటి ఆఫర్లను వినియోగించుకోవచ్చని వెల్లడించింది.

# అత్యుత్సాహమే మూసీకి శాపం

- కనీసం నిర్వాసితులతో చర్చించకుండానే కూల్చివేతలంటూ ఆర్భాటం
- అధికారుల వ్యూహాత్మక తప్పిదంతో ఎగసిన ఆందోళనలు





మురుగుతో మహానగరాన్ని ఇబ్బంది పెడుతున్న మూసీనదిని సుందరీకరించాలన్న డిమాండ్ ఏళ్లుగా ఉంది. ఈ డిమాండ్‌కు గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఆమోదముద్ర వేశాయి. గత భారాస ప్రభుత్వం మూసీలో ఆక్రమణలు ఎన్ని ఉన్నాయన్న లెక్కలు వేసి ఆ తరువాత ముందుకెళ్లలేదు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఈ నది ప్రక్షాళనకు నడుం బిగించారు. సుందరీకరణకు ముందు ఆక్రమణల తొలగింపు ప్రక్రియ చాలా కీలకం. సున్నితమైన ఈ విషయంలో ఉన్నతాధికారులు ఒక ప్రణాళిక లేకుండా ముందుకెళ్లారు. కనీసం సమాచారం లేకుండా ఆక్రమణలకు మార్కింగ్ చేయడంతోపాటు కూల్చివేతలకు సిద్ధపడటంతో బాధితులు ఒక్కసారిగా ఆగ్రహించారు. ఫలితంగా ఇప్పుడు ఆక్రమణల తొలగింపు వ్యవహారం పెద్ద చిక్కుముడిలా మారింది.

**మాట్లాడకుండానే మార్కింగ్..**

గత ప్రభుత్వ హయాంలో నదిగర్భం, సమీపంలోనూ 12,500 ఆక్రమణలు ఉన్నాయని గుర్తించారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత మరోసారి ఆక్రమణలను పరిశీలిస్తే దాదాపు 16 వేలు ఉన్నట్లు గుర్తించారు. ఆక్రమణదారులతో మాట్లాడి వారిని ఒప్పించిన తరువాతే తొలగింపు ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. నిర్వాసితులకు ఇచ్చే పరిహారం, ఇతరత్రా సౌకర్యాలు తెలిపి వారిని సమాధాన పర్చాలి. కానీ మూసీ అభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులకు ఏమైందో ఏమో ఒక్కసారిగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లను రంగంలోకి దింపి ఆక్రమణల తొలగింపునకు పూనుకున్నారు. నదీగర్భంలో ఉన్న చాలామంది రెండు పడక గదుల ఇళ్లకు తరలివెళ్లినా.. అక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఎదురుతిరిగారు.

**కూల్చుతారనే ప్రచారంతో..**

మూసీనది బఫర్‌జోన్‌లో దాదాపు 10వేల వరకు పక్కా నిర్మాణాలున్నాయి. వీటిలో చాలావాటికి కొన్నేళ్ల కిందటే బల్దియా నిర్మాణ అనుమతిచ్చింది. ఇలా సొంత ఇళ్లు ఉన్న వారికి నష్టపరిహారంపై కనీస సమాచారం ఇవ్వకుండానే అధికారులు మార్కింగ్ వేశారు. దీంతో ఆందోళనలు మొదలయ్యాయి. మూసీ ప్రాజెక్టుతో హైడ్రాకు సంబంధం లేకపోయినా రేపోమాపో కూల్చివేస్తారని కొందరు కావాలని ప్రచారం చేయడంతో నిర్వాసితుల్లో ఆందోళన తీవ్రమైంది. ఇదే సమయంలో భారాస, భాజపా, ఎంఐఎం ప్రజాప్రతినిధులు ఆందోళకారులకు సంఘీభావం ప్రకటించడంతో పరిస్థితి దారితప్పిందని అధికారులు చెబుతున్నారు. దీనివల్లే మూసీలో ఆక్రమణల తొలగింపు వ్యవహారం క్లిష్టంగా మారింది. మరోవైపు మూసీ బఫర్ జోన్ గుర్తింపు అన్ని ప్రాంతాల్లో సవ్యంగా జరగలేదని చెబుతున్నారు. ఉదాహరణకు పురానాపూల్ నుంచి కార్వాన్ వెళ్లేందుకు గతంలోనే బఫర్ జోన్‌లో వంద అడుగుల రోడ్డు నిర్మించారు. ఇప్పుడా రోడ్డును విస్మరించి బఫర్‌జోన్‌ను గుర్తించడంతో ఆందోళనలు తీవ్రమయ్యాయి. ఇప్పటికైనా నిర్వాసితులకు అన్ని రకాల న్యాయం చేస్తేనే మూసీ తొలగింపు ప్రక్రియ సజావుగా జరుగుతుంది.. లేని పక్షంలో సుందరీకరణ కలగానే మిగులుతుందని కాంగ్రెస్ ప్రజాప్రతినిధి ఒకరు పేర్కొనడం విశేషం.

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి



**గూడు గోస వినండి సారూ..**

అత్తాపూర్‌లోని మూసీ పరీవాహక ప్రాంతంలో సోమవారం మాజీ మంత్రి కేటీఆర్ పర్యటించారు. పలువురు మూసీ బాధితులు ఆయనకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మాజీ మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డి, సబితారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి ఆయనతో ఉన్నారు.

## పాతబస్తీకి వస్తే.. ఖబడ్దార్

### ఆర్డీవోకు మజ్లిస్ ఎమ్మెల్యేల హెచ్చరిక



బాపూఘాట్‌లో కలెక్టర్ అనుదీప్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కౌసర్ మొహినుద్దీన్, ముబీన్, జుల్ఫీకర్ అలీ


మెహిదీపట్నం: పాతబస్తీలో మూసీ తీరం వెంట ఇళ్లను నిర్మించుకొని ఉంటున్న వారిని ఖాళీ చేయాలంటూ సర్వే చేసేందుకు వస్తే తీవ్ర పరిణామాలుంటాయని మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలు కౌసర్ మొహినుద్దీన్, ముబీన్, జుల్ఫీకర్ అలీలు హైదరాబాద్ ఆర్డీవో మహిపాల్‌ని సోమవారం హెచ్చరించారు. ఇప్పటి వరకూ ఏ శాఖ ప్రభుత్వ అధికారులు తమ ఇలాఖాలోకి రాలేదని, ఒక వేళ వస్తే.. తమనుదాటి వెళ్లాలేరని సవాల్ విసిరారు. గోల్కొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్డీవోను కలిసిన ఎమ్మెల్యేలు సర్వే ఏ ప్రాతిపదికన చేస్తున్నారని, ఇళ్లకు రెడ్‌మార్కులు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. రీ-సర్వే చేశాకే మా ఇళ్లవద్దకు రావాలని అప్పటి వరకూ రెడ్ మార్క్ వేయకూడదని హెచ్చరించారు. మూసీ తీరం వెంట బఫర్‌జోన్, ఇతర అంశాలపై 2003లో అప్పటి ప్రభుత్వం నిర్వహించిన సర్వేనే ప్రామాణికంగా తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఆ సర్వే ప్రకారమే మార్కింగ్ చేయాలని సూచించారు.

## ప్రాజెక్టులకు సై.. నిధులు నిండుకున్నయ్

- తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో జీహెచ్ఎంసీ
- హెచ్-సిటి పనులను భుజానికెత్తుకున్న సర్కారు

ఈనాడు, హైదరాబాద్

జీహెచ్ఎంసీ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. రూ.6వేల కోట్ల అప్పులు, ఆయా బ్యాంకు రుణాలకు మూణ్నెళ్లకోసారి చెల్లించాల్సిన రుణ వాయిదాలతో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో.. కొత్త పనులను చేపట్టడం అసాధ్యమని సర్కారు భావించింది. రూ.150కోట్ల రుణాన్ని.. జీహెచ్ఎంసీ చేపట్టనున్న కూడళ్ల సుందరీకరణకు, ఇతరత్రా పనులకు ఇవ్వాలని హెచ్ఎండీఏకి సూచించింది. మౌలిక సౌకర్యాల కల్పనకు జీహెచ్ఎంసీ రూ.5వేల కోట్లు అడగ్గా.. అందులోని హెచ్-సిటి ప్రాజెక్టు పనుల పై సర్కారు దృష్టి పెట్టి అనుమతులను మంజూరు చేస్తోంది.



**కేబీఆర్ పార్కుతో మొదలు..**

కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ కష్టాలను పరిష్కరించే హెచ్-సిటి ప్రతిపాదనలను సర్కారు మొదటగా ఆమోదించిందని, వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు జీహెచ్ఎంసీ చెబుతోంది. ఆర్నెల్లలో నిర్మాణ పనులు మొదలు కావొచ్చని అంచనా వేస్తున్నారు. తర్వాతి దశలో.. మూసాపేట వై జంక్షన్, పాతబస్తీ, రేతిబౌలి, నానల్‌నగర్, ఖాజాగూడ, బండ్లగూడ, తదితర కూడళ్లు, పలు ఆర్ఓబీ, ఆర్‌యూబీ పనులకు అనుమతులు రానున్నాయి.

**సర్కారు నిధులిస్తేనే..:** ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను రాబడి అంతంతమాత్రంగానే ఉంది. నిర్మాణ అనుమతుల రూపంలో వచ్చే ఆదాయమూ తగ్గుముఖం పట్టింది. బల్దియాకు కొత్తగా బ్యాంకు రుణాలు మంజూరవట్లేదు. కొన్ని బ్యాంకులు ఇస్తామని ముందుకొస్తున్నా.. వడ్డీ రేటు అధికంగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో.. సర్కారైనా మౌలిక సౌకర్యాలకు నిధులు కేటాయించాలని జీహెచ్ఎంసీ కోరుతోంది.

**హెచ్ఎండీఏ ద్వారా రూ.150 కోట్లు..**

జీహెచ్ఎంసీకి రూ.150కోట్ల అప్పు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించగా. . నేరుగా నిధులిచ్చేందుకు హెచ్ఎండీఏ ఒప్పుకోలేదు. పనులు పూర్తవగానే బిల్లులు ఇవ్వాలని, వాటికి చెల్లిస్తామని చెప్పింది. అదైనా మంచిదేగా అని. . కమిషనర్ ఆమ్రపాలి యుద్ధప్రాతిపదికన అన్ని జోన్లలో కూడళ్ల సుందరీకరణ, పైవంతెనలకు రంగులు, ఇతర పనులను చేపట్టాలని ఆదేశాలిచ్చారు. పనులు రెండు నెలల్లో పూర్తవుతాయని ఇంజినీర్లు చెబుతున్నారు.

## గ్రేటర్‌లో తొలుత 'సారథి'

**రవాణాశాఖ ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి**

ఈనాడు, హైదరాబాద్

రవాణాశాఖ ఆన్‌లైన్ సేవలకు సంబంధించి కొత్త పోర్టల్ 'వాహన్-సారథి'లో తొలుత గ్రేటర్‌లో సారథిని అమలు చేయనున్నారు. ఈ నెల ఒకటి నుంచి సికింద్రాబాద్ రవాణాశాఖ నుంచి ప్రయోగాత్మక పరిశీలన కింద అమలు చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. తర్వాత దశల వారీగా గ్రేటర్‌లోని అన్ని కార్యాలయాల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. దేశ వ్యాప్తంగా రవాణా సేవలన్నింటిపై ఏకీకృతమైన విధానాన్ని అమలు చేసేందుకు గతంలో వాహన్-సారథి సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు ఇందులో భాగస్వామ్యం అయ్యాయి. ఇటీవల తెలంగాణ కూడా పచ్చజెండా ఊపింది. డ్రైవింగ్ లైసెన్సు వివరాలన్నీ 'సారథి'లో, వాహనాల వివరాలను 'వాహన్'లో నమోదు చేయనున్నారు. ఈ నేపథ్యంలో తొలుత సారథి సేవలను గ్రేటర్‌లో అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు.

**ఇవీ ప్రయోజనాలు...**

- సారథితో లైసెన్సుల జారీ ఇతరత్రా సేవలు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి.
- ఎల్ఎల్ఆర్ సైతం ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే పొందే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ విధానాన్ని కర్ణాటకలో విజయవంతంగా అమలు చేస్తున్నారు. పాత డ్రైవింగ్ లైసెన్సు రెన్యువల్ చేసుకోవడం, చిరునామా, మార్పులు, చేర్పులు లాంటి సేవలతోపాటు ఒక జిల్లా నుంచి మరో జిల్లా లేదా రాష్ట్రానికి బదిలీ అయినప్పుడు డ్రైవింగ్ లైసెన్సులను కూడా 'సారథి' ద్వారా సులువుగా ఆన్‌లైన్‌లోనే కల్పించనున్నారు.
- ఈ సేవల కోసం ఆన్‌లైన్‌లో ఫీజులు, నిర్ణీత డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. ఇది విజయమైంతన తర్వాత వాహన్ పోర్టల్‌ను సైతం అందుబాటులోకి తేనున్నారు. ఫలితంగా మొత్తం వాహనాల డేటా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానుంది.

## పంచాయతీ.. మున్సిపాలిటీల లేఅవుట్లపై నజర్

### చెరువులకు సమీపంలోని స్థలాలపై రెవెన్యూ సర్వే



ఈనాడు, హైదరాబాద్: చెరువులు.. జలవనరుల సంరక్షణకు హైడ్రా తరహా వ్యవస్థను జిల్లాలకు విస్తరించనున్న నేపథ్యంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని గ్రామాలు.. మున్సిపాలిటీల్లో ఇళ్ల నిర్మాణం కోసం వేసిన లేఅవుట్లపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. ప్రధానంగా మేజర్ పంచాయతీల నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లుగా మారిన వాటిలో తొలుత సర్వే నిర్వహిస్తారు. బఫర్ జోన్‌లు.. ఎఫ్‌టీఎల్‌లలో అనుమతులిచ్చిన సంస్థలకు లేఖలు రాశారు. స్థానిక ఇరిగేషన్ అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లి డిజిటల్ జీపీఎస్ సర్వేలు, గ్రామ నక్షాలు సరిపోల్చనున్నారు. చెరువుల బఫర్‌జోన్లలో కొందరు వెంచర్లు వేశారన్న ఫిర్యాదులతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీకి సమీపంలోని మేజర్ గ్రామాల్లోని చెరువులకు సమీపంలోని పట్టా భూములను కొందరు కొనుగోలు చేసి.. ఎఫ్‌టీఎల్ స్థలాలను కలిపేసుకున్నారు. నిర్మాణాలకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా అనుమతులివ్వడంతో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు లే-అవుట్లలో కలసిపోయాయి. ఇలాంటి లేఅవుట్లపై అధికారులు దృష్టిపెట్టనున్నారు.

## చంపాక.. 22 కి.మీ. నడక

- మహిళ నగలు, ఫోనుతో నిందితుడి పరార్
- దుండిగల్ హత్య కేసులో వీడని మిస్టరీ

ఈనాడు, హైదరాబాద్, దుండిగల్, న్యూస్‌టుడే: దుండిగల్‌లో మహిళ హత్య కేసు వెనుక మిస్టరీ వీడడం లేదు. పోలీసులు 3 ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నా హంతకుడి ఆచూకీ చిక్కడం లేదు. హత్య అనంతరం నిందితుడు మల్లంపేట నుంచి మియాపూర్ వరకూ 22 కిలోమీటర్ల వరకూ నడుచుకుంటూ వెళ్లినట్లు సీసీ ఫుటేజీలు సేకరించారు. ఈనెల 23న మల్లంపేట గ్రీన్‌పార్క్ కాలనీలోని అపార్టుమెంట్‌లో ఉండే బొద్దుల శారద (50) హత్యకు గురైంది. హత్యకు ముందు మాస్కు ధరించిన ఒక వ్యక్తితో కలిసి తన నివాసానికి వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. దాదాపు 100 సీసీ కెమెరాలను పరిశీలించగా చివరగా మియాపూర్‌లోని మద్యం దుకాణం వరకు వెళ్లినట్లు గుర్తించారు. ఆ తర్వాత అదృశ్యమయ్యాడు. పథకం ప్రకారం హత్య చేసి పరారైనట్లు పోలీసులు నిర్ధారించుకున్నారు. తాజాగా మృతురాలి ఫోను ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.





**తీరొక్క పువ్వై.. గౌరమ్మ కొలువై**

నగరంలో బతుకమ్మ సంబరాలు మొదలయ్యాయి. సోమవారం కూకట్‌పల్లిలో మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలతో తరలివచ్చి ఆడిపాడారు.


## దసరాకు 1450 ప్రత్యేక బస్సులు

ఈనాడు, హైదరాబాద్: దసరా నేపథ్యంలో గ్రేటర్ పరిధిలోని అన్ని డిపోల నుంచి మొత్తం 1450 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. నగరం నుంచి స్వస్థలాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు ఛార్జీలతో వీటిని నడపనున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్ల నుంచి 1180, రంగారెడ్డి నుంచి 265 బస్సులను జిల్లాలకు నడిపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రద్దీనిబట్టి బస్సులను పెంచే అవకాశం ఉంది.

## భూ వివరాలు సమస్తం.. యాప్‌లో నిక్షిప్తం

**హెచ్ఎండీఏ కోసం సిద్ధం చేయనున్న సర్కారు**

ఈనాడు, హైదరాబాద్



హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలో స్థలం, ఇల్లు కొనాలంటే ఆ భూమి ఏ జోన్‌లో ఉంది? వాటి పరిధిలో నీటి వనరులు ఉన్నాయా లాంటి వివరాలు తెలుసుకోవాలంటే అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిందే. ఈ నేపథ్యంలో కొనుగోలుదారులను ముందే అప్రమత్తం చేసేందుకు హెచ్ఎండీఏ ఓ యాప్‌ను సిద్ధం చేస్తోంది. హెచ్ఎండీఏలోని ఏడు జిల్లాల పరిధికి సంబంధించి మాస్టర్‌ప్లాన్ వివరాలన్నీ యాప్‌లో పొందుపర్చనున్నారు.

**ఏ జోన్ ఎక్కడ?**

ప్రస్తుతం హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్-2030లో రకరకాల జోన్లు ఉన్నాయి. నివాసిత, పారిశ్రామిక, బహుళ వినియోగ, కన్జర్వేషన్, బయో కన్జర్వేషన్ జోన్లతోపాటు భవిష్యత్తులో ఏర్పాటు చేయనున్న రహదారులు, చెరువులు, కుంటలు, అడవులు ఇలా అన్ని రకాల సమాచారం అందుబాటులో ఉంది. లేఅవుట్లు, బహుళ అంతస్తుల భవనాలు, ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అనుమతులు ఇచ్చే సమయంలో ఆ వివరాలన్నీ పరిగణలోకి తీసుకొని అధికారులు ముందుకెళ్తారు. అపార్ట్‌మెంట్, స్థలం ఎఫ్‌టీఎల్‌లో ఉంటే అలాంటి సమాచారం యాప్‌లో కనిపిస్తుంది. అనుమతుల కోసం కూడా యాప్‌లోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించనున్నారు.

## చంచల్‌గూడ జైలులో గంజాయి నిందితులు

*43 కేసులు.. 134 మంది అరెస్టు*

ధూల్‌పేట, న్యూస్‌టుడే: రెండు నెలల క్రితం ఆ ప్రాంతంలోని ఏ వీధిలో చూసినా గంజాయి బ్యాచ్‌ల హల్‌చల్.. చీకటి పడిందంటే చాలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఇంజినీరింగ్,



వైద్య విద్యార్థులు, వ్యసనపరులు ఆ పరిసర ప్రాంతాల్లో ఖరీదైన వాహనాలతో గంజాయి కోసం 'క్యూ' కట్టేవారు. గంజాయి రహిత ధూల్‌పేటగా చెయ్యాలన్న లక్ష్యంతో ఆబ్కారీ శాఖ చేపట్టిన ఆపరేషన్ ధూల్‌పేటతో అక్కడ మార్పు కొట్టొస్తోంది. స్టేట్ టాస్క్‌ఫోర్స్‌లోని అంజిరెడ్డి ఆధ్వర్యంలోని బృందానికి ధూల్‌పేట బాధ్యతలు అప్పగించి ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్‌టీఎఫ్, ధూల్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ఎక్సైజ్ అధికారులు, సిబ్బందికి విడతల వారిగా విధులు కేటాయించారు. ● గత రెండు నెలలుగా 43 కేసులు నమోదు కాగా.. 134 మంది గంజాయి విక్రేతలను అరెస్టు చేసి జైలుకు తరలించారు. మరో 51 మంది పరారీలో ఉండటంతో ఇప్పటికే చంచల్‌గూడ జైలులోని ప్రత్యేక బ్యారక్‌లో వంద మందికి పైగా రిమాండ్‌లో ఉన్నారు. మరోవైపు ధూల్‌పేటలో గంజాయి స్మగ్లింగ్ సూత్రధారులైన పేరుమోసిన హోల్‌సేల్ గంజాయి విక్రేతల్లో సుమారు అయిదుగురు ఇప్పటికీ అండర్ గ్రౌండ్‌లోనే ఉన్నారు. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. మోస్ట్ వాంటెడ్ అంగూరీభాయి కోసం ఇప్పటికీ గాలిస్తున్నారు.

## దోమలపై జపాన్ మందు

- థర్మల్ ఫాగింగ్ యంత్రాలకు త్వరలో స్వస్తి!
- కోల్డ్ ఫాగింగ్ విధానాన్ని పరిశీలించిన బల్దియా

ఈనాడు, హైదరాబాద్



చీకటి పడగానే వీధుల్లో గుర్రుమనే శబ్దంతో పొగను విరజిమ్మే థర్మల్ ఫాగింగ్ యంత్రాలు త్వరలో అటకెక్కనున్నాయి. జపాన్ సాంకేతికతతో ప్రజారోగ్యానికి హాని చేయకుండా దోమలను అంతం చేసే కోల్డ్ ఫాగింగ్ విధానాన్ని జీహెచ్ఎంసీ పరీక్షిస్తోంది. నగరంలో నాలుగు ప్రాంతాల్లో రెండు విధానాలను పరీక్షించి ఫలితాలను శాస్త్రవేత్తలతో విశ్లేషించాలని కమిషనర్ నిర్ణయించారు. ఇప్పటికే ఓ ప్రాంతంలో పరీక్ష జరిపామని, జపాన్ సాంకేతికతతో పని చేసే యంత్రాలు మెరుగైన ఫలితం చూపాయని అధికారులు చెబుతున్నారు. కొత్త విధానం వస్తే ఏటా డీజిల్, పెట్రోలు నల్లబజారులో విక్రయిస్తున్నఅవినీతి అధికారులకు అడ్డుకట్టపడుతుందనే వాదన వినిపిస్తోంది.

**థర్మల్ ఫాగింగ్ ఇలా..:** డీజిల్, పెట్రోలు, మలాథిన్ రసాయన మిశ్రమాన్ని యంత్రం వేడి చేయగా వచ్చే పొగను వీధుల్లో చిమ్ముతారు. దోమలు మత్తుతో పడిపోతాయి. జీహెచ్ఎంసీలో పెద్ద ఫాగింగ్ యంత్రాలు 63 ఉన్నాయి. ఒక్కో యంత్రానికి రోజూ 45 లీటర్ల డీజిల్, 9 లీటర్ల పెట్రోలు వెచ్చిస్తున్నారు. ● 302 చిన్న ఫాగింగ్ యంత్రాలు ఉండగా రోజుకు 9 లీటర్ల డీజిల్, 1.5 లీటర్ల పెట్రోలు.. వినియోగిస్తున్నారు.

**కోల్డ్ ఫాగింగ్.. :** థర్మల్ ఫాగింగ్ యంత్రాలతో పోలిస్తే ఇవి పరిమాణంలో చిన్నవి. ధర మాత్రం ఎక్కువే. దోమల నియంత్రణ రసాయనంతో కలిపి నీటి మిశ్రమాన్ని అతి సూక్ష్మ పరిమాణంలో అధిక ఒత్తిడితో గాలిలోకి చిమ్మడం ద్వారా వాతావరణంలో దోమలను నశింపజేసే పొర ఏర్పడుతుంది. పెద్ద ఫాగింగ్ యంత్రాలకు 200 మి.లీ. చిన్న యంత్రాలకు 5 మి.లీ. డెల్టామెథ్రిన్ రసాయనాన్ని వాడుతారు.

**కుందన్‌బాగ్ ప్రయోగంలో..**

- కుందన్‌బాగ్‌లోని 16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జనావాసాలను రెండు భాగాలుగా ఓ వైపు థర్మల్ ఫాగింగ్‌ను, మరోవైపు కోల్డ్ ఫాగింగ్‌ను నిర్వహించారు. కోల్డ్ ఫాగింగ్ చేపట్టిన ప్రాంతాల్లో దోమలు అధికంగా మరణించినట్లు తేలింది. ఐసీటీ ధ్రువీకరణ, జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కేంద్రం అనుమతి తీసుకున్నాకే కోల్డ్ ఫాగింగ్‌ను అమలు చేస్తామని బల్దియా స్పష్టం చేస్తోంది.

# ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

## ప్రైవేటు ఉపాధ్యాయులకు దసరా సెలవులు అమలు చేయండి



నరసింహారెడ్డికి వినతి పత్రం ఇస్తూ..

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు దసరా సెలవులు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర కమిటీ సోమవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ (డీఎస్‌ఈ) ఇ.వి నరసింహారెడ్డికి విన్నవించింది. అనంతరం ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యా శాఖ అక్టోబరు 2 నుంచి 12 వరకు దసరా సెలవులను ప్రకటించిందని, ఆ సెలవులు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకూ వర్తిస్తాయన్నారు. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థులకు మాత్రమే సెలవులు ఇచ్చి, ఉపాధ్యాయులకు ఇవ్వడం లేదన్న విషయాన్ని డీఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు ఆయన వెంట రాష్ట్ర నాయకులు పైడులు ఉన్నారు.

## 'ప్రజావాణి'కి 155 ఫిర్యాదులు

ఈనాడు, హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 155 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ ఆమ్రపాలి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు.

## కండర క్షీణత వ్యాధిగ్రస్థులకు సంరక్షకుడి భృతి కల్పించాలి



ర్యాలీలో బాధితులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: కండర క్షీణత వ్యాధి బాధితుల సంరక్షకుడి (కేర్ టేకర్) ఖర్చు భరించలేని స్థితిలో ఉన్నారని, వారికి సంరక్షకుడి భృతి (కేర్ టేకర్ అలవెన్స్) కల్పించాలని తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టీఎండీఏ) రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్ నుంచి ఖైరతాబాద్ ప్రధాన కూడలికి తమ సమస్యలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెళ్లి, తిరిగి ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 3500 మంది కదల్లేని స్థితిలో నాలుగు గోడల మధ్య బతుకీడుస్తున్నారన్నారు. సంరక్షుడి భృతితో పాటు తీవ్ర వైకల్యం గల వారికి రూ.20వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. టీఎండీఏ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

| | |
|---|---|
| ఖైరతాబాద్ | 80085 73345 |
| జూబ్లీహిల్స్ | 80085 73352 |
| బంజారాహిల్స్ | 80085 73348 |

బంజారాహిల్స్ యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే :

? బంజారాహిల్స్ ఉదయనగర్ బస్తీలోని మసీదు ఎదురుగా ఉన్న వీధిలో రెండు వీధి దీపాలు వెలగడం లేదు. చీకటిపడిన తరువాత రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సమస్య పరిష్కరించండి.

– ముర్తుజా, ఉదయనగర్, బంజారాహిల్స్.

✓ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం. – సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్– 18

? శాలివాహననగర్ కాలనీ పంజాబ్ నేషనల్ బ్యాంకు సమీపంలో బజారులో వీధిదీపాలు రెండు నెలలుగా వెలగడం లేదు. ఫిర్యాదు చేసినా సిబ్బంది పట్టించుకోవడం లేదు.

–భాస్కర్ రాజు, శాలివాహననగర్ కాలనీ.

✓ వెలగని వీధిదీపాలకు వెంటనే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– వసుదేవ్, జీహెచ్‌ఎంసీ సర్కిల్ నం.17, వీధిదీపాల నిర్వహణ ఇన్‌ఛార్జి.

## ఓవైపు సుందరం.. మరోవైపు దుర్గంధం!





ఖైరతాబాద్, న్యూస్‌టుడే: నగరం మధ్యలో ఆహ్లాదకరంగా పచ్చని చెట్లతో పార్కు. ఉదయం పర్యాటకులు కాసేపు సేదతీరేందుకు అక్కడికి చేరుకుంటారు. అలాంటి ఆకర్షణ ఉన్నదే నెక్లెస్ రోడ్డులోని ఐమ్యాక్స్ థియేటర్ ఎదుట గల లేక్‌వ్యూ పార్కు. అయితే, కొన్ని రోజులుగా ఈ పార్కులో ఆహ్లాదం కరువైంది. మురుగుమయంగా మారుతోంది.

**దారి ప్రత్యేకం**

చాలా పార్కుల్లో ఉదయపు నడక దారి ప్రత్యేకంగా సిమెంట్ లేదా టైల్స్‌తో ఉంటుంది. లేక్‌వ్యూలో మాత్రం మట్టితో దారి ఉంటుంది. దాంతో ఇక్కడ నడక సాగించేందుకు చాలా మంది ఆసక్తి చూపుతారు. వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకు వాకర్స్ సందడి ఉంటుంది. అదే సమయంలో పార్కుకు పర్యాటకులూ చేరుకుని అక్కడి చెట్ల కింద పచ్చని గడ్డిలో సేదతీరుతుంటారు.

**ఏం జరుగుతోంది..**

రెండు వారాలుగా మురుగు పార్కులోని కొలనులోకి ప్రవహిస్తోంది. గతంలో మహా భారత్‌నగర్ బస్తీ నుంచి వరద నీరు వచ్చేది. పైప్‌లైన్ ద్వారా కలుషిత నీరు కొలనులోకి చేరుతోంది. మురుగు నీటిని మళ్లీ ఫౌంటెయిన్ ద్వారా కొలనులోకి పంపిస్తున్నారు. ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో వరద నీటిని వెలుపలకు పంపేందుకు మింట్ కాంపౌండ్‌లో సంపు నిర్మాణం చేసి అక్కడి నుంచి మోటారు సాయంతో పైపులైన్ ద్వారా లేక్‌వ్యూ పార్కులోకి పంపిస్తున్నారు. ఇటీవల వర్షాలు వచ్చినపుడు కాలనీలో డ్రైనేజీలు పొంగి ఈ కాలువలోకి ప్రవహించాయి. ఆ సమయంలో వరద నీరు అధికంగా ఉండటంతో మురుగు ప్రభావం కనిపించలేదు.

**సమన్వయంతోనే పరిష్కారం**

పార్కులోని కొలను బాగుచేసేందుకు హెచ్‌ఎండీఏ లక్షల రూపాయలు ఖర్చు చేస్తుండగా, జీహెచ్‌ఎంసీ, జలమండలి నిర్లక్ష్యంతో పార్కు, కొలను దుర్గంధ భరితంగా మారుతోంది. పర్యాటకులు వచ్చిన సమయంలో ఆహ్లాదంగా ఉండేలా నీటి ఫౌంటెయిన్ ఏర్పాటు చేశారు. కాని మురుగు వాసన వెదజల్లుతోంది. దీని వలన పలువురు ఇబ్బంది పడుతున్నారు. మూడు శాఖల అధికారులు సమన్వయంతో సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



ఉద్యానంలో కొలను

**అధికారులు వస్తున్నా..**

ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో వర్షం పడినపుడు మాత్రమే పార్కులోకి నీరు ప్రవహించేలా అధికారులు ఏర్పాటు చేశారు. అయితే చొద్ది కాలం వరద నీరు కాలువకు సీవరేజ్ పైపులు కనెక్షన్ ఇచ్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమస్యపై వాకర్లు హెచ్‌ఎండీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, జీహెచ్‌ఎంసీ, జలమండలి సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిశీలించారు. పరిష్కారం మాత్రం చూపడం లేదని వాపోతున్నారు.

## సీపీఆర్ చేద్దాం.. ప్రాణాలు రక్షిద్దాం



అకస్మాత్తుగా గుండెపోటుకు గురైతే కాపాడే సీపీఆర్‌పై సోమవారం జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు అపోలో ఆసుపత్రి వైద్యులు శిక్షణ ఇచ్చారు. ఆపద వేళ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

– న్యూస్‌టుడే, ఫిల్మ్‌నగర్

## ఘుమఘుమలు



ఎర్రమంజిల్‌లోని రీజెన్సీ కలినరీ కళాశాలలో 'తెలుగు తరంగం' పేరుతో సోమవారం వంటకాల ప్రదర్శన ఏర్పాటుచేశారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్ర, హైదరాబాదీ వంటకాలు 150 రకాలు ప్రదర్శించారు. – న్యూస్‌టుడే, సోమాజిగూడ

## స్వచ్ఛ ప్రతిజ్ఞ



హైదరాబాద్ గ్రామర్ స్కూల్ విద్యార్థులతో కలిసి కార్పొరేటర్ వెంకటేశ్ సోమవారం ఫిల్మ్‌నగర్‌లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'నేను చెత్త వేయను... ఇతరులను చెత్త వేయనివ్వను' ప్రతిజ్ఞ చేయించారు. – న్యూస్‌టుడే, ఫిల్మ్‌నగర్

## ముట్టడి



మంత్రి కొండా సురేఖపై భారాస సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు తెలంగాణ భవన్ ముట్టడికి యత్నించారు. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి అక్కడి నుంచి పంపించారు. – న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

## రాజ్‌భవన్ బడి పిల్లలకు చల్లని తీగునీరు



కూలర్‌ను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

సోమాజిగూడలోని రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలకు హడ్కో సంస్థ వాటర్ ప్యూరిఫైయర్ కమ్ కూలర్‌ను బహూకరించింది. దాదాపు రూ.లక్ష వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ కూలర్‌ని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. – న్యూస్‌టుడే, సోమాజిగూడ

## మా పోరాటానికి మద్దతివ్వండి



పూడూరు మండలం దామగుండంలో నేవీ ప్రాజెక్టు ఏర్పాటుకు వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని భారాస నాయకుడు జి.నాగేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో దామగుండం పరిరక్షణ కమిటీ సభ్యులు సోమవారం సినీ నటుడు సోనుసూద్‌కు వినతి పత్రం అందజేశారు.

– న్యూస్‌టుడే, పూడూరు

## ఖాతాలోకి డబ్బులు పంపిస్తానని మోసం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేస్తానంటూ రూ.50వేలు కాజేసిన ఘటన ఇది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. కమలాపురి కాలనీకి చెందిన సహాయ దర్శకుడు సిరికృష్ణ ఆదివారం జూబ్లీహిల్స్ రోడ్ నం.5లోని ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు జమ చేయడానికి వెళ్లాడు. ఓ వ్యక్తి తనకు అత్యవసరమని, నగదు ఇస్తే ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేస్తానని నమ్మించాడు. నగదు తీసుకున్న తర్వాత నెఫ్ట్ ద్వారా డబ్బులు పంపించినట్లు చూపించాడు. అయితే నగదు ఖాతాలో జమకాలేదు. రెండు గంటల సమయం పడుతుందని నమ్మించి ఆ వ్యక్తి అక్కడి నుంచి జారుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: మధురానగర్‌కు చెందిన నీలకంఠం సెప్టెంబరు 26న మధురానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో గల ఎస్‌బీఐ బ్యాంకు ఏటీఎంలో రూ.40వేలు డిపాజిట్ చేయడానికి వెళ్లాడు. అక్కడే ఉన్న అపరిచిత వ్యక్తి రూ.40 వేలు ఇస్తే నేరుగా మీ ఖాతాలోకి డబ్బులు పంపుతానని నమ్మించాడు. నీలకంఠం నగదు ఇవ్వగా ఆన్‌లైను తాను డబ్బు పంపినట్లు మేసేజ్ చూపించాడు. కొద్ది నిమిషాల్లో నగదు మీ ఖాతాలో జమ అవుతుందని ఉడాయించాడు. బాధితుడు సోమవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తనిఖీల్లో పట్టుబడిన మత్తు ఇంజెక్షన్లు.. ఇద్దరి అరెస్టు

పంజాగుట్ట, న్యూస్‌టుడే: మత్తు ఇంజెక్షన్లు తరలిస్తున్న వ్యక్తిని పంజాగుట్ట పోలీసుల అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. యూసుఫ్‌గూడ కృష్ణానగర్ చెందిన మహ్మద్ నయాముద్దీన్ ప్రైవేటు ఎలక్ట్రీషియన్. ఈనెల 28న అమీర్‌పేట్‌లో ద్విచక్రవాహనంపై వస్తుండగా పోలీసులు తనిఖీలు చేశారు. వాహనం డిక్కీ తెరిచి చూడగా 7 మత్తు ఇంజెక్షన్లు లభించాయి. పోలీసులు నయాముద్దీన్‌ను అరెస్టు చేసి విచారించగా అవి మధుమేహానికి సంబంధించిన ఇంజెక్షన్‌లని చెప్పాడు. పోలీసులు క్లూస్‌టీం సిబ్బందిని, డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను పిలిపించి విచారించారు. మల్కాజిగిరి నేరేడ్‌మెట్‌కు చెందిన సిద్ధా వీటిని కొనుగోలు చేస్తున్నట్లు తేలడంతో ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.

## కులం పేరుతో దూషణ.. అట్రాసిటీ కేసు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: కులాంతర వివాహం చేసుకున్న వరుడి కుటుంబ సభ్యులపై అట్రాసిటీ కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం... యాదగిరినగర్‌లో ఉంటున్న బాధిత మహిళ (26)కు ఘట్‌కేసర్‌కు చెందిన విష్ణుతో ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇద్దరి కులాలు వేరు కావడంతో బాధితురాలి ఇంటికి వచ్చిన విష్ణు ఆమె తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లిచేసుకున్నాడు. విష్ణు కాపురాన్ని సొంతూరికి మార్చాడు. ఇంట్లో విష్ణు, అతని తల్లి వీరమణి, ఆమె సోదరి సరస్వతీ అదే అపార్టమెంట్‌లో ఉండే రాజు ఆమెను కులం పేరుతో దూషించారు. అదనపు కట్నం కొరకు వేధించారు. తనను అసభ్యకరంగా కులంపేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ ఆదివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రాజీకి రాలేదని దాడి.. కేసు

యూసుఫ్‌గూడ: కేసును రాజీ చేసుకోవడానికి రాలేదనే కారణంతో ఓ యువకుడిని దాడిచేసి గాయపర్చిన ఘటన ఇది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన నారాయణ సెప్టెంబరు 29న నడిచి వెళ్తుండగా, అదే ప్రాంతానికి చెందిన పవన్, అతని స్నేహితుడితో బైక్‌పై వచ్చి అటకాయించాడు. జూన్ 4న రాత్రి పవన్, నారాయణ ఇంట్లోకి జ్ఞప్రవేశించి అతడి కుమారుడు, కూతురిపై దాడిచేయడంతో నారాయణ కూతురు మీనాక్షి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. అప్పట్లో పవన్ జైలుకు వెళ్లివచ్చాడు. కేసు రాజీకి రాలేదనే నేపంతో దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సంక్షిప్త సమాచారం

### హైడ్రాపై బక్క జడ్సన్ వినూత్న నిరసన

ఈనాడు, హైదరాబాద్: హైడ్రాపై మాజీ కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ వినూత్న నిరసన చేపట్టారు. సోమవారం ఆయన సచివాలయం, జీహెచ్‌ఎంసీ భవనాలపై ఆర్‌బీ-ఎక్స్ గుర్తులను వేశారు. ఈ భవనాలు హుస్సేన్‌సాగర్ బఫర్‌జోన్‌లో ఉన్నాయని హైడ్రా ఈ కార్యాలయాలను కూల్చాలని ప్రభుత్వానికి సవాల్ చేశారు.

### కాంగ్రెస్ వ్యక్తిగత దాడులకు పాల్పడుతోంది

ఫిల్మ్‌నగర్: భారాస నేతలపై కాంగ్రెస్ వ్యక్తిగత దాడులకు పాల్పడుతోందని పార్టీ నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆనంద కన్వెన్షన్‌లో హరీశ్‌రావు భాగస్వామి అని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

### అభివృద్ధి పనుల పరిశీలన

ఖైరతాబాద్: ఎన్ఎఫ్‌సీఎల్ సర్కిల్‌లో అభివృద్ధి పనులను జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పరిశీలించారు.

### పథకాలు వినియోగించుకోండి

వెంగళ్‌రావునగర్: జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 యూసీడీ విభాగం ఆధ్వర్యంలో వెంగళరావునగర్ డివిజన్‌లో డ్వాక్రా మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ దేదీప్య పాల్గొన్నారు. యూసీడి విభాగం సీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### మహాత్మాగాంధీ సిద్ధాంతాలు యువతకు మార్గదర్శకం

నారాయణగూడ: శాంతి, అహింసలను ఆయుధాలుగా ప్రయోగించి పోరాడిన నాయకుడు మహాత్మాగాంధీ అని వక్తలన్నారు. నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంత్యుత్సవాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డా.విజయకుమార్ సర్వోదయ ఫౌండేషన్ కార్యదర్శి ప్రొ.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడారు.

### అంబేడ్కర్ వర్సిటీ స్థలాన్ని కేటాయించొద్దు

జూబ్లీహిల్స్: డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి చెందిన పది ఎకరాల స్థలాన్ని జేఎన్ఎఫ్ఏయూకి కేటాయించవద్దని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. నోడల్ అధికారి డాక్టర్ బానోతు ధర్మ, అసోసియేషన్ అధ్యక్షుడు సాకా వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి డాక్టర్ ఉదయిని పాల్గొన్నారు.

### త్వరలో కొత్త వీధి దీపాలు

బంజారాహిల్స్: వెంకటేశ్వర కాలనీ డివిజన్ బంజారాహిల్స్ రోడ్డు నం.1, 7, 8, 9 ప్రాంతాల్లో కొత్త వీధి దీపాల ఏర్పాటుపై సోమవారం స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. అవసరమైన చోట రోడ్డు విభాగినులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ సూచించారు. మున్సిపల్ డిప్యూటీ ఈఈ చైతన్య పాల్గొన్నారు.

### సీసీటీవి కెమెరాలతో నేరాల నియంత్రణ

బోరబండ: నేరాల అదుపునకు సీసీ కెమెరాలు ముఖ్యమని బోరబండ కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ అన్నారు. మధురానగర్‌లో నిర్వహించిన యూత్‌కమిటీ సమావేశంలో బస్తీ అధ్యక్షుడు చెట్టి దేవేందర్ రూ.20వేల చెక్కును బోరబండ రాణా డీఐ బి.భూపాల్‌గౌడ్, అడ్మిన్ ఎస్సై షేక్ నాగుల్‌మీరాకు అందజేశారు.

జూబ్లీహిల్స్: నిఘానేత్రాలు అసలైన దోషులను పట్టిస్తాయని జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి అన్నారు. హైలం కాలనీలో ఆ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీవాసులంతా ముందుకొచ్చి ఏర్పాటు చేసుకున్న 20 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు.

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపకార వేతనాలు

యూసుఫ్‌గూడ: యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకుంటున్న 9వ తరగతి 9మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. ఉల్లాస్ ట్రస్ట్ ఏటా పరీక్షలు నిర్వహించి మెరిట్ విద్యార్థులను ఎంపిక చేస్తారు. .

### లక్ష్యంపై స్పష్టత ఉంటే విజయం సాధ్యం

నారాయణగూడ: జీవిత లక్ష్యంపై స్పష్టత ఉండి, పట్టుదలతో పరిశ్రమ కచ్చితంగా అనుకున్న సాధించగలుగుతారని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమి మెంటార్ బాలలత అన్నారు. సోమవారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సోహం లీడర్ షిప్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖాముఖీలో విద్యార్థుల ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారు.

## తల్లిదండ్రులే కనిపించే దైవం



కళాకృష్ణకు సత్కరించిన డా.కె.వి.రమణాచారి

రవీంద్ర భారతి, న్యూస్‌టుడే: తల్లిదండ్రులే కనిపించే దైవం అని ప్రభుత్వ మాజీ సలహాదారు, డా.కె.వి.రమణాచారి అన్నారు. సోమవారం రాత్రి రవీంద్రభారతిలో శ్రీకూచిపూడి నృత్య నిలయం ఆధ్వర్యంలో కులపతి భాగవతుల రామకోటయ్య స్మృత్యార్థం 'శతవత్సర పారంపర్యం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధ నాట్యాచార్యులు డా.కళాకృష్ణకు భాగవతుల రామకోటయ్య స్మారక పురస్కారంతో సత్కరించారు. ఆధ్యాత్మిక శాస్త్రవేత్త వీఎస్ఆర్ మూర్తి, పద్మశ్రీ డా.ఆనందశంకర్ జయంత్, పద్మశ్రీ ఉమామహేశ్వరి, కేంద్ర సంగీత నాటక అకాడమి పురస్కార గ్రహీత దీపికారెడ్డి మాట్లాడారు.

### అసలైన లబ్ధిదారులకే ఇళ్లు కేటాయించండి

బోరబండ, న్యూస్‌టుడే: ఎస్పీఆర్ హిల్స్ కమలానగర్‌లో నిర్మించిన రెండు పడకగదుల ఇళ్లను నిజమైన లబ్ధిదారులకు కేటాయించాలని కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. మూసీ నిర్వాసితులకు కమలానగర్ ఇళ్లను కేటాయిస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కమిషనర్ ఛాంబర్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు.



## రికార్డు అసిస్టెంట్లను జేఆర్వోలు గుర్తించండి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: పంచాయతీల్లో వీఆర్ఏలుగా ఉన్న తమను రెవెన్యూతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలకు పంపుతూ రికార్డు అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం జూనియర్ రెవెన్యూ ఆఫీసర్ (జేఆర్ఓ)లుగా గుర్తించాలని తెలంగాణ రికార్డు అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి వీరన్న ముదిరాజ్, నరసింహ మౌర్య కోరారు. గతంలో పదోతరగతి అర్హత గల ఈ పోస్టులను ఇంటర్‌గా, ఇప్పుడు డిగ్రీ అర్హతగా మార్చడం సరికాదన్నారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారు ప్రస్తుతం రాష్ట్రంలో 22వేల మంది ఉన్నారని, ఇంటర్ అర్హత గల వారందరినీ జేఎల్ఓలుగా గుర్తించాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లిన వారిని సొంత జిల్లాకు మార్చాలని కోరారు. 2014 నుంచి నేటి వరకు చనిపోయిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అసోసియేషన్‌కు రాష్ట్ర కమిటీని ప్రకటించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కావలి సత్యనారాయణ, సాగే ఓంకార్ తదితరులు ఉన్నారు.



## '15లోపు అద్దె చెల్లించకుంటే భవనాలకు తాళాలు వేస్తాం'



మాట్లాడుతున్న ఎ.దేవేందర్ రెడ్డి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రైవేటు అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ వసతి గృహాల అద్దె బకాయిలు ఈ నెల 15వ తేదీలోపు చెల్లించకుంటే తాళాలు వేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేట్ భవన యాజమాన్య సంఘం హెచ్చరించింది. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సంఘం అధ్యక్షుడు ఎ.దేవేందర్ రెడ్డి, సలహాదారు కొండా దేవయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 950 గురుకులాలు, 150 హాస్టళ్లు మొత్తం 1100 అద్దె భవనాలు ఉండగా, రూ.500 కోట్ల అద్దె రావాల్సి ఉందన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి బండి కుమారస్వామి, నాయకులు అభిలాష్, కృష్ణమూర్తి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలకు సమానత్వం, స్వేచ్ఛ, రక్షణ అవసరం

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: మహిళా సాధికారత, సమానత్వాన్ని సాధించి, వారికున్న హక్కులను పరిరక్షించినప్పుడే వారి జీవితాలు బాగుపడతాయని వక్తలన్నారు. సోమవారం రవీంద్రభారతిలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అండ్ సోషల్ జస్టిస్ (ఎన్‌హెచ్ఆర్‌సీఎస్‌జే) ఆధ్వర్యంలో 'మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు ఆపాలి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎన్‌హెచ్ఆర్‌సీఎస్‌జే జాతీయ అధ్యక్షుడు ఆకాష్ మాట్లాడుతూ.. మహిళలు తమ హక్కులతో పాటు రక్షణ చట్టాలను గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ ఛైర్మన్ శ్రీనివాసరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి, సామాజికవేత్త డా.సుబ్రహ్మణ్యం, న్యూరోస్పెషలిస్టు (ఖమ్మం) డా.జగదీష్‌బాబు, స్త్రీవైద్య నిపుణురాలు డా.నీరజ, డీఎస్పీ శేఖర్‌రెడ్డి, సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య, సాయి శివరావు, మౌనిక తదితరులున్నారు.

## మూసీ సుందరీకరణ పేరుతో ప్రజల జీవితాల్లో అంధకారం



మాట్లాడుతున్న సంధ్య

ఖైరతాబాద్: మూసీ సుందరీకరణ పేరుతో అక్కడ నివాసం ఉంటున్న ప్రజల జీవితాలు అంధకారం అవుతున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో దాదాపు 8 వేల కుంటుంబాలకు చెందిన సమస్య ఇది అని పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో పీఓడబ్ల్యూ సంధ్య, నివాస హక్కుల ప్రచార పరిరక్షణ సంస్థ (ఛత్రి) కన్వీనర్ వర్గీస్ తెక్నాత్, నివాస హక్కుల ఫెడరేషన్ నేత జీవన్ కుమార్, ఎంవీ ఫౌండేషన్ కన్వీనర్ వెంకట్ రెడ్డి మాట్లాడారు. మూసీ కింద ఉన్న 74 గ్రామాల ప్రజలో మాట్లాడిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రొ.హరగోపాల్ ఫోన్ ద్వారా సందేశమిచ్చారు.

## జీటీఎస్ దేవస్థానంలో ప్రసాదాల విక్రయం నిలిపివేత

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: వెంగళ్‌రావునగర్ డివిజన్ జీటీఎస్‌కాలనీలోని శ్రీవీరాంజనేయ భవానీశంకర అయ్యప్ప సాయిబాబా దేవస్థానంలో రెండు నెలలు నుంచి ప్రసాదాల విక్రయం నిలిపివేశారని, ప్రతి గురువారం 500-600 మందికి నిర్వహించే అన్నదానం సగానికి కుదించారని భక్తులు వాపోయారు. నిత్యం వచ్చే భక్తులకు కనీసం తాగునీరు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే ఇది రెండో అతిపెద్ద ఆలయం. 2017లో దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లింది. అప్పటి నుంచి కొన్ని రోజులు అభివృది, కమిటీ, తరువాత నాలుగుసార్లు పాలక మండలిని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జులై 25న పాలకమండలి కమిటీ కాలపరిమితి పూర్తయింది. అప్పటి నుంచి ఆలయ నిర్వాహణ గాడి తప్పిదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై దేవాదాయశాఖ సికింద్రాబాద్ జోన్ అసిస్టెంట్ సంధ్యారాణి స్పందిస్తూ.. దేవస్థానంలో ఏమి జరుగుతుందో తెలుసుకునేందుకు ఇన్స్‌పెక్టర్‌ని పంపించి పరిశీలిస్తామన్నారు. సమస్యలుంటే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. కమిషనర్‌తో మాట్లాడి నూతన పాలక మండలి కమిటీ నియమిస్తామని చెప్పారు.

## ఉపముఖ్యమంత్రి ఇంట్లో చోరీ నిందితుల కోసం ప్రత్యేక బృందం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇంట్లో చోరీ ఘటనలో నిందితుల కోసం బంజారాహిల్స్ పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్ రోడ్ 14లోని బీఎన్ రెడ్డి కాలనీలో ప్లాట్ నం.40 భట్టి వ్యక్తిగత నివాసం ఉంది. కాపలదారుగా ఉన్న రోషన్ మండల్.. ఇంట్లో అల్మారాలోని రూ.80వేలు, వెండి సామగ్రి దోచుకుని వెళ్లినట్లు భట్టి పీఏ భాస్కరశర్మ గురువారం రాత్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా రోషన్ మండల్, అతని స్నేహితుడు ఉదయ్ కుమార్‌ను ఖరగ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో అక్కడి పోలీసులు అనుమానంతో పట్టుకున్నారు. వారి నుంచి రూ.1.50 లక్షల నగదు, 100 గ్రాముల బంగారు బిస్కెట్, కొంత విదేశీ కరెన్సీ, వెండి పాత్రలు, ఆభరణాలను స్వాధీనం చేసుకుని వారిని కోర్టులో హాజరుపర్చారు. నిందితులను నగరానికి తీసుకొచ్చేందుకు బంజారాహిల్స్ పోలీసులు పశ్చిమ బెంగాల్ వెళ్లారు.

## పిల్లలూ.. భోజనం బాగుందా?: కలెక్టర్



ఈనాడు, హైదరాబాద్: పిల్లలూ భోజనం బాగుందా? ఇక్కడి పరిసరాలు బాగున్నాయా? అంటూ రంగారెడ్డి కలెక్టర్ ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులను ప్రశ్నించారు. సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న ఆయన సోమవారం రాత్రి ఇబ్రహీంపట్నానికి వచ్చారు. గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పదోతరగతి పిల్లలో మాట్లాడి.. ప్రతి ఒక్కరూ డిస్టింక్షన్‌లో పాసవ్వాలని సూచించారు. అక్కడే బసచేశారు.

## మలి వయసా.. ఆరోగ్యంపైనే ధ్యాస



వీరంతా 60-70 ఏళ్ల మధ్య వయసున్న తల్లులు. నిత్యం ఉదయం 6 గంటలకల్లా వచ్చి ఇందిరాపార్కులో యోగా, ఇతర వ్యాయామాలు చేస్తుంటారు. అందుకే ఆరోగ్యంగా ఉన్నామంటున్నారు

## డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు.. ధ్రువపత్రాలతో రండి

ఈనాడు, హైదరాబాద్ : డీఎస్సీ-2024కు 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులు వారి అసలు ధ్రువపత్రాలు, గెజిటెడ్ అధికారి సంతకంతో కూడిన రెండు సెట్ల నకలు పత్రాలతో తమవద్దకు రావాలని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల విద్యాశాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 1 నుంచి 5వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ధ్రువ పత్రాలను అధికారులు పరిశీలించనున్నారు. ఆయా జిల్లాల అభ్యర్థులు సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్ నుంచి ఒక ఫారంను డౌన్‌లోడ్ చేసుకుని నింపి ధ్రువపత్రాలతో పాటు తీసుకురావాలని సూచించారు.

- **హైదరాబాద్ జిల్లా అభ్యర్థులు:** స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు గవర్నమెంట్ మోడల్ అలియా స్కూల్, ఎల్బీస్టేడియం ఎదురుగా, బషీర్‌బాగ్. **ఎస్‌జీటీ అభ్యర్థులు..** మహబూబియా బాలికల ఉన్నత పాఠశాల, లేపాక్షి ఎదురుగా, బషీర్‌బాగ్
- **రంగారెడ్డి జిల్లా అభ్యర్థులు.. :** బహదూర్‌గూడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఎల్బీనగర్ మెట్రోరైల్ స్టేషన్ వద్ద.
- **మేడ్చల్ జిల్లా అభ్యర్థులు..:** జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర), మల్కాజిగిరి చౌరస్తా సమీపంలో.

## హరికిరణ్‌కు ప్రథమ స్థానం



మిద్దే హరికిరణ్

దమ్మపేట, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని మొద్దులగూడేనికి చెందిన మిద్దే హరికిరణ్ ఫిజికల్ సైన్స్ ఆంగ్ల విభాగంలో డీఎస్సీలో హైదరాబాద్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. హరికిరణ్ తొలుత దమ్మపేట మండలంలో విద్యా వాలంటీర్‌గా పని చేశారు. అనంతరం 2019 నుంచి కొడంగల్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుత డీఎస్సీలో 77.83 మార్కులతో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రథమ ర్యాంకు పొందారు. హరికిరణ్ తండ్రి సాధారణ రైతు. తల్లి చెన్నమ్మ గృహిణి. హరికిరణ్‌ను మండలానికి చెందిన పలువురు అభినందించారు.

# కొత్త ఠాణాలు సరే..
# సిబ్బంది ఏరీ..?



- నగర ఠాణాల్లో ఏటా 20 వేలకు పైగా ఎఫ్ఐఆర్‌లు..2 లక్షల వరకు పెట్టీ కేసులు నమోదవుతున్నాయి.
- నగరంలోని 60 ఠాణాలకు అదనంగా 11 కొత్త పోలీస్‌స్టేషన్లు అందుబాటులోకి వచ్చాయి.
- ఏడు జోన్లలో మహిళా ఠాణాలు ఏర్పాటు చేశారు. సెల్ స్నాచింగ్‌లు, దోపిడీలు, ఇంటి చోరీలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల రవాణాపై నిత్యం 700కుపైగా ఫిర్యాదులు అందుతున్నాయి.
- మౌలిక వసతులు కరవు
- కేసులు పెరగడంతో రెట్టింపు పనిఒత్తిడి

ఈనాడు, హైదరాబాద్: నగర పోలీసు కమిషనరేట్‌లో విధి నిర్వహణలో ఉండగానే కళ్లు తిరిగి పడిపోయిన కానిస్టేబుల్. ద్విచక్ర వాహనంపై ఆసుపత్రికి తరలిస్తుండగా కిందపడ్డారు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్‌స్ట్రోక్‌తో మరణించినట్లు నిర్ధారించారు. బోనాల వేడుకల్లో బందోబస్తులో ఉన్న ఏసీపీ కూడా ఇదే సమస్యతో ఆసుపత్రిపాలయ్యారు. ఇద్దరు ఎస్సైలకు పోస్టింగ్‌లు ఇచ్చినా ఆ ఠాణాలో చేయడం మా వల్ల కాదంటూ సెలవుపై వెళ్లిపోయారు. 'మెగా సిటీ పోలీసింగ్‌లో ఠాణాలు పెరిగినా సిబ్బంది పెరగలేదు.



### సర్దుబాటుతో సరి..

పాత ఠాణాల్లో పనిచేస్తున్న ఎస్సైలు, కానిస్టేబుళ్లను కొత్త స్టేషన్లకు సర్దుబాటు చేశారు. ఇప్పటికీ కొన్ని ఠాణాల్లో మౌలిక సౌకర్యాలు పూర్తిగా లేవు. ఓ కొత్త ఠాణాలో ఏడాదిలో నలుగురు ఇన్‌స్పెక్టర్లు మారారు. మరో కొత్త ఠాణాకు నలుగురు ఎస్సైలు అవసరమంటే ఇద్దరితో సరిపెట్టారు. ఒక్క వాహనంతోనే ప్యాట్రోలింగ్ చేయాల్సి వస్తోందని, ఉన్నతాధికారుల వీసీకి మరో ఠాణాకు వెళ్లాల్సి వస్తోందంటున్నారు.

### దర్యాప్తులపై ప్రభావం

పని ఒత్తిడి ప్రభావం కేసుల దర్యాప్తుపై పడుతోందని ఓ ఏసీపీ వివరించారు. కొన్నిసార్లు దర్యాప్తునకు సాక్ష్యాధారాలు సేకరించడంలో అధికారులు విఫలమై కోర్టుల్లో చీవాట్లు పడాల్సి వస్తోందని ఒక ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సిబ్బందిపై పనిభారం తగ్గించాలని కేసుల దర్యాప్తు, బందోబస్తు విధులను విభజించి వేర్వేరుగా సిబ్బందిని కేటాయించాలని గతంలో ప్రతిపాదన తెచ్చినా సిబ్బంది కొరతతో వాయిదా వేశారు.

# అశ్లీలం చూస్తే
# కటకటాలే..!

- సాంకేతిక ఆధారాలతో నిందితుల ఆచూకీ కనిపెడుతున్న పోలీసులు

- హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు వరకు 520 పోక్సో కేసులు నమోదయ్యాయి. పోక్సో కేసుల్లో అరెస్టయ్యే నిందితుల్లో ఎక్కువ మందిపై అశ్లీల వీడియోల ప్రభావం ఉన్నట్లు వెల్లడవుతోంది.
- ఈ తరహా కేసుల్లో అభియోగాలు నిరూపితమైతే ఐదేళ్ల వరకూ శిక్ష పడే అవకాశముంది.
- అశ్లీల వీడియోలకు బానిసగా మారిన ఓ వ్యక్తి అందులో ఉన్నట్లుగా చేయాలని తన 13 ఏళ్ల కూతురిపై కన్నేశాడు. అతడి చేష్టలను బాలిక తిరస్కరించడం.. ఇంకా ఎవరికైనా చెబుతుందనే ఉద్దేశంతో బండరాయితో కొట్టి ఊపిరాడకుండా చేసి దారుణంగా హతమార్చాడు. సరిగా చదువుకోవడం లేదని మందలించినందుకు ఇంటి నుంచి వెళ్లిపోయిందని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసి అడ్డంగా దొరికిపోయాడు.



ఈనాడు, హైదరాబాద్: చిన్నారులతో చిత్రీకరించిన అశ్లీల వీడియోలు డౌన్‌లోడ్ చేసి చూసినా.. వ్యాప్తి చేసినా ఇక నుంచి కటకటాలు లెక్కించేందుకు సిద్ధంగా ఉండాల్సిందే. ఇది సుప్రీంకోర్టు తీర్పు. ఫోన్, కంప్యూటర్‌లో గుట్టుగా చూస్తే ఎవరూ గుర్తించలేరనుకోవద్దు. పోలీసులు సాంకేతిక ఆధారాలతో కనిపెడుతున్నారు. వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఇతరులకు పంపిస్తున్నట్లు వెలుగుచూస్తుండడంతో నియంత్రణపై రాచకొండ పోలీసులు దృష్టి సారించారు.

### అమెరికా సమాచారంతో ఇక్కడ అరెస్టు

ఇక్కడి పోలీసులే కాదు.. విదేశీ దర్యాప్తు సంస్థలు కూడా మన దేశంలో చైల్డ్ పోర్నోగ్రఫీ వ్యాప్తి చేస్తున్న వారిపై దృష్టిసారిస్తున్నాయి. అమెరికాలోని హోంల్యాండ్ సెక్యూరిటీ ఇన్వెస్టిగేషన్స్ (హెచ్ఎస్ఐ), నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్స్ (ఎన్‌సీఎంఈసీ) తదితర సంస్థలు ఐపీ అడ్రస్‌లను కేంద్ర హోంశాఖకు అందిస్తున్నాయి. అలా వచ్చిన సమాచారంతో గత ఏడాది ఒక యువకుడిని రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు.

### కఠినంగా వ్యవహరిస్తున్నాం

'చిన్నారులపై లైంగిక దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. చిన్నారుల అశ్లీల దృశ్యాలు చూసినా సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు పంపినా పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం ఐదేళ్ల జైలు శిక్ష పడుతుంది. చిన్నారులను మానవ మృగాల నుంచి కాపాడుకుని నేరరహిత సమాజంలో భాగస్వాములవుదాం' - సుధీర్‌బాబు, రాచకొండ పోలీస్ కమిషనర్

## ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యువకుడి అరెస్ట్



నరేశ్‌గౌడ్

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యువకుడిని కంచన్‌బాగ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం చరికొండ గ్రామానికి చెందిన సిద్దమోని నరేశ్‌గౌడ్ హస్తినాపురం డీఆర్‌డీఎల్ కాలనీలో ఉంటున్నాడు. ఇంటీరియర్ డిజైనర్. అంతర్జాలంలో రేవంత్‌రెడ్డిపై చేసిన అవమానకరమైన వ్యాఖ్యలను గమనించిన భారాస నాయకుడు, కంచన్‌బాగ్‌కు చెందిన న్యాయవాది అహ్మద్ అస్లం ఉల్లా షరీఫ్ ఫిర్యాదుతో నరేశ్‌గౌడ్‌ను అరెస్ట్ చేశారు. భారాస నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఠాణాకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు.

## ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు సత్వరం చెల్లించాలి



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో వేముల రామకృష్ణ, తదితరులు

రాంనగర్, న్యూస్‌టుడే: విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంటు బకాయిలను వారం రోజుల్లోగా చెల్లించాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, రాష్ట్ర బీసీ ఫ్రంట్ ఛైర్మన్ గొరిగె మల్లేశ్ యాదవ్‌ల ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్కు సమీపంలోని ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ప్రభుత్వం చొరవ చూపకుంటే మంత్రులు, ఎమ్మెల్యేలను బయట తిరగనీయకుండా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.





## ప్రమాదకరం ఈ ప్రయాణం

ఆటో ట్రాలీలో కూరగాయలను పరిమితికి మించి వేసి వాటిపై ప్రమాదకరంగా కూర్చుని వెళ్తున్న చిరు వ్యాపారులు ట్యాంక్‌బండ్‌పై కనిపించారు. మరోవైపు అసెంబ్లీ వద్ద సరకు రవాణా వాహనంలో తాళ్లను పట్టుకుని మహిళలు వెళ్తున్నారిలా..

## మహిళ గొంతు కోసి హత్య



జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఆర్ఎంపీ వైద్యుడి భార్యను గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి హతమార్చారు. జూబ్లీహిల్స్ పోలీసుల వివరాల ప్రకారం.. యూసఫ్‌గూడ నవోదయ కాలనీ ప్లాట్ 36లోని రెండో అంతస్తులో ఆర్ఎంపీ వైద్యుడు లక్ష్మీనారాయణ కుటుంబంతో నివసిస్తున్నాడు. భార్య **సుధారాణి(44)**, ఇద్దరు పిల్లలున్నారు. సోమవారం సాయంత్రం పిల్లలిద్దరూ ట్యూషన్‌కి, లక్ష్మీనారాయణ ఎల్లారెడ్డిగూడలోని క్లినిక్‌కి వెళ్లాడు. ట్యూషన్ నుంచి పిల్లలిద్దరూ ఇంటికి వచ్చి తలుపు తీసి చూడగా తల్లి రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గమనించి తండ్రికి చెప్పగా లక్ష్మీనారాయణ ఇంటికి వచ్చి 100 ద్వారా పోలీసులకు సమాచారాన్ని అందించాడు. జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రెడ్డి, ఎస్సైలు సోమశేఖర్, వినోద్ కుమార్ రెడ్డి, హరీశ్వర్ రెడ్డి తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే సుధా రాణి మృతి చెంది ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. జరిగిన సంఘటనపై పిల్లల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

## గర్భిణిపై దాడి చేసిన నిందితుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: అక్రమంగా ఇంట్లోకి చొరబడి గర్భిణినిపై దాడి చేసి గాయపర్చిన నిందితుడికి న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.18,000 జరిమానా విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్ సమీపంలోని సిఖ్‌చావని ప్రాంతానికి చెందిన సర్దార్ శైలేందర్ సింగ్(36) సేల్స్‌మెన్‌గా పనిచేస్తాడు. 2020 సెప్టెంబరు 13 సాయంత్రం అదే కాలనీలో ఆటోలో కూర్చొని మద్యం తాగుతుండగా అక్కడ ఆడుకుంటున్న పిల్లల్లో ఒకరైన అనుదీప్‌సింగ్ విసిరిన చిన్న రాయి అతడికి తగిలింది. అదేరోజు రాత్రి శైలేందర్‌సింగ్.. ఆ బాలుడి ఇంట్లోకి ప్రవేశించి అతని తల్లి నిండు గర్భిణి అయిన జగ్‌దీశ్ కౌర్(28)పై దాడి చేసి గాయపర్చాడు.

## ఆర్డినెన్స్ తీసుకొచ్చి జమిలి ఎన్నికలు నిర్వహించే కుట్ర



మాట్లాడుతున్న డా. కె.నారాయణ. చిత్రంలో బాలమల్లేశ్

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: భాజపా సంకీర్ణ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా ఆర్డినెన్స్ ద్వారా జమిలి ఎన్నికలను నిర్వహించే కుట్ర చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ ఆరోపించారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 'వన్ నేషన్, వన్ రేషన్, వన్ ఓట్, వన్ ఎలక్షన్' పేరుతో ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. మోదీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, బిహార్ సీఎం నితీష్ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. అభివృద్ధి పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాలకు సీపీఐ అభ్యంతరం చెప్పడం లేదని, అయితే అవి అందరికీ ఉపయోగపడేలా నిర్మించాలని, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. దీనిపై ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశామని తెలిపారు. హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిందేనని, మూసీ ప్రక్షాళన సైతం చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ముందుగా పేదలకు పునరావాసం కల్పించి, తర్వాతే ఖాళీ చేయించాలని సూచించారు. వికారాబాద్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఉన్న ఫిరంగి నాలాలపై ఆక్రమణలను తొలగించాలన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ ఉన్నారు.

## మధ్యంతర బెయిలుకు నృత్య దర్శకుడు జానీ పిటిషన్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: అత్యాచారం, బెదిరింపులు, పోక్సో కేసులో అరెస్టై చంచల్‌గూడ జైలులో విచారణ ఖైదీగా ఉన్న నృత్య దర్శకుడు జానీ మధ్యంతర బెయిలు కోసం సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. గత వారం ఆయన దాఖలు చేసిన రెగ్యులర్ బెయిలు పిటిషన్ సోమవారం విచారణకు రాగా, రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో కోర్టు తదుపరి విచారణను అక్టోబరు 7వ తేదీకి వాయిదా వేసింది. దిల్లీలో ఉత్తమ నృత్య దర్శకుడి అవార్డును అందుకోవాల్సి ఉన్నందున, ఐదు రోజులు మధ్యంతర బెయిలు మంజూరు చేయాలని అభ్యర్థిస్తూ పిటిషన్ వేశాడు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కౌంటర్ దాఖలుకు వీలుగా విచారణను న్యాయమూర్తి నేటికి వాయిదా వేశారు.

## వయసు 19.. చోరీలు 23
### ద్విచక్రవాహనాల నిందితుడు, అతనికి సహకరించిన నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

యాచారం, న్యూస్‌టుడే: జల్సాల కోసం ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడిన యువకుడు చివరకు పోలీసులకు చిక్కి కటకటాలు లెక్కిస్తున్నాడు. 19ఏళ్ల వయసులోనే 23 బైక్‌లను చోరీ చేశాడు. యాచారం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి వివరాలు వెల్లడించారు. ఫార్మాసిటీ పోలీసులు సెప్టెంబరు 29న మేడిపల్లిలో వాహనాల తనిఖీ చేస్తుండగా తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన హర్షవర్ధన్(19) మోటర్‌సైకిల్‌పై అనుమానంగా వెళ్లడం గమనించి ప్రశ్నించారు. బైకులు చోరీలు చేస్తున్నట్లు తేలడంతో రూ.9 లక్షలు విలువ చేసే 23 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నందివనపర్తి గ్రామ వాసి రాజు(29), మహ్మద్ అమెర్ అలీ(22), మేడిపల్లి గ్రామ నివాసి భేత జంగయ్య(32), జాల నాగరాజు(24) ద్వారా గ్రామాల రైతులకు విక్రయించినట్లు చెప్పాడు. మహబూబ్‌నగర్, అఫ్జల్‌గంజ్, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, మంచాల, యాచారం, మేడిపల్లి ఫార్మాసిటీ పోలీసుస్టేషన్‌ల పరిధిలోని బస్టాండ్లు, హోటళ్ల వద్ద పార్కు చేసిన వాటిని చోరీ చేసేవాడు. హర్షవర్ధన్‌కు సహకరించిన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ నర్సింహరావు, ఎస్సై తేజంరెడ్డి పాల్గొన్నారు.

## విమానాశ్రయంలో మహిళ అదృశ్యం

శంషాబాద్, న్యూస్‌టుడే: గల్ఫ్ దేశం నుంచి వచ్చిన మహిళా ప్రయాణికురాలు శంషాబాద్ విమానాశ్రయంలో అదృశ్యమైంది. ఆర్జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లికి చెందిన వివాహిత సౌదీ అరేబియా వెళ్లింది. ఈనెల 25న దమ్మామ్ నుంచి స్వదేశానికి బయల్దేరినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. ఆమెను ఇంటికి తీసుకెళ్లడానికి కుటుంబ సభ్యులు విమానాశ్రయానికి వచ్చారు. కాగా విమానాశ్రయంలో దిగిన ఆమె కనిపించకుండా పోయింది. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

| చికెన్ ధరలు | | | |
| --- | --- | --- | --- |
| ఫాంరేటు | 110-00 | డ్రెస్డ్ | 191-00 |
| రిటైల్ | 132-00 | స్కిన్‌లెస్ | 218-00 |

## అక్కపై తమ్ముడి లైంగిక దాడి

ఉప్పల్, న్యూస్‌టుడే: తల్లి కాలం చేసింది. తండ్రి మద్యానికి బానిసయ్యాడు. దీంతో అన్నీ తానై తమ్ముడిని ఇంటర్ చదివిస్తోంది ఓ యువతి. తల్లిలేని లోటును తీరుస్తూ తండ్రి బాధ్యతలను సైతం తానే భరిస్తూ కుటుంబ భారాన్ని మోస్తోంది. సభ్య సమాజం తల దించుకునేలా తల్లిలాంటి అక్క మీదనే సొంత తమ్ముడు కన్నేశాడు. ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో అక్క మీద తమ్ముడు లైంగికదాడి చేసిన ఘటన ఆలస్యంగా ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పల్ పరిసరాల్లో ఉండే ఓ కాలనీకి చెందిన ఓ యువతి(19) ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. యువతి తమ్ముడు(17) ఇంటర్ చదువుతున్నాడు. గత నెల 27న(సెప్టెంబరు) ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న యువతిపై ఆమె తమ్ముడు లైంగిక దాడి చేశాడు. యువతి తండ్రికి చెప్పినా పట్టనట్టుగా వ్యవహరించాడు. దీంతో ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## మూసీ ప్రక్షాళనకు
# కొత్త ఎస్టీపీలు!



మూసీ ప్రక్షాళన విషయంలో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే మూసీకి ఇరువైపులా హైదరాబాద్‌లో 1595, మేడ్చల్ మల్కాజిగిరి 239, రంగారెడ్డిలో 332 నిర్మాణాలు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నట్లు తేల్చారు. నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్లు కేటాయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఒకవైపు ఆక్రమణల తొలగింపు.. మరోవైపు మురుగునీటిని శుద్ధి చేయడం కొనసాగించాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం అమృత స్కీంలో భాగంగా ప్రభుత్వంతోపాటు గుత్తేదారు భాగస్వామ్యం కింద హైబ్రిడ్ యాన్యునిటి పద్ధతి(హామ్)లో కొత్తగా 39 ఎస్టీపీలను నిర్మించనున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు వరకు మురుగు కలిసే మూసీతోపాటు చెరువులు, కుంటల వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ నెలాఖరులోపు టెండర్లు ఆహ్వానించేందుకు జలమండలి సిద్ధమవుతోంది. మొత్తం రూ.3849.10 కోట్లతో 972 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో 39 ప్రాంతాల్లో నిర్మించనున్నారు. కేంద్రం 40శాతం, గుత్తేదారు సంస్థ, జలమండలి కలిసి 60శాతం నిధులు వెచ్చిస్తాయి. భూసేకరణ ఇబ్బంది లేకుండా చిన్న చిన్న కేంద్రాలను ప్రభుత్వ భూముల్లో ఎక్కువ నిర్మించనున్నారు. ప్రస్తుతం గ్రేటర్‌వ్యాప్తంగా ఉన్న ఎస్టీపీల ద్వారా 750 మిలియన్ లీటర్ల మురుగును శుద్ధి చేస్తున్నారు. ఇవి కాకుండా 31 ఎస్టీపీలు సిద్ధమవుతున్నాయి.

-ఈనాడు, హైదరాబాద్

## మియాపూర్‌లో వివాహిత దారుణ హత్య



స్పందన

మియాపూర్, న్యూస్‌టుడే: మియాపూర్‌లో ఓ వివాహితను పదునైన ఆయుధంతో ఆమె ఇంట్లోనే హత్య చేసిన ఘటన సంచలనం సృష్టించింది. ఏసీపీ నరసింహారావు, సీఐ దుర్గారామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... దీప్తిశ్రీనగర్ సీబీఆర్ ఎస్టేట్ 3ఏ బ్లాక్‌లో ఉండే ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు నమ్రుత కుమార్తె బండి స్పందన (29) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇంటర్ చదువుతున్న సమయంలోనే అదే కాలనీకి చెందిన వినయ్‌కుమార్‌ను ప్రేమించింది. 2022 ఆగస్టులో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. భర్త ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్. 2023లో భర్త తనను వేధిస్తున్నాడంటూ మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదైంది. విడాకుల కేసు కోర్టులో ఉంది.

### విచక్షణారహితంగా పొడిచి...

సోమవారం తల్లి తాను పనిచేస్తున్న పాఠశాలలో విధులకు వెళ్లగా స్పందన ఇంట్లో ఉంది. మధ్యాహ్నం సమీపంలో నివాసం ఉంటే సోదరి వచ్చి ఇంటి తలుపు తట్టినా తీయకపోవడంతో వెళ్లిపోయింది. సాయంత్రం పాఠశాల నుంచి తిరిగి వచ్చిన తల్లి కాలింగ్ బెల్ నొక్కినా, కుమార్తె సెల్‌ఫోన్‌కు కాల్ చేసినా స్పందించకపోవడంతో స్థానికుల సాయంతో తలుపు బద్దలు కొట్టి చూడగా అప్పటికే హత్యకు గురై ఉంది. పదునైన ఆయుధంతో విచక్షణారహితంగా పొడిచినట్లు కనిపిస్తున్నా.. అక్కడ ఎటువంటి ఆయుధం లభించలేదని పోలీసులు తెలిపారు. నిందితులు తెలిసినవారా అనే కోణంలో విచారిస్తున్నామని ఏసీపీ తెలిపారు. అపార్ట్‌మెంట్‌తోపాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీని సేకరిస్తున్నామన్నారు.

## పోలీసుల అదుపులో మెదక్ పట్టణ ఉన్నతాధికారి

లాలాపేట, న్యూస్‌టుడే: మెదక్ పట్టణంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకర్ని ఓయూ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈయన కుటుంబంతో కలిసి వారాసిగూడలో ఉంటున్నారు. మరో మహిళను పెళ్లి చేసుకోవడంపై భార్య అతన్ని నిలదీసింది. ఇరువురి మధ్య గొడవ జరగడంతో మాట్లాడుకుందామని చెప్పి భార్యను బయటకు తీసుకెళ్లాడు. ఆందోళనకు గురైన ఆమె బంధువులు 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఓయూ పోలీసులు వారిని తార్నాకలో అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రాత పూర్వక ఫిర్యాదు ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

## జల్సాలకు అలవాటుపడి.. చోరీలకు తెగబడి



వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ

సనత్‌నగర్, న్యూస్‌టుడే: జల్సాలకు అలవాటుపడి ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న ఇద్దరు పాత నేరస్థులతోపాటు ఓ బాలుడిని సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 9 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఏసీపీ హనుమంతరావు, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, నాగిరెడ్డితో కలిసి బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ ఠాణాలో వివరాలు వెల్లడించారు. ఎర్రగడ్డలో ఆదివారం తనిఖీలు చేస్తుండగా కూకట్‌పల్లి నుంచి వస్తున్న ముగ్గురు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వెంబడించి పట్టుకొని విచారించగా నేరం అంగీకరించారు. నిందితుల్లో మూసాపేట ప్రగతినగర్‌కు చెందిన ఎం.శివశంకర్(20), జనతానగర్‌కు చెందిన గోవింద(19)తోపాటు ఓ బాలుడు(17) ఉన్నారు. జగద్గిరిగుట్ట, గోల్కొండ, కూకట్‌పల్లి పోలీసుస్టేషన్లలో శివశంకర్‌పై ఆరు, గోవిందపై 4 కేసులున్నాయి. వీరు జైలుకు వెళ్లొచ్చినా పద్ధతి మార్చుకోలేదు. సనత్‌నగర్, బోరబండ, బాలానగర్, కూకట్‌పల్లి, చందానగర్, కేపీహెచ్‌బీ, మియాపూర్ పోలీసుస్టేషన్ల పరిధిలో మొత్తం 9 వాహనాలను చోరీ చేశారు. శివశంకర్ నుంచి 4, గోవింద నుంచి 4, బాలుడి నుంచి ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను రిమాండ్‌కు, బాలుడిని జువైనల్ హోంకు తరలించారు.

## దీర్ఘకాలిక సెలవులో నిజాంపేట కమిషనర్



సౌజన్య

నిజాంపేట, న్యూస్‌టుడే: నిజాంపేట నగర పాలక సంస్థ కమిషనర్ దేవులపల్లి సౌజన్య దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. జీహెచ్ఎంసీలో ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేసిన ఆమెను నెల క్రితమే ఇక్కడికి బదిలీ చేశారు. ఆగస్టు 30న బాధ్యతలు స్వీకరించిన ఆమె నెల రోజులకే దీర్ఘకాలిక సెలవు పెట్టడం చర్చనీయాంశమైంది. దీనికితోడు అధికార పార్టీకి చెందిన ఓ బడా నాయకుడు తాను చెప్పిందే జరగాలని పలుమార్లు ఒత్తిడి తేవడంతోనే ఆమె సెలవుపై వెళ్లడానికి కారణమని తెలుస్తోంది.

## కలెక్టరేట్ వద్ద మూసీ నిర్వాసితుల నిరసన

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లను కూల్చే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని మూసీ నిర్వాసితుల సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ఉద్యమాన్ని అధికం చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో బాధితులతో కలిసి సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున నిరసన ప్రదర్శించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారికి వినతిపత్రం సమర్పించారు. సొంత ఊరిలో పొలాలు అమ్ముకొని, బంగారం విక్రయించి, రుణాలు పొంది ఇళ్లను కట్టుకున్నామని, వీటిని కూలిస్తే జీవనోపాధి కోల్పోవడంతోపాటు అప్పులపాలవుతామని.. తమ జీవితాలు అగమ్యగోచరంగా మారతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## నిర్లక్ష్యంతోనే ప్రమాదం.. పరిహారం చెల్లించాల్సిందే

ఈనాడు, హైదరాబాద్: బస్సు బాడీ నిర్మాణం సందర్భంగా జరిగిన ప్రమాదంలో మంటలు చెలరేగి గాయపడిన డ్రైవరు ఎ.పద్మయ్య, ప్రమాద నష్టంపై వాహన యజమాని కె.తిరుపతిరెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. హైదరాబాద్‌కు చెందిన వీరి పిటిషన్‌ను విచారించిన కమిషన్. . గాయపడిన డ్రైవరుకు అయిన వైద్య ఖర్చులకు 1.07 లక్షలు, మానసిక వేదనకు గురైనందుకు పరిహారంగా రూ.5 లక్షలు, ఏడాదిపాటు కోల్పోయిన ఆదాయం రూ.2.5 లక్షలు, కోర్టు ఖర్చుల కింద రూ.10 వేలు చెల్లించాలని ఆదేశించింది. జిల్లా కమిషన్ తీర్పును సవాలు చేస్తూ ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో అప్పీలు దాఖలు చేసింది. దీనిపై ఇన్‌ఛార్జి అధ్యక్షురాలు మీనా రామనాథం, సభ్యులు వి.వి.శేషుబాబుతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. బస్సు బాడీ నిర్మాణంలో భాగంగా దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని, అయితే ఆ ప్రాంతంలోకి నిర్వాహకులు ఇతరులను అనుమతించకూడదన్నారు. డ్రైవరును అనుమతించడంతో అనుకోకుండా జరిగిన ప్రమాదంలో గాయపడ్డారని, అందువల్ల పరిహారం చెల్లించాల్సిందేనని తీర్పు వెలువరించింది. అయితే వైద్య ఖర్చులకు అయిన రూ.1.06 లక్షలు, పరిహారంగా రూ.లక్ష, ఏడాదిపాటు కోల్పోయిన ఆదాయం రూ.1.80 లక్షలు, కోర్టు ఖర్చుల కింద రూ.10 వేలు, ప్రమాదం జరిగిన తేదీ నుంచి 8 శాతం వడ్డీతో డ్రైవరుకు చెల్లించాలని ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఆదేశించింది.

## బీఎస్ఎన్ఎల్ 'సర్వత్ర' పేరుతో ఎఫ్‌టీటీహెచ్ సేవలు


బెలూన్ ఎగుర వేస్తున్న జి.రత్నకుమార్, చంద్రశేఖర్ తదితరులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ మూడు రోజుల్లో రాష్ట్రంలో ఎఫ్‌టీటీహెచ్ రోమింగ్ వైఫై సేవలను 'సర్వత్ర' పేరుతో ప్రారంభించనుందని సంస్థ తెలంగాణ సీజీఎం జి.రత్నకుమార్ తెలిపారు. బీఎస్ఎన్ఎల్ రజతోత్సవాలను సోమవారం సాయంత్రం లక్డీకాపూల్‌లోని టెలిఫోన్ భవన్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ల్యాండ్‌లైన్ కాన్సెప్ట్‌తో వచ్చే ఎఫ్‌టీటీహెచ్ సేవలను పొందిన వినియోగదారుడు రోమింగ్ సదుపాయంతో అదే సేవలను మరోచోట యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో వినియోగించుకోవచ్చన్నారు. బీఎస్ఎన్ఎల్ హైదరాబాద్ పీజీఎం ఎం.చంద్రశేఖర్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.




బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవానికి సోమవారం విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కళాకారుల జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అష్ట లక్ష్మి రంగోళి, నాగాలాండ్ కోయిర్ నృత్యం సందర్శకులను మంత్రముగ్ధులను చేసింది.
–న్యూస్‌టుడే, బొల్లారం

## ఎగ్జిబిషన్ మైదానంలో గర్బా, దాండియా 6 నుంచి


గోడ పత్రాలను ఆవిష్కరించిన గోవింద్‌రాఠీ, నిరంజన్, సురేందర్ రెడ్డి, చిత్రంలో డి.మోహన్, రంగారెడ్డి, గిరిధారిలాల్ డాగా

గోషామహల్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అక్టోబరు 6 నుంచి 10వ తేదీ వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం పెండాల్‌లో గర్బా, దాండియా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రామాయాణ్ మేళా చీఫ్ కన్వీనరు గోవింద్‌రాఠీ తెలిపారు. సోమవారం ఎగ్జిబిషన్ సొసైటీ కార్యాలయంలో గోడ పత్రాలు ఆవిష్కరించారు. గోవింద్‌రాఠీ మాట్లాడుతూ.. అయిదు రోజుల పాటు రాత్రి 8 గంటల నుంచి 12 వరకు జరిగే ఈ కార్యక్రమంలో ముంబయి నుంచి ప్రత్యేక కళాకారుల బృందం విచ్చేస్తున్నట్లు తెలిపారు. విజేతలకు దసరా రోజున బహుమతులు అందజేస్తామన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డి.మోహన్, ఎకనామిక్ కమిటీ కార్యదర్శి జీవీ రంగారెడ్డి, ఉత్సవ నిర్వాహకులు గిరిధారిలాల్ డాగా, మనోజ్ జైస్వాల్, సుమిత్‌రాఠీ పాల్గొన్నారు.



## గుర్రం జాషువా యాదిలో...


మాట్లాడుతున్న ఇనాక్. చిత్రంలో భవానీ ప్రసాద్, కళా జనార్దనమూర్తి తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జాషువా రచనలు సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. సోమవారం త్యాగరాయ గానసభ నిర్వహణలో 'గుర్రం జాషువా యాది..'లో శీర్షికతో గుండవరపు హనుమంతరావు హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. జాషువా రాసిన కవితల్లో ప్రధానంగా దళితుల ఆవేదన ప్రతిధ్వనిస్తుందన్నారు. ఆయన ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు జల్ది విద్యాధరరావు, కోయి కోటేశ్వరరావు, సుధాకర్, భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సవాళ్లను అధిగమించడంలో ఆవిష్కరణలు కీలకం


పుస్తకావిష్కరణలో అతిథులు

దుండిగల్, న్యూస్‌టుడే: సవాళ్లను అధిగమించడంలో ఆవిష్కరణలు కీలకమని ధన్‌బాద్ ఐఐటీ డైరెక్టర్ సుకుమార్ మిశ్రా అన్నారు. మహీంద్రా వర్సిటీలో సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలపై నిర్వహించిన ద్వితీయ అంతర్జాతీయ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చేసే అభివృద్ధి రేపటి భవిష్యత్తుకు దారి చూపుతుందన్నారు.

## నగరంలో ఈనాడు

● గచ్చిబౌలిలోని బ్రహ్మాకుమారీ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఉ. 11గంటలకు కేంద్రీయ విశ్వవిద్యాలయం 24వ స్నాతకోత్సవం.. ముఖ్యఅతిథి టి.జి.సీతారాం ● ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని హయత్ గచ్చిబౌలిలో ఉ. 11గంటలకు 'తెలంగాణ మహిళా ఔత్సాహిక పారిశ్రామిక సదస్సు' ముఖ్య అతిథి నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం. ●రవీంద్ర భారతిలో ఉ. 9గంటలకు అంతర్జాతీయ వయోధిక దినోత్సవం. ముఖ్య అతిథులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి సీతక్క ● తార్నాకలోని మర్రి కృష్ణ హాల్‌లో ఉదయం 9.30గంటలకు అంతర్జాతీయ వయోధికుల దినోత్సవం. ● సికింద్రాబాద్‌లోని పాత కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రిలో ఉదయం 9.30గంటలకు తొలి టెలిమెడిసిన్ కేంద్రం ప్రారంభం.

# పరాన్నజీవుల కణాంతరాలపై పరిశోధన



● అంటువ్యాధుల నియంత్రణకు 'ఐ- పెరల్'
● బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ జీవశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ నితీష్ గుప్తా

వ్యాధుల నియంత్రణకు పరిశోధనలు నిర్వహిస్తున్నా.. కొత్త మందులను తయారు చేస్తున్నా.. గ్రామాల్లో జ్వరం.. జలుబు.. దగ్గు వంటి సాధారణ జబ్బులు తొందరగా తగ్గడం లేదు. అంటురోగాలు వ్యాప్తి చేసే ఈగలు, దోమలు, అపరిశుభ్రత కారణంగా రోగాలు పెరుగుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు అంటురోగాలు వ్యాప్తిచేసే పరాన్నజీవుల కణాంతరాలపై పరిశోధనలు పెరుగుతున్నా" యని బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ జీవశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ నితీష్ గుప్తా అన్నారు. బయోసైన్సెస్ రంగంలో వస్తున్న మార్పులు.. పరిశోధనలపై 'ఈనాడు'తో తో మాట్లాడారు.

**? వైద్యరంగంలో అధునాతన చికిత్సా విధానాలు అందుబాటులోకి వస్తున్నా... గ్రామీణ ప్రాంతాల్లో జబ్బులు ఎందుకు తగ్గడం లేదు?**

● గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా వైద్యసేవలు పూర్తిగా అందుబాటులోకి రాకపోవడం వల్లే జబ్బులు తగ్గడం లేదు. పారిశుద్ధ్యలోపం కారణంగా జంతువులు, కీటకాల నుంచి మనుషులకు జబ్బులు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. మలేరియా, డెంగీ జ్వరాలు పెరిగేందుకు కారణాలివే. వైద్యసేవల కన్నా ముందుగా అక్కడ ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి.

**? పరాన్నజీవుల కణాంతరాల పరిశోధన ఏ మేరకు ఫలితాలు ఇవ్వొచ్చు?**

● పరాన్నజీవులు, దోమల ద్వారా చిన్నారులు, వృద్ధులు, మహిళలకు వస్తున్న జబ్బులను నియంత్రించేందుకు గణనీయ ప్రభావం చూపనుంది. వ్యాధికారక క్రిములు, జబ్బులను తగ్గించే మందులపై ఏకకణజీవుల తిరుగుబాటుపై పరిశోధనలు నిర్వహిస్తున్నాం.

**? డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఈ తరహా ప్రయోగశాలలు నెలకొల్పితే విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందా?**

● డిగ్రీ కళాశాలలు, వర్సిటీల్లో ఐ-పెరల్ స్థాయిలో కాకపోయినా లైఫ్ సైన్సెస్‌లో వస్తున్న మార్పులు, భవిష్యత్ పరిశోధనలపై అవగాహన పెంచుకునేందుకు ప్రయోగశాలలుండాలి. భవిష్యత్తులో పరిశోధనలతో పాటు వాణిజ్యపరంగా అవకాశాలు పెరగనున్నాయి.

**? పరాన్నజీవుల కణాంతర పరిశోధనలతో యువత, కార్పొరేట్ సంస్థలకు ఏకకాలంలో ప్రయోజనాలు లభిస్తాయా?**

● పరాన్నజీవుల కణాంతర పరిశోధనలు నైతిక ప్రమాణాలతో కూడిన ఒక ప్రత్యేక లక్ష్యం. లైఫ్ సైన్సెస్‌పై ఆసక్తి, అభిరుచి ఉన్న యువ పరిశోధకులు ఈ ప్రయోగశాలల్లో చేరవచ్చు. వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా వారు అంకుర సంస్థలను స్థాపించేందుకు అవకాశాలున్నాయి.

**? ప్రపంచ బయోసైన్స్ పరిశోధనల్లో ఐ-పెరల్ ప్రాధాన్యం ఏమిటి?**

● అంతర్జాతీయ స్థాయిలో వినూత్న పరిశోధనల నిర్వహణ. విదేశీ విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం, కొత్త శాస్త్రీయ ప్రమాణాలను పరిచయం చేయడం, యాంటీ మైక్రోబియాల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) ప్రభావాన్ని కృత్రిమ మేధతో కూడిన పరిశోధనల ద్వారా తగ్గించడం, తక్కువ ఖర్చుతో పరిశోధనలు నిర్వహించడం ద్వారా ఐ-పెరల్ ప్రాముఖ్యత పెరిగేలా కార్యాచరణ రూపొందించాం.

ఈనాడు, హైదరాబాద్

## దివ్యాంగులు.. సమస్యల సాధనకు అడుగులు




సరకు రవాణా ఆటోలో ఉన్న వీరంతా దివ్యాంగులు.. సమస్యల గురించి అధికారులకు విన్నవించేందుకు సోమవారం కొంగర కలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. కర్రల సాయంతో నడవగలిగిన వారు కలెక్టరేట్‌లోకి వెళ్లగా.. ఆటో దిగలేని వారు అందులోనే వేచి ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా సంక్షేమ అధికారిని కలిసి సమస్యలు విన్నవించారు.

## మరిచిపోలేని గురువు.. మరపురాని వీడ్కోలు


మనోరమ దంపతులకు విద్యార్థుల స్వాగతం

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్ ప్రభుత్వోన్నత పాఠశాల(ఓల్డ్) బయోసైన్స్ ఉపాధ్యాయిని సీతాపురం మనోరమ ఉద్యోగ విరమణకు పూర్వ విద్యార్థులంతా తరలివచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు. 31 ఏళ్ల పాటు బోధనా వృత్తిలో ఉన్న ఆమె ఎంతోమంది విద్యార్థుల అభిమానాన్ని పొందారు. సోమవారం ఆమె ఉద్యోగ విరమణ పొందుతున్నారని తెలిసి 2009 నుంచి 2024 వరకు ఆమె వద్ద చదువుకున్న విద్యార్థులు అలూమినీ జట్టుగా ఏర్పడి ఆదివారం పాఠశాలలో ఘనంగా వీడ్కోలు పలికారు. సనత్‌నగర్ బస్టాండ్ నుంచి మేళతాళాలు, కోలాట నృత్యాలతో పూల వర్షం కురిపిస్తూ అరకిలో మీటరు దూరంలోని పాఠశాల వరకు స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ప్రత్యేక రథంలో దంపతుల వెంట నడుస్తూ వీడ్కోలు పలకడం గమనార్హం.

## క్యాన్సర్‌పై అవగాహన.. 'పింక్' సిటీగా భాగ్యనగరం



ఈనాడు, హైదరాబాద్: కిమ్స్-ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రఘురాం ఆధ్వర్యంలో సోమవారం 'పెయింట్ ది సిటీ పింక్ క్యాంపైన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అక్టోబరు నెల ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన దినం పురస్కరించుకొని భాగ్యనగరంలోని చారిత్రాత్మక కట్టడాలు, ఇతర ప్రముఖ భవనాలు గులాబీ రంగు అలుముకున్నాయి. చార్మినార్, బుద్ధ విగ్రహం, టీహబ్, దుర్గంచెరువు కేబుల్ వంతెన, కిమ్స్ ఆసుపత్రి ఇలా పలు కట్టడాలు గులాబీ రంగు విద్యుత్తు దీపాలతో తీర్చిదిద్దారు.

## అమీన్‌పూర్‌లో కళాశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: అమీన్‌పూర్ పట్టణ పరిధిలో ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో చదువుతున్న అమ్మాయిలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఆకతాయిలు ముసుగులు వేసుకుని వచ్చి అమ్మాయిలను కొడుతున్నారని వారు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఒక అమ్మాయికి దెబ్బలు తగిలి వసతి గృహంలో విశ్రాంతి తీసుకొంటోందని వివరించారు. దసరా సెలవులు ప్రకటించి పిల్లలను ఇంటికి పంపించాలని కోరారు. యాజమాన్యం అంగీకరించడంతో విద్యార్థినులను ఇళ్లకు తీసుకెళ్లారు.

## యువ పరిశోధకుల అంకుర సంస్థకు టీస్పార్క్ నిధులు


ప్రభాకర్


నరేంద్రకుమార్

లాలాపేట, నెల్లికుదురు – న్యూస్‌టుడే: మిరప పంటను ఆశిస్తున్న నల్లతామర తెగులు నివారణకు పరిశోధనలు చేసి సేంద్రియ ఆధారిత మందులు తయారుచేసిన యువ పరిశోధకులను తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ అందించే రూ.5 లక్షల టీ-స్పార్క్ గ్రాంట్ వరించింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి యువకుడు గాజుల ప్రభాకర్, డోర్నకల్ యువకుడు నరేంద్రకుమార్ . ఓయూలో ఎంఎస్సీ పీహెచ్‌డీ పూర్తిచేసి శ్రీజీపీఎవెన్ లైఫ్ సైన్సెస్ అనే స్టార్టప్ సంస్థను స్థాపించారు. పంటలపై ఆశించే పురుగు, తెగుళ్ల నివారణకు పరిశోధనలు చేస్తున్నారు. హైదరాబాద్ ఐకేపీ నాలెడ్జ్ పార్క్ సహాయంతో థ్రిప్ క్లియర్ అనే సేంద్రియ ఆధారిత పురుగు మందు రూపొందించారు. టీ-స్పార్క్ వారు పలుమార్లు పరిశీలించి గ్రాంట్‌కు తమ సంస్థను ఎంపిక చేశారని ప్రభాకర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



# సొంతూళ్లకు వెళ్తున్నారా.. దొంగలతో జాగ్రత్త

ఈనాడు, హైదరాబాద్



దసరా పండుగ సెలవులు మొదలవుతున్నాయి. ఇంటిల్లిపాదీ నగరం నుంచి సొంతూళ్లకు ప్రయాణమవుతుంటారు. దొంగలు మాత్రం ఇలాంటి సమయం కోసమే కాచుకుని కూర్చుంటారు. తాళం వేసిన ఇళ్లు కనిపిస్తే గుల్ల చేస్తారు. ఏటా దసరా, సంక్రాంతి సమయాల్లోనే చోరీలు అధికంగా నమోదవుతుంటాయి. ఈ నేపథ్యంలోనే సైబరాబాద్ పోలీసులు దొంగతనాల నివారణకు పలు జాగ్రత్తలు సూచిస్తున్నారు. కచ్చితంగా పాటిస్తే చోరీలు తగ్గుతాయని పేర్కొంటున్నారు. సూచనలివీ..

● ఊరెళ్లినప్పుడు విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదు ఇంట్లో ఉంచొద్దు. వెంట తీసుకెళ్లడం లేదా బ్యాంకు లాకర్లలో భద్రపరచడం చేయాలి. ఇంట్లో అయితే రహస్య ప్రదేశంలో దాచాలి. ● ఇంటికి సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్ లేదా సెంట్రల్ లాక్ సిస్టమ్ అమర్చుకోవాలి. ఇంట్లో లేనప్పుడు పాలప్యాకెట్లు, పత్రికలు తలుపు ముందు జమవ్వకుండా చూడాలి. ఇంటి బయట, లోపల కొన్ని లైట్లు ఆన్‌లో ఉంచాలి.

● వాహనాలను కచ్చితంగా ఇంటి ఆవరణలో పార్కింగ్ చేయాలి. ద్విచక్ర వాహనాల చక్రాలకు ప్రత్యేక తాళం వేయాలి. ● బీరువా, లాకర్ తాళాలు రహస్య ప్రదేశంలో దాచాలి. ఇంట్లో సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్ ద్వారా పర్యవేక్షిస్తూ ఉండాలి.

● ఊరు, విహార యాత్రలకు వెళ్లే విషయం సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దు.

● కాలనీ సంఘాలు, అపార్టుమెంట్లలో కచ్చితంగా భద్రతా సిబ్బందిని నియమించుకోవాలి.

● కాలనీల్లో స్వచ్ఛంద కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. ఎప్పటికప్పుడు పోలీసులకు అందుబాటులో ఉంటూ అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీసులకు సమాచారమివ్వాలి.

● చోరీలకు ముందు దొంగలు కచ్చితంగా రెక్కీ చేస్తుంటారు. పగటిపూట వేర్వేరు కారణాలతో వచ్చి కాలనీల్లో రెక్కీ చేసి రాత్రి దొంగిలిస్తుంటారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారమివ్వాలి.

● కాలనీల్లో దొంగతనాలు అరికట్టేందుకు డయల్ 100 లేదా స్థానిక పోలీసుస్టేషన్ నెంబరుకు సమాచారం ఇవ్వాలి.

## 'సంపన్నులకే రూ.లక్షల కోట్ల బడ్జెట్'


కోల్సే పాటిల్


ప్రదర్శనగా వెళ్తున్న విద్యార్థులు

లాలాపేట, న్యూస్‌టుడే: దేశంలో రూ.లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రజలకు కాకుండా సంపన్నులకే పంచుతున్నారని ముంబై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కోల్సే పాటిల్ అన్నారు. ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) స్వర్ణోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. పాలకులు అవినీతి, కుల, మతాలతో దేశాన్ని ధ్వంసం చేశారని తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ దేశంలో సామాన్య ప్రజానీకానికి విద్య అందకుండా చేస్తున్నారన్నారు. అనంతరం 'సమరశీల స్ఫూర్తి పీడీఎస్‌యూ' అనే పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ(ఎం.ఎల్) రాష్ట్ర కార్యదర్శి రంగారావు, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, పిడిఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ పాల్గొన్నారు.


సంప్రదాయ వస్త్ర ధారణతో ఫ్యాషన్ షో

## వేడుకగా మిస్ అండ్ మిసెస్ పోటీలు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: సంప్రదాయ వస్త్ర ధారణతో మిస్ అండ్ మిసెస్ ఇండియా ఐకానిక్ దివా 2024 పోటీలు సోమవారం రాత్రి సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో సందడిగా సాగాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ షో ఆకట్టుకుంది.

## మూసీ నిర్వాసితులకు న్యాయం చేయాలి


మాట్లాడుతున్న రాజేందర్‌పటేల్‌గౌడ్

గోల్నాక, న్యూస్‌టుడే: మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ కోరారు. నగరానికి సమీపంలోనే పునరావాసాన్ని కల్పించి ఉపాధికి ఇబ్బంది లేకుండా చూడాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. సోమవారం నింబోలిఅడ్డాలో సమావేశంలో.. నల్లెల్ల కిషోర్, భూషణ్ భాస్కర్, డా.ప్రశాంత్ నిమ్కర్, ప్రదీప్‌గౌడ్, అనిల్‌లతో కలిసి మాట్లాడారు.

## శరన్నవరాత్రి వేడుకలకు పెద్దమ్మతల్లి ఆలయం ముస్తాబు


ఎల్ఈడీ తెరపై అమ్మవారు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి దేవాలయం ముస్తాబు అవుతుంది. ఈ నెల 3 నుంచి 12వ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి వివరించారు.

**ఆదాయంలో 7వ స్థానం:** పెద్దమ్మతల్లి దేవాలయం నికర ఆదాయంలో ఏడో స్థానంలో ఉంది. మూడేళ్ల కిందట నికర ఆదాయం ఏడాదికి రూ.7.50 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.13 కోట్లకు చేరింది. నెలకు ఆలయ ఆదాయం రూ.50-60లక్షలు వస్తోంది. మంగళ, శుక్ర, శనివారాల్లో రోజుకు 600 మందికి మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నారు.

**నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారి అలంకరణ.. చీరలు**

| తేది | అలంకారం | చీర రంగు |
|---|---|---|
| 03 | బాలత్రిపుర సుందరీదేవి | పసుపు |
| 04 | గజలక్ష్మీదేవి | గులాభి |
| 05 | అన్నపూర్ణాదేవి | క్రీమ్ |
| 06 | గాయత్రిదేవి | ఆరెంజ్ |
| 07 | లలితాదేవి | కనకాంబరం |
| 08 | రాజరాజేశ్వరదేవి | ఆకుపచ్చ |
| 09 | సరస్వతిదేవి | తెలుపు |
| 10 | దుర్గాదేవి | ఎరుపు |
| 11 | మహిషాసుర మర్ధినీదేవి | ముదురు ఎరుపు |
| 12 | పెద్దమ్మతల్లి | గంధం |

## వారస్ చెస్ టోర్నీ రేపు

ఈనాడు, హైదరాబాద్: వారస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న ఓపెన్ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నీ ప్రైజ్‌మనీ రూ.లక్ష. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే అంతర్జాతీయ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామని నిర్వాహకులు వెల్లడించారు. సమాచారం కోసం 73968 47937లో సంప్రదించాలి. లేదా వారస్‌చెస్ అకాడమీ వెబ్‌సైట్లో పేర్లు నమోదు చేసుకోవాలి.

## అమ్మమ్మ... అమ్మ... అమ్మాయి!

మీకు తెలుసా?



అమ్మమ్మ మనలో కొంత భాగాన్ని కూడా తన కడుపులో మోసింది. ఎలానో తెలుసా? సాధారణంగా ఆడ శిశువు పుట్టేటప్పటికే తన జీవిత కాలంలో విడుదలయ్యే అండాలన్నీ కలిగిఉంటుందట. అంటే అమ్మమ్మ గర్భవతిగా ఉన్నప్పుడే ఆమె కడుపులో ఉన్న అమ్మ గర్భాశయంలో మనం అండాల రూపంలో తయారై ఉంటామన్నమాట. ఆ అండాల్లో మనమూ ఒకరం. ఆ విధంగా అమ్మమ్మ మనల్నీ తన కడుపులో మోస్తుంది.

## రాసిచ్చిన ఆస్తి వెనక్కి తీసుకోవచ్చా?

పదవీ విరమణ చేసిన డబ్బులు, పొలం, బంగారం... పిల్లలిద్దరికీ సమానంగా పంచేశాం. అప్పటి నుంచి పెన్షన్‌తోనే జీవితం గడుపుతున్నాం. ఏడాదిగా మా వారు మంచాన పడ్డారు. అప్పట్నుంచి మందులు, వైద్యం... వంటి ఖర్చులు ఎక్కువయ్యాయి. ఇంటి అవసరాలకూ డబ్బులు సరిపోవడం లేదు. కొడుకూ, కూతురు... మా బాధ్యతలు తీసుకోవడానికి పోట్లాడుకుంటున్నారు. వృద్ధాశ్రమంలో చేరమని సలహాలు ఇస్తున్నారు. ఆ మాటలు వింటోంటే అనాథలం అయిపోయామన్న బాధ మెలిపెడుతోంది. మా ఆస్తి వెనక్కి తీసుకుంటేనైనా వారికి బుద్ధి వస్తుందేమో అనిపిస్తోంది. ఆ అవకాశం ఉందా? – ఓ సోదరి

డియర్... వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

కన్నబిడ్డల మీద మమకారం, ఆస్తి రాసిస్తే తమ బాగోగులు చూస్తారనే భరోసా... తల్లిదండ్రులుగా మీకుండటం సహజం. కారణాలేవైనా ప్రాపర్టీనంతా ముందుగానే వాళ్లకి పంచి ఇచ్చి పొరపాటు చేశారనిపిస్తోంది. ఇప్పటి తరం తమకున్న బాధ్యతలు వేరనీ, కన్నవాళ్ల పోషణ భారమనీ భావిస్తుండటం విచారకరం. లేఖను బట్టి ఈ విషయంలో మీరెంత వేదన పడుతున్నారో అర్థమవుతోంది. మీలాంటి వారి కోసమే ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్ యాక్ట్-2007 తీసుకొచ్చింది. దీని ప్రకారం తమను తాము పోషించుకోలేని స్థితిలో ఉన్న తల్లిదండ్రులను పోషించే బాధ్యత పిల్లలదే. ఈ చట్టం బిడ్డలు ఆస్తులకోసం కన్నవాళ్లను హింసించకుండా కాపాడుతుంది. అంతేకాదు, పిల్లల చేతిలో బాధలు పడుతున్నా, ఆర్థికంగా, సామాజికంగా నిరాదరణకు గురవుతున్నా 'వృద్ధుల సంరక్షణ చట్టం' కింద ఏర్పాటైన న్యాయస్థానాన్ని రక్షణ కల్పించమని కోరవచ్చు. ఈ చట్టంలోని సెక్షన్ 23 ప్రకారం వృద్ధాప్యంలో తమ బాగోగులు చూడాలనే నియమంతో బిడ్డలకి ఆస్తిని ఇష్టపూర్వకంగా రాసిచ్చినా లేదా వాళ్లే బలవంతంగా రాయించుకుని అనుభవిస్తున్నా అది జరగనప్పుడు దాన్ని రద్దుచేయమని కోర్టుని కోరవచ్చు. అంటే, తమని చూడాలన్న ఒప్పందం మీద ఇచ్చిన ఆస్తుల్ని తల్లిదండ్రులు తిరిగి తీసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు చెబుతోంది. అయితే, ఇది చట్టం అమలులోకి వచ్చిన తరవాత జరిగిన లావాదేవీలకే వర్తిస్తుంది. ముందు ఒక లాయర్‌ని కలిసి మీ పరిస్థితిని వివరించండి. న్యాయం జరుగుతుంది.

## వృద్ధాప్యం... గౌరవప్రదం

థీమ్ 2024

ప్రస్తుతం ప్రపంచ సగటు ఆయుర్దాయం 75 ఏళ్లు. 2030 నాటికి ప్రపంచంలో యువత కంటే వృద్ధుల శాతమే ఎక్కువ కానుంది. ఈ పరిస్థితుల్లో వృద్ధుల సమగ్ర ఆరోగ్యం, సంరక్షణ, సామాజిక మద్దతు.. అంశాలకు ప్రాధాన్యం పెరగనుంది. ఈ సవాళ్లూ, అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా.. 'వృద్ధాప్యం గౌరవప్రదమైనది... ప్రపంచవ్యాప్తంగా వృద్ధులకు రక్షణ, మద్దతు వ్యవస్థలను బలోపేతం చేయడానికి ప్రాముఖ్యత' అనే థీమ్‌ని ఎంపికచేసింది ఐక్యరాజ్య సమితి.

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



దుర్గాలక్ష్మి

# వసుంధర

vasundhara@eenadu.in

**వృద్ధాప్యం శాపం కాదు... కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపే అద్భుత సమయం. కానీ అది కొందరికి తీరని కలే. అందుకే వృద్ధాశ్రమాల అవసరం పెరుగుతోంది. అలా మూడు దశాబ్దాల క్రితమే దాతల సహకారంతో ఏర్పాటైందే సంగారెడ్డి జిల్లా అన్నారంలోని 'సేవాశ్రమం'. ప్రారంభించినప్పటి నుంచి నేటివరకూ అక్కడ చేరిన వృద్ధుల సంరక్షణ బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తున్నారు మొవ్వా దుర్గాలక్ష్మి. ఆమెను పలకరించినప్పుడు... ఆ ఆశ్రమ జీవనం గురించి చెప్పుకొచ్చారిలా...**

## ఇది... ఆనందాశ్రమం



వృద్ధాశ్రమంలో పిల్లలు పట్టించుకోని వాళ్లే ఉంటారని అనుకుంటారు. కానీ అది సరికాదు. చాలామంది వాళ్లంతట వాళ్లే వస్తున్నారు. పిల్లలు వేరేచోట ఉండటం, ఉద్యోగాలూ వ్యాపారాలతో బిజీగా అవ్వడమే ప్రధాన కారణం. అసలే ఇది పోటీ ప్రపంచం. పరుగు తప్పదు. కాబట్టి వాళ్లనీ తప్పుపట్టలేం. అమ్మానాన్నల కోసం సౌకర్యాలన్నీ ఏర్పాటుచేస్తున్నారు. కానీ తీరికే లేదు. పైగా భార్యాభర్తల్లో ఒకరు చనిపోతే మరీ ఒంటరిగా అనిపిస్తుంది. ఆశ్రమంలో అయితే తమ వయసువాళ్లే ఉంటారు. అందుకే హోమ్‌ల దారి పడుతున్నారు.

ముప్పై ఏళ్ల నుంచీ నేను వృద్ధుల సేవలోనే ఉన్నా. వాళ్లకి ఇక్కడ ఉండటం ఇష్టమా కాదా అన్నది తెలుసుకోగలను. అయిష్టంగా చేరేవాళ్లకు ముందే కౌన్సెలింగ్ ఇస్తాం. 'పెద్దవాళ్లయ్యాక కొన్ని సర్దుబాట్లు తప్పనిసరి. పిల్లల అభిరుచుల్ని గౌరవిస్తూ వాళ్లతో కలిసి ఉండగలిగితే అంతకన్నా ఆనందం లేదు' అని చెబితే కొందరు తిరిగి వెళతారు. కానీ కొంతమంది మనసు మార్చుకుని హోమ్‌లో ఉండటానికే ఇష్టపడతారు.

అదీగాక, ఈతరం పెద్దలు సైతం స్వేచ్ఛ కోరుకుంటున్నారు. ఇక్కడైతే వాళ్లమీద పిల్లల ఆంక్షలు ఉండవు. నచ్చిన ప్రదేశానికో బంధువుల దగ్గరకో వెళ్లి వస్తుంటారు. గుళ్లూ, పర్యటనలకూ వెళుతుంటారు. దూరంగా ఉండి మధ్యమధ్యలో ఇంటికి వెళ్లడంవల్ల పిల్లలూ వాళ్లపట్ల ప్రేమగా గౌరవంగా ఉంటున్నారు.

**చిన్నపిల్లల్లానే...**

మా హోమ్‌లో ఉన్న వాళ్ల ఆరోగ్యంగా ఉండేందుకు నెల కోసారి డాక్టర్ విజిట్ ఉంటుంది. వారానికోసారి నర్సు వచ్చి బీపీ షుగర్ వంటివి చెక్ చేస్తుంటారు. ఓపిక ఉన్నవాళ్లు తమకు తోచిన పని చేస్తారు. లేదంటే టీవీ చూడటం, పత్రికలూ పుస్తకాలూ చదవడం చేస్తుంటారు. వీడియో కాల్స్ మాట్లాడుకుంటారు. సాయంత్రాలు చెస్, క్యారమ్స్ ఆడుకుంటారు. పండుగలతోపాటు మదర్స్, ఫాదర్స్, డాటర్స్ డే వంటివీ సెలబ్రేట్ చేసుకుంటాం. కాబట్టి ఇంటిని మిస్ అవుతున్నామన్న ఫీల్ ఉండదు. అదీగాక ఫంక్షన్లనీ మనవలు వచ్చారనీ వెళ్లి వస్తుంటారు.

కుటుంబం అన్నాక సమస్యల్లేకుండా ఉంటాయా... ఇక్కడా ఉంటాయి. ఒక్కొక్కరిదీ ఒక్కో తీరు. అలకలూ సర్దుబాట్లూ మామూలే. వయసు పెరిగేకొద్దీ చిన్నపిల్లల్లా ప్రవర్తించడం సహజమే. అది అర్థం చేసుకుని వాళ్ల మనస్తత్వాన్ని బట్టి మాట్లాడుతుంటాం. నన్ను అమ్మా అని కొందరంటే, కూతురులా భావించి పిలిచే వాళ్లు ఇంకొందరు. ఎవరెలా పిలిచినా పలుకుతా. నా ప్రపంచం వాళ్లే. మా నిర్వాహకులూ సిబ్బందీ అంతా సేవే లక్ష్యంగా పనిచేస్తున్నాం. అందుకే ఉమ్మడి రాష్ట్రంలో బెస్ట్ ఓల్డ్ ఏజ్ హోమ్ అవార్డునీ అందుకుంది సేవాశ్రమం.

తెనాలికి చెందిన ముమ్మనేని వీరభద్రం... అమెరికా వెళ్లినప్పుడు అక్కడి హోమ్స్‌ని చూసి, తన ఆలోచనను స్నేహితులతో పంచుకోవడంతో 1994లో ప్రారంభమైందీ ఆశ్రమం. మొదట అద్దె ఇంట్లో దీప్తిశ్రీనగర్‌లో ఉండేది. అక్కడినుంచి 2001లో బొబ్బా మోహనరావు అన్నారంలో ఇచ్చిన ఎకరా స్థలంలో మరికొందరు దాతల విరాళాలతో ఈ భవనాన్ని నిర్మించారు. చుట్టూ పచ్చని పరిసరాలూ పూలమొక్కలూ పండ్లచెట్లతో ఉండే ఆహ్లాదకరమైన వాతావరణమే ఈ ఆశ్రమ వాసుల్లోని ఆనందానికి సగం కారణం. 'ఇరుకిరుకు అపార్ట్‌మెంట్లతో పోలిస్తే మాకిక్కడే హాయి' అంటూ ఇంటికెళ్లిన రెండ్రోజులకే తిరిగొచ్చేస్తారు. అవునుమరి, ఆరోగ్యకరమైన ఆహారం, వసతి సదుపాయాల్ని కల్పించడంతోపాటు వాళ్లని ఎంతో ప్రేమగా చూస్తుంటాం. ఆ బంధం వల్లే వాళ్లు ఇక్కడి నుంచి వెళ్లడానికి ఇష్టపడరు. అందుకే నాకనిపిస్తోంది... 'వృద్ధులు ఆనందంకోసం వెతుక్కునే ఉమ్మడి కుటుంబాలే ఓల్డ్ ఏజ్ హోమ్'లని.



### తేలికైన వ్యాయామాలతో
## దీర్ఘాయుష్షు!

వయోధికులు, మధ్య వయసువారిలో శారీరక శ్రమతో కూడిన హాబీలతో ఆయుష్షు పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. డ్యాన్సింగ్, సైక్లింగ్, తోటపని, నడక, ఈత.. లాంటివి ఈ కోవకు చెందుతాయి. పనిలో భాగంగా కాకుండా.. తీరిక వేళల్లో చేసే శారీరక శ్రమతో మెదడు, గుండె ఆరోగ్యం మెరుగవుతుందని అనేక అధ్యయనాల్లో వెల్లడైంది. వీటితో ప్రాణాపాయ వ్యాధుల నుంచి చాలావరకూ రక్షించుకోవచ్చని చైనాలోని షాన్‌డాంగ్ యూనివర్సిటీ, అమెరికాలోని టెక్సాస్, మిన్నెసోటా యూనివర్సిటీల సంయుక్త పరిశోధనలో తేలింది. ఈ అధ్యయనం ప్రకారం వారంలో కొద్దిరోజులు పరిమిత స్థాయిలోనైనా హాబీ కోసం శారీరకంగా శ్రమించేవాళ్లకు గుండె జబ్బులు, క్యాన్సర్ తదితర ప్రాణాంతక సమస్యల నుంచి రక్షణ ఉంటుందట. అసలు ఎలాంటి వ్యాయామాలూ చేయనివారికంటే రోజులో కనీసం 5-10 నిమిషాలైనా 'లెజర్లీ ఫిజికల్ యాక్టివిటీ' చేసేవాళ్లకు అన్ని రకాలుగా మరణం సంభవించే అవకాశం 18 శాతం తక్కువట. రోజులో 20-40 నిమిషాలపాటు హాబీలతో మధ్య స్థాయి వ్యాయామం చేసినా మరణాన్ని 31 శాతం మేర ఆపొచ్చంటున్నారు. రోజులో మూడు గంటలు.. ఇష్టమైన గేమ్ ఆడటం, ఈత కొట్టడం, జాగింగ్, గార్డెనింగ్ లాంటి పనులు చేసేవారు మరణాన్ని 46 శాతం అడ్డుకోగలుతున్నారట. అయితే, వయసుతో పాటు హాబీగా చేసే శారీరక శ్రమ తగ్గుతోందనీ, మహిళల్లో ఇది ఇంకా తక్కువనీ మరో సర్వే చెబుతోంది. నిండునూరేళ్లూ హాయిగా బతకాలంటే శారీరక శ్రమతో కూడిన ఏదో ఒక హాబీని కొనసాగించండి.



మిస్ యూనివర్స్ కొరియా అందాల పోటీలు జరుగుతున్నాయి. వేదికపై మెరుపుతీగల్లాంటి యువతులతోపాటు 81 ఏళ్ల చోయీ సూన్ పోటీ పడ్డారు. కొరియా నుంచి 'మిస్ యూనివర్స్ కంటెస్టెంట్'గా నిలిచిన అత్యంత పెద్ద వయసు వ్యక్తిగా చరిత్ర సృష్టించారీమె. బెస్ట్ డ్రెస్సర్ అవార్డును అందుకున్నారు.

## 81 ఏళ్ల అందాల సుందరి!



'ప్రపంచాన్ని ఆశ్చర్యపోయేలా చేయాలన్నది నా లక్ష్యం' అని చెప్పే చోయీ 1943లో రెండవ ప్రపంచ యుద్ధసమయంలో జన్మించారు. జపాన్ వలస పాలన, యుద్ధ ప్రభావంతో దక్షిణకొరియాలోని మసాన్‌లో పెరిగిన ఆమె తీవ్ర పేదరికాన్ని ఎదుర్కొన్నారు. నర్సు శిక్షణ పూర్తిచేసి ఆసుపత్రిలో చేరారీమె. పాస్టర్‌గానూ సేవలందించారు. పెళ్లి, ఇద్దరు పిల్లలు, ఉద్యోగం.. చోయీ జీవితం సాఫీగానే ఉండేది. అనుకోని పరిణామాలతో 40 ఏళ్లప్పుడు భర్త నుంచి విడిపోయారు. ఒంటరిగానే పిల్లలను పెంచారు. తరవాత స్నేహితుడికి చేసిన ధన సాయం ఈమెను కష్టాలపాలు చేసింది. తిరిగి అతడు చెల్లించకపోయేసరికి సొంతిల్లు కూడా అమ్ముకుని పిల్లలతో రోడ్డుమీదకొచ్చారు.

**మోడల్‌గా రాణిస్తూ...**

'నేను చేసిన ఓ సాయంవల్ల నాతోపాటు నా పిల్లలూ పేదరికాన్ని అనుభవించాల్సి వచ్చింది. నా జీవితాన్ని తీర్చిదిద్దుకున్నా. ఫ్రీలాన్స్ కేర్ నర్సుగా చేరి రోగులకు సేవలందించేదాన్ని. ఓసారి విధుల్లో ఉన్నప్పుడు ఒక రోగి నావైపు చూస్తూ 'మీరు మోడల్‌గా ఎందుకు మారకూడద'ని అడిగింది. ఆ ప్రశ్న నన్ను ఆలోచించేలా చేసింది. కృత్రిమంగా అందాన్ని కాపాడుకుంటున్న ఈ కాలంలో సహజంగా వ్యాయామాలతో, పోషకవిలువలున్న ఆహారాన్ని తీసుకునే అలవాటు, మోడల్‌గా రాణించగలనే నమ్మకంతో ఈ రంగంలోకి అడుగుపెట్టాను. అయితే అప్పటికే నాకు 70 ఏళ్లు. అయినా ప్రయత్నం మానలేదు. మోడలింగ్ ఇనిస్టిట్యూట్‌లో చేరి ట్రైనింగ్ తీసుకుని, ఆ తర్వాత మోడల్‌గానూ విజయం సాధించా. అప్పులన్నీ తీర్చా'నని చెబుతున్న చోయి వారంలో మూడుసార్లు 40 నిమిషాలు నడవడం, దినసరి వ్యాయామం చేస్తారట. కొరియన్ శాఖాహార వంటకాలు సహా చేపలు, చికెన్ అంటే ఈమెకిష్టమట. 'సమస్య ఏదైనా మీకు మీరే జవాబుదారీగా ఉండాలని అందరికీ సలహా ఇస్తుంటా'నని చెబుతున్నారీ 81 ఏళ్ల సుందరి.

## బామ్మ మాట... బంగారు బాట!



మనసుకు నచ్చిన వ్యక్తి దూరమయ్యాడనీ, మార్కులు తగ్గాయనీ, పనిలో ఒత్తిడి... ఇలా అనేక కారణాలతో యువత ప్రాణాలు తీసుకుంటోంది. అలాగైతే ఊర్మిళ జమునాదాస్ ఆషర్ తనకెదురయ్యే సమస్యలకు ఎన్నోసార్లు చనిపోయి ఉండాలి. కానీ కష్టమెంత పెద్దదైనా ఎదురు నిలబడి పోరాడి మరీ జీవితాన్ని తీర్చిదిద్దుకున్నారు. ఆ ధైర్యమే లేటువయసులోనూ ఈమెను యూట్యూబ్ ఇన్‌ఫ్లుయన్సర్, సెలెబ్రిటీ షెఫ్, వ్యాపారవేత్త, టెడెక్స్ స్పీకర్‌గా గుర్తింపునిచ్చింది. నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్న 77ఏళ్ల ఊర్మిళ తన గురించి ఏం చెబుతున్నారంటే...

'మాది గుజరాత్. 17 ఏళ్లకు పెళ్లైంది. అయిదేళ్లలోపే ఇద్దరు మగపిల్లలు, పాప పుట్టారు. రెండేళ్లు నిండిన నా కూతురు డాబాపైనుంచి కిందపడిపోయి చనిపోయింది. మగపిల్లల్లో చేతికి అందివచ్చిన పెద్దోడు పాతికేళ్ల వయసులో మెదడు వ్యాధితో దూరమయ్యాడు. ఒక్కడైనా కళ్లెదుట ఉన్నాడని మనసుకు సర్ది చెప్పుకొన్నా. వాడికి పెళ్లై కొడుకు పుట్టాడు. అంతలోనే అనారోగ్యంతో నా చేతుల్లోనే మూడో అబ్బాయి కూడా ప్రాణాలొదిలాడు. ప్రపంచమంతా శూన్యంగా కనిపించింది. నా కోడలు బాగోగుల్నీ, మనవడు హర్షానూ పెంచాల్సిన బాధ్యత నామీదే ఉందని గుర్తించా. ఓసారి రోడ్డు ప్రమాదానికి గురై వాడికి పైపెదవి కట్ అయ్యింది. సర్జరీ తర్వాత తన ముఖకవళికలు మారిపోయాయంటూ తీవ్ర కుంగుబాటుకు గురై, బయటికెళ్లడం మానేశాడు. వాడు పెదవిని మాత్రమే కోల్పోయాడు. కానీ పిల్లలందరినీ కోల్పోయినా జీవితంలో ధైర్యంగా నిలబడిన నన్ను ఉదాహరణగా వాడికి చూపించా. రకరకాల స్నాక్స్, పచ్చళ్లతో దుకాణం ప్రారంభించేలా చేశా. ఏడాది తిరక్కుండానే అమ్మకాలు పెరిగాయి.

**కొవిడ్‌లో...**

లాక్‌డౌన్‌లో మా మనవడు వ్యాపారంలో నష్టపోయాడు. అప్పుడే తన సలహామేరకు యూట్యూబర్‌నయ్యా. 'గుజ్జుబెన్నా కా నాశ్తా' ఛానెల్ ప్రారంభించి, వంటల వీడియోలు అప్‌లోడ్ చేసేవాళ్లం. ఏడాదిలోనే రెండున్నర లక్షలమంది సబ్‌స్క్రైబర్లతో యూట్యూబ్ నుంచి సిల్వర్ బటన్ అందుకున్నా. అలాగే మా చుట్టుపక్కల ఉన్న పెద్దపెద్ద సొసైటీలకు తిరిగి, డోర్ డెలివరీలో ఆహారాన్ని అందిస్తామని చెప్పాం. ఇప్పుడు ఆ ప్రాంతాలవారంతా మా వినియోగదారులయ్యారు. అలాగే క్లౌడ్ కిచెన్‌తో ఆర్డర్లు అందుకుంటూ వ్యాపారవేత్తనయ్యా. దీనిద్వారా మరికొందరు మహిళలకు ఉపాధినీ కల్పిస్తున్నా. పనిచేస్తూ ప్రతి క్షణాన్ని ఆస్వాదించడమే నా ఎనర్జీ రహస్యం' అని చెప్పే ఊర్మిళ టెడెక్స్ స్పీకర్‌గా స్ఫూర్తి ప్రసంగాలూ ఇస్తున్నారు. మాస్టర్‌షెఫ్ షోలో పాల్గొని టాప్16లో నిలిచి జడ్జిల ప్రశంసలూ అందుకున్నారు.

> మన చిన్నతనంలో తల్లిదండ్రులు ఓపిగ్గా ఉన్నారు... ప్రస్తుతం వాళ్లు వృద్ధాప్యంలో ఉన్నారు. ఓపిగ్గా ఉండడం ఇప్పుడిక మన వంతు.

> పెద్దవాళ్లను ప్రేమించండి.. గౌరవించండి... ఎందుకంటే మీరు కూడా పెద్దవాళ్లు అయిపోతున్నారన్న విషయం గుర్తుంచుకోండి.

## సంతోషం కోసం చేసేయండి!



వృద్ధాప్యంలో ఒంటరితనం వేధిస్తుంది. ఈ సమయంలో సరైన తోడు, వ్యాపకం లేకపోతే అనారోగ్యాలు త్వరగా మీదపడతాయి. ఈ పరిస్థితి రాకుండా విదేశాల్లో అయితే వీరికోసం యాక్టివిటీ క్లాసులు, హాబీ తరగతులూ నిర్వహిస్తారు. కానీ, మన దగ్గర ఇలాంటివి తక్కువే. ఇప్పుడిప్పుడే అవగాహన పెరుగుతోంది. దాంతో పెద్దలకోసం యాక్టివిటీ కిట్‌లూ మార్కెట్‌లో దొరుకుతున్నాయి. వీటిని తెచ్చుకుంటే నచ్చిన పెయింటింగ్‌లు వేసేయొచ్చు. ఊలుతో స్వెటర్లు, మఫ్లర్లు...వంటివి అల్లేయొచ్చు. రంగులు, బ్రష్‌లు, ఊలు, సూది, డిజైను, ఫ్రేమ్... వంటివన్నీ ఇందులోనే ఉంటాయి. 'అబ్బా నాకు వీటిమీద ఆసక్తి లేదు' అంటారా ఎంచక్కా తోటపని చేసేందుకు వీలుగా పరికరాలు, విత్తనాలు, మందులు, ఎరువులు... ఇలా అన్నింటితో కలిపి గార్డెనింగ్ కిట్‌లూ దొరుకుతున్నాయి. వీటిల్లో నచ్చింది ఎంచుకుని ఎంచక్కా సమయాన్ని సంతోషంగా గడిపేయొచ్చు. దీనివల్ల ఆరోగ్యమూ బాగుంటుంది. అల్జీమర్స్ కూడా అదుపులో ఉంటుందని చెబుతారు వైద్యులు. మరి ఇంకెందుకాలస్యం... మొదలుపెట్టేయండి.



## పెద్దవారికి... చిన్న సాయాలు!

**వృద్ధాప్యాన్ని రెండో బాల్యంగా చెబుతాం. బుడిబుడి అడుగులేసే పిల్లల్లా వారికీ సాయం కావాలి. లోకంతో పరిచయం చేస్తూ సరికొత్త విషయాలెన్నో నేర్పాలి. గాయాల పాలవకుండా జాగ్రత్తగా కనిపెట్టుకోవాలి. అందుకు సాయపడేవే ఇవి...**

### బెల్ కొట్టినా భయం లేదిక!

ఉద్యోగాల రీత్యా బిడ్డలు ఒకచోటే... వయసు మళ్లిన తల్లిదండ్రులు మరోచోట నివసిస్తున్నారు. అసలే వయోభారం, దీనికితోడు అనారోగ్యాలు వారిని వేధిస్తుంటాయి. అందుకే, ఎవరైనా తలుపు తట్టినా వెంటనే వెళ్లి తీయలేరు. అకస్మాత్తుగా ఎవరైనా దాడి చేసినా ఆపలేరు. ఇలాంటి నిస్సహాయత అపరిచితులకు ఆసరా అవుతుంది. అలాకాకూడదంటే... ఇంటికి స్మార్ట్‌బెల్‌ని ఏర్పాటు చేసుకుంటే సరి. తలుపు తీయడానికి ముందే... బయట ఎవరున్నారో ఫోనులో చూసుకోవచ్చు. ఒకవేళ పరిచయస్థులే వచ్చినా హడావుడిగా వెళ్లి డోర్ తీయలేకపోయినా ఇబ్బందేం లేదు. ఫోన్‌లో పాస్‌కోడ్ కొట్టి తెరవచ్చు. లేదంటే ఇతర కుటుంబ సభ్యులు ఎవరైనా కూడా స్మార్ట్‌లాక్ ద్వారా అన్‌లాక్ చేయొచ్చు. ఇంతేకాదు, వయసు పెరిగి... డోర్ బెల్ కొట్టినా వినిపించడం లేదనే వారికోసం ఫోన్, ట్యాబ్లెట్‌లో నోటిఫికేషన్ వస్తుంది. దాన్ని చూసి అలర్ట్ అయిపోవచ్చు.




### నొప్పుల నుంచి ఉపశమనం!

వయసు పెరిగేకొద్దీ కీళ్ల నొప్పులు, కాళ్లు పట్టేయడం వంటి సమస్యలతో అడుగేయడానికీ ఇబ్బంది పడుతుంటారు. కాస్త కాళ్లు పట్టినా ఎంత హాయిగా ఫీలవుతారో. అన్నిసార్లూ మనకు ఓపిక ఉండదు, వీలూ చిక్కదు. అరె ఆ కాస్త సాయమూ చేయలేకపోతున్నామే అని బాధపడుతున్నారా? అయితే 'ఎయిర్ ప్రెజర్ లెగ్ మసాజర్' కొనివ్వండి. కొన్ని పాదాల దగ్గర్నుంచి తొడల వరకూ తొడుగులా వస్తాయి. కొన్ని మడమల దగ్గరకు ఉన్నవే ఉంటాయి. ఇవి వెచ్చదనం అందించడంతోపాటు మసాజ్‌నీ చేస్తాయి. వేడికి కావాల్సినంతగా అమర్చుకునే వీలుంటుంది. నొప్పిని తగ్గిస్తూనే రక్తప్రసరణను మెరుగుపరిచి కండరాలకు విశ్రాంతినిస్తాయి. వైర్ల జంజాటమేమీ ఉండదు. ఒకే చోట కూర్చొని ఉండాలనీ లేదు. పనిచేసుకుంటూ కూడా పెట్టుకోవచ్చు. ఛార్జింగ్ పెట్టుకుంటే సరిపోతుంది. కావాల్సిన చోటికి సులభంగా తీసుకెళ్లొచ్చు.






### దెబ్బలు తగలకుండా...

వయసు పైబడిన మహిళలకు చాలావరకు గాయాలు ఆకస్మికంగా పడిపోవడం వల్ల జరుగుతుంటాయి. అలాకాకుండా పెద్దవాళ్లను రక్షించుకోవడం కోసం ఈ 'యాంటీ ఫాల్ ఎయిర్‌బ్యాగ్ సూట్'ని తీసుకురండి. దీంతో వాళ్ల కింద పడ్డా కూడా తల, ఛాతీ, భుజాలు, నడుము, కటి వలయాల్లో దెబ్బలు తగలకుండా కాపాడొచ్చు. దీన్లో కాంతివేగంతో పనిచేసే రక్షణ వ్యవస్థ ఉంటుంది. ఇందులోని ఎయిర్‌బ్యాగ్ 0.1సెకన్లలోనే తెరుచుకుంటుంది. నైలాన్ ఫ్యాబ్రిక్‌తో చేసిన ఇది వాటర్‌ప్రూఫ్, వేసుకోవడానికి తేలిగ్గానూ ఉంటుంది. రీయూజబుల్ కూడా. హీలియం వాయువును నింపితే, దీన్ని తిరిగి వాడుకోవచ్చు. ప్రయత్నించి చూడండి.

### చీకటిలో... సాయంగా!

రాత్రిపూట ఇబ్బందిపడతారని కాస్త ఎక్కువ వెలుతురునిచ్చే లైటు వేసి ఉంచితే... ఆ వెలుగుకు నిద్ర పట్టట్లేదు అంటారు. పోనీ డిమ్ లైట్‌ని ఉంచితే మసక వెలుతురులో కనిపించక దేనికోదానికి తగలడం, కిందపడటం... పెద్దవాళ్లు ఉన్న ఇంట్లో ఇవన్నీ మామూలే కదా! ఈ 'మోషన్ సెన్సర్ మాగ్నెటిక్ బెడ్ ల్యాంప్'ని తెచ్చివ్వండి. దీన్ని వాళ్ల మంచం పక్కన ఉంచడమో గోడకి అతికించడమో చేయొచ్చు. లైట్‌స్టిక్... హోల్డర్‌కి అయస్కాంతంతో అతికి ఉంటుంది. కాబట్టి, ఎక్కడికి వెళ్లాలన్నా ఆ లైట్‌ని చక్కగా వెంట తీసుకెళ్లొచ్చు. బరువూ తక్కువే. మామూలుగా తక్కువ కాంతితోనే ఉంటుంది. దాన్ని పట్టుకుని కదలడం మొదలుపెట్టగానే కాంతి పెరుగుతుంది. కాబట్టి, చీకటిలో పడిపోతారన్న భయం ఉండదు. బాగుంది కదా!




అశ్విన్ 2/45

# చాంపియన్స్

3 ఓవర్లకే 50 పరుగులు.. టీ20ల్లోనే తక్కువగా కనిపించే దృశ్యమిది. 10.1 ఓవర్లలో 100.. 18.2 ఓవర్లలో 150.. 24.2 ఓవర్లలో 200.. 30.1 ఓవర్లలో 250!

స్కోరేమో రాకెట్ వేగంతో దూసుకెళ్తోంది.. టీ20 ఆడుతున్నారేమో అనుకుంటే ఆటగాళ్లు తెల్ల దుస్తుల్లో ఉన్నారు. బంతి ఎరుపు రంగులో ఉంది. ఇది టెస్టు మ్యాచే. కానీ దీన్నే టీ20లా మార్చి టీమ్‌ఇండియా బ్యాటర్లు చెలరేగిపోయారు. బంగ్లా బౌలర్లను ఊచకోత కోశారు.. రికార్డుల దుమ్ము దులిపారు!

శుక్రవారం మొదలైన మ్యాచ్‌లో ఆ రోజు ఆట సగం కూడా సాగలేదు. వర్షంతో శని, ఆదివారాలు ఆట తుడిచిపెట్టుకుపోయింది. మిగిలిన రెండు రోజులు ఆడినా డ్రా అవకాశాలే ఎక్కువ. కాదు గెలవాలంటే అసాధారణ ప్రదర్శన చేయాల్సిందే. బంగ్లాతో రెండో టెస్టులో భారత్ అదే చేసింది. టెస్టు ఆడుతున్నామనే సంగతి మర్చిపోయారేమో అనిపించేలా.. ఇంగ్లాండ్ బజ్‌బాల్‌ను తలదన్నేలా.. రికార్డులు గల్లంతయ్యేలా మన బ్యాటర్లు వీర విధ్వంసం సృష్టించారు.

రెండు రోజుల ఆట లేదని నిరాశ పడ్డ అభిమానులకు కిక్కు అందిస్తూ.. రోహిత్ సేన అదరగొట్టింది. 285/9కే ఇన్నింగ్స్ డిక్లేర్ చేసి.. ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టింది. చివరి రోజైన మంగళవారం భారత్ ఇదే ప్రదర్శన కొనసాగిస్తే గెలుపు పక్కా!


## కసిగా దంచేసి..

## చెలరేగిన భారత బ్యాటర్లు ● రికార్డులు బద్దలు

# గెలుపుపై కన్నేసి

- రెచ్చిపోయిన యశస్వి, రాహుల్

34.4 ఓవర్లలోనే 285/9 డిక్లేర్డ్


జైస్వాల్ 72 | కోహ్లి 47

కాన్పూర్

ఒక్క రోజులో ఎంత ఊపు. టెస్టు క్రికెట్లో కిక్కిచ్చే మజా. బంగ్లాదేశ్‌తో డ్రాగా ముగిసేలా కనిపించిన రెండో టెస్టులో భారత్ గెలుపు అవకాశాలు సృష్టించుకుంది. ప్రత్యర్థిని త్వరగా ఆలౌట్ చేసి.. ఆపై విధ్వంసక బ్యాటింగ్‌తో ఆధిక్యం సంపాదించి.. మరోసారి బంగ్లా పనిపట్టే దిశగా టీమ్‌ఇండియా సాగుతోంది. సోమవారం ఆట చివరకు రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా 26/2తో నిలిచింది. ఆ జట్టు ఇంకా 26 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు భారత్‌కు 52 పరుగుల ఆధిక్యం దక్కింది. టీమ్‌ఇండియా కేవలం 34.4 ఓవర్లలోనే 285/9 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. 8.22 రన్‌రేట్‌తో ఈ పరుగులు సాధించడం విశేషం. యశస్వి జైస్వాల్ (72; 51 బంతుల్లో 12×4, 2×6), కేఎల్ రాహుల్ (68; 43 బంతుల్లో 7×4, 2×6), కోహ్లి (47; 35 బంతుల్లో 4×4, 1×6) టీ20 తరహాలో రెచ్చిపోయారు. ప్రత్యర్థి స్పిన్నర్లు మెహిదీ హసన్ (4/41), షకిబ్ అల్ హసన్ (4/78) మెరిశారు. నాలుగో రోజు ఉదయం ఓవర్‌నైట్ స్కోరు 107/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 233 పరుగులకు ఆలౌటైంది. మొమినుల్ హక్ (107 నాటౌట్; 194 బంతుల్లో 17×4, 1×6) అజేయ శతకంతో పోరాడాడు. బుమ్రా (3/50), సిరాజ్ (2/57), అశ్విన్ (2/45), ఆకాశ్ దీప్ (2/43) రాణించారు.

**ఏమా బాదుడు!:** గ్రీన్‌పార్క్ స్టేడియంలో శని, ఆదివారాల్లో వర్షం పడింది. సోమవారం మాత్రం సునామీ వచ్చింది. ఇది సముద్రంలో రేగిన అలజడి కాదు.. మైదానంలో భారత బ్యాటర్ల ఊచకోతకు ఫలితం. చూస్తుండగానే స్కోరు 50, 100, 150, 200, 250 దాటిపోయింది. ఈ బాదుడుకు శ్రీకారం చుట్టింది మాత్రం జైస్వాల్. తొలి ఓవర్లోనే హ్యాట్రిక్ ఫోర్లతో దంచుడు మొదలెట్టాడు. మరో ఎండ్‌లో రోహిత్ కూడా తగ్గలేదు. వరుసగా రెండు సిక్సర్లతో పరుగుల వేట ఆరంభించాడు. 3 ఓవర్లకే స్కోరు 50. ఈ జోరుకు కళ్లెం వేసేందుకు బంగ్లా స్పిన్నర్‌ను దించింది. తొలి 7 బంతుల్లో 23 పరుగులు చేసిన రోహిత్.. మెహిదీ వేసిన బంతి తక్కువ ఎత్తులో వచ్చి స్టంప్స్‌ను లేపేయడంతో పెవిలియన్ చేరాల్సి వచ్చింది. వికెట్ పడ్డా ఇన్నింగ్స్ వేగం ఏ మాత్రం తగ్గలేదు. శుభ్‌మన్ (39)తో కలిసి జైస్వాల్ బౌండరీలకు గురిపెట్టాడు. 31 బంతుల్లోనే అతను అర్ధశతకం పూర్తిచేశాడు. స్వీప్, రివర్స్ స్వీప్, లాఫ్టెడ్, కట్, డ్రైవ్.. ఇలా మైదానంలో అన్నివైపులా జైస్వాల్ షాట్లు కొట్టాడు. 11వ ఓవర్లోనే జట్టు స్కోరు 100 దాటింది. కానీ శతకం దిశగా సాగుతున్న జైస్వాల్ తక్కువ ఎత్తులో వచ్చిన బంతికి బౌల్డయ్యాడు. వేగం కొనసాగించడానికి కోహ్లి కంటే ముందే బ్యాటింగ్‌కు వచ్చిన పంత్ (9) విఫలమవడం, శుభ్‌మన్ నెమ్మదించడంతో జోరు కాస్త తగ్గింది.

**ఆ ఇద్దరు కలిసి..:** టీ విరామం తర్వాత శుభ్‌మన్, పంత్‌ను షకిబ్ వరుస ఓవర్లలో ఔట్ చేయడంతో భారత్‌కు బ్రేక్ వేశామని బంగ్లా సంతోషపడే ఉంటుంది. కానీ కోహ్లి, రాహుల్ కలిసి ప్రత్యర్థికి ఆ అవకాశమే ఇవ్వలేదు. బౌలర్ ఎవరైనా సరే బాదడమే లక్ష్యంగా ఈ జోడీ బ్యాటింగ్ కొనసాగించింది. ఆరంభంలో రనౌట్ ప్రమాదం నుంచి తప్పించుకున్న కోహ్లి.. తైజుల్ బౌలింగ్‌లో చూడముచ్చటైన సిక్సర్ కొట్టాడు. మరో ఎండ్‌లో రాహుల్ నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. స్పిన్నర్లను వీళ్లు ఊడ్చేశారు. 28వ ఓవర్లోనే భారత్ ఆధిక్యం సంపాదించింది. రాహుల్ 33 బంతుల్లోనే అర్ధశతకం చేరుకున్నాడు. కానీ ఆ తర్వాత స్పిన్నర్లు షకిబ్, మెహిదీ భారత్‌ను దెబ్బకొట్టారు. అర్ధశతకం ముంగిట కోహ్లీని బౌల్డ్ చేసిన షకిబ్.. 87 పరుగుల (59 బంతుల్లో) అయిదో వికెట్ భాగస్వామ్యాన్ని విడగొట్టాడు. అక్కడి నుంచి వరుసగా వికెట్లు పడ్డాయి. రాహుల్, రెండు సిక్సర్లు కొట్టిన ఆకాశ్ దీప్ (12)ను మెహిదీ ఒకే ఓవర్లో ఔట్ చేయడంతో భారత్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. మిగిలిన ఓవర్లలో వికెట్లు పడగొట్టి బంగ్లాను ఒత్తిడిలోకి నెట్టేందుకు ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన భారత్ అనుకున్న ఫలితాన్ని పొందింది. రెండో ఇన్నింగ్స్‌లో వరుస ఓవర్లలో జాకిర్ (10), హసన్ (4)లను అశ్విన్ (2/14) ఔట్ చేశాడు. షాద్మన్ (7 బ్యాటింగ్), మొమినుల్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.


జడేజా

**అతని పోరాటం:** అంతకుముందు వర్షం కారణంగా రెండు రోజుల విరామం తర్వాత తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు హడలెత్తించారు. మొమినుల్ (ఓవర్‌నైట్ స్కోరు 40), ముష్ఫికర్ రహీం (ఓవర్‌నైట్ స్కోరు 6)ను ఓ వైపు నుంచి బుమ్రా, మరో ఎండ్ నుంచి ఆకాశ్‌దీప్ భయపెట్టారు. ఓ అద్భుతమైన ఇన్‌స్వింగర్‌తో ముష్ఫికర్ (11)ను బుమ్రా బౌల్డ్ చేశాడు. ఈ దశలో మొమినుల్ పట్టుదలతో నిలబడ్డాడు. కానీ రోహిత్, సిరాజ్ పట్టిన సూపర్ క్యాచ్‌లకు వరుసగా లిటన్ (13), షకిబ్ (9) పెవిలియన్ చేరడంతో బంగ్లా 170/6తో కష్టాల్లో పడింది. తర్వాత మెహిదీ (20) జతగా మొమినుల్ పోరాటం కొనసాగించాడు. లంచ్ తర్వాత 28 పరుగుల వ్యవధిలోనే బంగ్లా ఇన్నింగ్స్‌కు తెరపడింది. బుమ్రా.. వరుస ఓవర్లలో మెహిదీ, తైజుల్ (5)ను ఔట్ చేశాడు. చివరి బ్యాటర్ ఖలెద్ (0)ను పెవిలియన్ చేర్చిన జడేజా (1/28) 300వ టెస్టు వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు.

**3** టెస్టుల్లో 3000 పరుగులు, 300 వికెట్లు సాధించిన భారత ఆటగాళ్లలో జడేజా స్థానం. కపిల్ దేవ్, అశ్విన్ ముందున్నారు. ఓవరాల్‌గా ప్రపంచ క్రికెట్లో జడేజాది 11వ స్థానం. మ్యాచ్‌ల పరంగా అత్యంత వేగంగా ఈ ఘనత అందుకున్న ఆటగాళ్లలో ఇయాన్ బోథం (72) తర్వాత రెండో స్థానంలో జడేజా (74) ఉన్నాడు.

**1** వరుసగా మూడు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌ల్లోనూ 50కి పైగా వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్‌గా అశ్విన్ నిలిచాడు. 2019–21లో 71, 2021–23లో 61 వికెట్లు తీసిన అశ్విన్.. 2023-25లో 52 వికెట్లకు చేరుకున్నాడు. ఈ డబ్ల్యూటీసీలో అతనే అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

**18** 50 పరుగులకు భారత్ ఆడిన బంతులు. టెస్టుల్లో అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన జట్టుగా భారత్ నిలిచింది. ఈ ఏడాది వెస్టిండీస్‌పై ఇంగ్లాండ్ రికార్డు (26 బంతుల్లో) బద్దలైంది. అలాగే టెస్టు ఇన్నింగ్స్‌లో అతి తక్కువ ఓవర్లలో 100 (10.1 ఓవర్లు), 150 (18.2), 200 (24.2), 250 (30.1) పరుగులు సాధించిన జట్టుగా టీమ్‌ఇండియా చరిత్ర సృష్టించింది. గత రికార్డులను (2023లో వెస్టిండీస్‌పై భారత్ 12.2 ఓవర్లలో 100, 2023లో వెస్టిండీస్‌పై భారత్ 21.1 ఓవర్లలో 150, 2017లో పాకిస్థాన్‌పై ఆస్ట్రేలియా 28.1 ఓవర్లలో 200, 2022లో పాకిస్థాన్‌పై ఇంగ్లాండ్ 34 ఓవర్లలో 250) తిరగరాసింది.

### కోహ్లి @ 27000

అంతర్జాతీయ క్రికెట్లో 27 వేల పరుగుల మైలురాయిని చేరుకున్న నాలుగో ఆటగాడిగా విరాట్ కోహ్లి ఘనత సాధించాడు. కెరీర్‌లో ఎన్నో చిరస్మరణీయ ప్రదర్శనలు చేసిన అతడు.. ఇప్పటివరకు 194 టెస్టు ఇన్నింగ్స్‌ల్లో 8918 పరుగులు సాధించాడు. ఇందుల్లో 29 శతకాలు, 30 అర్ధశతకాలు ఉన్నాయి. కోహ్లి 295 వన్డేల్లో 50 సెంచరీలు, 72 అర్ధసెంచరీలతో 13,906 చేశాడు. అలాగే 125 టీ20ల్లో 4188 పరుగులు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్లో అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో సచిన్ (34,357), సంగక్కర (28,016), పాంటింగ్ (27,483) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. కోహ్లి అతి తక్కువ ఇన్నింగ్స్‌ల్లో (594) ఈ ఘనత సొంతం చేసుకున్నాడు. సచిన్ (623)ను అతడు అధిగమించాడు.

**బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్:** జాకిర్ (సి) జైస్వాల్ (బి) ఆకాశ్ 0; షాద్మన్ ఎల్బీ (బి) ఆకాశ్ 24; మొమినుల్ నాటౌట్ 107; నజ్ముల్ ఎల్బీ (బి) అశ్విన్ 31; ముష్ఫికర్ (బి) బుమ్రా 11; లిటన్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 13; షకిబ్ (సి) సిరాజ్ (బి) అశ్విన్ 9; మెహిదీ (సి) గిల్ (బి) బుమ్రా 20; తైజుల్ (బి) బుమ్రా 5; హసన్ ఎల్బీ (బి) సిరాజ్ 1; ఖలెద్ (సి) అండ్ (బి) జడేజా 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం:** (74.2 ఓవర్లలో ఆలౌట్) **233; వికెట్ల పతనం:** 1-26, 2-29, 3-80, 4-112, 5-148, 6-170, 7-224, 8-230, 9-231; **బౌలింగ్:** బుమ్రా 18-7-50-3; సిరాజ్ 17-2-57-2; అశ్విన్ 15-1-45-2; ఆకాశ్ దీప్ 15-6-43-2; జడేజా 9.2-0-28-1

**భారత్ తొలి ఇన్నింగ్స్:** యశస్వి (బి) హసన్ 72; రోహిత్ (బి) మెహిదీ 23; శుభ్‌మన్ (సి) హసన్ (బి) షకిబ్ 39; పంత్ (సి) హసన్ (బి) షకిబ్ 9; కోహ్లి (బి) షకిబ్ 47; రాహుల్ (స్టంప్డ్) లిటన్ (బి) మెహిదీ 68; జడేజా (సి) నజ్ముల్ (బి) మెహిదీ 8; అశ్విన్ (బి) షకిబ్ 1; ఆకాశ్‌దీప్ (సి) ఖలెద్ (బి) మెహిదీ 12; బుమ్రా నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం:** (34.4 ఓవర్లలో 9 వికెట్లకు) **285 డిక్లేర్డ్; వికెట్ల పతనం:** 1-55, 2-127, 3-141, 4-159, 5-246, 6-269, 7-272, 8-284, 9-285; **బౌలింగ్:** హసన్ మహ్మూద్ 6-0-66-1; ఖలెద్ 4-0-43-0; మెహిదీ హసన్ 6.4-0-41-4; తైజుల్ ఇస్లాం 7-0-54-0; షకిబ్ 11-0-78-4

**బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్:** షాద్మన్ బ్యాటింగ్ 7; జాకిర్ ఎల్బీ (బి) అశ్విన్ 10; హసన్ (బి) అశ్విన్ 4; మొమినుల్ బ్యాటింగ్ 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం:** (11 ఓవర్లలో 2 వికెట్లకు) **26; వికెట్ల పతనం:** 1-18, 2-26; **బౌలింగ్:** బుమ్రా 3-1-3-0; అశ్విన్ 5-2-14-2; ఆకాశ్ దీప్ 3-2-4-0

**1** టీమ్‌ఇండియా ఇంత తక్కువ ఓవర్ల (34.4)లో, ఇంత తక్కువ స్కోరు (285/9)కు ఓ టెస్టు తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయడం ఇదే మొదటిసారి.

**8.22** భారత్ ఇన్నింగ్స్‌లో నమోదైన రన్‌రేట్. కనీసం 200 బంతులు ఆడిన టెస్టు ఇన్నింగ్స్‌లో ఇదే అత్యధిక రన్‌రేట్. గత రికార్డు ఇంగ్లాండ్ (2022లో పాకిస్థాన్‌పై 7.36) పేరు మీద ఉంది. 100కు పైగా పరుగులు నమోదైన ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో 8కి పైగా రన్‌రేట్ కలిగి ఉండటం ఇదే తొలిసారి.

**23** రోహిత్, యశస్వి తొలి వికెట్‌కు 55 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసేందుకు ఆడిన బంతులు. 14.34 రన్‌రేట్‌తో వీళ్లు ఈ పరుగులు సాధించారు. టెస్టుల్లో అత్యంత వేగంగా నమోదైన 50 పరుగుల భాగస్వామ్యం ఇదే.

**31** అర్ధశతకానికి జైస్వాల్ ఆడిన బంతులు. టెస్టుల్లో అత్యంత వేగంగా అర్ధశతకం చేసిన భారత బ్యాటర్లలో అతను మూడో స్థానంలో ఉన్న శార్దూల్ (2021లో ఇంగ్లాండ్‌పై) సరసన చేరాడు. పంత్ (2022లో శ్రీలంకపై 28 బంతుల్లో), కపిల్ (1982లో పాకిస్థాన్‌పై 30 బంతుల్లో) ముందున్నారు.

### వాహ్.. వాహ్


సిరాజ్


రోహిత్

బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో రోహిత్, సిరాజ్ ఒంటిచేత్తో అద్భుతమైన క్యాచ్‌లు అందుకున్నారు. సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ 50వ ఓవర్ నాలుగో బంతిని ఆడేందుకు ముందుకు వచ్చిన లిటన్.. మిడాఫ్ మీదుగా షాట్ కొట్టాడు. కానీ మిడాఫ్‌లో ఉన్న రోహిత్ టక్కున ఎగిరి తనను దాటి వెళ్లిపోతున్నట్లు కనిపించిన బంతిని కుడి చేత్తో పట్టుకున్నాడు. లిటన్ నమ్మశక్యం కానట్లు పెవిలియన్ బాట పట్టాడు. 37 ఏళ్ల వయసులో మెరుపు వేగంతో స్పందించి క్యాచ్ అందుకున్న రోహిత్ తన ఫిట్‌నెస్‌పై మరోసారి అదిరే సమాధానమిచ్చాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే అశ్విన్ (ఇన్నింగ్స్ 56వ) బౌలింగ్‌లో బ్యాట్‌పై నియంత్రణ కోల్పోయిన షకిబ్ చివరి బంతిని గాల్లోకి లేపాడు. ఎండ బాగా కాస్తుండటంతో గాల్లోకి ఎగిరిన బంతిని అంచనా వేయడం ఇబ్బంది అయినప్పటికీ.. మిడాఫ్ నుంచి వెనక్కి పరిగెడుతూ సిరాజ్ సంచలన క్యాచ్ అందుకున్నాడు. చివరి క్షణాల్లో గాల్లో వెనక్కి ఎగిరి.. కింద పడుతూ.. ఎడమ చేతి వేళ్లతో బంతిని ఒడిసిపట్టుకున్నాడు. అయితే ఫీల్డింగ్‌లో భారత్ కొన్ని అవకాశాలూ చేజార్చింది. బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో పంత్, కోహ్లి.. రెండో ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ క్యాచ్‌లు పట్టలేకపోయారు.

## అమ్మాయిల ఆట చూద్దాం రండి!

- మహిళల టీ20 ప్రపంచకప్ మరో 2 రోజుల్లో

ఈనాడు క్రీడావిభాగం



టీ20 ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా విజయంతో అభిమానుల సంబరాలు మిన్నంటాయి. కొన్ని నెలల పాటు ఆ కిక్కు కొనసాగింది. ఇప్పుడు అమ్మాయిల ధనాధన్‌కు రంగం సిద్ధమైంది. మహిళల టీ20 ప్రపంచకప్ గురువారమే ఆరంభం కాబోతోంది. గత కొన్నేళ్లలో బాగా వేగం పుంజుకుని ఆకర్షణీయంగా మారిన మహిళల క్రికెట్.. అభిమానుల దృష్టిని బాగానే ఆకర్షిస్తోంది. ముఖ్యంగా అమ్మాయిలు టీ20ల్లో తలపడితే స్టేడియాలు నిండిపోతున్నాయి. టీవీ సెట్ల ముందు కూడా సందడి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో యూఏఈ వేదికగా గురువారం మొదలయ్యే పోటీ కప్పు మీదా అభిమానులు అమితాసక్తి ప్రదర్శిస్తారనడంలో సందేహం లేదు. ఇప్పటిదాకా ఏ ఫార్మాట్లోనూ ప్రపంచకప్ సాధించలేకపోయిన భారత మహిళల జట్టు.. ఈసారి ఎలాగైనా కల నెరవేర్చుకోవాలనుకుంటోంది. 2020లో తొలిసారి టీ20 ప్రపంచకప్ ఫైనల్ చేరిన భారత్.. ఆస్ట్రేలియా చేతిలో పరాజయం చవిచూసింది. తమ దేశ పురుషుల జట్టును మించి క్రికెట్లో ఆధిపత్యం చలాయిస్తున్న ఆస్ట్రేలియా.. ఆరుసార్లు విజేతగా నిలవడం విశేషం. మరోసారి ఆ జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. కానీ మునుపెన్నడూ లేనంత బలంగా, ఆల్‌రౌండ్ నైపుణ్యంతో కనిపిస్తున్న భారత జట్టు స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే కప్పు గెలిచే అవకాశముంది. ఇంకా ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా జట్లు కూడా టైటిల్ ఫేవరెట్లే.

- ఇప్పటిదాకా జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్‌లు 8. ఆస్ట్రేలియా ఆరుసార్లు (2010, 2012, 2014, 2018, 2020, 2023) విజేతగా నిలిచింది. ఇంగ్లాండ్ (2009), వెస్టిండీస్ (2016) ఒక్కో టైటిల్ సాధించాయి.
- టోర్నీలో 10 జట్లు పోటీ పడుతున్నాయి. అయిదేసి జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి మిగతా జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడతాయి. రెండు గ్రూప్‌ల నుంచి లీగ్ దశలో టాప్-2 జట్లు సెమీస్‌కు వెళ్తాయి.
- టోర్నీకి దుబాయ్, షార్జా మైదానాలు ఆతిథ్యమిస్తున్నాయి. ఈ నెల 20న దుబాయ్‌లో ఫైనల్ జరుగుతుంది.
- గ్రూప్-ఎలో ఉన్న భారత్, పాకిస్థాన్ ఈ నెల 6న తలపడతాయి.

## ‘లక్ష్య’ శ్రీనివాస్, లక్ష్మికి రజతాలు


లక్ష్మి


శ్రీనివాస్

పట్నా: ఇండియన్ ఓపెన్ అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఈనాడు సీఎస్ఆర్ కార్యక్రమం ‘లక్ష్య’ క్రీడాకారులు నలుబోతు శ్రీనివాస్ (ఆంధ్రప్రదేశ్), గెమ్మెల లక్ష్మి (ఆంధ్రప్రదేశ్) రజత పతకాలతో మెరిశారు. సోమవారం జరిగిన పురుషుల 200 మీటర్ల పరుగులో శ్రీనివాస్ (21.29 సెకన్లు) ద్వితీయ స్థానం సాధించాడు. మహిళల లాంగ్ జంప్‌లో లక్ష్మి (5.91 మీటర్లు) రెండో స్థానంలో నిలిచి రజతం సొంతం చేసుకుంది.


గౌతమి | అజయ్

## భారత షూటర్లకు రెండు కాంస్యాలు

దిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు రెండు కాంస్య పతకాలు గెలుచుకున్నారు. పెరూ రాజధాని లిమాలో జరిగిన ఈ పోటీల్లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ విభాగం కాంస్య పతక పోరులో గౌతమి బానోత్-అజయ్ మలిక్‌లతో కూడిన భారత ద్వయం 17-9తో అనామార్జియా-డార్కో టామ్‌సెవిచ్ (క్రొయేషియా) జంటను ఓడించింది. అంతకుముందు క్వాలిఫికేషన్లో 628.9 పాయింట్లతో గౌతమి జంట మూడో స్థానంలో నిలిచింది. ఈ విభాగంలో చైనా, ఫ్రాన్స్ వరుసగా స్వర్ణ, రజత పతకాలు నెగ్గాయి. మిక్స్‌డ్ పిస్టల్ విభాగంలో లక్షిత-ప్రమోద్ జంట కంచు గెలుచుకుంది. కాంస్య పతక పోరులో లక్షిత జోడీ 16-8తో మరో భారత జంట కనిష్క దాగర్-ముకేశ్ నేలవల్లి ద్వయాన్ని ఓడించింది. ఈ పోటీలో జర్మనీ పసిడి గెలవగా.. ఉక్రెయిన్ రజతాన్ని సొంతం చేసుకుంది. ఇదే ఈవెంట్లో బరిలో దిగిన మరో భారత జంట అభినవ్ షా-శాంభవి ఆరో స్థానంతో సరిపెట్టుకుంది.

## సూర్యవంశీ అదుర్స్


సూర్యవంశీ

చెన్నై: వైభవ్ సూర్యవంశీ (81 బ్యాటింగ్; 47 బంతుల్లో 13×4, 2×6) అదరగొట్టడంతో ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో అనధికారిక టెస్టులో యువ భారత్ సత్తాచాటుతోంది. సోమవారం ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్-19 జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 293 పరుగులకు ఆలౌటైంది. రైలీ కింగ్సెల్ (53; 77 బంతుల్లో 9×4, 1×6), క్రిస్టియన్ హోవ్ (48; 89 బంతుల్లో 6×4), ఐడాన్ ఓకానర్ (61; 70 బంతుల్లో 7×4, 2×6) రాణించారు. యువ భారత్ బౌలర్లు సమర్థ్ నాగరాజ్ (3/49), ఆదిత్య రావత్ (2/50), మహ్మద్ ఇనాన్ (3/48) విజృంభించి ఆసీస్‌ను కట్టడి చేశారు. ఆట చివరికి భారత్ అండర్-19 జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 14 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 103 పరుగులు సాధించింది.

## శాఫ్ ఫుట్‌బాల్ విజేత భారత్

థింపు: శాఫ్ అండర్-17 ఫుట్‌బాల్ టోర్నమెంట్లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ విజేతగా నిలిచింది. సోమవారం ఫైనల్లో 2-0 గోల్స్‌తో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. తొలి అర్ధభాగంలో భారత్ గోల్స్ కొట్టలేకపోయింది. కానీ ద్వితీయార్ధంలో మహ్మద్ కైఫ్ తలతో బంతిని నెట్‌లోకి పంపి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. స్కోరు సమం చేయడానికి బంగ్లా ప్రయత్నించినా భారత్ సమర్థంగా అడ్డుకుంది. ఇంజురీ సమయంలో అర్బాష్ (95వ) గోల్ కొట్టి భారత్ విజయాన్ని ఖాయం చేశాడు.

## మాస్టర్స్ లీగ్‌లో ఆడనున్న సచిన్


సచిన్

ముంబయి: భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ తిరిగి బరిలోకి దిగనున్నాడు. ఈ ఏడాది జరిగే మొట్టమొదటి అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్ (ఐఎంఎల్)లో అతడు ఆడతాడు. ఐఎంఎల్‌లో భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, ఇంగ్లాండ్, శ్రీలంక ఆటగాళ్లు పాల్గొంటారు. ఆరు ఫ్రాంఛైజీలు పోటీ పడే ఈ లీగ్‌కు ముంబయి, లఖ్‌నవూ, రాయ్‌పుర్‌లు వేదికలు. సచిన్, సునీల్ గావస్కర్ కలిసి ఐఎంఎల్‌ను ప్రారంభిస్తున్నారు.

## ముంబయితో రెస్ట్ ఢీ

### నేటి నుంచి ఇరానీ ట్రోఫీ

ఉదయం 9.30 నుంచి

కాన్పూర్: ఇరానీ ట్రోఫీకి వేళైంది. మంగళవారం ఆరంభమయ్యే ఈ కప్‌లో రంజీ ఛాంపియన్ ముంబయితో రెస్ట్ ఆఫ్ ఇండియా తలపడనుంది. ముంబయికి రహానె.. రెస్ట్ ఆఫ్ ఇండియాకు రుతురాజ్ గైక్వాడ్ సారథ్యం వహించనున్నారు. బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో ఆడే అవకాశాన్ని దక్కించుకోలేకపోయిన సర్ఫరాజ్‌ఖాన్, ధ్రువ్ జురెల్, యశ్ దయాళ్‌లను విడుదల చేయడంతో వారు ఇరానీ ట్రోఫీలో ఆడుతున్నారు. సర్ఫరాజ్‌ఖాన్ ముంబయికి.. వికెట్‌కీపర్ జురెల్, లెఫ్టార్మ్ పేసర్ దయాళ్ రెస్ట్ ఆఫ్ ఇండియాకు ఆడనున్నారు.

## మరో పదేళ్లకు సరిపడా బలగముంది


లక్ష్మణ్

బెంగళూరు: అంతర్జాతీయ క్రికెట్లో మరో పదేళ్లు భారత్ ఆధిపత్యం చెలాయించడానికి కావాల్సినంత మంది ఆటగాళ్లు దేశంలో ఉన్నారని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (బీసీఈ) చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ అన్నాడు. “రాబోయే పదేళ్లు దేశం గర్వించేలా చేసే చాలామంది ఆటగాళ్లు మన దగ్గర ఉన్నారని ఆత్మవిశ్వాసంతో చెప్పగలను. పురుషుల్లోనే కాదు మహిళల క్రికెట్లో కూడా. అంతటి ప్రతిభ కలిగి ఉండటం మన అదృష్టం. ప్రతి ఏడాది కనీసం రెండు ఎ- జట్టు పర్యటనలు ఉండేలా చూసుకుంటున్నాం. ప్రపంచంలోని అన్ని పరిస్థితులపై అవగాహన, అనుభవం సంపాదించేందుకు ఈ పర్యటనలు ఉపయోగపడతాయి. మహిళల టీ20 ప్రపంచకప్ కోసం బీసీఈ శిక్షణ శిబిరంలో భారత జట్టు తీవ్రంగా శ్రమించింది. అమ్మాయిల సాధన, నిబద్ధత, పట్టుదలకు సాటిలేదు. వాళ్ల సన్నద్ధమైన విధానం నాకు గర్వంగా అనిపించింది” అని లక్ష్మణ్ చెప్పాడు.

## టైప్-1 మధుమేహానికి టాటా!

### తొలిసారి మూలకణ మార్పిడితో నయంచేసిన చైనా శాస్త్రవేత్తలు

**బీజింగ్:** టైప్-1 మధుమేహాన్ని నయం చేసేందుకు సరికొత్త చికిత్సా మార్గాన్ని కనుగొన్నట్లు చైనా శాస్త్రవేత్తలు ప్రకటించారు. మూలకణ మార్పిడితో ప్రపంచంలోనే తొలిసారిగా ఓ బాధితురాలిలో ఆ వ్యాధికి చెక్ పెట్టినట్లు తెలిపారు. దశాబ్ద కాలానికిపైగా టైప్-1 మధుమేహంతో బాధపడిన ఆమె.. తమ చికిత్స ముగిసిన రెండున్నర నెలల తర్వాత నుంచి ఇన్సులిన్ అవసరం లేకుండా సహజంగా రక్తంలో చక్కెర నిల్వలను నియంత్రించుకోగలుగుతున్నారని పేర్కొన్నారు. తియాంజిన్ ఫస్ట్ సెంట్రల్ హాస్పిటల్, పెకింగ్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఈ చికిత్సలో కీలక పాత్ర పోషించారు. 'సెల్' జర్నల్‌లో ఈ వివరాలు ప్రచురితమయ్యాయి.

**ఇప్పటిదాకా ఐలెట్ మార్పిడి..**

ఐలెట్ కణాల మార్పిడిని టైప్-1 మధుమేహానికి సమర్థ చికిత్సగా ఇప్పటివరకూ నిపుణులు భావిస్తూ వచ్చారు. క్లోమంలో ఉండే ఐలెట్ కణాలు ఇన్సులిన్, గ్లూకగాన్ వంటి హార్మోన్ల ఉత్పత్తి పనిని నిర్వర్తిస్తాయి. ఆ హార్మోన్లు రక్తంలోకి విడుదలై గ్లూకోజ్ స్థాయిల నియంత్రణకు దోహదపడతాయి. ఐలెట్ మార్పిడి విధానంలో.. తొలుత మృతుల (దాతల) క్లోమం నుంచి ఐలెట్ కణాలను సేకరిస్తారు. టైప్-1 మధుమేహ బాధితుల కాలేయంలో వాటిని ప్రవేశపెడతారు. దాతల కొరత కారణంగా ఈ చికిత్స అంతగా ఊపందుకోవడం లేదు.

**కొత్త విధానంలో..**

తాజాగా తాము అభివృద్ధి చేసిన మూలకణ విధానంతో మధుమేహ చికిత్సకు సరికొత్త ద్వారాలు తెరుచుకున్నాయని చైనా శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ విధానంలో.. టైప్-1 మధుమేహ బాధితుల నుంచి తొలుత అడిపోజ్ కణాలను సేకరిస్తారు. రసాయనిక ప్రక్రియలతో వాటిని ప్లూరీపొటెంట్ స్టెమ్ సెల్‌లు (మూలకణాలు)గా రీప్రోగ్రామ్ చేస్తారు. అనంతరం ఆ మూలకణాలను ఐలెట్ కణాలుగా మార్చి.. తిరిగి బాధితుల శరీరంలో ప్రవేశపెడతారు. వారి శరీరం నుంచి ఆవిర్భవించిన కణాలే కాబట్టి వాటిని రోగనిరోధక వ్యవస్థ తిరస్కరించే ముప్పు ఉండదు. నిరుడు జులైలో చైనా పరిశోధక బృందం ఈ మూలకణ మార్పిడి చికిత్సకు అనుమతి పొందింది. పాతికేళ్ల వయసున్న మధుమేహ బాధితురాలికి 30 నిమిషాల కంటే తక్కువ సమయంలోనే సంబంధిత శస్త్రచికిత్సను పూర్తిచేసింది. అప్పటికే రెండుసార్లు కాలేయ మార్పిడి, ఒకసారి ఐలెట్ మార్పిడి (విజయవంతం కాలేదు)



చేయించుకున్న ఆ బాధితురాలు.. మూలకణ చికిత్స తర్వాత దాదాపు సాధారణ స్థితికి వచ్చారు. శస్త్రచికిత్స జరిగిన 75 రోజుల తర్వాత ఆమె ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకోవడం పూర్తిగా మానేశారు. మరో రెండున్నర నెలలు ముగిసేసరికి.. 98%కు పైగా సమయం ఆమె రక్తంలో చక్కెర నిల్వలు నియంత్రణలో ఉంటూ వచ్చాయి. కాలేయంలోకి కాకుండా.. పొత్తికడుపు కండరాల్లోకి మూలకణాలను పంపించడంతో చికిత్స కోసం పెద్ద కోత పెట్టాల్సిన అవసరం కూడా రాలేదని శాస్త్రవేత్తలు వివరించారు.

జ్ఞాన నేత్రం

---

**కశ్మీర్‌లో**

## నేడు తుదిదశ సమరం

**జమ్మూ:** శాసనసభ ఎన్నికల సమరంలో చివరి దశ పోలింగ్ మంగళవారం జరగనుంది. జమ్మూ ప్రాంతంలో 24, కశ్మీర్ లోయలో 16 కలిపి మొత్తం 40 స్థానాల్లో బరిలో ఉన్న 415 మంది అభ్యర్థుల భవితను 39.18 లక్షల మంది ఓటర్లు తేల్చనున్నారు. 5,060 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిమిత్తం దాదాపు 20 వేల మంది సిబ్బందిని వినియోగించనున్నారు. 370 రాజ్యాంగ అధికరణం రద్దయిన తర్వాత ఓటు హక్కు పొందిన పశ్చిమ పాకిస్థాన్ శరణార్థులు, వాల్మీకి సమాజ్, గూర్ఖా తెగలవారు ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయబోతున్నారు.

***5న సాయంత్రం 6 తర్వాత ఎగ్జిట్ పోల్స్ వెల్లడి***

జమ్మూకశ్మీర్ ఎన్నికలపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలను అక్టోబరు 5న సాయంత్రం 6 గంటల తర్వాతే ప్రసారం చేయాలని అధికార వర్గాలు స్పష్టంచేశాయి. ఈ మేరకు ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం సోమవారం ప్రకటన విడుదల చేసింది.

---



***వేరొకరి జీవితాన్ని జీవించకండి***

మీరు ఇతరులు చేసే ప్రతి ప్రతిపాదనకూ మొహమాటంతో 'ఎస్' చెప్పుకొంటూ వెళ్తే మీది కాని జీవితాన్ని జీవించాల్సి వస్తుంది. అది ఎలా ఉంటుందంటే మారథాన్ పూర్తిచేయాలన్న వేరొకరి కోరిక కోసం మీరు పరిగెత్తడం లాంటిది. మీరు ఎంత పరిగెత్తినా మీకు ఫలితం ఉండకపోగా, క్రమంగా అది బాధాకరంగా మారుతుంది. అందుకే నో చెప్పడం నేర్చుకొని మీదైన జీవితాన్ని కొనసాగించండి.

– జియున్ లీ, బ్రాండ్ స్ట్రాటజిస్ట్

---

# సుదీర్ఘ యుద్ధానికి మేం సిద్ధం

- హెజ్‌బొల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ కాసిం ప్రకటన



నయీమ్ కాసిం

**బీరుట్:** ఇజ్రాయెల్‌తో సుదీర్ఘ యుద్ధానికి తాము సిద్ధమని హెజ్‌బొల్లా ప్రకటించింది. ప్రత్యర్థి భూతల దాడులు చేసినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపింది. సోమవారం హెజ్‌బొల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ నయీమ్ కాసిం టెలివిజన్‌లో ప్రసంగించాడు. అధినేత హసన్ నస్రల్లా మరణానంతరం హెజ్‌బొల్లా తొలి స్పందన ఇదే. మృతి చెందిన సీనియర్ కమాండర్ల స్థానాలను కొత్త వారితో భర్తీ చేశామని కాసిం తెలిపాడు. 'ఇజ్రాయెల్ భూతల దాడులను ప్రారంభించాలనుకుంటే.. అందుకు మేమూ సిద్ధమే. హెజ్‌బొల్లాలోని కీలక సైనిక కమాండర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు. కానీ అవి మా సైనిక సామర్థ్యాలను ప్రభావితం చేయలేకపోయాయి. చనిపోయిన కమాండర్ల స్థానంలో కొత్త వారిని భర్తీ చేశాం. మా ప్రాంతాలను రక్షించుకునేందుకు ఇజ్రాయెల్‌పై పోరాటం కొనసాగిస్తాం. మా సంస్థ సుదీర్ఘ యుద్ధానికి సిద్ధమైంది' అని హెజ్‌బొల్లా వ్యవస్థాపక సభ్యుడైన కాసిం పేర్కొన్నాడు. చాలాకాలం నుంచి నస్రల్లాకు డిప్యూటీగా కాసిం పని చేస్తున్నాడు. కొత్త నేతను ఎన్నుకునే వరకూ కాసిం తాత్కాలికంగా హెజ్‌బొల్లాకు నాయకత్వం వహించనున్నాడు.

***హమాస్ కీలక నేత హతం***

ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) సోమవారం లెబనాన్‌పై విరుచుకుపడింది. తెల్లవారుజామున రాజధాని బీరుట్‌లోని కోలా ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్ భవనంపై బాంబుల వర్షం కురిపించింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందినట్లు తెలుస్తోంది. కోలా ప్రాంతంలో జరిగిన దాడిలో తమ సంస్థకు చెందిన ముగ్గురు నాయకులు మరణించినట్లు 'పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ది లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా' ప్రకటించింది. లెబనాన్‌లోని టైర్ నగరంలో తమ అగ్రశ్రేణి కమాండర్ ఫతా షరీఫ్ చనిపోయినట్లు హమాస్ ప్రకటించింది. లెబనాన్‌లోని హమాస్ కార్యకలాపాలను షరీఫే పర్యవేక్షిస్తున్నారు. అయితే షరీఫ్ తమ ఉద్యోగి అని.. సెలవుపై ఉన్నాడని ఐక్యరాజ్య సమితికి చెందిన పాలస్తీనా శరణార్థి సంస్థ యూఎన్ఆర్‌డబ్ల్యూఏ ప్రకటించడం గమనార్హం.

### నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడిన మోదీ

**దిల్లీ:** లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు, హెజ్‌బొల్లా అధినేత నస్రల్లా హత్యతో పశ్చిమాసియాలో రోజురోజుకీ ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణపై మోదీ 'ఎక్స్‌'లో పోస్టు పెట్టారు. 'పశ్చిమాసియాలో చోటుచేసుకున్న ఇటీవలి పరిణామాలపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో మాట్లాడా. ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటులేదు. పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు భారత్ కట్టుబడి ఉంది' అని అందులో పేర్కొన్నారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

---

## ఆ విద్యార్థికి అడ్మిషన్ ఇవ్వండి

- ఐఐటీ ధన్‌బాద్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు
- రుసుం చెల్లించలేకపోయిన యువకుడికి ఊరట



అతుల్‌కుమార్

**దిల్లీ:** నిరుపేద దళిత విద్యార్థికి సర్వోన్నత న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. ప్రతిష్ఠాత్మక ఐఐటీలో ఇంజినీరింగ్ చేయాలన్న ఆ యువకుడి కల సాకారానికి అవకాశం ఏర్పడింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా టిటోరా గ్రామానికి చెందిన అతుల్‌కుమార్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు సాధించి ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు పొందాడు. సీటు ఖరారు చేసేందుకు జూన్ 24 లోపు రూ.17,500 రుసుం చెల్లించాలి. దినసరి కూలీలైన అతడి తల్లిదండ్రులు ఆ మొత్తాన్ని సమకూర్చలేకపోయారు. వారి నిస్సహాయతను చూసిన గ్రామస్థులు విరాళాలు వేసుకొని ఆ మొత్తం అందించినా గడువు ముగిసే చివరి రోజుల్లో సాంకేతిక కారణాలతో ధన్‌బాద్ ఐఐటీ ఆన్‌లైన్ పోర్టల్ పనిచేయలేదు. దీంతో అతుల్ ఆ మొత్తాన్ని సకాలంలో విద్యా సంస్థకు చెల్లించలేకపోయారు. సీటు వచ్చినట్టే వచ్చి చేజారింది. అనంతరం వ్యవహారం సర్వోన్నత న్యాయస్థానానికి చేరింది. సకాలంలో రూ.17,500 రుసుం చెల్లించలేక సీటు కోల్పోయిన ఆ విద్యార్థికి అడ్మిషన్ కల్పించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం సోమవారం ఐఐటీ ధన్‌బాద్‌కు ఆదేశాలిచ్చింది. ప్రతిభావంతుడైన యువకుడిని రుసుము విషయంలో సీటుకు దూరం చేయడాన్ని అనుమతించలేమని పేర్కొంది. బీటెక్‌లో అతను ఎంపికైన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లో సీటు ఇవ్వడంతో పాటు వసతి గృహం తదితర ప్రయోజనాలను కల్పించాలని స్పష్టంచేసింది.

---

## వర్ధమాన్ గ్రూప్ ఛైర్మన్‌కు రూ.7 కోట్ల టోకరా

- సైబర్ నేరస్థుల చేతిలో మోసపోయిన ఎస్పీ ఓస్వాల్



ఎస్పీ ఓస్వాల్

**లుధియానా:** వర్ధమాన్ గ్రూప్ ఛైర్మన్ ఎస్పీ ఓస్వాల్‌ను సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించి రూ.7 కోట్లు కాజేశారు. సీబీఐ అధికారులమంటూ నమ్మబలికి వారు ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు సోమవారం వెల్లడించారు. మలేసియాకు రవాణా అవుతున్న ఓ పార్సిల్‌లో 58 నకిలీ పాస్‌పోర్టులు, 16 డెబిట్ కార్డులు, మరికొన్ని అనుమానాస్పద వస్తువులను గుర్తించామని, వాటితో మీ ఆధార్ కార్డు జత చేసి ఉందంటూ సీబీఐ అధికారులుగా పరిచయం చేసుకున్న మోసగాళ్లు ఓస్వాల్‌కు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఓస్వాల్‌ను పేర్కొన్నామన్నారు. మీ గౌరవానికి భంగం కలగకుండా డిజిటల్ అరెస్టు చేస్తామని.. ఇలా సహకరిస్తున్నందుకు రూ.ఏడు కోట్లు ఇవ్వాలంటూ వీడియో కాల్ ద్వారా కోరారు. ఇదంతా నమ్మేసిన ఆయన నిందితులు కోరిన నగదును వారు పేర్కొన్న 2 బ్యాంకు ఖాతాలకు పంపారు. తర్వాత ఈ విషయాన్ని ఓస్వాల్ తన మేనేజర్‌కు వివరించగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మోసం బయటపడింది. లుధియానా సైబర్ క్రైం పోలీసులు నిందితులు అటాను చౌధరి, ఆనంద్ కుమార్ చౌధరిలను గువాహటిలో అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5.25 కోట్లను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మరో అయిదుగురు నిందితులున్నారని గుర్తించారు.

---

## అదానీ ఖాతాలోకి సునామీలా డబ్బు

- పేదల జేబులు మాత్రం ఖాళీ
- పారిశ్రామికవేత్తల కోసమే మోదీ సర్కారు: రాహుల్



**చండీగఢ్:** పారిశ్రామికవేత్తల కోసమే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతుంటే, పారిశ్రామికవేత్త గౌతం అదానీ ఖాతాలోకి మాత్రం డబ్బులు సునామీలా ప్రవహిస్తున్నాయని విమర్శించారు. దీనికోసం మహాభారతంలోని చక్రవ్యూహం లాంటిది మోదీ రూపొందించారని, పేదల డబ్బును కొద్దిమంది కుబేరుల చేతికి పంపడమే దీని ఉద్దేశమని ఆరోపించారు. ఈ చక్రవ్యూహం వెనుక మోదీ, అమిత్‌షా, అదానీ, అంబానీ, డోభాల్, మోహన్ భాగవత్ ఉన్నారని చెప్పారు. సోమవారం హరియాణాలోని అంబాలా, కురుక్షేత్ర జిల్లాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగించిన రాహుల్.. భాజపాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతులు, పేదలు, కార్మికుల ప్రయోజనాల కోసం కాంగ్రెస్; పారిశ్రామికవేత్తల కోసం భాజపా పనిచేస్తున్నాయని చెప్పారు. పేదలు, సామాన్య ప్రజల జేబుల నుంచి ఎక్కువ డబ్బు బయటకు పోతోందా, లోపలకు వస్తోందా అని ప్రశ్నించాలని ఓటర్లకు సూచించారు.

### మోదీ ప్రచారానికీ ఆయన డబ్బే

'అదానీ ఏ పొలంలో పనిచేయరు. దుక్కి దున్నరు. చిన్న వ్యాపారాలేవీ చేయరు. రోజులో 24 గంటలూ ఆయన ఖాతాలోకి డబ్బు వచ్చిపడుతూనే ఉంటుంది. పేదల ఖాతాల్లోంచి మాత్రం తుపానులా డబ్బు బయటకు పోతోంది. అగ్నివీర్ పథకమే దీనికి ఉదాహరణ. ఇందులో చేరిన సైనికులకు పింఛనే రాదు' అని రాహుల్ వివరించారు. "మోదీకి అదానీయే దేవుడు. ఆయన చెప్పిందంతా మోదీ చేస్తారు. వ్యాపారాలు, భూములు.. ఏది ఎంత కావాలన్నా ఇచ్చేస్తారు. ఇజ్రాయెల్, అమెరికా కంపెనీలు ఆయుధాలు తయారుచేస్తే అదానీ వాటిపై తన కంపెనీ లేబుల్‌ను ముద్రించుకుంటారు. 'అదానీ డిఫెన్స్' నుంచి మన సైన్యం వాటిని కొంటుంది. సంపాదించిన సొమ్ములో సగాన్ని ఓ రాజకీయపార్టీకి, మోదీ మార్కెటింగ్‌కు అదానీ ఇస్తారు' అని రాహుల్ చెప్పారు.

---

## యస్ అనకుండా.. యా.. యా.. ఏమిటి?

- ఇదేమీ కాఫీ షాప్ కాదు
- పిటిషనర్‌పై సీజేఐ ఆగ్రహం

**దిల్లీ:** ఓ ఉద్యోగి సర్వీసు వివాదానికి సంబంధించి.. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్‌ను ప్రతివాదిగా పేర్కొంటూ ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేసిన పుణెకు చెందిన పిటిషనర్‌పై సోమవారం అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "న్యాయమూర్తిని ప్రతివాదిగా చేర్చి పిల్ ఎలా దాఖలు చేస్తారు? కాస్త గౌరవం చూపించాలి. ఓ జడ్జికి వ్యతిరేకంగా అంతర్గత విచారణ చేపట్టాలని ఆషామాషీగా మీరెలా అడుగుతారు. జస్టిస్ రంజన్ గొగొయ్.. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి. ఆయన ధర్మాసనం ముందు మీరు కేసు గెలవలేదన్న కారణంతో అంతర్గత విచారణను కోరలేరు. దీన్ని ఎట్టిపరిస్థితుల్లో సహించం. ఆయన పేరును ప్రతివాదుల జాబితాలోంచి తీసేయండి. అప్పుడు మీ అభ్యర్థనను పరిశీలిస్తాం" అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పేర్కొన్నారు. విచారణ సందర్భంగా ధర్మాసనం అడిగిన ప్రశ్నలకు పిటిషనర్... యస్ అని సమాధానం చెప్పకుండా యా..యా అని పేర్కొనడంపై సీజేఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. "యా.. యా ఏమిటి? ఇది కాఫీ షాప్ కాదు. దీన్ని మేం అనుమతించం" అంటూ పిటిషనర్‌కు చీవాట్లు పెట్టారు.

## కేసు సాగదీస్తే న్యాయవాదులకే లాభం

**దిల్లీ:** సుదీర్ఘ న్యాయపోరాటం వల్ల న్యాయవాదులకే ప్రయోజనం చేకూరుతుందని, వివాదాన్ని ఇంతటితో ముగించి పరస్పర సమ్మతితో విడాకులు తీసుకోవాలని ఓ వివాహ వివాద సంబంధిత కేసులో పిటిషనర్‌కు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై. చంద్రచూడ్ సూచించారు. తమ జంట మధ్య వివాదానికి సంబంధించిన కేసును మరో కోర్టుకు బదిలీ చేయాలంటూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సదరు మహిళ విద్యార్హతలను సీజేఐ అడిగారు. తాను ఎంటెక్ పూర్తిచేసి, అమెరికా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు ఆమె సమాధానమిచ్చారు. ప్రస్తుతం తాను ఉద్యోగం చేయడం లేదని పేర్కొన్నారు. దీనికి సీజేఐ స్పందిస్తూ.. "మీరు విద్యావంతులు. ముందు మంచి ఉద్యోగం సంపాదించండి. ఈ కేసులో మీరు 10 ఏళ్లయినా న్యాయపోరాటం చేయగలరేమో..! కానీ దానివల్ల కేవలం న్యాయవాదులకే ప్రయోజనం కలుగుతుంది. మీరెందుకు పరస్పర సమ్మతితో విడాకులు తీసుకునేందుకు అంగీకరించకూడదు? మీరు అందుకు అంగీకరిస్తే కేసును మూసేస్తాం. మీరు వైవాహిక బంధాన్ని తిరిగి కొనసాగించే పరిస్థితుల్లో లేరని స్పష్టమవుతోంది. మీరు నిరక్షరాస్యులైతే కేసు వేరేగా ఉండొచ్చు. కానీ మీరు చదువుకున్నవారు.. ఉద్యోగం సంపాదించగలరు" అని ఆ మహిళకు సూచించారు.

## కూల్చివేతలపై సుప్రీం ఆదేశాల ఉల్లంఘన!

- అస్సాం ప్రభుత్వానికి నోటీసులు

**దిల్లీ:** దేశంలో ఎక్కడా కూల్చివేతలు చేపట్టకూడదంటూ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులు ఉల్లంఘనకు గురయ్యాయంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు.. అస్సాం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సెప్టెంబరు 17న సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో అక్టోబరు 1 వరకు క్రిమినల్ కేసుల్లో నిందితులుగా ఉన్న వారి ఆస్తులు సహా దేశవ్యాప్తంగా ఆస్తుల కూల్చివేతలు చేపట్టకూడదంటూ ఆదేశాలిచ్చింది. అయితే ఈ ఉత్తర్వులను అస్సాం ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని, సోన్‌పుర్‌లో కూల్చివేతలకు అధికారులు సిద్ధమవుతున్నారని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది అహ్మదీ పేర్కొన్నారు. దీంతో జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం మూడు వారాల్లో పిటిషన్‌పై స్పందన తెలపాలని అస్సాం ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అప్పటివరకు యథాతథ స్థితిని కొనసాగించాలని పేర్కొంది.

## పరువు నష్టం కేసులో దిల్లీ సీఎం ఆతిశీకి సుప్రీంలో ఊరట

**దిల్లీ:** పరువునష్టం కేసులో దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు సోమవారం సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టు విచారణపై స్టే విధిస్తూ ఆదేశాలు ఇచ్చింది. 2018లో ఆప్ నేతలు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. భాజపా ఆదేశాలతో వివిధ వర్గాలకు చెందిన 30 లక్షల మంది ఓటర్ల పేర్లను దిల్లీ ఓటర్ల జాబితా నుంచి తొలగించారని ఆరోపించారు. దీనిపై కమలం పార్టీనేత రాజీవ్ బబ్బర్ ఫిర్యాదు చేశారు. ఆ వ్యాఖ్యలతో తమ పార్టీ ప్రతిష్ఠకు భంగం వాటిల్లిందన్నారు. ఈ కేసులో ఆతిశీ, కేజ్రీవాల్‌కు 2019లో ట్రయల్ కోర్టు నోటీసులు ఇచ్చింది. వాటికి వ్యతిరేకంగా ఆప్ నేతలు సెషన్స్ కోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. హైకోర్టులోనూ అదే పరిస్థితి ఎదురైంది. పరువునష్టం కేసును కొట్టివేయడానికి హైకోర్టు నిరాకరించింది. ఈ నేపథ్యంలోనే వారు సుప్రీంను ఆశ్రయించగా.. విచారణపై స్టే విధిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. స్పందన తెలియజేయాలని దిల్లీ పోలీసులను, రాజీవ్ బబ్బర్‌ను ఆదేశించింది.

---

# పీకేజే కేంద్రంగా హరియాణా పోరు

- పెహల్వాన్, కిసాన్, జవాన్ చుట్టూ ప్రచారం
- వ్యతిరేకతను అధిగమించడంపై కమలం కసరత్తు
- దూకుడు చూపిస్తున్న కాంగ్రెస్

**ఇంటర్నెట్ డెస్క్:** హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం రసవత్తరంగా సాగుతోంది. పదేళ్లుగా అధికారంలో ఉన్న భాజపాను గద్దె దించాలని విపక్ష కాంగ్రెస్ ముమ్మర ప్రయత్నాలు చేస్తుండగా.. అధికారాన్ని కాపాడుకునేందుకు కాషాయ దళం సర్వశక్తులొడ్డుతోంది. మొత్తం రాజకీయాలు పీకేజే (పెహల్వాన్, కిసాన్, జవాన్) కేంద్రంగా నడుస్తున్నాయి. ఈ మూడు వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న భాజపాకు ఈ ఎన్నికలు సవాల్‌గా మారాయి. పార్టీ ఫిరాయింపులూ తలనొప్పి తెచ్చిపెడుతున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం పది స్థానాలను భాజపాకు కట్టబెట్టిన హరియాణా ఓటర్లు ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆ పార్టీకే జై కొట్టారు. మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపించినప్పటికీ కమలదళానికే పట్టం కట్టారు. రాష్ట్రంలో అప్పుడు రైతులు, జవాన్లు, పెహల్వాన్‌ల నుంచి సమస్యలు లేకపోవడం కాషాయానికి కలిసివచ్చిందనే చెప్పవచ్చు. మరుసటి ఏడాదికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సాగు చట్టాలకు వ్యతిరేకంగా హరియాణా రైతులు భారీ ఆందోళన చేపట్టారు.

***అగ్నిపథ్‌తో రాజుకున్న అగ్గి***

సాయుధ దళాల్లో నియామకాల కోసం కేంద్రం తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకంపై హరియాణా యువత తీవ్ర అసంతృప్తితో ఉంది. వ్యవసాయం, సాయుధ బలగాల్లో చేరేందుకు ఎక్కువ మొగ్గు చూపే వీరినుంచి భాజపాపై వ్యతిరేకత కనిపిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో భారత పతాకాన్ని రెపరెపలాడించిన రెజ్లర్లు కూడా భాజపాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

***వ్యూహం మార్చిన కమలదళం***

రాష్ట్రంలో ఓటరు నాడిని పసిగట్టిన భాజపా అధిష్ఠానం.. లోక్‌సభ ఎన్నికలకు ముందే ఖట్టర్ స్థానంలో నయాబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టింది. అసంతృప్త నేతలు పార్టీకి తలనొప్పిగా మారారు. స్వతంత్రులుగా బరిలో దిగడంతో వారిపై వేటు వేసింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల శాతంతోపాటు కొన్ని సీట్లను కూడా కాషాయ పార్టీ కోల్పోవడం కమలదళంపై వ్యతిరేకతను సూచిస్తోంది. భాజపాకు వ్యతిరేకంగా వచ్చిన ప్రతి అంశాన్ని కాంగ్రెస్ తనకు అనుకూలంగా మార్చుకునేందుకు యత్నించింది. రైతు ఉద్యమం వేళ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే అగ్నిపథ్‌ను రద్దు చేస్తామంటూ ప్రకటించడం, రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు టికెట్ ఇవ్వడం వంటివాటితో ముందుకెళ్తోంది. 90 స్థానాలున్న శాసనసభకు అక్టోబరు 5న ఎన్నికలు జరగనున్నాయి.

---

## 'రాజ్యమాత- గోమాత'

### దేశవాళీ ఆవులకు మహారాష్ట్ర సర్కార్ గౌరవం

**ముంబయి:** మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొంది. దేశవాళీ ఆవులను 'రాజ్యమాత- గోమాత'గా సోమవారం ప్రకటించింది. వేదకాలం నుంచి ఉన్న ఆవుల ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకొని, ముంబయిలో రాష్ట్ర కేబినేట్ సమావేశం తర్వాత ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ వెల్లడించారు. ఆవుల కోసం పశుగ్రాసం కూడా రైతులకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ఆవుల షెల్టర్ల నిర్వాహకులకు ఒక్కో ఆవుకు రూ.50 చొప్పున రాయితీ అందించే ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించినట్లు వివరించారు. ఈ నిర్ణయం భారత సమాజంలో ఆవులకున్న ఆధ్యాత్మిక, శాస్త్రీయ, చారిత్రక ప్రాముఖ్యతను నొక్కిచెబుతుందని అధికారులు తెలిపారు.

---

## నేపాల్‌లో వరద బీభత్సం..

## 205కు చేరిన మృతుల సంఖ్య

**కాఠ్‌మాండూ:** నేపాల్‌లో భారీ వరదల కారణంగా మృతిచెందిన వారి సంఖ్య 205కు పెరిగింది. మరో 130 మంది గాయపడగా, మరో 24 మంది గల్లంతైనట్లు సోమవారం అధికారులు ప్రకటించారు. ఒక్క కాఠ్‌మాండూలోనే 56 మంది మృత్యువాతపడ్డారు. భద్రతా దళాలు గాలింపు, సహాయక చర్యలు మూడో రోజు సైతం కొనసాగాయి. భారీ వర్షాల కారణంగా దేశరాజధాని కాఠ్‌మాండూకు వెళ్లే రహదారులన్నీ ధ్వంసమయ్యాయి, 20 జల విద్యుత్ కేంద్రాలు దెబ్బతిన్నాయి. గత 45 ఏళ్లల్లో ఇలాంటి స్థాయి వరదలను ఎన్నడూ చూడలేదని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు.



నేపాల్ రాజధాని కాఠ్‌మాండూలో వరదల తీవ్రతకు బురదలో కూరుకుపోయిన కారు

---

## అమెరికాలో హెలీన్ కల్లోలం

### 107కు పెరిగిన మృతుల సంఖ్య

**వాషింగ్టన్:** అమెరికాలో హెలీన్ హరికేన్ కల్లోలానికి ఇంకా తెరపడటం లేదు. దాని దెబ్బకు మృత్యువాతపడ్డవారి సంఖ్య సోమవారంతో 107కు (మొత్తం ఆరు రాష్ట్రాల్లో) పెరిగింది. ఉత్తర కరోలినా రాష్ట్రంలో ఒక్క ఆషెవిలె నగరంలోనే హరికేన్ 30 మంది ప్రాణాలను బలి తీసుకుంది. వరదల్లో చిక్కుకొని, రోడ్లు తెగిపోయి, విద్యుత్తు సరఫరా నిలిచిపోయిన పలు ప్రాంతాలకు సహాయక బృందాలు చేరుకుంటున్నాయని ఉత్తర కరోలినా గవర్నర్ రాయ్ కూపర్ తెలిపారు. సహాయక చర్యలు కొనసాగే కొద్దీ మరిన్ని మృతదేహాలు బయటపడే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జార్జియా రాష్ట్రంలో మరణాల సంఖ్య సోమవారంతో 25కు చేరుకుంది.

---

## యూపీలో ముస్లిం జనాభా పెరుగుతోంది

- ఇక భాజపాను గద్దె దింపుతాం
- ఎస్పీ ఎమ్మెల్యే మెహబూబ్ అలీ

**బిజ్నోర్:** ఉత్తర్‌ప్రదేశ్‌లో పెరుగుతోన్న ముస్లిం జనాభా.. 2027లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాను గద్దె దింపుతుందని సమాజ్ వాదీ పార్టీ(ఎస్పీ) ఎమ్మెల్యే మెహబూబ్ అలీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 800 ఏళ్లకు పైగా పరిపాలించిన మొగల్ సామ్రాజ్యమే శాశ్వతంగా లేదని, అలాంటిది భాజపా ఎలా మనుగడ సాగిస్తుందని ప్రశ్నించారు. ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగానికి, రిజర్వేషన్లకు భాజపా వ్యతిరేకమని ఆరోపించారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది.

---

# ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు అవమానకరం

- తన ఆరోగ్య విషయాల్లోకి మోదీని లాగారు
- కాంగ్రెస్ అధ్యక్షుడిపై అమిత్ షా విమర్శలు

**దిల్లీ, చండీగఢ్:** ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దించేవరకూ తాను చనిపోనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు అసహ్యకరంగా, అవమానకరంగా ఉన్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం మండిపడ్డారు. ఖర్గే తన వ్యక్తిగత ఆరోగ్య విషయాల్లోకి అనవసరంగా మోదీని లాగారని అమిత్ షా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టారు. "నిన్న జమ్మూకశ్మీర్‌లో మల్లికార్జున ఖర్గే చేసిన ప్రసంగంలో అసహ్యకరమైన వ్యాఖ్యలు చేసి తన పార్టీ నేతలను మించిపోయారు. ప్రధాని మోదీపై కాంగ్రెస్ నాయకులకు ఎంత ద్వేషం, భయం ఉందో ఈ వ్యాఖ్యలు తెలియజేస్తున్నాయి. వారు నిరంతరం మోదీ గురించే ఆలోచిస్తున్నారని ఇవి చెబుతున్నాయి" అని షా విమర్శించారు.

***2047 నాటి వికసిత భారత్‌ను ఖర్గే చూడాలి***

ఖర్గే ఆరోగ్యంపై అమిత్ షా మాట్లాడుతూ "ఖర్గే ఆరోగ్యం విషయంలో మోదీ జీ, నేను ప్రార్థిస్తున్నాం. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని మనమందరం ప్రార్థించాలి. ఆయన ఇంకా చాలా సంవత్సరాలు జీవించాలి. 2047 నాటి వికసిత్ భారత్‌నూ ఆయన చూడాలి" అని షా ఆకాంక్షించారు.

***మీరు 125 ఏళ్లు జీవించాలి: రాజ్‌నాథ్***

మల్లికార్జున ఖర్గే 125 ఏళ్లపాటు జీవించాలంటూ, అప్పటి వరకూ మోదీ ప్రధానిగా కొనసాగాలంటూ భగవంతుడిని ప్రార్థిస్తానని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హరియాణాలో ఓ ఎన్నికల ర్యాలీలో పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మోదీ మూడోసారి ప్రధాని అయ్యారని భాజపా అధికార ప్రతినిధి సయద్ షానావాజ్ హుస్సేన్ పేర్కొన్నారు. ఖర్గే 100 సంవత్సరాలు ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థిస్తున్నట్లు, ఆ పుట్టినరోజున మోదీ పుష్పగుచ్ఛం పంపుతారని వ్యాఖ్యానించారు.

---



భారత వైమానిక దళం కొత్త అధిపతిగా ఎయిర్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు దిల్లీలోని వాయుసేన కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన అధిపతి ఎయిర్ మార్షల్ వివేక్ రామ్ చౌధరి (ఎడమవైపు వ్యక్తి)తో ఇలా కరచాలనం చేశారు.

# 'స్థానికత'ను వచ్చే ఏడాది నుంచి అమలు చేయొచ్చుగా..

- పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సీజేఐ సూచన
- ఇదివరకు ఇచ్చిన మినహాయింపును తొలగిస్తే.. 141 మంది విద్యార్థుల పరిస్థితేంటో చెప్పాలని నిర్దేశం



**ఈనాడు, దిల్లీ:** తెలంగాణలో 9, 10, 11, 12 తరగతులు చదవడంతోపాటు ఇక్కడే నీట్ పరీక్ష రాసినవారికే వైద్యవిద్య ప్రవేశాల్లో 85% స్థానిక కోటా వర్తింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 33ని వచ్చే ఏడాది నుంచి అమలు చేయడానికి వీలుందేమో చూడాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. లేదంటే ఈ జీవోను సవాల్ చేస్తూ.. కోర్టును ఆశ్రయించిన 141 మంది కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి సెప్టెంబరు 20న ఇచ్చిన మినహాయింపును తొలగిస్తే తలెత్తే పరిణామాల గురించి అభిప్రాయం చెప్పాలని నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలిపే అభిప్రాయం ప్రకారం.. తమ నిర్ణయాన్ని వెలువరిస్తామని పేర్కొన్నారు. సెప్టెంబరు 5న తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కలిసి సోమవారం విచారించిన సీజేఐ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. "కోర్టును ఆశ్రయించిన 141 మందిని కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం ఇస్తామని సెప్టెంబరు 20న విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫు హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తప్పుగా అంగీకరించారు. మేం గత విచారణ సమయంలో హైకోర్టు తీర్పుపై స్టే విధించాం. స్థానికతను నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందా? లేదా? అన్నది ఇక్కడ ప్రధానాంశం. గతంలో వైద్యవిద్య ప్రవేశాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి నిబంధనలు విధించినప్పుడు సుప్రీంకోర్టు వాటిని పదేపదే సమర్థించింది. అలాంటప్పుడు ఈ తీర్పుపై మధ్యంతర స్టే ఇవ్వకుండా ఎలా ఉండగలం" అని ప్రశ్నించారు.

### పరీక్షలకు ముందే జీవో విడుదల చేయకూడదా?

పరీక్షలకు ముందే ఈ నిబంధన విధించి ఉంటే బాగుండేదని, నీట్ పరీక్ష జరిగే క్రమంలో మధ్యలో తెచ్చారని విద్యార్థుల తరఫు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. జస్టిస్ చంద్రచూడ్ జోక్యం చేసుకుంటూ "పిల్లలు పరీక్షలకు హాజరు కాకముందే ఈ జీవో విడుదల చేసి ఉండకూడదా?" అని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణన్ బదులిస్తూ.. నీట్ ఫలితాలు వెలువడిన తర్వాత కౌన్సెలింగ్ దశలోనే ఈ నిబంధనలను వర్తింపజేసినట్లు చెప్పారు. జూన్ 1 వరకు ఏపీ విభజన చట్టంలోని పదేళ్ల నిబంధన అమలులో ఉండటంతో తాము ఈ జీవో జారీ చేయలేకపోయామని, [illegible] ఈ జీవో విడుదల చేశామని తెలిపారు. కాంపిటెంట్ అథారిటీ కోటా కింద తెలంగాణలో 17,668 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారన్నారని, ఇందులో 16,562 మంది స్థానికులు ఉన్నట్లు నోటిఫై చేశారన్నారు. 1,080 మంది స్థానికేతరుల కిందికి వస్తారు కాబట్టి వారికి స్థానిక కోటా కింద ప్రవేశం పొందే అర్హత లేదన్నారు. మరో 26 మందికి ఇతర కారణాల వల్ల అర్హత లేదని తెలిపారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశం మేరకు 141 మందిని స్థానిక కోటా కింద రిజిస్టర్ చేసినట్లు చెప్పారు. హైకోర్టును ఆశ్రయించినవారిలో నలుగురు ఇప్పటికే ఏపీని స్థానికతగా పేర్కొన్నందువల్ల వారిని పరిగణనలోకి తీసుకోలేమన్నారు. 16,562 మందికి స్థానిక కోటా 85% కింద ప్రవేశం పొందడానికి వీలుందన్నారు. ఈ వాదనలు విన్న అనంతరం జస్టిస్ డీవై చంద్రచూడ్.. సెప్టెంబరు 20న జారీ చేసిన ఉత్తర్వులను సవరించడానికి నిరాకరించారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిబంధన దాదాపు చట్టబద్ధంగా ఉందని, ఇదివరకు ఇలాంటివాటిని సుప్రీంకోర్టు సమర్థించిన గుర్తుచేశారు. మేం ఇదివరకు 141 మందికి మినహాయింపు ఇవ్వకపోయి ఉన్నట్లయితే ఈ వాదన సరైనదే అయ్యుండేదన్నారు. ఆ మినహాయింపును తొలగించడం ఇప్పుడు సమంజసం కాదన్నారు. కేవలం కోర్టును ఆశ్రయించినవారికి మాత్రమే మినహాయింపు ఇవ్వడం భావ్యం కాదన్నారు. ఇచ్చిన మినహాయింపును తొలగించడమే ఇప్పుడున్న మార్గమన్నారు. ఒకవేళ ఆ మినహాయింపును తొలగిస్తే ఆ 141 మంది విద్యార్థుల పరిస్థితి ఏంటో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదికి సూచిస్తూ తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

## బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ నాడు..
## స్కాన్ చేస్తే పార్కింగ్ ప్రదేశం ప్రత్యక్షం



స్కాన్ చేస్తున్న యువకులు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కీలకమైన గరుడసేవ నాడు అక్టోబరు 8వ తేదీన ప్రైవేటు వాహనాలను కొండ పైకి అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలో భక్తులు ఇబ్బంది పడకుండా తితిదే ప్రచారం, ఏర్పాట్లు చేపట్టారు. అలిపిరికి సమీపంలోని భారతీయ విద్యాభవన్, నెహ్రూ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానం, వినాయకనగర్ క్వార్టర్స్, ఎస్వీ వైద్య కళాశాల మైదానంలో వాహనాలు నిలిపేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. టూరిస్టు బస్సులను జూ మార్గంలోని దేవలోక్ మైదానం, ద్విచక్రవాహనాలకు బాలాజీ లింకు బస్టాండ్ పరిధిలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. పార్కింగ్ ప్రదేశాల వివరాలు, వాటికి చేరుకునే మార్గాల వివరాలతో రుయా, గరుడ కూడలి, బాలాజీ లింకు బస్టాండ్ వద్ద తితిదే క్యూఆర్ కోడ్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. ఫ్లెక్సీలో ఉన్న ప్రదేశం వద్ద సెల్‌ఫోన్‌తో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే లొకేషన్, రూట్‌మ్యాప్ కనిపిస్తుంది. —ఈనాడు, తిరుపతి

## యాంటీ బయాటిక్స్ నియంత్రణపై 3 నుంచి గ్లోబల్ సౌత్ కాన్ఫరెన్స్

**ఈనాడు, హైదరాబాద్, రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే:** యాంటీ బయాటిక్స్ విచ్చలవిడి వాడకంతో ప్రమాదకర స్థాయికి చేరుకున్న యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)నియంత్రణపై హైదరాబాద్‌లో అక్టోబరు 3 నుంచి 5 వరకు గ్లోబల్ సౌత్ కాన్ఫరెన్స్ జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సదస్సును ప్రారంభించనున్నారు. ఇన్ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయని సదస్సు ప్రతినిధులు డాక్టర్ రంగారెడ్డి బుర్రి, ఆర్.గోవింద్‌హరి సోమవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు.



**సమయం లేదనడం ఓ సాకు మాత్రమే**

నాకు వ్యాయామం చేయడానికి సమయం లేదని చాలా మంది చెబుతుంటారు. కానీ అది వాస్తవం కాదు. ప్రతి ఒక్కరికీ వారంలో 168 గంటలు ఉంటాయి. ఆ ఏడు రోజుల్లో 48 గంటలు ఉద్యోగం కోసం, 56 గంటలు నిద్రపోయేందుకు, 7 గంటలు వ్యాయామం కోసం కేటాయించుకున్నా ఇంకా 57 గంటల సమయం మిగిలి ఉంటుంది. ఎవ్వరికైనా సమయం లేకపోవడం సమస్య కాదు, ప్రాధాన్యతలను సరిగ్గా నిర్ణయించుకోకపోవడమే సమస్య.
– నాడర్ గిర్గిస్, పర్ఫార్మెన్స్ కోచ్

# పంటల డిజిటల్ సర్వేలో ప్రతిష్టంభన

- విధులకు హాజరుకాని ఏఈవోలు
- వ్యవసాయశాఖ సంజాయిషీ నోటీసులు

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా పంటల డిజిటల్ సర్వేలో ప్రతిష్టంభన నెలకొంది. తమకు సర్వే భారంగా, ఇబ్బందికరంగా మారిందని రాష్ట్రంలోని వ్యవసాయ విస్తరణాధికారు(ఏఈవో)లు పేర్కొన్నారు. వారు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సర్వేను బహిష్కరించారు. దీన్ని వ్యవసాయశాఖ తీవ్రంగా పరిగణించి వారికి షోకాజ్ నోటీసులు జారీచేసింది. 24 గంటల్లోగా సమాధానమివ్వాలంది. 'డిజిటల్ అగ్రిమిషన్' పథకం కింద కేంద్రం దేశవ్యాప్తంగా రూ.2,817 కోట్లతో డిజిటల్ సర్వే చేపట్టింది. ఇతర రాష్ట్రాల్లో సర్వే నడుస్తుండగా.. రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలు, వర్షాలు, వరదల కారణంగా వాయిదా వేశారు. తరువాత సెప్టెంబరు 27 నుంచి సర్వే ప్రారంభమైంది. ఒక్కో ఏఈవోకు 6500 ఎకరాలు సర్వేకు కేటాయించారు. ఈ సర్వే తమకు ఇబ్బందిగా మారిందని ఏఈవోలు ఆందోళన చేపట్టారు. మొత్తం 2610 ఏఈవోలలో 60 శాతం మంది మహిళలే. వారు కూడా సర్వేను వ్యతిరేకించారు.

### సంచాలకుడికి వినతి

ఏఈవో సంఘాల నేతలు ఇటీవల వ్యవసాయ సంచాలకుడు గోపిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సంచాలకుడు వారిని సర్వేలో పాల్గొనాలని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున గౌరవభృతి ఇస్తామని చెప్పారు. దానినీ ప్రకటించకపోవడంతో ఏఈవోలు సోమవారం సర్వేను బహిష్కరించారు.

### నేడు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు

రైతువేదికల్లో మంగళవారం జరిగే రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తామని ఏఈవోల ఐకాస తెలిపింది.

## శ్రీవారి ఆలయంలో నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### నాలుగు గంటల పాటు దర్శనాలు నిలిపివేత

**తిరుమల, న్యూస్‌టుడే:** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి జరగనున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఉదయం ఆరింటి నుంచి పది గంటల వరకు గర్భగుడి, ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేయనున్నారు. నాలుగు గంటల పాటు దర్శనాలను నిలిపివేస్తారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను దర్శనాలకు అనుమతించనున్నారు. అష్టదళ పాద పద్మారాధన సేవను రద్దు చేసినట్లు తితిదే తెలిపింది.

## నిర్మలా సీతారామన్ మీద విచారణపై కర్ణాటక హైకోర్టు స్టే

**ఈనాడు, బెంగళూరు:** ఎన్నికల బాండ్ల సేకరణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మీద విచారణపై కర్ణాటక హైకోర్టు స్టే విధించింది. తదుపరి విచారణను అక్టోబరు 22వ తేదీకి వాయిదా వేసింది. సోమవారం జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ.. ప్రతివాదుల నుంచి అభ్యంతరాలు దాఖలయ్యేంత వరకు ప్రాథమిక విచారణ చేపట్టడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. తదుపరి విచారణ వరకు ఈ స్టే అమలులో ఉంటుందన్నారు. ఐపీసీ సెక్షన్లలో బాధితులకు రక్షణ కల్పించే విధానాలున్నాయని, ఈ కేసులో ఫిర్యాదుదారుడు ఎలాంటి బాధితుడూ కాదని వివరించారు. కేవలం ఈ ఫిర్యాదు ద్వారా ఐపీసీ సెక్షన్ 383 వినియోగం గురించి వెల్లడించాలన్న అభిప్రాయంతో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కేసులో మరో నిందితుడు, భాజపా కర్ణాటక శాఖ పూర్వ అధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్..తనపై కేసు నమోదు చేయవద్దంటూ వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి విచారణ చేపట్టారు.

## గత రెండేళ్లలో విద్యుత్ అంతరాయాలు అధికమే!

### ఈఆర్‌సీకి డిస్కంల నివేదిక



**ఈనాడు, హైదరాబాద్:** పలు రకాల సమస్యలతో కరెంటు సరఫరా నిలిచిపోయినట్లు గత రెండేళ్లలో వినియోగదారులు పెద్దఎత్తున విద్యుత్ కార్యాలయాలకు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదుల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నా చాలా గంటల సమయం కరెంటు సరఫరా నిలిచిపోయినట్లు రాష్ట్రంలోని రెండు విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు స్పష్టం చేశాయి. గత రెండు ఆర్థిక సంవత్సరాల(2022-24)ల్లో రాష్ట్రంలో వినియోగదారుల నుంచి వచ్చిన వివిధ రకాల ఫిర్యాదులు, కరెంటు సరఫరా ఏ జిల్లాలో ఎన్ని గంటలు నిలిచిపోయింది, కారణాలను వివరిస్తూ ఉత్తర, దక్షిణ తెలంగాణ డిస్కంలు తాజాగా 'రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి'(ఈఆర్‌సీ)కి ఇచ్చిన నివేదికల్లో సమగ్ర వివరాలను అందజేశాయి.

- దక్షిణ డిస్కం పరిధిలో గతేడాది(2023-24) తొలి అర్ధభాగం అంటే 2023 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ కరెంటు సరఫరా నిలిచిపోయిందని ప్రజల నుంచి 5,04,310 ఫిర్యాదులు రాగా 54,66,529 మందికి అసౌకర్యం కలిగిందని పేర్కొంది.
- గతేడాది మలి అర్ధభాగం అంటే 2023 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకూ ప్రజల ఫిర్యాదులు గణనీయంగా తగ్గి 2,99,801 రాగా 46,33,671 మందికి అసౌకర్యం కలిగినట్లు దక్షిణ డిస్కం వెల్లడించింది.
- ఉత్తర డిస్కం పరిధిలో ఇళ్లకు, వాణిజ్య సంస్థలకు కరెంటు సరఫరా అయ్యే 11 కేవీ విద్యుత్ ఫీడర్లలో 2022-23లో మొత్తం 23,975 సార్లు అంతరాయాలతో 13,146 గంటల 26 నిమిషాల సేపు కరెంటు సరఫరా నిలిచిపోయింది.
- సాంకేతిక సమస్యలతోనే ఎక్కువగా సరఫరా నిలిచిపోతున్నట్లు విద్యుత్ ఇంజినీర్లు చెబుతున్నారు. మరమ్మతుల కోసం సిబ్బంది లైన్ క్లియర్ పేరుతో సరఫరా నిలిపివేయడం సర్వసాధారణం. కానీ, ఇవేకాకుండా హఠాత్తుగా బ్రేక్‌డౌన్ ఏర్పడటం, పైనుంచి కరెంటు రాకపోవడం వంటి సమస్యల వల్ల కూడా సరఫరా నిలిచిపోతున్నట్లు డిస్కంలు ఇచ్చిన నివేదికలు స్పష్టంచేశాయి.

# రెండు వర్సిటీల సెర్చ్ కమిటీల సమావేశాలు ఆలస్యం

- వీసీల నియామకాలకు మరో 15-20 రోజులు
- ఇంటర్‌బోర్డుకు వారంలో కొత్త కార్యదర్శి!

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకానికి ఈనెల 3, 4 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించాలనుకున్న సెర్చ్ కమిటీల సమావేశాలు కొంత ఆలస్యం కావచ్చని తెలుస్తోంది. అన్వేషణ కమిటీల సభ్యులు కొందరు విదేశాలకు వెళ్లడం, కనీసం సర్కారు నిర్ణయించిన తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో పాల్గొనేందుకు కూడా అవకాశం లేకపోవడంతో మాసాబ్ ట్యాంకులోని ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయంతోపాటు మరో వర్సిటీ సమావేశాల తేదీలు మారనున్నాయని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. అవి కూడా పూర్తయిన తర్వాత మొత్తం కలిపి వచ్చే 15-20 రోజుల్లో నియామకాలు పూర్తి చేస్తామని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. దసరాలోగా కొత్త ఉపకులపతులు రారని స్పష్టమవుతోంది. మహిళా వర్సిటీ కొత్తది అయినందున సెర్చ్ కమిటీ లేకుండానే వీసీని నియమించవచ్చు. బాసర ఆర్‌జీయూకేటీకి శాశ్వత వీసీని నియమించాలంటే ముందుగా కులపతిని నియమించాల్సి ఉంది.

◆ ఇంటర్‌బోర్డుకు వారం రోజుల్లో కొత్త కార్యదర్శిని నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో ఉన్న శ్రుతి ఓజా సెలవుపై వెళ్లడంతో కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా ఉన్న శ్రీదేవసేనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇంటర్‌బోర్డు కీలకం కావడంవల్ల శాశ్వత కార్యదర్శిని నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది.

## జమ్మూ-కశ్మీర్ డీజీపీగా నళిన్ ప్రభాత్ బాధ్యతలు



**శ్రీనగర్:** జమ్మూ-కశ్మీర్ డీజీపీగా ఆంధ్రప్రదేశ్ కేడర్ ఐపీఎస్ అధికారి నళిన్ ప్రభాత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత డీజీపీ ఆర్.ఆర్. స్వైన్ పదవీ విరమణ చేయడంతో ప్రభాత్ ఆయన స్థానంలో వచ్చారు. ఎన్‌ఎస్‌జీ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న నళిన్ ప్రభాత్‌ను జమ్మూ-కశ్మీర్ డీజీపీగా నియమిస్తూ కేంద్ర హోం శాఖ ఆగస్టు నెలలో ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన నళిన్ ప్రభాత్.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు.

## అమరావతికి రూ.250 కోట్లతో టెక్నాలజీ సెంటర్

**గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే:** ఏపీ రాజధాని అమరావతికి రూ.250 కోట్లతో టెస్టింగ్ ఫెసిలిటీస్‌తో కూడిన టెక్నాలజీ సెంటర్ మంజూరైందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఎంఎస్‌ఎంఈకి సంబంధించిన ఈ టెక్నాలజీ సెంటర్‌ను మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్‌ను సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లాలని సీఆర్‌డీఏ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చిందని ప్రకటనలో తెలిపారు.

# ఆచార్య సచ్చిదానందమూర్తి జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- నాగార్జున వర్సిటీలో రెండు రోజుల సెమినార్ ప్రారంభం



ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో ఆచార్యులు కొత్త రమేశ్, అశోక్‌కుమార్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కామినేని శ్రీనివాస్, వీసీ ఆచార్య కె.గంగాధరరావు తదితరులు

**ఈనాడు, అమరావతి:** ప్రముఖ భారతీయ తత్వవేత్త, పద్మవిభూషణ్ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి జీవితచరిత్ర.. ఆయన బోధనలను పాఠశాల, కళాశాల విద్యలో పాఠ్యాంశంగా చేర్చాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రభుత్వానికి సూచించారు. ఇది దేశానికి ఎంతో ప్రయోజనకరమని వివరించారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు తత్వశాస్త్రం పరిష్కారాలు చూపిస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని స్థాయిల్లోనూ భారతీయ తత్వ చింతనను అలవాటు చేసుకోవాలని సూచించారు. సచ్చిదానందమూర్తి శత జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళగిరిలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సెమినార్‌ను సోమవారం వెంకయ్యనాయుడు ప్రారంభించి కీలకోపన్యాసం చేశారు. 'దేశంలో ప్రస్తుత నూతన విద్యావిధానం మన తత్వశాస్త్రాన్ని బోధించేలా ఉంది. భారతీయ మూలాల్లోకి వెళ్లి ఆ శాస్త్రాన్ని నేటి తరానికి అందించిన మహనీయుడు డాక్టర్ కొత్త సచ్చిదానందమూర్తి. ఆయన అసాధారణమైన కృషితో ప్రపంచ స్థాయికి ఎదిగారు. జీవితకాలమంతా తన విజ్ఞానాన్ని ప్రపంచానికి పంచారు. భారతీయ తత్వశాస్త్రంలో లౌకిక, అలౌకిక అంశాలు అనేకం ఉన్నాయి. కాస్మాలజీ, మెటా ఫిజిక్స్ వంటి శాస్త్రాలు మన తత్వాల్లో ఉన్నాయి. ఆచార్య నాగార్జునుడు, ఆదిశంకరాచార్యులు తాత్వికతను ప్రముఖంగా చెప్పారు. ఆధునిక కాలంలో జిడ్డు కృష్ణమూర్తి, సర్వేపల్లి రాధాకృష్ణన్ తర్వాత తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేసిన వారు సచ్చిదానందమూర్తి' అని పేర్కొన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం పరితపించిన మహనీయులు సచ్చిదానందమూర్తి అని కీర్తించారు. శాంతి కావాలని తన రచనల ద్వారా ప్రపంచానికి చాటారని వివరించారు. కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, దిల్లీ వర్సిటీ విశ్రాంత ఆచార్యులు ఆచార్య అశోక్ వోహ్రా, ఆచార్య చలం, ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (అంతర్‌చిత్రంలో) మృతుడు నరసింహులు

## మంచం కింద డిటోనేటర్లు పెట్టి వీఆర్‌ఏ హత్య

- మృతుడి భార్యతో సన్నిహితంగా ఉండే వ్యక్తి ఘాతుకం

**వేముల, న్యూస్‌టుడే:** వివాహితతో సంబంధం పెట్టుకున్న ఓ వ్యక్తి ఆమె భర్తను డిటోనేటర్లు, జిలెటిన్‌స్టిక్స్‌తో పేల్చి హత్య చేసిన ఘటన ఏపీలోని వైఎస్సార్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. వేముల మండలంలోని వి.కొత్తపల్లెకు చెందిన ఎలంకూరు నరసింహులు (49) వీఆర్‌ఏగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన భార్య సుబ్బలక్షుమ్మ ముగ్గురాయి పనులకు వెళుతుండేవారు. ఇదే గ్రామానికి చెందిన బాబు అనే వ్యక్తితో ఆమెకు వివాహేతర బంధం ఉండేది. ఆ విషయం బయటపడటంతో నాలుగు నెలల కిందట నరసింహులు, బాబు గొడవపడ్డారు. సుబ్బలక్షుమ్మ కూడా కొద్దిరోజుల పాటు పుట్టింటికి వెళ్లి ఇటీవలే తిరిగొచ్చారు. ఈ నేపథ్యంలో ఆమెతో తన బంధానికి అడ్డువస్తున్న నరసింహులును ఎలాగైనా అంతమొందించాలని బాబు నిర్ణయించుకున్నాడు. ముగ్గురాయి గనుల్లో డిటోనేటర్లు, జిలెటిన్‌స్టిక్స్ పేల్చే అనుభవం ఉండటంతో వాటితోనే హత్యకు ప్రణాళిక రచించాడు. ఆదివారం రాత్రి ఇంటి ముందు వరండాలో నరసింహులు, సుబ్బలక్షుమ్మ వేర్వేరు మంచాలపై నిద్రపోయారు. దీన్నే అదనుగా చేసుకున్న బాబు గుట్టుచప్పుడు కాకుండా నరసింహులు మంచం కింద డిటోనేటర్లు, జిలెటిన్‌స్టిక్స్ ఉంచి పేల్చాడు. పేలుడు ధాటికి భర్తతో పాటు భార్య కూడా తీవ్రంగా గాయపడ్డారు. నరసింహులును 108లో వేంపల్లెకు తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందారు. సుబ్బలక్షుమ్మను కడప రిమ్స్‌కు తరలించారు. ఘటనపై దర్యాప్తు చేసిన పోలీసులు.. ఓ వ్యక్తిని హత్య చేసేందుకు జిలెటిన్‌స్టిక్స్‌ను వినియోగించడం ఇదే మొదటిసారని చెబుతున్నారు. నిందితుణ్ని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

# 'టెండరు' మేరకు పరీక్షలు జరుగుతున్నాయా..?

- తిరుమలలో ల్యాబ్‌ను పరిశీలించిన సిట్



ట్యాంకర్ నుంచి నాణ్యత పరీక్షల కోసం నెయ్యిని సేకరిస్తున్న సిబ్బంది



తిరుపతిలోని పోలీసు అతిథిగృహం నుంచి తిరుమల బయలుదేరుతున్న సిట్ బృందం

**ఈనాడు–తిరుపతి, న్యూస్‌టుడే, తిరుమల:** నెయ్యి సరఫరా కోసం టెండర్లు పిలిచినప్పుడు పేర్కొన్న ప్రమాణాల మేరకు తిరుమలలోని ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాన్ని సిట్ బృందం సోమవారం పరిశీలించింది. నెయ్యిలో జంతుకొవ్వు, వనస్పతి వంటివి కలిశాయా లేదా అన్నదానిపై పరీక్షలు నిర్వహిస్తున్నారా లేదా అని ల్యాబ్ అధికారులను అడిగి తెలుసుకుంది. నెయ్యి కొనుగోలు నుంచి సరఫరా, ల్యాబ్ పరీక్షలు, వినియోగం వరకూ అన్ని అంశాలపై సిట్ అధికారులు దర్యాప్తు చేశారు. తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారంపై గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలోని సిట్ బృందం సోమవారం క్షేత్రస్థాయిలో దర్యాప్తును ముమ్మరం చేసింది. సోమవారం ఉదయం (మూడో రోజు)విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జెట్టీ, కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తిరుపతి అదనపు ఎస్పీ (పరిపాలన) వెంకటరావులు తిరుమలలోని గిడ్డంగులు, ల్యాబ్‌లను పరిశీలించారు. గుత్తేదారు సంస్థల నుంచి ట్యాంకర్లను తీసుకొచ్చేప్పుడు అనుసరించే నాణ్యతా ప్రమాణాలు, వాహనాల వివరాలు, శాంపిళ్ల సేకరణ తదితర అంశాలపై తితిదే అధికారుల నుంచి వివరాలు సేకరించారు.

### ఎలా పరీక్షలు నిర్వహిస్తారు?

గిడ్డంగికి చేరుకున్న తర్వాత నెయ్యి శాంపిళ్ల సేకరణపైనా సిట్ అధికారులు ప్రశ్నించారు. గిడ్డంగి వద్దకు వచ్చిన వాహనం నుంచి నెయ్యి శాంపిళ్లు తీసుకున్నాక ఎలాంటి పరీక్షలు చేపడతారు? ఫలితాలు వచ్చేందుకు ఎంత సమయం పడుతుందని ఆరా తీశారు. ల్యాబ్‌లో నిర్వహించే పరీక్షలు ఏమిటి?.. నెయ్యిలో జంతు కొవ్వు, వనస్పతి వంటివి కలిస్తే గుర్తించేందుకు పరికరాలు ఉన్నాయా లేదా అని ప్రశ్నించారు. పరీక్షల్లో నెయ్యి నాణ్యంగా లేదని తేలితే ట్యాంకర్లను ఏ విధంగా వెనక్కిపంపుతారు? అని కూడా సిబ్బందిని ప్రశ్నించారు.

### పోటు సిబ్బంది నుంచి వివరాల సేకరణ

నాణ్యతా ప్రమాణాల్లో నెయ్యి బాగుందని తేలితే దాన్ని ఎక్కడ నిల్వ చేస్తారు.. నిల్వ కేంద్రాల నుంచి పోటు వరకు నెయ్యిని ఎలా తీసుకువెళతారనే అంశంపైనా సిట్ బృందం తితిదే అధికారులను ప్రశ్నించింది. ఆ తర్వాత సాయంత్రం వెంకటరావు నేతృత్వంలోని బృందం సభ్యులు పోటుకు వెళ్లి అక్కడ లడ్డూ తయారు చేసే సిబ్బందితో మాట్లాడారు. నెయ్యి నాణ్యతపై అధికారులకు ఎప్పుడైనా ఫిర్యాదు చేశారా అని కూడా వారిని ప్రశ్నించారు. నాణ్యత లేని నెయ్యి వస్తోందని గతంలో చెప్పినా అధికారులు స్పందించలేదని సిట్‌కు సిబ్బంది చెప్పినట్లు సమాచారం. మంగళవారం మరోమారు ల్యాబ్‌తోపాటు పోటును సిట్ సభ్యులు పరిశీలిస్తారు.

### నేడు ఏఆర్ డెయిరీకి సిట్ బృందం..

కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఆర్ డెయిరీకి సిట్ బృందం మంగళవారం వెళ్లనుంది. ఒక బృందం తిరుమల వెళ్లనుండగా మరొకటి తమిళనాడు దిండికల్‌లోని ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను పరిశీలించనుంది.

## పోలవరానికి తగ్గిన వరద

### డయాఫ్రంవాల్ నిర్మాణ ప్రాంతంలో నీరు ఎత్తిపోతకు చర్యలు

**పోలవరం, న్యూస్‌టుడే:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన డయాఫ్రంవాల్ నిర్మాణం నవంబరు నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. గోదావరిలో వరద ఉద్ధృతి తగ్గడంతో ప్రధాన డ్యాం ప్రాంతంలోని నీటిని పంపుల ద్వారా బయటకు ఎత్తిపోస్తుండగా.. తాజాగా మరిన్ని పంపులు ఏర్పాటు చేసే పనులను ముమ్మరంగా చేపడుతున్నారు.

## ముందస్తు బెయిలు మంజూరు చేయండి

- ఏపీ హైకోర్టును ఆశ్రయించిన ఏఆర్ ఫుడ్స్ ఎండీ రాజశేఖరన్

**ఈనాడు, అమరావతి:** శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశామనే ఆరోపణలతో తనపై తిరుపతి తూర్పు ఠాణాలో సెప్టెంబర్ 25న నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ ఆర్.రాజశేఖరన్ సోమవారం ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అరెస్టుతో పాటు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని అభ్యర్థించారు. దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. రాజకీయ కారణాలతో తనపై కేసు నమోదు చేశారని, ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరారు.

## రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడితే ఉపేక్షించొద్దు: ఏపీ సీఎం చంద్రబాబు

**ఈనాడు, అమరావతి:** వైకాపా ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న మద్యం, ఇసుక, ఫైబర్‌నెట్ కుంభకోణాలపై నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్షించారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీజీ హరీష్‌కుమార్ గుప్తా, నిఘా విభాగాధిపతి మహేష్ చంద్ర లడ్డాలతో ఆయన భేటీ అయ్యారు. శాంతిభద్రతల పరిస్థితి, నేర నియంత్రణపై ఆరా తీశారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో జరిగిన పలు ఘటనలు, వాటి వెనక ఉన్న వారి గురించి అధికారులు వివరించారు. రాజకీయం ముసుగులో నేరాలకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని సీఎం సూచించారు. సీఐడీ దర్యాప్తు చేస్తున్న మద్యం కుంభకోణం, మదనపల్లె ఫైళ్ల దహనం కేసుల పురోగతిపై సమీక్షించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న అవకతవకలు, జగనన్న ఇళ్ల నిర్మాణంలో కొనసాగిన దోపిడీ, ఫైబర్‌నెట్ కుంభకోణం తదితరాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేపట్టిన విచారణ నివేదికలపై సమీక్షించారు.

# ఎన్‌సీసీకి గడ్డు పరిస్థితులు

- క్యాంపుల నిర్వహణకు నిధులు లేక సతమతం
- మూడేళ్లలో రూ.17.5 కోట్లకు రూ.1.3 కోట్లే ఇచ్చిన తెలుగు రాష్ట్రాలు
- ఇక్కడి డైరెక్టరేట్‌ను మూసేయాలన్న డీజీ
- 1.39 లక్షల మంది క్యాడెట్లపై ప్రభావం


ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.ఎం.రెడ్డి

**ఈనాడు, హైదరాబాద్- కంటోన్మెంట్, న్యూస్‌టుడే:** నైపుణ్య శిక్షణపై దృష్టిపెడుతున్న తెలుగు రాష్ట్రాలు.. కీలకమైన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) శిక్షణపై నిర్లిప్తత ప్రదర్శిస్తున్నాయి. విద్యార్థులను క్రమశిక్షణ, దేహదారుఢ్యం, దేశభక్తి కలిగిన భావి పౌరులుగా తీర్చిదిద్దే, సైనిక దళాల్లో చేరికలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పే ఎన్‌సీసీ ఉనికికి తెలుగు రాష్ట్రాల్లో ప్రమాదం నెలకొంది. మూడేళ్లుగా తగినన్ని నిధులు మంజూరు కాకపోవడంతో క్యాడెట్స్‌కు క్యాంపులు నిర్వహించలేని గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. పరిస్థితి ఇలాగే ఉంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌సీసీ డైరెక్టరేట్‌ను మూసేయాలని డైరెక్టర్ జనరల్ ఇటీవల దిల్లీలో జరిగిన సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేయడం పరిస్థితికి అద్దం పడుతోంది.

రెండు తెలుగు రాష్ట్రాలకు సికింద్రాబాద్ కేంద్రంగా ఒకటే ఎన్‌సీసీ డైరెక్టరేట్ పనిచేస్తోంది. దీని పరిధిలో 1.39 లక్షల మంది క్యాడెట్స్ త్రివిధ దళాల యూనిట్లలో శిక్షణ పొందుతున్నారు. తెలంగాణలో హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్, నిజామాబాద్‌లో కలిపి 25 ఎన్‌సీసీ గ్రూపులు.. ఏపీలో కాకినాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, కర్నూలులో 45 గ్రూపులు ఉన్నాయి. ఒక్కో క్యాడెట్ రెండో ఏడాది నుంచి రెండు క్యాంపుల్లో పాల్గొంటారు. ఒక్కో క్యాంపునకు సుమారు 600 మంది హాజరవుతారు. ఇందుకు రూ.12 లక్షల వరకు ఖర్చవుతుంది. కేంద్రం 75 శాతం (రూ.9 లక్షలు) భరిస్తుంది. రాష్ట్రం 25 శాతం (రూ.3 లక్షలు) ఇవ్వాల్సి ఉంటుంది. రాష్ట్రాలు తమ వంతు వాటా ఇచ్చాకే కేంద్రం వాటా విడుదల చేస్తుంది. మూడేళ్లుగా తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు పూర్తి నిధులు ఇవ్వడం లేదు.

రెండు రాష్ట్రాల నుంచి మూడేళ్లలో రూ.17.5 కోట్లు ఇవ్వాల్సి ఉండగా.. రూ.1.3 కోట్లే మంజూరయ్యాయి. అదనంగా 26 వేల క్యాడెట్లను చేర్చుకోవడానికి అవకాశం ఉన్నా అదనపు వ్యయం భరించలేమని విస్తరణను ఆపేశారు. ఎన్‌సీసీకి రాష్ట్రాల యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖల నుంచి నిధులు విడుదలవుతున్నాయి. ఆ శాఖలకు బడ్జెట్ తక్కువ కావడంతో ఎన్‌సీసీకి వచ్చేసరికి ఏమీ మిగలడం లేదని.. ఈ విభాగాన్ని విద్యాశాఖ పరిధిలోకి తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు.

### శిక్షణ అకాడమీ సైతం కరవే..

పలు రాష్ట్రాల్లో ఎన్‌సీసీకి ప్రత్యేకంగా శిక్షణ అకాడమీలు ఉన్నాయి. అక్కడే క్యాంపులు నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో అకాడమీ లేకపోవడంతో విద్యాసంస్థల్లో సెలవు రోజుల్లో ఏర్పాటు చేస్తున్నారు. సికింద్రాబాద్ బైసన్‌పోలో మైదానంలో నిర్వహిస్తున్నా వర్షాకాలంలో పాముల బెడదతో క్యాడెట్స్‌ను ఇంటికి పంపిస్తున్నారు. 10-12 ఎకరాల స్థలం కేటాయిస్తే శిక్షణ అకాడమీ ఏర్పాటుకు అవకాశం ఉంటుందని ఎన్‌సీసీ అధికారులు చెబుతున్నారు. ఏపీ, తెలంగాణలకు వేర్వేరు డైరెక్టరేట్లు ఉంటే ఎక్కువ మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని సూచిస్తున్నారు.


సికింద్రాబాద్‌లోని ఎన్‌సీసీ కార్యాలయం

### సీఎంలు స్పందిస్తారనే ఆశాభావంతో ఉన్నాం..

ఇటీవల దిల్లీలో జరిగిన సంయుక్త సమావేశంలో 9 రాష్ట్రాల మంత్రులు పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఎవరూ హాజరుకాలేదు. క్యాంపుల నిర్వహణకు 2022 నుంచి రాష్ట్ర వాటా పూర్తిస్థాయిలో రావడం లేదు. వ్యయాలను సర్దుబాటు చేస్తూ నిర్వహిస్తున్నాం. సీఎంలను కలిస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అనుకుంటున్నాం. వారు తీరిక లేకుండా ఉండటంతో కలవడం సాధ్యపడటం లేదు.

– ఎయిర్ కమోడోర్ వి.ఎం.రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎన్‌సీసీ డైరెక్టరేట్ (ఏపీ, తెలంగాణ)

## ట్రోలింగ్‌తో మానసికంగా వేధిస్తున్నారు: మంత్రి కొండా సురేఖ

### భారాస శ్రేణులు నిద్ర లేకుండా చేస్తున్నారంటూ కంటతడి



**ఈనాడు, హైదరాబాద్:** భారాస నాయకులు సామాజిక మాధ్యమాల్లో తనను కించపరిచేలా ట్రోలింగ్ చేస్తూ మానసికంగా వేధిస్తున్నారని మంత్రి కొండా సురేఖ కన్నీటిపర్యంతమయ్యారు. సోమవారం ఆమె గాంధీభవన్‌లో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా కమిటీ ఛైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి మాట్లాడారు. 'ఇన్‌ఛార్జి మంత్రిగా మెదక్ జిల్లాకు వెళ్లాను. అక్కడి భాజపా ఎంపీ రఘునందన్‌రావు చేనేత సమస్యలు వివరించి.. గౌరవంగా చేనేత మాలను నా మెడలో వేశారు. ఈ ఘటనపై భారాస సోషల్ మీడియా శ్రేణులు చెప్పుకోలేని విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. నాకు నిద్ర లేకుండా చేస్తున్నారు. అది చేనేత వృత్తుల వారికి సంబంధించిన గౌరవప్రదమైన నూలు మాల. ఈ పోస్టులు చూసి నా పద్మశాలి కుటుంబసభ్యులు ఆవేదన చెందారు. గుర్తి భారాస కార్యాలయానికి వెళితే వారిని కొట్టారు. అధికారం కోల్పోవడంతో భారాస నేతలు పిచ్చిపట్టి దుర్మార్గమైన ప్రచారాలు చేస్తున్నారు. కేటీఆర్, హరీశ్‌రావు ఇంటి ఆడవాళ్లపై మాట్లాడితే ఊరుకుంటారా? ఇకపై వీటిని సహించేది లేదు. నాకు మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతో కేటీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మహిళలకు మంత్రి పదవులు ఇవ్వలేదు' అని సురేఖ పేర్కొన్నారు.

### సురేఖ అసౌకర్యానికి చింతిస్తున్నా: మాజీ మంత్రి హరీశ్‌రావు

సామాజిక మాధ్యమాల వేదికగా జరిగే వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నానని, మంత్రి కొండా సురేఖకు కలిగిన అసౌకర్యానికి ఆమెతోపాటు తానూ చింతిస్తున్నానని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విచారం వ్యక్తం చేశారు. ఈ అంశంపై 'ఎక్స్' వేదికగా సోమవారం ఆయన స్పందించారు. 'మహిళల పట్ల అగౌరవంగా ప్రవర్తించడాన్ని ఏ ఒక్కరూ సహించరు. ఈ విషయంలో భారాస అయినా ఉపేక్షించబోం. సామాజిక మాధ్యమాల్లో బాధ్యతగా వ్యవహరించాలని అందరినీ కోరుతున్నాను' అని పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గణపతిరెడ్డి. చిత్రంలో రాచకొండ కిష్టయ్య, వీరేశం తదితరులు

## డిమాండ్లను పరిష్కరించకపోతే కస్టమ్స్ మిల్లింగ్ చేయం

### రాష్ట్ర రా రైస్‌మిల్లర్ల సంక్షేమ సంఘం

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కస్టమ్స్ మిల్లింగ్ (సీఎంఆర్) చేయబోమని రాష్ట్ర రా రైస్ మిల్లర్ల సంక్షేమ సంఘం పేర్కొంది. మిల్లింగ్ నిబంధనలను మార్చాలని, శుభ్రం చేసిన వడ్లనే మిల్లులకు ఇవ్వాలని, తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరింది. సోమవారం ఘట్‌కేసర్‌లో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతి రెడ్డి, వీరేశం, ఉపాధ్యక్షుడు రాచకొండ కిష్టయ్య ఇతర నేతలు, అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొని ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించడం లేదని పేర్కొన్నారు. సీఎంఆర్‌లో క్వింటాలు దొడ్డు వడ్లకు 67 కిలోల బియ్యం ఇవ్వాలనే నిబంధనను మార్చి.. 60 కిలోలకు తగ్గించాలని, బీపీటీకి 55 కిలోలకు తగ్గించాలని కోరారు. ఇంకా మరి కొన్ని వినతులను ప్రతిపాదిస్తూ.. తీర్మానాలు చేశారు.

## హైదరాబాద్ మరో వయనాడ్ కాకూడదనే..

- మూసీ ప్రక్షాళనకు శ్రీకారం
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, న్యూస్‌టుడే:** హైదరాబాద్ మరో వయనాడ్ కాకూడదన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్నారంటే జలప్రళయంలో హైదరాబాద్ కొట్టుకుపోవాలని భారాస నేతలు భావిస్తున్నారా అని ప్రశ్నించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూసీని ఎక్కువగా భారాస నేతలే కబ్జా చేశారని ఆరోపించారు. "మూసీలో ఇప్పటి వరకు పేద ప్రజలకు చెందిన ఒక్క ఇంటిని కూడా కూల్చలేదు. మూసీని ప్రక్షాళించకపోతే హైదరాబాద్ నగరంతోపాటు రంగారెడ్డి, నల్గొండ జిల్లాలు నీటమునిగి ప్రజలకు నష్టం వాటిల్లుతుంది. అవగాహన లేకనే భారాస నేతలు మూసీ, హైడ్రాను రాద్ధాంతం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న భారాసపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మంత్రి కొండా సురేఖపై భారాస నాయకులు చేస్తున్న ట్రోలింగ్‌పై కేటీఆర్, హరీశ్‌రావులు స్పందించాలి" అని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, పీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ రాంమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, హైదరాబాద్ జిల్లాల విశ్రాంత ఉద్యోగులు గాంధీభవన్‌కు వచ్చి పీసీసీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించారు. తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఈ సందర్భంగా వారు కోరారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన నిర్మాణ విషయాన్ని సీఎంతో చర్చిస్తానని వారికి మహేశ్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు.

- యువజన కాంగ్రెస్ రూపొందించిన ఇందిరా ఫెలోషిప్ పోస్టరును మహేశ్‌కుమార్‌గౌడ్ సోమవారం గాంధీభవన్‌లో ఆవిష్కరించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జ్ఞాపకార్థం ఏఐసీసీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఆయన తెలిపారు.

### భారాస నేతలు ప్రజలకు శత్రువులు: ఎమ్మెల్యే యెన్నం

భారాస నేతలు తెలంగాణ ప్రజలకు శత్రువులని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. సోమవారం అసెంబ్లీలోని సీఎల్పీ మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రపంచంలోని విషపూరిత నదుల్లో మూసీ కూడా ఒకటని, దీని పక్కన 25 లక్షల మంది నివసిస్తున్నారని అన్నారు. మూసీ నీటితో పండిస్తున్న కూరగాయలు విషపూరితమవుతున్నాయని అన్నారు. మూసీ సుందరీకరణతో నష్టపోయే పేదలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. సీఎంగా కేసీఆర్ చేయలేకపోయిన పనిని ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తుంటే భారాస నేతలు ఓర్చుకోలేకపోతున్నారని మండిపడ్డారు.

## ఏపీలో నూతన మద్యం విధానం ఖరారు

### నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

**ఈనాడు, అమరావతి:** ఏపీలో రెండేళ్ల కాల పరిమితితో నూతన మద్యం విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ ఏడాది అక్టోబరు 12 నుంచి 2026 సెప్టెంబరు 30 వరకూ ఈ విధానం అమల్లో ఉంటుంది. మొత్తం 3,396 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి సోమవారం అర్ధరాత్రి తర్వాత నోటిఫికేషన్ను విడుదల చేసింది. మంగళవారం ఉదయం నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించనుంది. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చు. ఒకే వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకోవచ్చు. ఒక్కో దానికి రూ.2 లక్షలు చొప్పున నాన్ రిఫండబుల్ రుసుము చెల్లించాలి. డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా లేదా బ్యాంకు చలానా ద్వారా దరఖాస్తు రుసుము చెల్లించాలి. డీడీ తీసుకుని నేరుగా ఎక్సైజ్ స్టేషన్లలో అందించాలి. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో లాటరీ తీసి, లైసెన్సులు కేటాయించనున్నారు. ఈ నెల 11వ తేదీన ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి లైసెన్సుదారులు కొత్త దుకాణాలు ప్రారంభించుకోవచ్చు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) నడుపుతున్న ప్రభుత్వ మద్యం దుకాణాల విధానం గడువు సోమవారంతో ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో కొత్త విధానం అమల్లోకి వచ్చేంత వరకూ ప్రస్తుతమున్న ప్రభుత్వ దుకాణాలే యథాతథంగా కొనసాగనున్నాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా ఐదు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

## త్వరలో అంగన్‌వాడీ కేంద్రాల్లో రాగిజావ: మంత్రి సీతక్క



**మానకొండూర్, తిమ్మాపూర్, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని 5 లక్షల అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నపూర్ణ ట్రస్టు ద్వారా త్వరలో రాగిజావ అందిస్తామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సోమవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని బాలికల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పోషణ ఆరోగ్య జాతర, తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లోని మానసిక వికలాంగుల పాఠశాల వార్షికోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఏళ్ల తరబడి వంటింటికి పరిమితమైన స్త్రీలు ఇప్పుడిప్పుడే బయటకొచ్చి అన్ని రంగాల్లో రాణిస్తుంటే వారిని అవమానపరిచేలా భారాస శ్రేణులు ట్రోలింగ్ చేయడం సబబు కాదని మండిపడ్డారు. భారాస నాయకుల విష ప్రచారాలను కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పి కొట్టాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో విమర్శలకు హద్దు ఉంటుందని, దాన్ని ఎవరూ దాటవద్దని హితవు పలికారు.

## జాతీయ సగటును అధిగమించిన రాష్ట్ర ఐటీ ఎగుమతుల వృద్ధి

- ఇక్కడి అంకురాలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు
- ఆమ్‌చామ్ ఇండియా టెక్‌స్కేప్ సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు



**రాయదుర్గం, న్యూస్‌టుడే:** అనేక సవాళ్లు, సమస్యలకు సరికొత్త పరిష్కారాలతో రాష్ట్రంలో మొగ్గ తొడుగుతున్న అంకురసంస్థలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఈ ఏడాది రాష్ట్ర ఐటీ ఎగుమతుల వృద్ధి జాతీయ సగటును అధిగమించిందని తెలిపారు. హైదరాబాద్‌లోని రాయదుర్గం టీ హబ్‌లో అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇన్ ఇండియా(ఆమ్‌చామ్ ఇండియా) నగర ఛాప్టర్ ఆధ్వర్యంలో -టెక్- స్కేప్ తెలంగాణ' అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఆయన కీలకోపన్యాసం చేస్తూ.. 'రాష్ట్ర ప్రభుత్వ వ్యూహాత్మక చొరవ, వ్యాపార అనుకూల వాతావరణం, ఆవిష్కరణలకు ప్రాధాన్యం నేపథ్యంలో పెట్టుబడులను ఆకర్షించగలిగాం. యువతలో నైపుణ్యాభివృద్ధి, అంకురాలను ప్రోత్సహిస్తున్నందున టెక్ కంపెనీలకు నగరం గమ్యస్థానంగా నిలుస్తోంది. కృత్రిమ మేధ(ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), బ్లాక్‌చైన్ రంగాల పురోగతి రాష్ట్రంలో సాధ్యమైంది. ఫిన్‌టెక్, ఆరోగ్య రంగం, విద్యారంగ అంకురాలపై పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తున్నారు. సైబర్ సెక్యూరిటీకి అధిక ప్రాధాన్యమిస్తూ ఇందులో అంకురాలను ప్రోత్సహిస్తున్నాం. నగరంలో 200 ఎకరాల్లో ఏఐ సిటీ నిర్మాణంతో ఈ రంగంలో అగ్రగామిగా నిలవాలనేదే ప్రభుత్వ లక్ష్యం. అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో భాగస్వామ్యాలు నెలకొల్పుకొని వేలమంది విద్యార్థులు, ఉద్యోగులు, ప్రభుత్వ అధికారులకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వనున్నాం' అని మంత్రి వివరించారు. సదస్సులో వివిధ అంశాలపై చర్చాగోష్ఠులు నిర్వహించగా ప్రభుత్వ, పారిశ్రామిక రంగ ప్రముఖులు ప్రసంగించారు.

## తండ్రి దెబ్బలు తాళలేక.. ఠాణాకు బాలిక

**జగిత్యాల, న్యూస్‌టుడే:** తండ్రి పెట్టే చిత్రహింసలు తాళలేక ఓ బాలిక ఠాణా మెట్లెక్కింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లికి చెందిన బాలిక గడ్డం గంగజల తల్లి అనిత కరోనా సమయంలో మృతి చెందారు. దీంతో తండ్రి పెద్దరాజం.. లచ్చవ్వ అనే మరో మహిళను వివాహం చేసుకున్నాడు. ఏడో తరగతి చదువుతున్న గంగజలను తండ్రి నిత్యం కొడుతున్నాడు. లచ్చవ్వకు రెండ్రోజుల క్రితం జ్వరం రావడంతో జగిత్యాల జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చేర్పించారు. ఆమెతోపాటు జగిత్యాలకు వచ్చిన బాలిక గంగజల.. సోమవారం రాత్రి పట్టణ పోలీసుస్టేషన్‌కు వచ్చి తండ్రి దెబ్బలు తాళలేకపోతున్నానని.. తనను ఏదైనా వసతిగృహంలో చేర్పించాలని వేడుకుంది. బాలిక శరీరంపై ఉన్న దెబ్బలను చూసి చలించిపోయిన పోలీసులు.. ఆమెను జిల్లా సంక్షేమశాఖ అధికారులకు అప్పగించాలని నిర్ణయించారు. కౌన్సెలింగ్ ఇవ్వడానికి పెద్దరాజం కోసం ఆరా తీయగా అందుబాటులో లేడని పోలీసులు తెలిపారు.

## అబూజ్‌మడ్‌లో వేట!

- చుట్టుముడుతున్న భద్రతా దళాలు
- దండకారణ్యం చుట్టూ క్యాంపుల ఏర్పాటు
- మావోయిస్టు అగ్రనేతల పయనంపై సర్వత్రా ఆసక్తి
- ఎక్కువమంది 70 ఏళ్లకు పైబడిన వారే

**ఈనాడు, హైదరాబాద్:** అబూజ్‌మడ్ అంటే.. తెలియని కొండలు అని స్థానిక గోండి భాషలో అర్థం. దట్టమైన అడవులతో కూడిన ఆ ప్రాంతంలో స్థానిక గిరిజనులు తప్ప మిగతావారు తిరిగే సాహసం కూడా చేయలేరు. ఛత్తీస్‌గఢ్‌లో దండకారణ్యంగా పిలుచుకునే ఈ అబూజ్‌మడ్ ఇటీవలి వరకూ మావోయిస్టులకు పెట్టనికోటలా ఉంది. ఇప్పుడు ఆ ప్రాంతం నలువైపులా బేస్‌క్యాంపులతో కేంద్ర, రాష్ట్ర బలగాలు చుట్టుముడుతుండడంతో అక్కడ మకాం వేసిన మావోయిస్టు అగ్రనేతల సంగతి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ అగ్రనేతల్లో మూడొంతులు తెలుగువారే కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ దీనిపై చర్చ జరుగుతోంది. పైగా వీరిలో ఎక్కువ మంది 70 ఏళ్లు పైబడ్డ వారే కావడం గమనార్హం.

### ప్రతి 4 కి.మీ.కి ఒక బేస్‌క్యాంపు

అబూజ్‌మడ్‌కు నలువైపులా ప్రతి 4 కిలోమీటరుకు ఒక బేస్‌క్యాంపు చొప్పున ఏర్పాటు చేసుకుంటూ భద్రతా సిబ్బంది వ్యూహాత్మకంగా ముందుకు కదులుతున్నారు. ఇలా క్రమంగా మావోయిస్టులను వెనక్కు పంపుతూ ఒక ప్రాంతానికి పరిమితం చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ మధ్య సీఆర్‌పీఎఫ్ దళాలు అబూజ్‌మడ్ చుట్టూ 20 క్యాంపులను ఏర్పాటు చేశాయి. సరిహద్దు భద్రత దళం (బీఎస్‌ఎఫ్) కీలకమైన కాంకేర్ జిల్లాలో 3 క్యాంపులు నిర్వహిస్తోంది. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) విభాగం మూడు బెటాలియన్లను (3 వేల మంది) రంగంలోకి దించింది. స్థానికంగా డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్), పోలీసులు మావోయిస్టుల వేటలో నిమగ్నమయ్యాయి. ఇలా ఏదోఒకరోజు మావోయిస్టులు పాగా వేసిన ప్రాంతాన్ని బలగాలు చేరుకునే అవకాశం ఉంది. అదే జరిగితే అక్కడున్న మావోయిస్టులు ముఖ్యంగా అగ్రనేతల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.



- ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు మావోయిస్టులను తుడిచిపెడతామని అనేకమార్లు ప్రకటించారు. దీనికి తగ్గట్టుగానే ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలను మోహరిస్తున్నారు. నిరంతర కూంబింగ్, పక్కా నిఘాతో బలగాలు మావోయిస్టులపై విరుచుకుపడుతున్నాయి. దీని ఫలితం కనిపిస్తోంది.

### కేంద్ర కమిటీలో 11 మంది తెలుగువారే


అర్ధ శతాబ్దకాలంగా మావోయిస్టు ఉద్యమాన్ని తెలుగువారే నడుపుతున్నారు. ప్రస్తుత మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు అలియాస్ బసవరాజ్, ఆ కమిటీలోని 16 మంది సభ్యుల్లో 11 మంది తెలుగువారే. వీరంతా 70 ఏళ్లకు పైబడ్డ వారే కావడం గమనార్హం. కార్యదర్శి కేశవరావు, మాజీ కార్యదర్శి గణపతి, ఇతర కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి, కడారి సత్యనారాయణ, పుల్లూరి ప్రసాద్, మొడెం బాలకృష్ణ తదితరులు వయోభారం, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. అడవిలో వీరు ఎక్కువ దూరం నడవడం కూడా కష్టమే. ప్రస్తుతం చుట్టుముడుతున్న భద్రతా బలగాలను వీరు ఎలా తప్పించుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. మరోపక్క ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు తమవైపు రాకుండా తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలు సరిహద్దుల్లో నిరంతరం కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇంత సంక్లిష్ట పరిస్థితుల్లో మావోయిస్టు అగ్రనేతలు ఎలా మనగలుగుతారన్నది ప్రశ్నార్థకంగా మారింది. వారు పట్టుబడ్డా, లొంగిపోయినా మావోయిస్టు ఉద్యమం ఉనికి కోల్పోయినట్లే. మరోపక్క ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 120 మంది మావోయిస్టులు పోలీసుల కాల్పుల్లో మరణించగా 250 మంది లొంగిపోయారు. 223 మంది అరెస్టయ్యారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

## 26 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసిన సీబీఐ

### అందులో హైదరాబాద్‌లో ఐదుగురు, విశాఖలో 11 మంది

**దిల్లీ:** అక్రమ కాల్ సెంటర్లు నిర్వహిస్తూ ప్రజలను దోచుకుంటున్న 26 మంది సైబర్ నేరగాళ్లను సీబీఐ అరెస్టు చేసింది. 'ఆపరేషన్ చక్ర-3' పేరుతో హైదరాబాద్, విశాఖపట్నం, అహ్మదాబాద్, పుణె తదితర 32 చోట్ల గత గురువారం రాత్రి జరిపిన సోదాల వివరాలను అధికారులు సోమవారం వెల్లడించారు. విశాఖలో 11 మందిని, పుణెలో 10 మందిని, హైదరాబాద్‌లో ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద రూ.58.45 లక్షల నగదు, 3 ఖరీదైన వాహనాలు, పెద్దఎత్తున ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైళ్లు, ల్యాప్‌టాప్‌లు, ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విశాఖ మురళీనగర్‌లోని వి.సి.ఇన్‌ఫ్రోమెట్రిక్స్ ప్రై.లి., ఆత్రియ గ్లోబల్ సర్వీసెస్ ప్రై.లి., హైదరాబాద్‌లోని వయాజెక్స్ సొల్యూషన్స్, పుణెలోని వి.సి.ఇన్‌కన్‌ఫార్మిటీస్ ప్రై.లి.లో సోదాలు నిర్వహించినట్లు చెప్పారు.

## బతుకమ్మ వేడుకలకు వచ్చి.. పాఠశాల బస్సు కింద నలిగిన చిన్నారి


మనోజ్ఞ

**ముస్తాబాద్, న్యూస్‌టుడే:** వారంపాటు జ్వరంతో బాధపడ్డ చిన్నారి పాఠశాలలో బతుకమ్మ వేడుకలకు హాజరయ్యేందుకు వచ్చి విగతజీవిగా మారింది. తరగతి గదిలోకి వెళ్లే క్రమంలో తాను వచ్చిన బస్సే ఆమెను కబళించింది. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. నామాపూర్ గ్రామానికి చెందిన సల్కం వెంకటలక్ష్మి-భూమరాజులకు సంతానం కలగలేదు. దీంతో సమీప బంధువుల వద్ద మనోజ్ఞ(5)ను దత్తత తీసుకున్నారు. తల్లి బీడీ కార్మికురాలు కాగా, తండ్రి ఉపాధి నిమిత్తం రెండేళ్ల కిందట దుబాయ్ వెళ్లారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చిన్నారి నర్సరీ చదువుతోంది. జ్వరం రావడంతో వారం రోజులుగా పాఠశాలకు వెళ్లలేదు. జ్వరం తగ్గడం, పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయురాలు చెప్పడంతో సోమవారం వెళ్లింది. బస్సు దిగి తరగతి గదిలోకి వెళ్తోంది. ఈ క్రమంలో బస్సు సహాయకుడు సరిగా గమనించి, హెచ్చరించకపోవడంతో డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా బస్సు నడపడం వల్ల చిన్నారి తలపై నుంచి వెనక టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తల్లితోపాటు బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. తల్లి ఫిర్యాదుతో బస్సు డ్రైవర్ గురుమూర్తి, సహాయకుడు రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ వెల్లడించారు. పాఠశాలను సీజ్ చేయడంతోపాటు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని ఎన్‌ఎస్‌యూఐ, ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ నాయకులు మూడు గంటలు ఆందోళన చేశారు. పాఠశాలపై చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల ఆర్డీవో రమేశ్, డీఈవో రమేశ్‌కుమార్ వారికి హామీ ఇచ్చి బడి గేటుకు తాళం వేయించడంతో నిరసన విరమించారు.



### మార్చారు తలరాత.. మాస్టారుకు పల్లకి మోత

నలభై ఏళ్ల ఉద్యోగ జీవితం.. వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎందరినో తీర్చిదిద్దారు.. పలు ప్రాంతాల్లో పనిచేసిన ఆయన మార్గదర్శకత్వంలో 120 మందికిపైగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు సాధించారు. ఒక్క యాదాద్రి జిల్లా మోత్కూరు మండలంలోని దత్తప్పగూడెంలోనే 40 మందికిపైగా సర్కారు కొలువులు కైవసం చేసుకున్నారు. ఆయనే మోత్కూరు ఉన్నత పాఠశాలలో 20 ఏళ్లకుపైగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వ్యాయామ ఉపాధ్యాయుడు మందడి రాంరెడ్డి. సోమవారం ఆయన అభినందన సభ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.గోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రాంరెడ్డిని పూర్వ విద్యార్థులు పల్లకిలో మోసుకొని వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులు రాంరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. –న్యూస్‌టుడే, మోత్కూరు

## అమ్రాబాద్‌లో సఫారీ సందర్శనకు అనుమతి

**మన్ననూరు (అమ్రాబాద్), న్యూస్‌టుడే:** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యం (ఏటీఆర్)లోకి మంగళవారం నుంచి పర్యాటకులను అనుమతించనున్నారు. వన్యప్రాణుల సంతానోత్పత్తికి ఆటంకం కలగకుండా ఉండేందుకు మూడు నెలల క్రితం అడవిలోకి పర్యాటకుల అనుమతిని నిలిపివేశారు. ఇప్పుడు అటవీశాఖ సఫారీ సేవలను పునఃప్రారంభిస్తోంది. శ్రీశైలం ప్రధాన రహదారిపై మన్ననూరు నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఫర్హాబాద్ చౌరస్తా ఉంది. దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు అక్కడికి వెళ్లేందుకు అటవీశాఖ ఫర్హాబాద్ చౌరస్తా నుంచి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసింది.

## కబ్జాల కట్టడికి కావాలో చట్టం

(మొదటి పేజీ తరువాయి)

దీంతోపాటు ప్రభుత్వ భూములు, దేవాదాయ భూముల రక్షణకు కూడా ఒక చట్టం అవసరమన్న చర్చ జరుగుతోంది. ఇతరత్రా కేసుల విచారణలతో భూ ఆక్రమణలకు సంబంధించిన వ్యాజ్యాలు ఇతర కోర్టుల్లో ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. ప్రత్యేక కోర్టులు ఉంటే శీఘ్రగతిన న్యాయం చేకూరుతుందని నిపుణులు సూచిస్తున్నారు. రాష్ట్రంలో భూముల ధరలు భారీగా పెరగడంతో చాలచోట్ల ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు పెరుగుతున్నాయి. తప్పుడుపత్రాలు సృష్టించి కొందరు కబ్జాలు చేస్తున్నారు. ఈ తరహా కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించకపోతే ఆయా భూములు ప్రభుత్వం చేజారే పరిస్థితులున్నాయి. ఈ క్రమంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ప్రాధాన్యం ఏర్పడింది.

### అపరాధ రుసుం వసూలు తప్ప..

ప్రస్తుతం రాష్ట్రంలో భూ ఆక్రమణల నిషేధిత చట్టం (ఎన్‌క్రోచ్‌మెంట్ యాక్ట్) ఉంది. జిల్లాస్థాయిలో కలెక్టర్, మండల స్థాయిలో తహసీల్దార్లు.. భూకబ్జాలకు పాల్పడిన వారిపై అపరాధ రుసుం వసూలు చేయడానికి మాత్రమే ఈ చట్టం ఊతమిస్తోంది. ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ భూములైతే పంటనష్టం, ఏవైనా కట్టడాలు నిర్మిస్తే వాటిద్వారా ఏర్పడిన నష్టాన్ని మదింపు చేసి ఆ మేరకు అపరాధ రుసుం మాత్రమే విధిస్తున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై ప్రత్యేకంగా చర్యలు చేపట్టేందుకు భూ ఆక్రమణల నిరోధక చట్టం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. దీనిద్వారా కోర్టులు ఏడేళ్ల వరకు జైలు శిక్షతోపాటు అపరాధ రుసుం విధించడానికి వీలవుతుందని పేర్కొంటున్నారు.

### 4 రాష్ట్రాల్లో విజయవంతంగా..

ప్రస్తుతం 4 రాష్ట్రాల్లో విజయవంతంగా భూ ఆక్రమణల నిరోధక చట్టం అమలుతో పాటు, ప్రత్యేక కోర్టులు పనిచేస్తున్నాయి. ఈ మేరకు అస్సాం (2011), కర్ణాటక (2014), ఒడిశా (2015), గుజరాత్ (2020)లు చాలా ఏళ్లుగా అమలు చేస్తుండగా ఈ రాష్ట్రాల్లో ఆక్రమణల కట్టడి, శిక్షలు వేగవంతంగా అమలవుతున్నట్లు నిపుణులు ఉదహరిస్తున్నారు.

### నాడు 800 కేసుల బదిలీ..


ఉమ్మడి రాష్ట్రంలో భూ ఆక్రమణల నిరోధక ప్రత్యేక కోర్టు ఉండేది. రాష్ట్రపతి ఆమోదించిన చట్టంతో 1982లో ఈ కోర్టు ఏర్పడింది. విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి, ఇద్దరు జిల్లా జడ్జిలు, ఇద్దరు ఐఏఎస్ అధికారులు సభ్యులుగా కోర్టు కొనసాగింది. ఆక్రమణల నిరోధక చట్టానికి మరింత పదును పెట్టేందుకు ఉమ్మడి రాష్ట్రంలో అడ్వొకేట్ జనరల్ నేతృత్వంలో 2007లో ఒక కమిటీని కూడా ఏర్పాటుచేశారు. మరుసటి ఏడాదే కమిటీ పలు సిఫార్సులు చేయగా అమలు కాలేదు. అనంతరం 2014లో రెండు రాష్ట్రాలు ఏర్పాటు కాగా రెండేళ్లలో ఉమ్మడి రాష్ట్రంలోని చట్టాలను అన్వయించుకోవాలని విభజన చట్టం సూచించింది. అనంతరం తెలంగాణలో భూ ఆక్రమణల నిరోధక చట్టాన్ని పునర్వ్యవస్థీకరించలేదు. 2016లో రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని రద్దుచేయగా కోర్టు కూడా రద్దయింది. కోర్టు పరిధిలో ఉన్న దాదాపు 800 కేసులు హైకోర్టు, జిల్లా కోర్టులకు బదిలీ అయ్యాయి. 200 అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. కోర్టు పరిధిలో ఉన్న 60 మంది సిబ్బందిని కూడా ఇతర కోర్టులకు డిప్యూటేషన్‌పై పంపించారు.

## యూఏఈలో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలు

ఈనాడు, హైదరాబాద్: యూఏఈలో అత్యధిక డిమాండ్ ఉన్న డెలివరీ బాయ్స్ (బైక్‌రైడర్లు) ఉద్యోగాలకు ఆ దేశం ఆహ్వానిస్తోంది. ఈ ఉద్యోగాలకు యువకులు దరఖాస్తు చేసుకోవాలని టామ్‌కామ్ తెలిపింది. 21 నుంచి 40 ఏళ్లలోపు యువత అర్హులని, మూడేళ్లుగా టూవీలర్ లైసెన్సు ఉండాలని టామ్‌కామ్ సీఈవో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ రెజ్యూమెను tomcom.resume@gmail.comకు పంపించాలని, మరిన్ని వివరాలకు 9440051285, 9440048500, 9701040062, 9440051452 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


## కన్వీనర్ కోటాలో వైద్య సీట్ల కేటాయింపు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్య కళాశాలల్లో 2024-25 సంవత్సరానికి మొదటి రౌండ్ కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు వివరాలను కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం వెల్లడించింది. మొదటి రౌండ్ కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్‌లో అడ్మిషన్లు పొందిన విద్యార్థుల వివరాలను కళాశాలల వారీగా వెల్లడించింది. సీట్లు పొందినవారికి మొబైల్‌కు సమాచారం పంపారు. ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు సుప్రీంకోర్టు ఉత్తర్వులకు లోబడి ఉంటాయని పేర్కొంది.




## 'సాహితీ' లక్ష్మీనారాయణకు 14 రోజుల రిమాండు

ఈనాడు, హైదరాబాద్: ప్రీలాంచింగ్ ఆఫర్ల పేరుతో పెద్దఎత్తున డబ్బు వసూలు చేసి సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్న కేసులో సాహితీ ఇన్‌ఫ్రా వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బూదాటి లక్ష్మీనారాయణను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో వెల్లడించింది. ఆయనకు 14 రోజుల రిమాండు విధిస్తూ నాంపల్లి న్యాయస్థానం సోమవారం ఆదేశాలు జారీ చేసిందని తెలిపింది. ప్రపంచస్థాయి ప్రమాణాలతో గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, ఫ్లాట్లు నిర్మిస్తానని సాహితీ సంస్థ భారీగా డబ్బు వసూలు చేసి ప్రజలను మోసం చేసిందని, దీనికి సంబంధించి ఇప్పటికే తెలంగాణ పోలీసులు అనేక కేసులు నమోదు చేయగా వాటి ఆధారంగా నిధుల మళ్లింపు ఆరోపణలపై తాము మరో కేసు నమోదు చేశామని ఈడీ పేర్కొంది. దాదాపు 700 మంది నుంచి రూ.360 కోట్ల వరకూ వసూలు చేసినట్లు తమ దర్యాప్తులో వెల్లడైందని, ఈ సంస్థ చేపట్టిన ప్రాజెక్టులకు రెరా, హెచ్ఎండీఏ అనుమతులు కూడా లేవని, సేకరించిన డబ్బును లక్ష్మీనారాయణ తనతోపాటు తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి మళ్లించి చాలావరకూ డ్రా చేసుకున్నాడని వివరించింది. తన సంస్థ డైరెక్టర్‌గా ఉన్న సందు పూర్ణచంద్రరావుతో కుమ్మక్కై డబ్బు కొల్లగొట్టి దాని ద్వారా స్థిరాస్తులు కూడబెట్టుకున్నారని తెలిపింది. ఈడీ విచారణకు హాజరుకాకుండా తప్పుడు వైద్య పత్రాలు సమర్పించారని, చాలాకాలంగా తప్పించుకొని తిరుగుతున్నారని, విశ్వసనీయ సమాచారంతో ఆదివారం ఆయనను అరెస్టు చేశామని వెల్లడించింది. దర్యాప్తులో భాగంగా జరిపిన సోదాల్లో కీలకమైన పత్రాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు స్వాధీనం చేసుకున్నామని, రూ.161.50 కోట్ల స్థిర, చరాస్తులను జప్తు చేశామని ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ ఈ ప్రకటనలో వివరించింది.







EENADU Vol: 51, Iss: 52 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. 95 & 96, Survey No. 150, Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Hyderabad, Medchal District - 500 037, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223, RNI No. 27656/75, Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

## పిల్లలు, యువత చెప్పిన చోటుకే విహార యాత్ర!



- కుటుంబ యాత్రల రూపకల్పనలో కీలకంగా వ్యవహరిస్తున్న నవతరం

**దిల్లీ:** సెలవుల్లో ఎక్కడికెళ్దాం.. అనే విషయంలో ఇంట్లోని 14 ఏళ్లలోపు చిన్నారులు (జనరేషన్ ఆల్ఫా), 27 ఏళ్లలోపు యువతీ యువకుల (జనరేషన్ జడ్) ఆసక్తులకే ప్రాధాన్యం ఉంటోందని తాజా సర్వే పేర్కొంది. ముఖ్యంగా భారత్‌లోని యువ యాత్రికుల్లో 93 శాతం మంది కుటుంబ విహార యాత్రల ప్రణాళికల రూపకల్పనలో చురుకైన పాత్ర పోషిస్తున్నారని, కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని వెల్లడించింది. ఈ మార్పు పర్యాటక రంగ భవిష్యత్ ముఖ చిత్రానికి రూపకల్పన చేస్తుందని 'స్మాల్ వాయిసెస్, బిగ్ ఛాయిసెస్: హిల్టన్ 2025 ట్రావెల్ రిపోర్టు' అభిప్రాయపడింది. '76 శాతం భారతీయ తల్లిదండ్రులు.. (అంతర్జాతీయంగా 70 శాతం తల్లిదండ్రులు) తమ పిల్లల ఇష్టాల మేరకే విహార యాత్ర స్థలాలను ఎంపిక చేసుకుంటున్నారు. స్థలాలు, అక్కడి కార్యక్రమాలపై పిల్లల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. అదే సమయంలో ప్రయాణం (44%), ఆహారం (40%), బస (32%), బడ్జెట్ (28%), కాల వ్యవధి (26%) తదితరాలను తల్లిదండ్రులు నిర్దేశిస్తున్నారు' అని ఈ సర్వే పేర్కొంది. విహార యాత్రల పట్ల ఆసక్తితో ఉన్న భారతీయ యువత ఏడాదికి 2, 3 టూర్లకు వెళుతున్నట్లు నివేదిక వెల్లడించింది. 94 శాతం మంది కనీసం ఒక యాత్రకైనా వెళుతున్నట్లు తెలిపింది. 'జెన్ ఆల్ఫా, జెన్ జడ్ యాత్రికులు ఏడాది ముందే టూర్ ప్రణాళికలను రూపొందించుకుంటున్నారు. కొత్త ప్రదేశాలను చుట్టి రావడాన్ని 87 శాతం మంది గర్వకారణంగా భావిస్తున్నారు' అని సర్వే పేర్కొంది. భారతీయ యువత దేశీయ, అంతర్జాతీయ టూర్ల పట్ల ఆసక్తితో ఉన్నట్లు తెలిపింది.

## వయసుమళ్లిన వారిలో పెరుగుతున్న ఒంటరి ధోరణి

- తాజా అధ్యయనంలో వెల్లడి



**దిల్లీ:** దేశంలో వయసు మళ్లిన వారిలో ఒంటరిగా నివసించే ధోరణి పెరుగుతోందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. ఆర్థిక, సామాజిక స్వతంత్రతపై ప్రాధాన్యం పెరగడమే దీనికి ప్రధాన కారణమని పేర్కొంది. 'ఏజ్‌వెల్ ఫౌండేషన్' అనే సంస్థ సెప్టెంబరులో దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని 10 వేల మందిపై ఈ అధ్యయనం నిర్వహించింది. దాని ప్రకారం.. 14.3 శాతం మంది ఒంటరిగా జీవిస్తున్నట్లు వెల్లడైంది. ఇది పట్టణ ప్రాంతాల్లో 15 శాతం ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో 13.4 శాతంగా ఉంది. ఒంటరిగా ఉంటున్న వారిలో 41.9 శాతం మంది ఐదేళ్లకు పైబడి వేరుగా ఉంటున్నారని, ఇందులో 46.5 శాతం మంది మహిళలే ఉన్నారని తేలింది. ఇలా నివసిస్తున్న వారిలో మొత్తంగా 46.9% మంది తాము సంతోషంగా ఉన్నామని చెప్పగా.. 41.5% మంది అసంతృప్తిగా ఉన్నామని తెలిపారు. ఒంటరిగా ఉండటం వల్ల తమ మానసిక ఆరోగ్యం దెబ్బతింటోందని 41% మంది పేర్కొనగా.. తమ ఆరోగ్యం బాగుంటోందని 32% మంది చెప్పారు.

## రుతుక్రమం త్వరగా మొదలైతే.. ఎత్తులో అధిక పెరుగుదల!

**దిల్లీ:** రజస్వల అయ్యే వయసుకు, ఎత్తు పెరుగుదలకు మధ్య సంబంధం ఉంటున్నట్లు తాజా అధ్యయనమొకటి గుర్తించింది. త్వరగా రజస్వల అయ్యే బాలికలు.. ఆ తర్వాత ఎక్కువ ఎత్తు పెరిగే అవకాశాలు ఉంటాయని నిర్ధారించింది. స్వీడన్‌లోని గుటెన్‌బర్గ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు దాదాపు 800 మందిపై ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. రుతుక్రమం మొదలయ్యాక బాలికలు సగటున 6-8 సెంటీమీటర్ల ఎత్తు పెరుగుతారని గతంలో కొన్ని అధ్యయనాలు పేర్కొన్నాయి. అయితే ఆ పెరుగుదలలో చాలా వ్యత్యాసాలు ఉన్నాయని గుటెన్‌బర్గ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు వెల్లడించారు. 12 ఏళ్లు లేదా అంతకంటే తక్కువ వయసులోనే రుతుక్రమం మొదలైతే.. అప్పటి నుంచి బాలికలు దాదాపు 13 సెంటీమీటర్ల మేర ఎత్తు పెరుగుతున్నట్లు గుర్తించారు. 14 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసులో రజస్వల అయితే మాత్రం ఆపై సగటున మూడు సెంటీమీటర్లే పెరుగుతున్నట్లు తేల్చారు.



దిల్లీలోని జమైకా హైకమిషన్ సమీపంలో సోమవారం 'జమైకా మార్గ్' ప్రారంభ కార్యక్రమంలో క్రికెటర్ క్రిస్ గేల్, జమైకా ప్రధానమంత్రి ఆండ్రూ హోల్‌నెస్

## 2.17 కోట్ల సిమ్‌కార్డుల రద్దు!

- 2.26 లక్షల మొబైల్ ఫోన్లు బ్లాక్
- సైబర్ నేరాల నియంత్రణకు కేంద్రం చర్యలు
- జాతీయ మీడియా కథనాలు వెల్లడి

**దిల్లీ:** సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం మరిన్ని చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. నకిలీ పత్రాలు సమర్పించి పొందిన, సైబర్ నేరాల్లో ప్రమేయం ఉన్న సిమ్ కార్డుల రద్దు దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ఈ చర్యలు అమల్లోకి వస్తే 2.17 కోట్ల సిమ్‌కార్డులు రద్దు కానున్నాయి. అలాగే 2.26 లక్షల మొబైల్ ఫోన్లను బ్లాక్ చేయనున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిర్వహించిన సమావేశంలో ఈ కనెక్షన్ల రద్దుకు సంబంధించిన సమాచారాన్ని టెలికాం శాఖ సమర్పించినట్లు సమాచారం. ఆ సమావేశంలో బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్, ఆర్‌బీఐ, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ), ఐటీ శాఖ, సీబీఐకు చెందిన అధికారులు, ఇతర భద్రతా ఏజెన్సీలకు చెందిన నిపుణులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు. సిమ్ కార్డులు జారీ చేసేప్పుడు నో యువర్ కస్టమర్(కేవైసీ)ని సమర్థంగా అమలు చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.

కంబోడియా కేంద్రంగా జరుగుతున్న సైబర్ నేరాల గురించి కొన్నినెలల క్రితం మీడియాలో కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. దాదాపు 5 వేలమంది భారతీయులు ఆ దేశంలో చిక్కుకుపోయారని, వారి ఇష్టానికి వ్యతిరేకంగా, వారితో సైబర్ నేరాలు చేయిస్తున్నారని వాటి సారాంశం. డేటా ఎంట్రీ పోస్టులకు భారీ వేతనాల ఆశజూపి, సైబర్ మోసాలు చేయించేవారు. టెలీకాలర్లుగా ఫోన్లు చేసి క్రిప్టోకరెన్సీలో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలొస్తాయంటూ మోసగించడమే వీరి పని. ఈ విషయం వెలుగులోకి రావడంతో కేంద్రం మంత్రిత్వశాఖలతో కలిపి ఒక కమిటీని వేసింది. బ్యాంకింగ్, ఇమిగ్రేషన్, టెలికాం సెక్టార్లలో ఉన్న లోపాలను ఆ కమిటీ గుర్తించింది. ఈ నేపథ్యంలో భారతీయ నంబర్ల మాదిరిగా కనిపించే ఇంటర్నేషనల్ కాల్స్‌ను బ్లాక్ చేయాలని కొన్ని నెలల క్రితం టెలికాం ఆపరేటర్లకు టెలికాం శాఖ ఆదేశాలు జారీ చేసింది.

## సైబర్ నేరాల సూత్రధారి అరెస్టు

- 20 వేల సిమ్ కార్డులను మోసగాళ్లకు అందించిన నిందితుడు

**దేహ్రాదూన్:** అంతర్జాతీయ సైబర్ నేరస్థులకు సహకరిస్తున్న ఓ ముఠా సూత్రధారిని ఉత్తరాఖండ్ పోలీసులు అరెస్టు చేశాయి. హరిద్వార్ జిల్లా మంగలౌర్‌లో సోమవారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు సోహిల్ ఏడాదిగా ముఠాను నిర్వహిస్తూ ఆగ్నేయాసియా దేశాల్లోని సైబర్ నేరస్థులకు నకిలీ సిమ్ కార్డులను సమకూరుస్తుండేవాడు. ఇప్పటి వరకూ ఇలా సుమారు 20 వేల సిమ్‌లను అతడు మన దేశంలోని కొన్ని రాష్ట్రాలు, చైనా, థాయ్‌లాండ్, కంబోడియా, మయన్మార్, వియత్నాం, మలేసియాల్లోని నేరస్థులకు అందించాడు. సోహిల్ అరెస్టు సందర్భంగా అతని వద్ద నుంచి 1,816 సిమ్‌కార్డులు, రెండు చెక్‌బుక్‌లు, అయిదు మొబైల్ ఫోన్లు, రెండు బయోమెట్రిక్ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగలౌర్‌లో మహిళలకు ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తానని, కప్పులు, టీ సెట్ల వంటివి బహుమతులుగా ఇచ్చి వారి ఆధార్ కార్డులు, పత్రాలు, వేలిముద్రలు సేకరించి వాటితో వందల కొద్దీ సిమ్ కార్డులను సోహిల్ వినియోగంలోకి తీసుకువచ్చేవాడని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వివరించారు.

## రూ.9,600 కోట్ల పనులకు రేపు ప్రధాని మోదీ శ్రీకారం

**దిల్లీ:** స్వచ్ఛభారత్ మిషన్‌ను ప్రారంభించి అక్టోబరు రెండో తేదీకి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా పారిశుద్ధ్యం, పరిశుభ్రతలకు సంబంధించి రూ.9,600 కోట్ల పనులకు ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారు. మహాత్మాగాంధీ 155వ జయంతిని పురస్కరించుకుని బుధవారం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే స్వచ్ఛభారత్ దినోత్సవంలో ఆయన పాల్గొంటారని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. అమృత్, అమృత్ 2.0 కింద పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, మురుగునీటి పారుదల వ్యవస్థల మెరుగుదలకు ఉద్దేశించిన రూ.6,800 కోట్ల ప్రాజెక్టులు దీనిలో ఉన్నాయని వెల్లడించింది. దీంతోపాటు గంగానది ప్రక్షాళన కింద కొన్ని పనులు, బయోగ్యాస్ ప్లాంట్ల సంబంధిత పనులు చేపట్టబోతున్నట్లు తెలిపింది.

## పిల్లల చికిత్సకు రూ.10 కోట్లు ఇవ్వాల్సిందే

**దిల్లీ:** అరుదైన వ్యాధితో బాధపడుతున్న 18 మంది పిల్లల చికిత్స కోసం ఎయిమ్స్‌కు రూ.10 కోట్లు ఇవ్వాల్సిందేనని కేంద్ర ప్రభుత్వానికి దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. గతంలో ఇదే అంశంపై ఇచ్చిన ఆదేశాలను రీకాల్ చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. ఇప్పటికే పిల్లలకు చికిత్స ప్రారంభమైందని, మధ్యలో ఆపేస్తే ఇబ్బందులొస్తాయని జస్టిస్ ప్రతిభా ఎం సింగ్ స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో చికిత్స ఆపేయడం అన్యాయమని పేర్కొన్నారు.

## బొగ్గు కుంభకోణంలో ఐదుగురిపై దోష నిర్ధారణ

**దిల్లీ:** ఝార్ఖండ్‌లోని బొగ్గు గనుల కేటాయింపు కేసులో ఐదుగురిని సోమవారం దిల్లీ కోర్టు ఒకటి దోషులుగా తేల్చింది. 17వది అయిన ఈ కేసులో రుంగ్టా ప్రాజెక్ట్స్ లిమిటెడ్, అప్పటి ఎండీ ఆర్ఎస్ రుంగ్టా, సంజయ్ రుంగ్టా, టీఎం అచ్యుతన్, శంభునాథ్‌లను దోషులుగా న్యాయమూర్తి అరుణ్ భరద్వాజ్ నిర్ధారించారు. వారికి శిక్షపై అక్టోబరు 4న తీర్పు ఇవ్వనున్నారు.

## 4 నెలల వయసులో చేసిన బాల్య వివాహం రద్దు

**జోధ్‌పుర్:** నాలుగు నెలల వయసులో తనకు చేసిన వివాహాన్ని 20 ఏళ్ల వయసులో ఓ మహిళ రద్దు చేసుకున్నారు. దీనికి రాజస్థాన్‌లోని జోధ్‌పుర్ కుటుంబ న్యాయస్థానం అనుమతిచ్చింది. దీంతోపాటు కోర్టు ఖర్చులను చెల్లించాలని భర్తను ఆదేశించింది. అనిత అనే మహిళకు 4 నెలల వయసులో తల్లిదండ్రులు పెళ్లి చేశారు. 15 ఏళ్ల వయసు వచ్చాక కాపురానికి పంపాలని అత్తింటివారు ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆ యువతి కోర్టును ఆశ్రయించారు. వివాహాన్ని రద్దు చేయాలని కోరారు. విచారణ జరిపిన కోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

## మణిపుర్‌లో ఏఎఫ్‌ఎస్‌పీఏ ఆరు నెలలు పొడిగింపు

**ఇంఫాల్:** సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని(ఏఎఫ్‌ఎస్‌పీఏ) మరో ఆరు నెలలు పొడిగిస్తూ మణిపుర్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఇంఫాల్ లోయ పరిధిలోకి వచ్చే 19 పోలీసు స్టేషన్లు, అస్సాంతో సరిహద్దును పంచుకునే ప్రాంతానికి దీని నుంచి మినహాయింపు ఇచ్చింది. అక్టోబరు 1 నుంచి ఈ పొడిగింపు ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని రాష్ట్ర హోం శాఖ సోమవారం వెలువరించిన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

## భారత సర్వేయర్ జనరల్‌కు రూపాయి జరిమానా

**దిల్లీ:** రక్షిత అడవుల్లోని లక్ష వృక్షాలను కొట్టివేసిన కేసుకు సంబంధించి జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాలను ధిక్కరించిన భారత సర్వేయర్ జనరల్‌కు ఆ న్యాయస్థానం ఒక్క రూపాయి జరిమానా విధించింది. వృక్షాల నరికివేత కేసుకు సమాధానం ఇవ్వాలని, వర్చువల్‌గా విచారణకు హాజరు కావాలని ఎన్జీటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ గత విచారణ సమయంలో భారత సర్వేయర్ జనరల్‌ను ఆదేశించారు. సోమవారం నాటి విచారణకు సర్వేయర్ జనరల్ తన సమాధానాన్ని దాఖలు చేయకపోగా వర్చువల్ విచారణకూ గైర్హాజరయ్యారు. హాజరీ నుంచి మినహాయింపు కోరుతూ అభ్యర్థన కూడా పంపించలేదు. దీంతో సర్వేయర్ జనరల్‌కు నామమాత్రంగా ఒక రూపాయి జరిమానా విధించారు.



## యువతి తలలో సూది మర్చిపోయి.. కుట్లేసిన వైద్యుడు

**లఖ్‌నవూ:** వైద్యుల నిర్లక్ష్యం ఓ యువతి ప్రాణాలమీదకు తెచ్చింది. వివాదం విషయంలో తలకు గాయం కావడంతో ఆసుపత్రికి వెళ్లిన యువతికి చికిత్స చేసిన డాక్టర్ తలలోనే సర్జికల్ సూదిని మర్చిపోయిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని హాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాపూర్‌కు చెందిన పద్దెనిమిదేళ్ల యువతిపై కొందరు దాడికి దిగడంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆమె ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్లగా పరీక్షించిన వైద్యుడు తలకు కుట్లు వేసి పంపారు. ఇంటికి వెళ్లిన అనంతరం యువతికి తీవ్రంగా తలనొప్పి రావడంతో కుటుంబసభ్యులు ఆమెను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు యువతికి చికిత్స చేస్తుండగా తలలో సర్జికల్ సూది కనపడటంతో కంగుతిన్నారు. వెంటనే దానిని తొలగించి, కుట్లు వేశారు. దీంతో బాధితులు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. చికిత్స చేస్తున్న సమయంలో వైద్యుడు మద్యం మత్తులో ఉన్నందు వల్లే ఈ విధంగా జరిగినట్లు ఆరోపించారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో హాపూర్ జిల్లా చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ త్యాగి ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఘటనపై విచారణకు ఆదేశించామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## వైద్య సిబ్బందిపై అనుచిత ప్రవర్తన తగదు

- రాష్ట్రపతి ముర్ము హితవు

**దిల్లీ:** వైద్య సిబ్బంది పట్ల రోగుల సహాయకులు అనుచితంగా ప్రవర్తించడం తగదని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హితవు పలికారు. ఇటువంటి చర్యలను ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు. సోమవారం దిల్లీలో జరిగిన అటల్ బిహారీ వాజ్‌పేయీ వైద్య విద్యా సంస్థ, ఆర్ఎంఎల్ ఆసుపత్రి 10వ స్నాతకోత్సవంలో ఆమె మాట్లాడారు. రోగుల ప్రాణాలను కాపాడటానికి వైద్యులు అన్ని ప్రయత్నాలనూ చేస్తుంటారని, కొవిడ్ సమయంలో ఇది నిరూపితమైందని రాష్ట్రపతి పేర్కొన్నారు. 'రోగికి హాని చేయాలని ఏ ఒక్క వైద్యుడూ అనుకోరు. సైన్స్‌లో అన్నిసార్లూ పరిష్కారాలు దొరక్కపోవచ్చు. వైద్యులు ఒత్తిళ్ల మధ్య పని చేస్తుంటారు' అని వివరించారు.

### న్యాయబద్ధ పాలన ఉంటేనే ఆర్థిక వృద్ధి

న్యాయబద్ధమైన పాలన ఉన్నప్పుడే ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధ్యమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. సోమవారం తనను కలిసేందుకు రాష్ట్రపతి భవన్‌కు వచ్చిన ట్రైనీ ఐపీఎస్ అధికారులతో ఆమె మాట్లాడారు. 'శాంతి భద్రతలను, పౌరుల హక్కులను గాలికొదిలేసినప్పుడు దేశంలో జరుగుతున్న అభివృద్ధి ఒక అర్థం లేని వ్యర్థం అవుతుంది. స్త్రీలపై జరుగుతున్న దాడులను ప్రస్తావించదలుచుకున్నా. రాక్షస మనస్తత్వం, సమాజంలో ఉన్న మూఢ భావాల కారణంగా ఆ కేసులు సంక్లిష్టంగా ఉంటాయి. దీనిపై వివిధ దశల్లో పోరాటం జరగాల్సి ఉన్నప్పటికీ.. మొదటి స్పందన పోలీసుల నుంచే ఉండాలి' అని రాష్ట్రపతి సూచించారు. మొత్తం 188 మంది ఐపీఎస్ అధికారుల్లో 54 మంది మహిళలు ఉండటం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. గతంతో పోలిస్తే ఈ సంఖ్య చాలా ఎక్కువని పేర్కొన్నారు.



ట్రైనీ ఐపీఎస్ అధికారులతో సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

## ఐఎస్ఎస్‌కు చేరిన స్పేస్‌ఎక్స్ క్రూ-9

- ఫిబ్రవరిలో భూమికి తిరిగిరానున్న సునీతా విలియమ్స్

**ఇంటర్నెట్ డెస్క్:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన ఇద్దరు వ్యోమగాములను తిరిగి భూమికి తీసుకొచ్చేందుకు చేపట్టిన స్పేస్ఎక్స్ క్రూ-9 మిషన్ ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమైంది. క్రూ-9 మిషన్‌తో ఫాల్కన్-9 రాకెట్‌ను శనివారం ఫ్లోరిడాలోని కేప్ కెనావెరాల్ నుంచి ప్రయోగించారు. ఆదివారం సాయంత్రం అది ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. ఆ ప్రక్రియ పూర్తయ్యాక క్రూ-9 మిషన్‌లోని నాసా వ్యోమగామి నిక్ హాగ్, రష్యన్ కాస్మోనాట్ అలెగ్జాండర్ గోర్బునోవ్ ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించారు. తోటి వ్యోమగాములు వారిని ఆలింగనం చేసుకొని స్వాగతం పలికారు. నిక్, అలెగ్జాండర్ ఐదు నెలల పాటు ఐఎస్ఎస్‌లో వివిధ పరిశోధనలు చేపడతారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో భూమిపైకి తిరిగొస్తారు. చాన్నాళ్లుగా ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోయిన సునీతా విలియమ్స్, బచ్ విల్‌మోర్ కూడా వారితోపాటే భూమిపైకి రానున్నారు.

## లింగ వివక్షకు భారీ మూల్యం

- రూ.184.2 కోట్లు చెల్లించిన ఎఫ్‌బీఐ

**వాషింగ్టన్:** శిక్షణ సమయంలో లింగ వివక్ష చూపడంతోపాటు మహిళా ట్రైనీలను లైంగికంగా వేధించిన కేసులో అమెరికా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎఫ్‌బీఐ) భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. 34 మంది తొలగించిన మహిళలకు రూ.184.2 కోట్లను పరిహారంగా అందించేందుకు ఆ సంస్థ అంగీకరించింది. వర్జీనియాలోని క్వాంటికో అకాడమీలో శిక్షణ సమయంలో మహిళా ట్రైనీలపై శిక్షకులు లింగ వివక్ష చూపారు. వారిపై అసభ్యకర కామెంట్లు చేశారు. ఆ తర్వాత వారిని వివిధ కారణాలతో తొలగించారు. దీంతో 2019లో ఎఫ్‌బీఐపై వారు దావా వేశారు. విచారణల అనంతరం బాధితులతో సంస్థ ఒప్పందానికి వచ్చింది. వారికి రూ.184.2 కోట్లను చెల్లించేందుకు అంగీకరించింది. ఈ ఒప్పందాన్ని కోర్టు ఆమోదించాల్సి ఉంది. ఎఫ్‌బీఐ చరిత్రలో ఇదే అతి పెద్ద దావా కావడం గమనార్హం.

## 45 రోజులుగా నిద్రలేదు

- పని ఒత్తిడితో ఉద్యోగి ఆత్మహత్య

**లఖ్‌నవూ:** పని ఒత్తిడి కారణంగా ఉద్యోగులు ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు పెరుగుతున్నాయి. తాజాగా ఉత్తర్‌ప్రదేశ్‌లో అలాంటి ఘటనే చోటుచేసుకొంది. ఓ ఫైనాన్స్ సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దాదాపు 45 రోజులు నిద్ర లేకుండా పని చేశానని.. ఒత్తిడి కారణంగానే చనిపోతున్నట్లు ఆత్మహత్య లేఖలో పేర్కొన్నారు. ఝాన్సీకి చెందిన తరుణ్ సక్సేనా (42) ఓ ఫైనాన్స్ కంపెనీలో ఏరియా మేనేజర్‌గా పని చేస్తున్నారు. అయితే.. టార్గెట్‌లు విధిస్తూ ఉన్నతోద్యోగులు తనను తీవ్ర ఒత్తిడికి గురి చేసేవారని, పనిని సమయానికి పూర్తి చేయకపోతే జీతాన్ని కుదిస్తామని బెదిరించేవారని లేఖలో ప్రస్తావించారు. భార్యకు రాసిన అయిదు పేజీల లేఖలో తన ఆత్మహత్యకు గల కారణాలను వివరించారు. పై ఉద్యోగులు ఎంతో ఒత్తిడికి గురి చేసేవారని.. అవమానించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు.



అమెరికాలోని ఉత్తర కరోలినాలో హెలీన్ హరికేన్ తీవ్రతకు ధ్వంసమైన వాహనాలు

## బెంగాల్ ప్రభుత్వానికి 'సుప్రీం' చీవాట్లు

**దిల్లీ:** పశ్చిమబెంగాల్లోని వైద్య కేంద్రాల్లో డాక్టర్లు, ఇతర సిబ్బందికి అవసరమైన విశ్రాంతి గదులు, శౌచాలయాలు నిర్మించడంలో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఆసుపత్రులకు వచ్చి వెళ్లే వారిని గమనించటానికి, అక్కడి పరిస్థితులను సమీక్షించటానికి ఉపయోగపడే సీసీటీవీల అమరిక కూడా మందకొడిగా సాగుతుండడంపై మండిపడింది. అక్టోబరు 15వ తేదీకల్లా ఆ పనులన్నింటినీ పూర్తి చేయాలని బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఏ ఒక్క పనీ 50 శాతం కూడా పూర్తి కాలేదని ఆక్షేపించింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర సభ్యులుగా ఉన్నారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్యకళాశాల, ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను ధర్మాసనం సుమోటోగా విచారణకు చేపట్టిన విషయం తెలిసిందే.



### అది పోలీసుల పనే

బాధితురాలి పేరును, చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పదేపదే ప్రసారం చేయడం వల్ల ఆమె తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని సోమవారం విచారణ సందర్భంగా న్యాయవాది వృందా గ్రోవర్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సంబంధించి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలిచ్చామని, ఉల్లంఘించే వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. బాధితురాలి ఫొటో, పేరు, ఇతర వివరాలను అనధికారికంగా వెల్లడించే వారిని గుర్తించడానికి నోడల్ అధికారిని నియమించాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఆసుపత్రుల్లో చేపట్టాల్సిన భద్రతాపరమైన చర్యలను సూచించేందుకు ఏర్పాటైన జాతీయ కార్యదళం కార్యాచరణ పురోగతిపై నివేదిక సమర్పించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ఆదేశించింది. కేసు తదుపరి విచారణను అక్టోబరు 14వ తేదీకి వాయిదా వేసింది.

## సకాలంలో న్యాయం అందించకుంటే న్యాయ పాలనకు ప్రమాదమే: సుప్రీం

**దిల్లీ:** బాధితులకు సకాలంలో, వేగంగా న్యాయాన్ని అందించకుంటే దీర్ఘకాలంలో అది న్యాయ పాలనకు విపత్తుగా మారుతుందని సుప్రీంకోర్టు హెచ్చరించింది. సహేతుకమైన కారణాలు లేకుండా విచారణలను అడ్డుకునే ప్రయత్నాలను న్యాయస్థానాలు ఆదిలోనే అడ్డుకోవాలని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం స్పష్టం చేసింది. సకాలంలో న్యాయం జరుగుతుందని బాధితులు, నిందితులతో పాటు సమాజమూ ఆశిస్తుందని తెలిపింది. 2013 మార్చిలో నమోదైన ఓ వ్యక్తి హత్య కేసుకు సంబంధించి మళ్లీ దర్యాప్తు చేయాలంటూ మద్రాస్ హైకోర్టు పరిధిలోని మదురై ధర్మాసనం 2021 ఏప్రిల్‌లో వెలువరించిన ఆదేశాలను కొట్టివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. విచారణార్హత లేని అభ్యర్థనలను న్యాయస్థానాలు ప్రాథమిక పరిశీలనలోనే తోసిపుచ్చాలని స్పష్టం చేసింది. హైకోర్టు ధర్మాసనం తన ఆదేశాలకు సహేతుకమైన కారణాలను వెల్లడించలేదని ఆక్షేపించింది. ట్రయల్ కోర్టులో చివరి వాదనలు 2019 అక్టోబరులో ముగిశాయని పేర్కొన్న హైకోర్టు...మరోసారి దర్యాప్తునకు ఆదేశించడం సమర్థనీయంగా లేదని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం పేర్కొంది. 2021 డిసెంబరు 2నాటి అదనపు అభియోగ పత్రాన్ని పరిగణనలోకి తీసుకోవద్దంటూ అప్పీలును అనుమతించింది. ఇరుపక్షాల వాదనలను మళ్లీ విని 8 వారాల్లో తీర్పునివ్వాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది.

## 56 ఏళ్ల నాటి విమాన ప్రమాదం.. నలుగురి మృతదేహాలు లభ్యం

**దిల్లీ:** ఐదున్నర దశాబ్దాల క్రితం నాటి భారత వాయుసేన ఏఎన్-12 విమానం ప్రమాదానికి సంబంధించిన సెర్చ్ ఆపరేషన్‌లో కీలక పురోగతి చోటుచేసుకుంది. అప్పుడు అదృశ్యమైన వారిలో నలుగురి మృతదేహాలను గుర్తించినట్లు సైన్యం వెల్లడించింది. మిగతా వారికోసం గాలింపు కొనసాగుతోందని తెలిపింది. భారత వాయుసేనకు చెందిన టర్బోప్రాప్ ట్రాన్స్‌పోర్టు విమానం.. ఫిబ్రవరి 7, 1968న చండీగఢ్ నుంచి లేహ్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని రోహతంగ్ పాస్‌లో కూలిపోయింది. ఆ సమయంలో విమానంలో 102 మంది ప్రయాణికులు ఉన్నారు. వారందరి ఆచూకీ లేకుండా పోయింది. బాధితులంతా మంచు కొండల్లోనే చిక్కుకుపోయినట్లు సైన్యం భావించింది. గతంలో వారికోసం పలుమార్లు సెర్చ్ ఆపరేషన్ చేపట్టినప్పటికీ అక్కడ అత్యంత ప్రతికూల పరిస్థితుల కారణంగా ఫలితం లేకుండా పోయింది. తాజాగా చేపట్టిన ఆపరేషన్‌లో మరో నలుగురి అవశేషాలు వెలికితీశారు.

## క్రూజ్ భారత్ మిషన్ ప్రారంభం

- ముంబయిలో ఆరంభించిన కేంద్రమంత్రి సర్బానంద్

**ముంబయి:** దేశంలో క్రూజ్ (విలాస నౌకల్లో విహారం) పర్యాటకాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ సోమవారం 'క్రూజ్ భారత్ మిషన్' కార్యక్రమాన్ని ముంబయిలో ప్రారంభించారు. సముద్ర-నౌకాశ్రయ; నదీ; ద్వీప-దేశాంతర్గత ప్రాంతాలను మూడు కీలక క్రూజ్ విభాగాలుగా.. 2029 నాటికి ఇప్పుడున్న క్రూజ్ పర్యాటకుల సంఖ్యను రెట్టింపు చేయాలన్నది దీని లక్ష్యం. అంతేకాకుండా విలాస నౌకా విహార పర్యాటకానికి అంతర్జాతీయ కేంద్రంగా మనదేశం ఎదిగేలా, గమ్యస్థానంగా మారేలా చూడటమూ ఇతర లక్ష్యాలు.

## భారత్‌జెన్ ప్రాజెక్టు ఆరంభం

**దిల్లీ:** భారత్‌జెన్ ప్రాజెక్టును మనదేశం సోమవారం ప్రారంభించింది. వివిధ భారతీయ భాషల్లో పౌరులకు జనరేటివ్ ఏఐ (కృత్రిమ మేధ)ను అందుబాటులోకి తీసుకురావడం దీని లక్ష్యం. ప్రపంచంలో ప్రభుత్వ ఆర్థిక సహకారంతో రూపొందిన తొలి ప్రాజెక్టు ఇదేనని కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఇంటర్‌డిసిప్లినరీ సైబర్-ఫిజికల్ సిస్టమ్ (ఎన్ఎం-ఐసీపీఎస్)పై నేషనల్ మిషన్ కింద ఐఐటీ బొంబాయి నేతృత్వంలో రూపొందిన ఈ ప్రాజెక్టు జనరేటివ్ ఏఐ వ్యవస్థలను రూపొందిస్తుంది. ఇవి వివిధ భారతీయ భాషల్లో నాణ్యమైన సమాచారాన్ని విభిన్నంగా అందిస్తాయి. ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రధాన శాస్త్రీయ సలహాదారు ఎ.కె.సూద్, శాస్త్ర సాంకేతిక విభాగం కార్యదర్శి అభయ్ కరాందికర్, టెలికమ్యూనికేషన్ కార్యదర్శి నీరజ్ ప్రారంభించారు.

## జపాన్‌లో 27న పార్లమెంటు ఎన్నికలు

**టోక్యో:** జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా మంగళవారం రాజీనామా చేయనున్నారు. అనంతరం పాలనా పగ్గాలను తమ లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ)కే చెందిన షిగేరు ఇషిబాకు అప్పగించనున్నారు. ప్రధాని పదవిని చేపట్టిన తరవాత 27న పార్లమెంటు ఎన్నికలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఇషిబా ప్రకటించారు. మూడేళ్ల క్రితం ప్రధాని పదవి చేపట్టిన కిషిదా వరుసగా అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఇది ఆయన్ను రాజకీయంగా దెబ్బతీసింది. ఇది రాజీనామాకు దారితీసింది.

## రువాండాలో మార్‌బర్గ్ వైరస్

**కిగాలి:** ఆఫ్రికా దేశమైన రువాండాలో మార్‌బర్గ్ వైరస్ సోకి 8 మంది మరణించారు. ఈ వైరస్ సోకినవారితో సన్నిహితంగా ఉన్న 300 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఎక్కువమంది వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలే ఉన్నారు. ఎబోలాను పోలిన మార్‌బర్గ్ వైరస్ గబ్బిలాల్లో కనిపిస్తుంది. ఈ వైరస్ సోకినవారికి సకాలంలో చికిత్స అందకపోతే ప్రాణాలు కోల్పోతారు. మార్‌బర్గ్‌కు తోడు రువాండాలో ఎంపాక్స్ కేసులూ వెలుగు చూడటం ఆందోళన కల్గిస్తోంది.

## తైవాన్ మా పవిత్ర భూభాగం: జిన్‌పింగ్

**బీజింగ్:** తైవాన్ స్వతంత్రతను తాము వ్యతిరేకిస్తున్నట్లు చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ పునరుద్ఘాటించారు. అది తమ దేశ పవిత్ర భూభాగమని వ్యాఖ్యానించారు. చైనా జాతీయ దినోత్సవం (అక్టోబరు 1) నేపథ్యంలో బీజింగ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన ఓ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

## డ్రోన్లతో విరుచుకుపడిన రష్యా

**కీవ్:** రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య డ్రోన్ల యుద్ధం ముమ్మరమవుతోంది. ఉక్రెయిన్‌లోని 11 ప్రాంతాలపై ఆదివారం రాత్రి డ్రోన్లు, క్షిపణులతో రష్యా విరుచుకుపడింది. గత 33 రోజులుగా రాత్రి సమయాల్లో రష్యా గగనతల దాడులు కొనసాగిస్తోందని ఉక్రెయిన్ సైనికులు తెలిపారు. ఉక్రెయిన్ కూడా రష్యాపై డ్రోన్లను ప్రయోగిస్తోంది.

## ఆస్ట్రియాలో ఫ్రీడమ్ పార్టీ విజయం

**వియెన్నా:** ఆస్ట్రియా పార్లమెంటరీ ఎన్నికల్లో ఫ్రీడమ్ పార్టీ విజయం సాధించింది. దానికి మొత్తం 29.2% ఓట్లు వచ్చాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఆస్ట్రియా జాతీయ ఎన్నికల్లో ఒక ఫార్ రైట్ పార్టీ గెలవడం ఇదే తొలిసారి. ఛాన్స్‌లర్ కార్ల్ నెహామర్‌కు చెందిన ఆస్ట్రియన్ పీపుల్స్ పార్టీ 26.5% ఓట్లతో రెండో స్థానంతో సరిపెట్టుకుంది. సోషల్ డెమోక్రాట్స్ 21% ఓట్లు దక్కించుకుంది. ఎన్నికల్లో ఫ్రీడమ్ పార్టీ గెలిచినప్పటికీ ప్రభుత్వ ఏర్పాటుకు సరిపడా మెజార్టీ దక్కలేదు. సంకీర్ణ సర్కారు ఏర్పాటు కోసం దానితో చేతులు కలిపేందుకు ఇతర పక్షాలు సుముఖంగా లేవని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి.

# పన్ను లెక్కలు మారనున్నాయ్




## నేటి నుంచే అమల్లోకి

ఈనాడు - హైదరాబాద్

ప్రస్తుత ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌లో, పన్నుల విధానంలో పలు మార్పులను ప్రభుత్వం ప్రతిపాదించిన సంగతి విదితమే. ఇందులో కొన్ని ఇప్పటికే అమల్లోకి రాగా, మరికొన్ని అక్టోబరు 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

### వివాద్ సే విశ్వాస్

ఆదాయపు పన్ను వివాదాలకు సంబంధించిన పరిష్కారాల కోసం వివాద్ సే విశ్వాస్ పథకాన్ని 2020లో ప్రభుత్వం తీసుకొచ్చింది. దీనికి కొనసాగింపుగా బడ్జెట్‌లో వివాద్ సే విశ్వాస్ 2.0ను ప్రతిపాదించింది. మంగళవారం ఇది ప్రారంభం కానుంది. 2024 జులై 22 నాటికి వివాదంలో ఉన్న కేసులకు ఇది వర్తిస్తుంది.

### ఆధార్ నిబంధనలు

పాన్ కార్డు దరఖాస్తు, పన్ను రిటర్నులు దాఖలు చేసే సమయంలో ఆధార్ సంఖ్య, ఎన్‌రోల్‌మెంట్ ఐడీ ఈ రెండింటిలో ఏదో ఒకటి ఉంటే సరిపోయేది. ఇకపై కేవలం ఆధార్ సంఖ్యనే వినియోగించాలి.

### ఎస్‌టీటీ

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్ (ఎఫ్అండ్ఓ)లో కాంట్రాక్టును విక్రయిస్తే.. ఆప్షన్ ప్రీమియంపై ఎస్‌టీటీ (సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్) 0.0625% నుంచి 0.1 శాతానికి పెరగనుంది. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై ఎస్‌టీటీ 0.02% వర్తించనుంది.

### బాండ్లపై

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన బాండ్లపై వచ్చిన వడ్డీకి 10% మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్) వర్తిస్తుంది. ఇది ఈ రోజు నుంచే అమల్లోకి రానుంది. బాండ్లపై వచ్చిన రాబడి ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10వేలకు మించి ఉన్నప్పుడే టీడీఎస్ విధిస్తారు. ఫ్లోటింగ్ రేట్ సేవింగ్ బాండ్లకూ ఇదే నిబంధన ఉంటుంది.

### షేర్ల బైబ్యాక్‌లో

కంపెనీలు షేర్లను బైబ్యాక్ చేసినప్పుడు ఇప్పటి వరకూ సంస్థలకు పన్ను బాధ్యత ఉండేది. ఇప్పుడు ఇది వాటాదార్లకు బదిలీ అయ్యింది. డివిడెండ్ తరహాలోనే షేర్ల బైబ్యాక్ సమయంలోనూ పన్ను వర్తిస్తుంది.

## ఆడిట్ రిపోర్టుల దాఖలుకు 7 వరకు అవకాశం

దిల్లీ: గత ఆర్థిక సంవత్సరానికి గాను ఆడిట్ రిపోర్టులు సమర్పించేందుకు అక్టోబరు 7 వరకు గడువు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం ఆడిట్ రిపోర్టు సమర్పించాల్సిన పన్ను చెల్లింపుదారులు, ఎలక్ట్రానిక్ ఫైలింగ్ విషయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అందువల్లే సెప్టెంబరు 30 వరకు ఉన్న గడువును మరో వారం పెంచుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## బీమా ప్రీమియం భారమవుతుందా?

### పాలసీల స్వాధీన విలువ పెరగనున్న నేపథ్యం

దిల్లీ: పాలసీదారులకు ప్రయోజనం చేకూర్చే చర్యల్లో భాగంగా భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ).. పాలసీ స్వాధీన విలువకు సంబంధించి కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ఇవి అక్టోబరు 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో జీవిత బీమా ప్రీమియం కొంత మేర పెరగొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.



పాలసీదారు వ్యవధికి ముందే తన పాలసీని రద్దు చేసుకుంటే, బీమా సంస్థ ఆ పాలసీకి స్వాధీన విలువను లెక్కించి, చెల్లిస్తుంది. ఇది పాలసీని బట్టి మారుతుంది. చాలా సందర్భాల్లో చెల్లించిన ప్రీమియంలో 30-35 శాతానికి మించి ఉండకపోవడంతో.. పాలసీదారులు నష్టపోతున్నారు. దీనికి పరిష్కారం చూపించే క్రమంలో పాలసీ స్వాధీన విలువ సహేతుకంగా ఉండాలనే నిబంధనలను ఐఆర్‌డీఏఐ తీసుకొచ్చింది. ఇప్పటికే ఉన్న పాలసీలకూ కొత్త స్వాధీన విలువను గణించాలని పేర్కొంది.

**ద్వితీయార్ధం నుంచే..:** దీనిపై ఒక ప్రైవేటు బీమా సంస్థ ఉన్నతాధికారి స్పందిస్తూ.. స్వాధీన విలువ పెరిగిన నేపథ్యంలో, దీన్ని అందుకునేందుకు ప్రీమియాన్ని కాస్త పెంచడంతో పాటు, ఏజెంట్ల కమీషన్‌ను కొంత మేర కంపెనీలు తగ్గించక తప్పదని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధం నుంచి బీమా ప్రీమియాలు పెరిగే అవకాశం ఉందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ డైరెక్టర్ గౌరవ్ దీక్షిత్ పేర్కొన్నారు. ఇప్పటికే బీమా సంస్థలు కొత్త నిబంధనలు అమలు చేసేందుకు తమ పాలసీలను సవరిస్తున్నాయి. బీమా దిగ్గజం ఎల్ఐసీకి ఇది పెద్ద సవాలని నిపుణులు పేర్కొంటున్నారు.

ఈనాడు బిజినెస్

## డాక్టర్ రెడ్డీస్ చేతికి స్విస్ కంపెనీ బ్రాండ్లు

ఈనాడు, హైదరాబాద్: నికోటిన్ రిప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్ఆర్‌టీ) విభాగానికి చెందిన కన్జ్యూమర్ హెల్త్‌కేర్ బ్రాండ్లను స్విస్ కంపెనీ హలేన్ పీఎల్‌సీ నుంచి డాక్టర్ రెడ్డీస్ సొంతం చేసుకుంది. అమెరికా మినహా ఇతర దేశాల్లో ఈ బ్రాండ్లకు సంబంధించిన అన్ని హక్కులు డాక్టర్ రెడ్డీస్‌కు లభిస్తాయి. హలేన్ గ్రూపు సంస్థ అయిన నార్త్‌స్టార్ స్విట్జర్లాండ్ ఎస్ఏఆర్ఎల్ నుంచి ఈ బ్రాండ్లు కొనుగోలు చేసినట్లు డాక్టర్ రెడ్డీస్ సోమవారం వెల్లడించింది. స్విస్‌లోని తమ అనుబంధ సంస్థ ద్వారా ఈ బ్రాండ్లను కొనుగోలు చేసేందుకు 458 మిలియన్ పౌండ్లు (రూ. 5,000 కోట్లకు పైగా) చెల్లించామని డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది. ఈ బ్రాండ్లలో నికోటినెల్ అనే పెద్ద బ్రాండు ఉంది. ఆసియా, ఐరోపా, ల్యాటిన్ అమెరికా, ఆస్ట్రేలియా దేశాల్లో ఈ బ్రాండును అత్యధికంగా వినియోగిస్తున్నారు. ప్యాచ్, గమ్, లోజెంజ్ రూపాల్లో నికోటినెల్ మార్కెట్లో అందుబాటులో ఉంది. ఈ బ్రాండ్ల కొనుగోలుతో కన్జ్యూమర్ హెల్త్‌కేర్ విభాగాల్లో విస్తరించడానికి తమకు వీలవుతుందని డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది.

## చిన్న మొత్తాల పొదుపు పథకాల వడ్డీ రేట్లలో మార్పు లేదు

దిల్లీ: 2024 అక్టోబరు 1 నుంచి ప్రారంభమయ్యే త్రైమాసికానికి, వివిధ చిన్న మొత్తాల పొదుపు పథకాల వడ్డీ రేట్లలో ప్రభుత్వం ఎలాంటి మార్పు చేయలేదు. సోమవారం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, సుకన్య సమృద్ధి పథకంపై 8.2% వడ్డీ లభిస్తుంది. మూడేళ్ల టర్మ్ డిపాజిట్లపై 7.1%, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)పై 7.1 శాతం, పోస్టాఫీసు పొదుపు డిపాజిట్ పథకాలపై 4% వడ్డీ రేటును కొనసాగించింది. కిసాన్ వికాస్ పత్రపై 7.5% వడ్డీ లభిస్తుంది. ఇందులో పెట్టే పెట్టుబడి 115 నెలల్లో మెచ్యూరిటీకి వస్తుంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)లపై 7.7%, నెలవారీ ఆదాయ పథకంపై 7.4% వడ్డీ రేటు లభించనుంది. వరుసగా మూడో త్రైమాసికంలోనూ ఈ పథకాల వడ్డీ రేట్లను ప్రభుత్వం సవరించలేదు.

## ఎఫ్‌డీపై 7.5% వడ్డీ

ఈనాడు, హైదరాబాద్: స్వల్పకాలిక వ్యవధికి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే వారికోసం ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. 9 నెలల కాల వ్యవధి గల ఎఫ్‌డీపై 7.50%, 12 నెలల డిపాజిట్లపై 8.25% వడ్డీ ఇస్తామని తెలిపింది. సీనియర్ సిటిజన్లకు దీనిపై 0.50% వడ్డీ అధికంగా అందుతుంది.

## ఐఫోన్ కేస్‌ల ఉత్పత్తి తాత్కాలికంగా నిలిపివేత

దిల్లీ: ఐఫోన్ 15, ఐఫోన్ 16 కేస్‌ల ఉత్పత్తిని టాటా ఎలక్ట్రానిక్స్ తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఐఫోన్ల తయారీ కోసం వచ్చే మూడు నెలలకు సరిపడా కేస్‌ల నిల్వలున్నాయని, ఇబ్బందేమీ కలగదని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. శనివారం తెల్లవారక ముందు తమిళనాడులోని హోసూరు ప్లాంటులో ఎలక్ట్రానిక్స్ విడిభాగాలకు చెందిన ఒక రసాయన గోడౌన్‌లో భారీ ఎత్తున మంటలు చెలరేగడం వల్లే కేస్‌ల తయారీ నిలపాల్సి వచ్చింది.

### కోడి గుడ్లు

అక్టోబరు 1న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

| | |
|---|---|
| హైదరాబాద్ | 510 |
| వరంగల్ | 512 |
| విజయవాడ | 535 |
| గోదావరి | 535 |
| విశాఖపట్నం | 535 |
| చిత్తూరు | 523 |

## సోనీ 85 అంగుళాల టీవీ

### ప్రచారకర్తగా ఎస్ఎస్ రాజమౌళి




బ్రావియా 9 టీవీతో రాజమౌళి, సునీల్ నయ్యర్

ఈనాడు, హైదరాబాద్: పెద్ద తెరపై సినిమా చూసిన అనుభవాన్ని ఇంటి దగ్గరే సొంతం చేసుకునే విధంగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత 4కే ఓఎల్ఈడీ టెలివిజన్లను జపాన్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సోనీ ఆవిష్కరించింది. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సోనీ బ్రావియా 7 (75/65/55 అంగుళాలు, ధర రూ.1,82,000 నుంచి ప్రారంభం), బ్రావియా 8 (65/55 అంగుళాలు, ధర రూ.2,19,900 నుంచి ప్రారంభం), బ్రావియా 9 (85/75 అంగుళాలు, ధర రూ.4,49,990 నుంచి ప్రారంభం) స్మార్ట్ టీవీలను ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, సోనీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ నయ్యర్‌తో కలిసి దేశీయ విపణిలోకి విడుదల చేశారు. వీటికి రాజమౌళి ప్రచారకర్తగా వ్యవహరించనున్నారు. టీవీలతో పాటు థియేటర్ బార్ సిరీస్ 8, 9లనూ సోనీ విడుదల చేసింది.

## ఆంధ్రా సిమెంట్స్ రైట్స్ ఇష్యూ

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రా సిమెంట్స్ రైట్స్ ఇష్యూ ద్వారా ప్రస్తుత వాటాదార్ల నుంచి రూ.180 కోట్ల వరకు సమీకరించనుంది. దీనికి సోమవారం జరిగిన బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రైట్స్ ఇష్యూ కోసం అనుమతి కోరుతూ ఇప్పటికే సెబీకి, స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ దరఖాస్తు చేసింది. అనుమతులు రాగానే రైట్స్ ఇష్యూ ప్రక్రియ మొదలుపెడతారు.

## మౌలికంలో ప్రతికూల వృద్ధి

### మూడున్నరేళ్ల తర్వాత ఆగస్టులో -1.8%



దిల్లీ: మూడేన్నరేళ్ల తర్వాత ఆగస్టులో కీలక 8 మౌలిక రంగాల్లో ప్రతికూల వృద్ధి నమోదైంది. ఈ రంగాల ఉత్పత్తి వృద్ధి రేటు -1.8 శాతంగా నమోదైంది. 2021 ఫిబ్రవరిలో నమోదైన -3.3% తర్వాత ఇదే కనిష్ఠం. బొగ్గు, ముడి చమురు, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, సిమెంటు, విద్యుత్ రంగాల్లో ఉత్పత్తి తగ్గడమే ఇందుకు కారణం. ఈ ఏడాది జులైలో కీలక రంగాల ఉత్పత్తిలో 6.1% వృద్ధి రేటు నమోదైంది. 2023 ఆగస్టులో ఇది 13.4%.

✦ ఆగస్టులో బొగ్గు -8.1%, ముడి చమురు -3.4%, సహజవాయువు -3.6%, రిఫైనరీ ఉత్పత్తులు -1%; సిమెంటు -3%, విద్యుత్ రంగ ఉత్పత్తి -5% చొప్పున తగ్గాయి.

✦ ఎరువుల ఉత్పత్తిలో 3.2% వృద్ధి ఉండగా.. ఉక్కు ఉత్పత్తి వృద్ధి 16.4% నుంచి 4.5 శాతానికి తగ్గింది.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- ఆగస్టులో కీలక రంగాల ఉత్పత్తి 4.6% పెరగ్గా, గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో 8% వృద్ధి ఉంది.

✦ పారిశ్రామిక వృద్ధిని లెక్కించేందుకు ప్రామాణికంగా భావించే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ 8 కీలక రంగాల వాటా 40.27 శాతంగా ఉంటుంది.

## ఎఫ్&ఓ నిబంధనల కఠినతరంపై నిర్ణయాల్లేవు

● ప్యాసివ్ ఎంఎఫ్ పథకాల సరళీకరణ ● సెబీ బోర్డు సమావేశం




దిల్లీ: చిన్న మదుపర్లు అధికంగా నష్టాలు చవిచూస్తున్న ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్ఓ) ట్రేడింగ్‌కు సంబంధించి నిబంధనలను కఠినతరం చేయడంపై, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ బోర్డు ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు. ఎఫ్అండ్ఓ ట్రేడింగ్ నియంత్రణకు పలు ప్రతిపాదనలను సూచిస్తూ జులైలో ఓ చర్చాపత్రాన్ని సెబీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ ప్రతిపాదనలపై సోమవారం జరిగిన సెబీ బోర్డు సమావేశం నిర్ణయం తీసుకుంటుందని మార్కెట్ వర్గాలు ఎదురుచూసినా, వాటి జోలికి వెళ్లలేదు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనల్లో సవరణ, పెట్టుబడి సలహాదార్లు, పరిశోధన విశ్లేషకులకు అర్హతా పరిమితుల సడలింపు సహా మొత్తం 17 ప్రతిపాదనలకు ఈ సమావేశంలో సెబీ బోర్డు ఆమోదం తెలిపింది.

✦ ప్యాసివ్ మ్యూచువల్ ఫండ్ (ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్స్, ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్స్) పథకాలకు సంబంధించి సరళీకృత నిబంధనల విధానానికి సెబీ ఆమోదం తెలిపింది. ప్రాయోజిత సంస్థల (స్పాన్సర్స్)కు అర్హతలు, ట్రస్టీల బాధ్యతలు, అనుమతుల ప్రక్రియ, వివరాల వెల్లడి నిబంధనలను సరళీకరించింది.

✦ నిధుల సమీకరణకు ప్రాధాన్య మార్గంగా మార్చేందుకు రైట్స్ ఇష్యూ ప్రాసెసింగ్ సమయాన్ని 23 రోజులకు సెబీ తగ్గించింది.

✦ అధిక నష్టాన్ని భరించే సామర్థ్యమున్న మదుపర్లకు కొత్త పెట్టుబడి మార్గం (అసెట్ క్లాస్) తీసుకురావాలనే ప్రతిపాదనకు సెబీ ఆమోదం తెలిపింది. ఇందులో ఒక మదుపరి కనీసం రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పెట్టుబడిగా పెట్టొచ్చు.

## అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యూనిట్ల తనిఖీ

### కొన్ని అభ్యంతరాలు గుర్తించిన యూఎస్ఎఫ్‌డీఏ బృందం

ఈనాడు, హైదరాబాద్: అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ అయిన అపిటోరియా ఫార్మాకు హైదరాబాద్ శివార్లలోని సంగారెడ్డిలో ఉన్న యూనిట్లను అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) బృందం సెప్టెంబరు 23 - 27 తేదీల్లో తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో కొన్ని అభ్యంతరాలను యూఎస్ఎఫ్‌డీఏ గుర్తించినట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. ఆయా అభ్యంతరాలు సాధారణమైనవేనని, వీటిని తగిన సమయంలో సరిదిద్ది మళ్లీ యూఎస్ఎఫ్‌డీఏకు నివేదిస్తామని అరబిందో ఫార్మా వివరించింది.

## సస్యరక్షణ ఉత్పత్తుల పరిశీలనకు పాలీహౌస్: కోరమాండల్

ఈనాడు, హైదరాబాద్: ఎరువులు, సస్య రక్షణ ఉత్పత్తులు అందించే కోరమాండల్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ సమీపంలోని శామీర్‌పేట వద్ద ఉన్న తన పరిశోధన- అభివృద్ధి కేంద్రంలో నిర్మించిన పాలీహౌస్‌ను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.శంకరసుబ్రమణియన్ లాంఛనంగా ప్రారంభించారు. సంస్థ ఉన్నతాధికార్లు అమీర్ అల్వీ, అమిత్ రస్తోగి, మాదాబ్ అధికారి, జి.బాబు పాల్గొన్నారు. కొత్తగా అభివృద్ధి చేసిన విత్తనాలు, సస్య రక్షణ ఉత్పత్తుల సామర్థ్యాన్ని పరీక్షించడానికి, ఫలితాలను నిర్ధారించుకోవడానికి ఈ పాలీహౌస్ ఉపయోగపడుతుందని సంస్థ పేర్కొంది. నానో ఎరువులు, బయో స్టిమ్యులెంట్స్, ద్రవ ఎరువులు, నిదానంగా- నియంత్రణతో విడుదల చేసే ఎరువులు, కస్టమ్- కోటెడ్ ఎరువులు, పీజీఆర్ (ప్లాంట్ గ్రోత్ రెగ్యులేటర్స్) తదితర ఎరువులు, సస్య రక్షణ ఉత్పత్తులను ఇక్కడ పరీక్షించొచ్చు.

## కరెంట్ ఖాతా లోటు కాస్త పెరిగింది

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో దేశ కరెంట్ ఖాతా లోటు (సీఏడీ) 9.7 బిలియన్ డాలర్లు లేదా జీడీపీలో 1.1 శాతానికి చేరింది. ఏడాది కిందట ఇదే సమయంలో ఇది 8.9 బిలియన్ డాలర్లు (జీడీపీలో 1%)గా ఉందని ఆర్‌బీఐ సోమవారం వెల్లడించింది. జనవరి-మార్చి త్రైమాసికంలో 4.6 బిలియన్ డాలర్లు లేదా జీడీపీలో 0.5 శాతంగా కరెంట్ ఖాతా మిగులు చోటు చేసుకోవడం విశేషం. వస్తువుల వాణిజ్య అంతరం 56.7 బి. డాలర్ల నుంచి 65.1 బిలియన్ డాలర్లకు పెరగడం వల్లే ఏప్రిల్-జూన్‌లో సీఏడీ కాస్తంత అధికమైంది.

## ద్రవ్యలోటు 27 శాతానికి పరిమితం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అయిదు నెలల్లో కేంద్ర ద్రవ్యలోటు పూర్తి ఆర్థిక సంవత్సర లక్ష్యంలో 27 శాతంగా నమోదైందని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) వెల్లడించింది. వ్యయాలు, ఆదాయాల మధ్య అంతరమైన ద్రవ్యలోటు ఆగస్టు చివరకు రూ.4,35,176 కోట్లుగా నమోదైంది. 2023 ఇదే సమయంలో 2023-24 బడ్జెట్ అంచనా (బీఈ)ల్లో 36 శాతంగా ఇది ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ద్రవ్యలోటును జీడీపీలో 4.9 శాతానికి లేదా రూ.16,13,312 కోట్లకు పరిమితం చేయాలని కేంద్ర బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ఫ్లిప్‌కార్ట్‌లో జావా యెజ్డీ మోటార్‌సైకిళ్లు

ముంబయి: ఇ-కామర్స్ వెబ్‌సైట్ ఫ్లిప్‌కార్ట్‌లో జావా యెజ్డీ మోటార్‌సైకిళ్లను బుక్ చేసుకోవచ్చని కంపెనీ సోమవారం వెల్లడించింది. ఫ్లిప్‌కార్ట్‌కు ఉన్న 50 కోట్ల వినియోగదార్ల అనుభవాన్ని మెరుగుపర్చడానికి, ప్రీమియం మోటార్‌సైకిల్ శ్రేణి లభ్యత పెంచడానికి ఈ భాగస్వామ్యం దోహదం చేస్తుందని కంపెనీ తెలిపింది. క్లాసిక్ మోటార్‌సైకిల్ బ్రాండ్లు జావా, యెజ్డీ, బీఎస్ఏలను క్లాసిక్ లెజెండ్స్ డిజైన్ చేసి, ఉత్పత్తి చేసి విక్రయిస్తోంది.

## అష్నీర్ గ్రోవర్‌తో భారత్‌పే సెటిల్‌మెంట్



దిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ భారత్‌పే.. ఆ కంపెనీ మాజీ సహ వ్యవస్థాపకుడు అష్నీర్ గ్రోవర్‌తో సెటిల్‌మెంట్ ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో నెలల తరబడి సాగిన చట్టపరమైన, ప్రజా వివాదానికి ముగింపు పలికింది. ఈ ఒప్పందం ప్రకారం.. గ్రోవర్‌కు భారత్‌పేతో ఇకపై ఎలాంటి సంబంధం ఉండదు. కంపెనీ షేర్ హోల్డింగ్‌లో భాగం కూడా ఉండదు. గ్రోవర్ తన వాటాలో కొంత భాగాన్ని భారత్‌పే బోర్డుకు బదిలీ చేస్తారు. మిగిలిన మొత్తాన్ని అతనితో సంబంధం లేకుండా, కుటుంబ ట్రస్టు నిర్వహిస్తుంది. ఇరుపక్షాలు చట్టపరమైన కేసులను కొనసాగించబోవని భారత్‌పే, గ్రోవర్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఫిన్‌టెక్ యునికార్న్ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై దిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం దీపక్ గుప్తాను అరెస్టు చేసిన కొద్ది రోజులకు భారత్‌పేలో ఈ సెటిల్‌మెంట్ కుదరడం గమనార్హం. అష్నీర్ గ్రోవర్ భార్య మాధురీ జైన్ గ్రోవర్ సోదరి భర్తే దీపక్ గుప్తా. కంపెనీ ప్రయోజనం కోసం అతని వద్ద నిర్దిష్ట సంఖ్యలో ఉన్న షేర్లను రెసిలెంట్ గ్రోత్ ట్రస్ట్‌కు బదిలీ చేయనున్నారు. మిగిలిన షేర్లు అతని కుటుంబ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తారు.

**అసలేం జరిగింది?:** 2022 జనవరిలో కోటక్ మహీంద్రా బ్యాంక్ సిబ్బందిపై అసభ్యకర పదజాలం వినియోగించారన్న ఆరోపణలతో పాటు, మోసపూరిత విధానాలు అనుసరించారని వార్తలు రావడంతో భారత్‌పే కంపెనీ గ్రోవర్‌ను సెలవుపై పంపింది. 2022 ఫిబ్రవరిలో పాలనా సమీక్ష కోసం శామ్, అల్వారెజ్, మార్సల్ (ఏ అండ్ ఎం), పీడబ్ల్యూసీలను భారత్‌పే నియమించుకుంది. ఏ అండ్ ఎం నివేదికలో మాధురీ జైన్ గ్రోవర్, ఆమె కుటుంబ సభ్యులు, సోదరుడు శ్వేతాంక్ జైన్, బావ దీపక్ జగదీశ్రమ్ గుప్తా భారత్‌పేలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించింది. నకిలీ ఇన్‌వాయిస్‌లను తయారు చేయడం నుంచి వ్యక్తిగత సౌందర్య చికిత్స, విదేశీ పర్యటనల కోసం కంపెనీ నిధులు వాడుకున్నారని, ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ గ్రోవర్ భార్య మాధురీ జైన్ గ్రోవర్‌ను 2022 ఫిబ్రవరి 23న భారత్‌పే తొలగించింది. మార్చి 1న గ్రోవర్ కంపెనీ ఎండీ బాధ్యతల నుంచి వైదొలిగారు. తాజాగా భారత్‌పేతో సెటిల్‌మెంట్‌కు వచ్చారు.

## కొన్ని రకాల స్క్రూలకు నాణ్యతా నిబంధనలు తప్పనిసరి

దిల్లీ: నాణ్యత లేని వస్తువుల దిగుమతిని అరికట్టడానికి, దేశీయ తయారీని పెంచడానికి, వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కొన్ని రకాల స్క్రూలకు తప్పనిసరి నాణ్యతా నిబంధనలను విధించింది. భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) ధ్రువీకరణ ఉంటే మినహా ఈ ఉత్పత్తులను ఉత్పత్తి చేయడం, విక్రయించడం, నిల్వ చేయడం కుదరదు. నిబంధనలను ఉల్లంఘిస్తే మొదటి నేరానికి రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా కనీసం రూ.2 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. రెండోసారి, తదుపరి నేరాల విషయంలో జరిమానా కనీసం రూ.5 లక్షలకు పెరుగుతుంది. గరిష్ఠంగా వస్తువుల విలువ కంటే 10 రెట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ మేరకు పరిశ్రమ ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. 6 నెలల తర్వాత ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయి.

## సీఏలకు కౌన్సెలింగ్ హెల్ప్‌డెస్క్: ఐసీఏఐ

దిల్లీ: పని ఒత్తిడి కారణంగా ఒక చార్టర్డ్ అకౌంటెంట్(సీఏ) మరణించిన నేపథ్యంలో, ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) దిద్దుబాటు చర్యలకు దిగింది. ఒత్తిడి నివారణకు ఏం చర్యలు తీసుకోవాలో సూచించాలంటూ ఒక బృందాన్ని ఏర్పాటు చేసింది. సీఏలకు సహాయంగా కౌన్సెలింగ్ హెల్ప్ డెస్క్‌నూ తీసుకురానుంది.

**ఇదీ కారణం:** ఈవై గ్లోబల్‌కు చెందిన ఎస్.ఆర్. బట్లిబోయ్ అనే సంస్థలో పనిచేస్తున్న అన్నా సెబాస్టియన్ పెరయిల్ అనే చార్టర్డ్ అకౌంటెంట్ తీవ్ర పని ఒత్తిడి కారణంగా ఇటీవల చనిపోయారు. ఈ వృత్తిలో ఒత్తిడిని ఎదుర్కోవడానికి, వృత్తి - వ్యక్తిగత జీవిత సమతౌల్యాన్ని మెరుగుపరచడానికి ఈ బృందం చర్యలు తీసుకుంటుందని ఐసీఏఐ వివరించింది. ఐసీఏఐ జాతీయ కాల్ సెంటర్ (9997599975)లోనే ప్రత్యేక కౌన్సెలింగ్ హెల్ప్ డెస్క్‌నూ ఏర్పాటు చేయనున్నారు. ఐసీఏఐలో 4 లక్షల మంది సభ్యులు, 8 లక్షల మందికి పైగా విద్యార్థులు ఉన్నారు.

# ఊహించని నష్టాలు

సెన్సెక్స్ ▼1272 84300

నిఫ్టీ ▼368 25811



● జపాన్ మార్కెట్ల క్షీణత.. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం

● రూ.3.57 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరి

సమీక్ష

బ్యాంకింగ్, ఫైనాన్స్, వాహన షేర్లలో భారీ అమ్మకాలతో సోమవారం మదుపర్లు ఊహించని నష్టాలు చవిచూశారు. జపాన్ మార్కెట్లు కుప్పకూలడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవ్వడం, విదేశీ మదుపర్ల అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి. ఆ ప్రభావంతో సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు 1.5% నీరసపడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 10 పైసలు తగ్గి 83.79 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.19% నష్టంతో 71.84 వద్ద ట్రేడవుతోంది.

✦ మదుపర్ల సంపదగా పరిగణించే, బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ సోమవారం రూ.3.57 లక్షల కోట్లు తగ్గి రూ.474.35 లక్షల కోట్ల (5.66 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 363 పాయింట్ల (క్రితం ముగింపు 85,571.85) నష్టంతో 85,208.76 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా బలహీనంగానే కదలాడిన సూచీ, ఒకదశలో 1314.71 పాయింట్లు క్షీణించి, 84,257.14 పాయింట్లకు పడింది. చివరకు 1272.07 పాయింట్ల నష్టంతో 84,299.78 వద్ద ముగిసింది. నిఫ్టీ 368.10 పాయింట్లు కోల్పోయి 25,810.85 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,794.10- 26,134.70 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 25 కుదేలయ్యాయి. యాక్సిస్ బ్యాంక్ 3.12%, ఎం అండ్ ఎం 2.70%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.58%, నెస్లే 2.12%, టెక్ మహీంద్రా 2.10%, మారుతీ 1.99%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.88%, ఎస్‌బీఐ 1.88%, టాటా మోటార్స్ 1.78%, ఇన్ఫోసిస్ 1.64%, భారతీ ఎయిర్‌టెల్ 1.46% డీలాపడ్డాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 2.82%, ఎన్‌టీపీసీ 1.27%, టాటా స్టీల్ 1.17%, ఏషియన్ పెయింట్స్ 0.55% లాభపడ్డాయి.

✦ **మ్యాన్‌కైండ్ ఫార్మా రూ.10,000 కోట్ల సమీకరణ:** నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్ల జారీ ద్వారా రూ.10,000 కోట్ల వరకు సమీకరించనున్నట్లు మ్యాన్‌కైండ్ ఫార్మా తెలిపింది.

✦ రాజస్థాన్‌లో రూ.1.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో **టాటా పవర్** ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో రూ.75,000 కోట్లను గ్రీన్ ఎనర్జీ, రాజస్థాన్ విద్యుత్ రంగంపై వెచ్చించనుంది.

✦ సింగపూర్ ఎయిర్‌లైన్స్‌తో కలిసి కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డును **ఎస్‌బీఐ కార్డ్** విడుదల చేసింది. క్రిస్‌ఫ్లయర్ ఎస్‌బీఐ కార్డ్ (వార్షిక ఫీజు రూ.2,999+ పన్నులు), క్రిస్‌ఫ్లయర్ ఎస్‌బీఐ కార్డ్ అపెక్స్ (వార్షిక ఫీజు రూ.9999+పన్నులు) వేరియంట్లలో ఇది లభించనుంది. సింగపూర్ ఎయిర్‌లైన్స్, స్కూట్ ఎయిర్‌లైన్, కిరస్‌షాప్.కామ్, క్రిస్+లైఫ్‌స్టైల్ ఆప్, పెలాగోలలో పలు సదుపాయాలను ఈ కార్డుదారులకు కల్పించనున్నారు.

✦ **రిలయన్స్ షేరుకు 3.23% నష్టాలు:** అమ్మకాల ఒత్తిడితో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ఇంట్రాడేలో 3.35% తగ్గి రూ.2,950 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 3.23% (రూ.98.60) నష్టంతో రూ.2,953.80 దగ్గర స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.66,819.76 కోట్లు తగ్గి రూ.19.98 లక్షల కోట్లకు పరిమితమైంది.

✦ 2016లో కొనుగోలు చేసిన స్పెక్ట్రమ్ కోసం ప్రభుత్వానికి ముందస్తుగా రూ.8,465 కోట్లు చెల్లించినట్లు **భారతీ ఎయిర్‌టెల్** వెల్లడించింది. ఈ బకాయిలపై 9.3% వడ్డీ రేటు చెల్లిస్తున్నట్లు పేర్కొంది.

✦ తమిళనాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి హైడ్రోజన్ ప్రాజెక్ట్ కాంట్రాక్టును **గ్రీన్‌జో ఎనర్జీ** అందుకుంది. దీంతో కంపెనీ మొత్తం ఆర్డరు పుస్తకం విలువ రూ.1,200 కోట్లకు చేరింది.

✦ **ఐఎల్ అండ్ ఎఫ్ఎస్** గ్రూప్ కొత్త ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా నంద్ కిశోర్ నియమితులయ్యారు. అక్టోబరు 1 నుంచి ఆయన నియామకం అమల్లోకి రానుంది.

✦ దక్షిణ భారత్‌లో ఇంధన నిర్వహణ వ్యవస్థల అభివృద్ధి, అమలు కోసం ఆర్డరు పొందినట్లు **ఎల్ అండ్ టీ** ప్రకటించింది.

✦ స్టాక్ బ్రోకర్ నియమాలు, ఇతర నిబంధనలను ఉల్లంఘించినందుకు **ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్‌**పై రూ.10 లక్షల జరిమానాను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ విధించింది.


✦ కేజీ-డీ6 క్షేత్రంలో ఉత్పత్తి చేసే సహజవాయువు ధరను మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్‌కు 10.16 డాలర్లకు **రిలయన్స్ ఇండస్ట్రీస్** పెంచింది. పైప్డ్ వంట గ్యాస్ రేట్లలో ఎటువంటి మార్పులు చేయలేదు.

✦ **డిఫ్యూజన్ ఇంజినీర్స్** ఐపీఓ ముగిసేసరికి 114.50 రెట్ల స్పందన లభించింది. 65,98,500 షేర్లను సంస్థ ఆఫర్ చేయగా, 75,55,15,992 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. ఎన్ఐఐ విభాగంలో 207.60 రెట్లు, క్యూఐబీల నుంచి 95.74 రెట్లు, రిటైల్ మదుపర్ల నుంచి 85.61 రెట్ల స్పందన వచ్చింది.

✦ ఐపీఓ ద్వారా రూ.3000-3500 కోట్లు సమీకరించే లక్ష్యంతో **డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్**, రూ.600 కోట్లు సమీకరించేందుకు **సోలార్ వరల్డ్ ఎనర్జీ సొల్యూషన్స్** సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి.

✦ ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు **విశాల్ మెగా మార్ట్, యాక్మే సోలార్ హోల్డింగ్స్, మమతా మెషినరీ** కంపెనీలకు సెబీ అనుమతి ఇచ్చింది.

✦ అంతర్జాతీయ కర్బన వ్యర్థాల నిర్మూలనకు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) ప్రారంభించిన ట్రాన్సిషనింగ్ ఇండస్ట్రియల్ క్లస్టర్స్ కార్యక్రమంలో మూడు అదానీ గ్రూప్ సంస్థలు **అదానీ న్యూ ఇండస్ట్రీస్, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, అంబుజా సిమెంట్స్** చేరాయి.




## గేమ్ ఛేంజర్ సందడి షురూ

'కన్న వూర్లో కాలెట్టానంటే నేనైనా నీలాంటోణ్నే... మాటలన్నీ చేతల్లో పెడితే మీరైనా నాలాంటోళ్లే...' అంటూ సందడి షురూ చేశారు రామ్‌చరణ్. ఇదంతా 'గేమ్ ఛేంజర్' చిత్రం కోసమే. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రమిది. కియారా అడ్వాణీ కథానాయిక. దిల్‌రాజు, శిరీశ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలోని 'రా మచ్చా మచ్చా...' అంటూ సాగే పాటని సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. 'కళ్లజోడు తీస్తే నీలాంటివాణ్నే... షర్టు పైకి పెడితే నీలాంటివాణ్నే...' అంటూ మొదలయ్యే ఈ పాటకి తమన్ స్వరాలు సమకూర్చగా, అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. నకాశ్ అజీజ్ ఆలపించారు. కథానాయకుడి పరిచయం నేపథ్యంలో వచ్చే ఈ పాటని వెయ్యి మందికి పైగా కళాకారుల నేపథ్యంలో తెరకెక్కించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన జానపద నృత్యాలు, సంగీత కళలు ఈ పాటకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. గణేశ్ ఆచార్య నృత్య రీతులు సమకూర్చిన ఈ పాటలో, రామ్‌చరణ్ ఓ బాణీకి సింగిల్ టేక్‌లో చేసిన నృత్యాలు, శంకర్ మార్క్ హంగులు ఈ పాటకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని సినీ వర్గాలు తెలిపాయి. ఇందులో రామ్‌చరణ్ యువ ఐఏఎస్ అధికారి పాత్రలో సందడి చేయనున్నారు.

# ఈనాడు సినిమా

# అభినయ చక్రవర్తి

ఐ యామ్ ఎ డిస్కో డ్యాన్సర్ అంటూ ఒంట్లో ఎముకలే లేనట్టు ఆయన చేసిన డ్యాన్స్ ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించింది..

'డ్యాన్స్ డ్యాన్స్'లో డిస్కో బ్రేక్ స్టెప్పులతో ఆయన చేసిన హంగామాకు థియేటర్లు హోరెత్తిపోయాయి..

ఆయనే 80, 90ల్లో బాలీవుడ్‌ని ఏలిన ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి. కానీ మిథున్ అంటే డిస్కో పాటలే కాదు యాక్షన్ చిత్రాలు, కుటుంబ కథలు, విలనిజం పండిన పాత్రలూ ఎన్నో గుర్తొస్తాయి. కలకత్తా వీధుల్లో పొట్ట చేత పట్టుకొని తిరిగిన స్థితి నుంచి 'బెంగాల్ టైగర్' అనిపించుకునే స్థాయికి ఎదిగిన ఆయన జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం. ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోయి పాత్రకు ప్రాణ ప్రతిష్ఠ చేయడమే తన లక్ష్యమని చెప్పే గొప్ప అభినయ చక్రవర్తి మిథున్. అందుకే ఆయనకు 'దాదా సాహెబ్ ఫాల్కే' పురస్కారం ప్రకటించడం ఎంతో సముచితం అంటూ ఆనందం వ్యక్తం చేస్తోంది భారతీయ చిత్రసీమ.


మిథున్ చక్రవర్తి

## డ్యాన్స్‌లో ఘన కీర్తి

ఉద్యమాల్లో చురుగ్గా ఉండే మిథున్ తన సోదరుడి మరణంతో చలించిపోయారు. ఉద్యమ బాటని వీడి బొంబాయి నైట్ క్లబ్బుల్లో డ్యాన్సర్‌గా జీవితాన్ని ప్రారంభించారు. ఆ సమయంలోనే ప్రముఖ దర్శకుడు మృణాల్ సేన్ దృష్టిలో పడి 'మృగయ'తో నటుడిగా తొలి అవకాశాన్ని దక్కించుకున్నారు. 1976లో వచ్చిన ఈ చిత్రంలో తిరుగుబాటుదారుని పాత్రలో కనిపించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. మరో గొప్ప విశేషం ఏంటంటే ఇందులోని నటనకు ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారం అందుకున్నారు మిథున్. ఆ తర్వాత పలు హిందీ చిత్రాల్లో నటించినా తన మాతృభాష బెంగాలీలో హీరోగా పరిచయం అయిన 'నాదీ తేకే సాగరే' మంచి విజయం అందుకుంది. ఆ తర్వాత నటించిన స్పై థ్రిల్లర్ చిత్రం 'సురక్ష' హిట్ కావడంతో మిథున్ కెరీర్ జోరందుకుంది. ఆ తర్వాత 'షౌకీన్', 'అశాంతి' లాంటి చిత్రాలతో దూసుకుపోతున్న మిథున్ జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పింది 'డిస్కో డ్యాన్సర్'. ఇందులో 'ఐ యామ్ ఎ డిస్కో డ్యాన్సర్' అంటూ మిథున్ వేసిన స్టెప్పులు ప్రపంచ వ్యాప్తంగా ఆయనకు అభిమానుల్ని సంపాదించిపెట్టాయి. ఈ చిత్రం ఆధారంగానే బాలకృష్ణ నటించిన 'డిస్కో కింగ్' తెరకెక్కింది. 'ముఝే ఇన్సాఫ్ చాహియే', 'హమ్ సే హై జమానా', 'పసంద్ అప్నీ అప్నీ', 'ఘర్ ఏక్ మందిర్', 'ముక్తి', 'కసమ్ పైదా కర్నే వాలేకీ', 'ప్యార్ ఝుక్తా నహీ', 'ప్రేమ్ ప్రతిగ్యా', 'గుండా', 'షికారి', 'ప్రేమ్ వివాహ్', 'దుష్మన్', 'జల్లాద్', 'గులామి', 'చండాల్', 'పరివార్' లాంటి ఎన్నో చిత్రాల్లో నటించి మురిపించారు. అప్పట్లో ఒకే ఏడాదిలో 19కిపైగా చిత్రాల్లో నటించిన కథానాయకుడిగా అరుదైన ఘనత సాధించారు మిథున్.

### మిథున్‌వైపు కన్నెత్తి చూడని హీరోయిన్స్

తన సినీ కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలు.. మరెన్నో అవార్డులను సంపాదించుకున్న మిథున్ కూడా చిత్రపరిశ్రమలో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారు. కెరీర్ తొలినాళ్లలో ఆయన సరసన నటించడానికి ఏ కథానాయిక అంగీకరించకపోయేదట. రంగు తక్కువగా ఉన్నారని ఆయనతో నటించడానికి హీరోయిన్స్ ఇష్టపడేవారు కాదట. కానీ.. తొలిసారి మిథున్‌తో కలిసి పనిచేయడానికి కథానాయిక జీనత్ అమన్ ముందుకు వచ్చారు. వీరిద్దరి కలయికలో వచ్చిన 'అశాంతి' చిత్రం అప్పట్లో మంచి హిట్‌ను అందుకుంది. ఈ విషయాన్ని మిథున్ పలు సందర్భాల్లో చెప్పారు.



### గురుతో సెకండ్ ఇన్నింగ్స్ జోరు..

హిందీ, బెంగాలీ, కన్నడ.. ఇలా భాషతో సంబంధం లేకుండా హిట్లు కొడుతూ సరికొత్త డ్యాన్స్ స్టెప్పులతో ప్రేక్షకుల్ని మెప్పించిన మిథున్ కూడా సినీరంగంలో ఎన్నో పరాజయాల్ని అందుకున్నారు. ఆయన నటించిన 'సబ్‌సే బఢ్కర్ హమ్', 'గౌతమ్ గోవింద' లాంటి వరుస సినిమాలు బాక్సాఫీసు వద్ద ఆశించిన ఫలితాలు అందుకోలేపోయాయి. దీంతో కొంత కాలం పాటు సినిమాల నుంచి విరామం తీసుకొని ఊటీలో హోటల్ వ్యాపారాన్ని నిర్వహించారు. ఆ తర్వాత 'ఎలాన్' చిత్రంతో తిరిగి హిందీ సినిమాల్లోకి అడుగుపెట్టినా అది కూడా ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయింది. ఆ తర్వాత 2007లో దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన 'గురు' చిత్రంతో మళ్లీ ఆయన తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించి వరుస అవకాశాలతో జోరు ప్రదర్శించారు.

### డ్యాన్స్ ఇండియా డ్యాన్స్‌కు న్యాయనిర్ణేతగా పాపులర్

హీరోగానే కాకుండా సహాయ నటుడిగానూ ఆయన తనదైన ముద్ర వేశారు. అమితాబ్‌బచ్చన్‌తో కలిసి నటించిన 'అగ్నిపథ్'లో మిథున్ పోషించిన కృష్ణన్ అయ్యర్ పాత్ర ప్రేక్షకులకు గుర్తుండి పోతుంది. పవన్‌కల్యాణ్, వెంకటేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'గోపాల గోపాల' చిత్రంతో తెలుగు, తమిళ భాషల్లోకి అడుగుపెట్టి మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన 'ది విలన్' చిత్రంతో తొలిసారి కన్నడలో నటించారు. 'మలుపు' అనే మరో తెలుగు సినిమాలోనూ నటించారు. 2022లో ఆయన నటించిన 'ది కశ్మీర్ ఫైల్స్' భారీ విజయాన్ని అందుకుంది. పలు డ్యాన్స్ షోలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన మిథున్ కెరీర్‌లో 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్' ఎంతో గుర్తింపు తెచ్చింది.

### కుమారులు ముగ్గురూ సినిమాల్లోనే..

మిథున్ మొదట నటి హెలెన ల్యూక్‌ను వివాహం చేసుకున్నారు. ఈ ఇద్దరూ కొన్ని నెలలకు విడిపోయారు. ఆ తర్వాత యోగిత బాలీని పెళ్లాడారు. ఈ ఇద్దరికీ ముగ్గురు కుమారులు మిమోహ్, ఉష్మయ్, నమోశి ఉన్నారు. మిమోహ్ నటుడిగా, ఉష్మయ్, నమోశీ నటనతో పాటు దర్శకులుగానూ కొనసాగుతున్నారు. మిథున్ దంపతులు దిశానీ అనే అమ్మాయిని దత్తత చేసుకున్నారు.

### ఎన్నో అవార్డులు

తొలి సినిమాకి జాతీయ అవార్డు పొందిన మిథున్‌కు మళ్లీ 1992లో వచ్చిన బెంగాలీ చిత్రం 'తహదేర్ కథ'లోని నటనకుగానూ జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం దక్కింది. ఆ తర్వాత వివేకానందుడి జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన 'స్వామి వివేకానంద' చిత్రంలోని నటనకు ఉత్తమ సహాయ నటుడిగా జాతీయ పురస్కారం అందుకున్నారు. ఇవి కాకుండా పలు ఫిల్మ్ అవార్డులు కూడా ఆయన్ని వరించాయి.


నాగచైతన్య, సాయిపల్లవి

## తండేల్ కోసం శివరాత్రి పాట

నాగచైతన్య కెరీర్‌లోనే అత్యంత ప్రత్యేకమైనదిగా శివరాత్రి పాట నిలిచిపోతుందని చెబుతోంది 'తండేల్' బృందం. వెయ్యి మందికిపైగా నటులతో ఈ పాటని చిత్రీకరించారు. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రమిది. చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పకులు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో శివరాత్రి నేపథ్యంలో వచ్చే ఓ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని సినీ వర్గాలు తెలిపాయి. ఈ పాటని ఇటీవలే నృత్య దర్శకుడు శేఖర్ నేతృత్వంలో నాయకానాయికలు నాగచైతన్య, సాయిపల్లవితోపాటు, వెయ్యి మందికిపైగా నటులతో తెరకెక్కించినట్టు సినీ వర్గాలు తెలిపాయి. ''శ్రీకాకుళం జిల్లా డి.మత్స్యలేశం గ్రామంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందిస్తున్న చిత్రమిది. నిజమైన సంఘటనలే అయినా, ఇద్దరు ప్రేమికుల జీవితాల్లోని భావోద్వేగాలు, సంఘటనలు ఎంతో ఆసక్తికరంగా కల్పిత కథలకంటే థ్రిల్లింగ్‌గా ఉంటాయి. దక్షిణ కాశీగా పేరు గాంచిన పురాతన శివాలయం శ్రీకాకుళంలోని శ్రీముఖలింగం. ఇక్కడ నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల స్ఫూర్తితోనే ఈ సినిమాలో పాట తెరకెక్కించాం. సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఎప్పటికీ నిలిచిపోయేలా ఓ క్లాసిక్ బాణీని సమకూర్చారు. భారీ సెట్స్‌ని తీర్చిదిద్ది, అత్యున్నత నిర్మాణ విలువలతో పాటని తెరకెక్కించామ''ని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: షామ్‌దత్, కూర్పు: నవీన్ నూలి, కళ: శ్రీనాగేంద్ర తంగాల.

## పిలక.. గిలక


సప్తగిరి, బ్రహ్మానందం

అడవికే పాఠాలు చెప్పడానికి వచ్చిన ఇద్దరు గురువుల కథేమిటో తెలియాలంటే 'కన్నప్ప' చూడాల్సిందే. విష్ణు మంచు ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. మోహన్‌బాబు నిర్మాత. ఈ చిత్రంలో హాస్యనటులు బ్రహ్మానందం, సప్తగిరి... ఒకరు పిలక, మరొకరు గిలక పాత్రల్లో సందడి చేయనున్నారు. ఆ పాత్రల్ని పరిచయం చేస్తూ సోమవారం ఓ ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది చిత్రబృందం. చేపకి ఈత, పులికి వేట, కోకిలకి పాట నేర్పిన గుగ్గురువులు అడవికే పాఠాలు నేర్పడానికి వస్తే... అంటూ ఈ పాత్రల్ని పరిచయం చేసింది. వీరిద్దరి కామెడీ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా మారనుందని సినీ వర్గాలు తెలిపాయి. డిసెంబరులో పాన్ ఇండియా స్థాయిలో ఈచిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## డబ్బంటే ఇష్టమున్న ప్రతి వ్యక్తికీ ఈ సినిమా నచ్చుతుంది


సత్యదేవ్, మనోజ్, సత్యరాజ్, డాలీ ధనంజయ, జెన్నిఫర్

“నా కెరీర్‌లో మైలురాయి లాంటి చిత్రం 'జీబ్రా'. డబ్బు అంటే ఇష్టం ఉన్న ప్రతి వ్యక్తికీ ఈ సినిమా నచ్చుతుంది'' అన్నారు నటుడు సత్యదేవ్. ఆయన.. డాలీ ధనంజయ హీరోలుగా ఈశ్వర్ కార్తీక్ తెరకెక్కించిన బహుభాషా చిత్రమే 'జీబ్రా'. ఎస్ఎన్.రెడ్డి, ఎస్.పద్మజ, బాల సుందరం, దినేశ్ సుందరం సంయుక్తంగా నిర్మించారు. ప్రియా భవానీ శంకర్, జెన్నిఫర్ పిసినాటో కథానాయికలు. సత్యరాజ్, సత్య, సునీల్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 31న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హీరో నాని ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. అనంతరం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంచు మనోజ్ అతిథిగా పాల్గొన్నారు. నటుడు సత్యదేవ్ మాట్లాడుతూ.. ''డబ్బు మీద చేసిన సినిమా ఇది. వైట్, బ్లాక్ మనీతో పాటు చాలా అంశాలు ప్రేక్షకుల్ని అలరిస్తాయి. ఇందులో నేను చాలా సరికొత్త పాత్రతో కనువిందు చేయనున్నా'' అన్నారు.

## కలి పురుషుడి పాత్రే స్ఫూర్తి


శివ శేషు

“మన పురాణాల్లోని కలి పురుషుడి పాత్రని స్ఫూర్తిగా తీసుకుని చేసిన సినిమా ఇది. సమయాన్ని, ఆత్మని ఆధారం చేసుకుని యుగాన్ని ప్రభావితం చేసే కలిని మా కథలో ఎలా చూపించామన్నది ఆసక్తికరం” అన్నారు శివ శేషు. ఆయన తెరకెక్కించిన చిత్రం 'కలి'. ప్రిన్స్, నరేశ్ అగస్త్య జంటగా నటించారు. లీలా గౌతమ్ వర్మ నిర్మాత. సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం ఈ నెల 4న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు శివ శేషు. ''శివరామ్ అనే వ్యక్తి జీవితంలో జరిగిన సంఘటనల చుట్టూ సాగే కథ ఇది. ఆ పాత్రలో ప్రిన్స్ కనిపిస్తారు. ఓ సర్వే ప్రకారం ప్రపంచంలో 70 శాతం మంది ఏదో ఒక సందర్భంలో ఆత్మహత్య ఆలోచన చేస్తున్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకి ఆత్మహత్య పరిష్కారం కాదనే అంశాన్ని మా సినిమాతో చెబుతున్నాం. శివరామ్ చాలా మంచి వ్యక్తి. అతని మంచితనం ఎన్నో ఇబ్బందుల్ని తెచ్చిపెడుతుంది. దాంతో ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికొస్తాడు. ఆ సందర్భంలోనే అనుకోకుండా ఇంటికొచ్చిన ఓ అపరిచిత వ్యక్తి వల్ల శివరామ్ జీవితంలో ఏం జరిగిందన్నది ఇందులో కీలకం. అపరిచిత వ్యక్తిగా నరేశ్ అగస్త్య నటించారు. కథలో బల్లి పాత్ర కూడా కీలకం. ఆ పాత్రకు ప్రియదర్శి డబ్బింగ్ చెప్పారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో ప్రత్యేకంగా సెట్‌ని తీర్చిదిద్ది చిత్రీకరణ చేశామ''ని తెలిపారు. తన ప్రయాణం గురించి వివరిస్తూ... ''చిన్నప్పటినుంచీ సాహిత్యం అంటే మక్కువ. కొంతకాలం వ్యాపారం చేసినా, దర్శకత్వం నా కల కావడంతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టా. 'భాగమతి' దర్శకుడు అశోక్, 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' దర్శకుడు అరుణ్ పవార్ దగ్గర దర్శకత్వం విభాగంలో పనిచేశా. లాక్‌డౌన్ సమయంలో రాసుకున్న ఈ కథతో దర్శకుడిగా తొలి ప్రయత్నం చేశాన''ని చెప్పారు శివ శేషు.

## శ్వాగణిక వంశమట.. ఏ మగాడన్నా వాళ్లకు మొక్కాల్సిందే!


శ్రీవిష్ణు

'సామజవరగమన', 'ఓం భీమ్ బుష్' విజయాల తర్వాత హీరో శ్రీవిష్ణు నుంచి రానున్న కొత్త చిత్రం 'శ్వాగ్'. హసిత్ గోలి దర్శకత్వం వహించిన ఈ సినిమాని టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. రీతూ వర్మ కథానాయిక. మీరా జాస్మిన్, దక్ష, శరణ్య ప్రదీప్, సునీల్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 4న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. శ్వాగణిక వంశ మగవాళ్ల కథ ఇది. “1551 నుంచి మగవాడి ప్రయాణం” అంటూ మొదలైన ట్రైలర్ నవ్వులు పంచుతూనే ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. శ్రీవిష్ణు ఇందులో నాలుగు తరాలకు చెందిన వాడిగా నాలుగు భిన్నమైన పాత్రల్లో కనువిందు చేయనున్నారు. రీతూ వర్మ వింజామర వంశానికి చెందిన రాణిగా రెండు పాత్రల్లో సందడి చేయనుంది. తన శ్వాగణిక రాజ వంశ నిధిని ఈతరం వారసుడికి అందించాలని భవభూతి మహారాజు ప్రయత్నించడం.. అతన్ని అడ్డుకునేందుకు వింజామర రాణి రకరకాల ప్రయత్నాలు చేయడం ప్రచార చిత్రంలో చూపించారు. తరతరాలుగా సాగుతున్న ఆడ, మగల ఆధిపత్య పోరును ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని అంతర్లీనంగా లింగ వివక్షను చర్చిస్తున్నట్లు ట్రైలర్‌ను బట్టి అర్థమవుతోంది. “శ్వాగణిక వంశమట.. దేశంలో ఏ మగాడన్నా వాళ్లకు మొక్కాల్సిందే”, “సరిహద్దు దాటుతున్నాం.. మగతనంతో విర్రవీగండి'' అంటూ ట్రైలర్‌లో వినిపించిన సంభాషణలు ఆసక్తిరేకెత్తించేలా ఉన్నాయి. ఈ సినిమాకి వివేక్ సాగర్ సంగీతమందించగా.. వేదరామన్ శంకరన్ ఛాయాగ్రహకుడిగా వ్యవహరించారు.

## జాతీయ అవార్డుకు అర్హతున్న చిత్రమిది

“జాతీయ అవార్డు సాధించడానికి అన్ని అర్హతలు ఉన్న సినిమా 'కమిటీ కుర్రోళ్లు'. ఈ చిత్రం చూస్తున్నంతసేపు మా చిన్ననాటి రోజులే గుర్తొచ్చాయి'' అన్నారు నటుడు, నిర్మాత కొణిదెల నాగబాబు. ఆయన కుమార్తె నిహారిక సమర్పణలో యదు వంశీ తెరకెక్కించిన చిత్రమే 'కమిటీ కుర్రోళ్లు'. ఇది విడుదలై 50రోజులు పూర్తయిన నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో వేడుక నిర్వహించారు. దీనికి నాగబాబు, దిల్‌రాజు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. ''దర్శకుడు యదు వంశీ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రానికి జాతీయ అవార్డు వచ్చే అవకాశముంది. ఇలాంటి సినిమాని మా నిహారిక నిర్మించడం చాలా గొప్పగా అనిపిస్తోంది'' అన్నారు. దర్శకుడు యదు వంశీ మాట్లాడుతూ.. ''ప్రస్తుతం 50రోజులు పూర్తి చేసుకోవడం అరుదుగా జరుగుతోంది. నా తొలి సినిమాకే ఇలా జరిగినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు. ''ఓ మంచి చిత్రం తీస్తున్నామనుకున్నాం కానీ, 50రోజుల రన్ ఉంటుందని అనుకోలేద''న్నారు నిర్మాత నిహారిక. ఈ కార్యక్రమంలో చిత్ర నటీనటులు, సాంకేతిక బృందానికి 50రోజుల మెమొంటోని అందించారు.


నాగబాబు, నిహారిక, దిల్‌రాజు, యదు వంశీ

# కాళ్లకు వాన గండం

వానజల్లు కురుస్తుంటే ఆనందంగానే ఉంటుంది. కానీ వరద నీటిలో తడిస్తేనే చిక్కులు. మురుగుతో కలిసిన నీటితో పాదాలు, కాళ్లకు ఇన్‌ఫెక్షన్లు తలెత్తొచ్చు. చాలావరకవి మామూలుగానే తగ్గినా కొందరికి తీవ్రం కావొచ్చు. వేళ్లు, కాళ్లు తొలగించాల్సి రావొచ్చు. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో వెలుగు చూసిన ఉదంతాలే దీనికి నిదర్శనం. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం పనికిరాదు. చిన్న ఇన్‌ఫెక్షనే కదాని అశ్రద్ధ చేస్తే పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఒకింత జాగ్రత్త వహిస్తే తీవ్ర ఇన్‌ఫెక్షన్‌గా మారకుండా చూసుకోవచ్చు. ఎప్పుడు కుంభవృష్టి కురుస్తుందో, ఎప్పుడు వరద ముంచెత్తుతుందో తెలియని ప్రస్తుత తరుణంలో వాననీటితో ముంచుకొచ్చే కాలి ఇన్‌ఫెక్షన్ల గురించి తెలుసుకొని ఉండటం మంచిది.

## తంతు కణజాలం చచ్చుబడటం




మన చర్మం కింద తంతు కణజాలం (ఫేషియా) ఉంటుంది. సాగే గుణం గల ఇది కొవ్వు, రక్తనాళాలు, కండరాలు, నాడుల చుట్టూ విస్తరించి.. అవి వాటి స్థానాల్లో కుదురుగా ఉండటానికి తోడ్పడుతుంది. అయితే బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ మూలంగా కొందరిలో ఇది చచ్చుబడొచ్చు (నెక్రొటైజింగ్ ఫేషియైటిస్).

వర్షాకాలంలో దోమలు, కీటకాలు కుడుతుంటాయి. అక్కడ దురద పెట్టటం వల్ల తరచూ గోకుతుంటారు. దీంతో చర్మం గీసుకుపోతుంది. వాన నీటిలో నడుస్తున్నప్పుడు రాళ్లు తగిలి గాయాలు కావొచ్చు. పుల్లల వంటివి గీసుకుపోయి గాట్లు పడొచ్చు. వీటి నుంచి బ్యాక్టీరియా తేలికగా లోపలికి ప్రవేశిస్తుంది. వర్షపు నీటిలో మురుగు నీరు కలిసే ప్రమాదమూ ఉంది. ఇందులో మలంలోని బ్యాక్టీరియా ఉంటుంది. ఇలాంటి బ్యాక్టీరియా గాట్లు, గాయాల నుంచి లోపలికి ప్రవేశించి, ఇన్‌ఫెక్షన్‌కు కారణమవుతుంది. దీంతో ప్రమాదమేంటంటే- చాలా వేగంగా విస్తరించటం. 24 గంటల్లోనే తీవ్రమవుతుంది. స్ట్రెప్టోకాకస్, స్టెఫలోకాకస్ బ్యాక్టీరియా చాలా త్వరగా ఫేషియాను దెబ్బ తీస్తుంది. చర్మాన్ని, దాని కిందుండే ఫేషియా, కొవ్వు, కండరాలు, ఎముక వరకూ వెళ్తుంది. అందుకే దీన్ని ఫ్లెష్ ఈటింగ్ బ్యాక్టీరియా అనీ అంటారు. నిజానికిది అరుదైన సమస్య. లక్షమందిలో 1-5 మందికి రావొచ్చు. కానీ వరదనీటిలో తడిస్తే ముప్పు పెరిగే అవకాశముంది.



డా॥ ఎ.పార్థసారథి
చర్మ నిపుణులు
అంచలాస్ స్కిన్ ఇన్‌స్టిట్యూట్
జూబ్లీహిల్స్
హైదరాబాద్

**రకరకాలు:** ఫేషియా చచ్చుబడటంలో టైప్ 1, 2, 3, 4 అని రకాలున్నాయి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే వారిలో.. అంటే హెచ్ఐవీ, మధుమేహం వంటి జబ్బులు గలవారు, స్టిరాయిడ్ మందులు వాడేవారు, క్యాన్సర్లతో బాధపడేవారిలో టైప్ 1 రకం కనిపిస్తుంటుంది. దీనికి క్లెబ్‌సేలా, ఇ.కొలి, ప్రొటియస్ వంటి రకరకాల సూక్ష్మక్రిములు (పాలీమైక్రోబియల్) కారణమవుతుంటాయి. మామూలు వ్యక్తుల్లో వచ్చేది టైప్ 2. దీనికి కారణం స్ట్రెప్టోకాకస్, స్టెఫలోకాకస్ బ్యాక్టీరియా (మోనోమైక్రోబియల్). తరచూ కనిపించేది ఇదే. ఇక మూడోది క్లోస్ట్రిడియల్ జాతి బ్యాక్టీరియాతో వచ్చేది. నాలుగో రకం క్యాండిడియాసిస్ ఫంగస్‌తో వస్తుంది.



**లక్షణాలు:** నొప్పి, వాపు, ఎరుపు బాగా వేధిస్తాయి. కొందరికి పొక్కులూ బయలుదేరొచ్చు.

**సత్వర చికిత్స ప్రధానం :** సమస్యను త్వరగా గుర్తించి, చికిత్స అందించటం చాలా కీలకం. వీరిని ఆసుపత్రిలో చేర్చి రక్తనాళం ద్వారా ద్రవాలు, యాంటీబయాటిక్స్ ఇస్తే బాగా కోలుకుంటారు. కాకపోతే జబ్బును నిర్ధరించేసరికే ఇన్‌ఫెక్షన్ రక్తంలోకి చేరుకునే (సెప్సిస్) అవకాశముంది. ఇది తీవ్ర సమస్య. సంక్లిష్టమైంది. అత్యవసరంగా చికిత్స చేయాల్సి ఉంటుంది. తంతు కణజాలం చచ్చుబడితే అవయవాన్ని తొలగించటం తప్ప మరో మార్గముండదు. కుళ్లినచోటును బట్టి వేళ్లు, పాదం, కాలు తొలగించాల్సి వస్తుంది. లేకపోతే కణజాలం చచ్చుబడటం విస్తరిస్తూ వస్తుంది. ఆలస్యమైతే ప్రాణాల మీదికీ రావొచ్చు. దీని బారినపడ్డవారిలో ప్రతి ముగ్గురిలో ఒకరు మరణించే ప్రమాదముండటం గమనార్హం.

## పాదానికి ప్రమాదం



అసలే తడి. పైగా ఎక్కువసేపు పాదం నీటిలో తడిసిపోయింది. బ్యాక్టీరియా, ఫంగస్‌కు ఇంతకన్నా ఏం కావాలి? త్వరగా చర్మం లోపలికి చేరుకుంటుంది. దీంతో కొందరికి కాలి వేళ్ల మధ్య వచ్చే ఫంగస్ ఇన్‌ఫెక్షన్ (అథ్లెట్స్ ఫుట్) రావొచ్చు. ఇది మనుషుల్లో ఒకరి నుంచి మరొకరికి వ్యాపించొచ్చు. అలాగే జంతువులు, మట్టి నుంచి కూడా సంక్రమించొచ్చు. షూ వేసుకునేవారిలో, మధుమేహం గలవారిలో, ఊబకాయుల్లో ఇది ఎక్కువ. లావుగా ఉన్నవారిలో, కాళ్ల వాపు గలవారిలో పాదాల వేళ్ల మధ్య ఖాళీ తక్కువగా ఉంటుంది. దీనికి నీటి తడి తోడైతే అగ్నికి ఆజ్యం పోసినట్టే. తడి, వేడి ఎక్కువగా ఉండటం వల్ల ఫంగస్ చేరి, ఇన్‌ఫెక్షన్‌కు దారితీస్తుంది.

**లక్షణాలు:** అథ్లెట్స్ ఫుట్‌లో వేళ్ల మధ్య చర్మం పగులుతుంది, పొట్టు మాదిరిగా ఊడుతుంది. దురద పెడుతుంది. చర్మం ఉబ్బి ఎర్రగా, వంకాయ లేదా బూడిద రంగులో కనిపిస్తుంది. మండినట్టు, పొడిచినట్టు అనిపిస్తుంది. కొన్నిసార్లు చర్మం పొడి బారటం, పొలుసులు పాదం పైభాగానికీ విస్తరించొచ్చు.

**చికిత్స:** ఇన్‌ఫెక్షన్ ఉన్నప్పుడు వేళ్ల మధ్య యాంటీఫంగల్ పౌడర్ చల్లి, దూదిని పెట్టుకోవాలి. యాంటీఫంగల్ లోషన్ కూడా రాసుకోవచ్చు. కట్టు కట్టకూడదు. షూకు బదులు చెప్పులు వేసుకోవాలి. గాలి తగిలితే త్వరగా మానుతుంది. అలాగే ఫ్లూకొనజోల్ వంటి యాంటీఫంగల్ మాత్రలు వేసుకోవటం తప్పనిసరి. వీటిని కనీసం 15-30 రోజులు వాడితే ఇన్‌ఫెక్షన్ పూర్తిగా నయమవుతుంది. కాకపోతే ఒకరి నుంచి మరొకరికి వ్యాపించటమే సమస్య. ఇంట్లో ఒకరికి వచ్చిందంటే మిగతా అందరికీ వచ్చే అవకాశముంది. కాబట్టి కుటుంబ సభ్యులందరికీ చికిత్స అవసరమవుతుంది.

◆ ఈ ఫంగస్ కాళ్లకే కాకుండా చంకలు, గజ్జలు, ఆడవారిలో రొమ్ముల కింద వంటి భాగాల్లోనూ రావొచ్చు. కొందరికి ఒళ్లంతా రావొచ్చు (టీనియా కార్పొరిస్). వర్షాకాలంలో దగ్గర దగ్గరగా పడుకోవటం మూలంగానూ ఫంగస్ ఒకరి నుంచి మరొకరికి తేలికగా వ్యాపిస్తుంటుంది. ఇన్‌ఫెక్షన్ గలవారు వాడిన దుప్పట్లు, తువ్వాలు వంటివి మరొకరు ఉపయోగించినా అంటుకోవచ్చు.

## చర్మం పొర వాపు



చర్మం కింది పొర వాపు (సెల్యులైటిస్) మరో సమస్య. ఒకరకంగా దీన్ని నిర్లక్ష్యం చేయటం వల్ల వచ్చే సమస్య అనుకోవచ్చు. గాట్లు, గాయాల వంటి వాటికి అశ్రద్ధ చేయటం వల్ల సమస్యగా పరిణమిస్తుంది. సెల్యులైటిస్‌కు రకరకాల బ్యాక్టీరియా కారణమవుతుంది. ప్రధానంగా స్టెఫలోకాకస్, స్ట్రెప్టోకాకస్ బ్యాక్టీరియాతో వస్తుంటుంది. ఇది శరీరంలో ఎక్కడైనా రావొచ్చు గానీ కాళ్లు, పాదాలు, వేళ్లలో ఎక్కువ. సాధారణంగా ఎండుగజ్జి (ఎగ్జిమా) గలవారిలో తరచూ చూస్తుంటాం. వానకాలంలో ఎండుగజ్జి వంటి చర్మ సమస్యలు మరింత ఎక్కువవుతాయి కూడా. దీంతో గోకటం వల్ల చర్మం గీసుకుపోవచ్చు. గాయాలు, గాట్లతోనూ ప్రమాదమే. వీటి నుంచి బ్యాక్టీరియా తేలికగా లోపలికి వెళ్తుంది. సొరియాసిస్, అథ్లెట్స్ ఫుట్ వంటి ఇన్‌ఫెక్షన్లు గలవారికి.. రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారికీ దీని ముప్పు ఎక్కువే. పిల్లల్లోనూ చూస్తుంటాం. సెల్యులైటిస్ చాలావరకూ చర్మం దిగువ, కొవ్వు పొరలకే పరిమితమవుతుంది. తంతు కణజాలానికి, కండరాలకు విస్తరించటం అరుదు.

**లక్షణాలు:** ఇన్‌ఫెక్షన్ తలెత్తిన చోట చర్మం ఎరుపెక్కుతుంది. కాలు వాచి, ఉబ్బుతుంది. నొప్పి చాలా తీవ్రంగా ఉంటుంది. ద్రవంతో కూడిన బొబ్బలూ ఏర్పడొచ్చు. చూడటానికి చర్మం చిన్న గుంతలు పడినట్టుగా నారింజ తొక్కలా కనిపిస్తుంది. జ్వరం, చలి, బలహీనత కూడా ఉండొచ్చు.

**చికిత్స:** సెల్యులైటిస్‌లో యాంటీబయాటిక్ మాత్రలు అంతగా పనిచేయవు. ఆసుపత్రిలో చేర్చి రక్తనాళం ద్వారా 7-10 రోజులు యాంటీబయాటిక్స్ ఇవ్వాల్సి ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే సమస్య ముదిరి, ఇన్‌ఫెక్షన్ రక్తంలోకి వ్యాపించే ప్రమాదముంది. అప్పుడు తీవ్రమైన జ్వరం, వికారం, వాంతులు, బలహీనత తలెత్తుతాయి. రక్తపోటు పడిపోతుంది. మూత్రం తగ్గుతుంది.

## నివారణ ముఖ్యం

◆ వర్షపు నీటిలో తడిచినప్పుడు ఇంటికి వచ్చాక వేడినీటితో శుభ్రంగా పాదాలు కడుక్కోవాలి. గాట్లు ఉన్నట్టయితే యాంటీబయాటిక్ మలాము రాసుకోవాలి. ఒకవేళ ఒళ్లంతా తడిస్తే వేడి నీటితో స్నానం చేయటం మంచిది.

◆ పాదాలు పొడిగా ఉండేలా, గాలి తగిలేలా చూసుకోవాలి. వర్షాకాలంలో బయటకు వెళ్లేటప్పుడు నీటికి తడవని షూ వేసుకుంటే మేలు. పాదాలు పూర్తిగా ఆరిన తర్వాతే చెప్పులు, షూ తిరిగి ధరించాలి. చెప్పులు వేసుకోకుండా ఆరుబయట, వాననీటిలో నడవొద్దు.

◆ పాదాలకు రక్త ప్రసరణను దెబ్బతీసే మధుమేహం వంటి సమస్యలు ఉన్నట్టయితే డాక్టర్‌ను సంప్రదించి ప్రత్యేకమైన చెప్పులు, షూ వేసుకోవాలి. తరచూ పాదాలు, కాళ్లను గమనిస్తూ ఎరుపు, వాపు వంటి ఇన్‌ఫెక్షన్ లక్షణాలేవైనా ఉన్నాయేమో చూసుకోవాలి. ఇతరుల పాదరక్షలను వేసుకోవద్దు.

# బీపీ తగ్గుతోందేం?

**సమస్య:** నాకు 54 ఏళ్లు. థైరాయిడ్ జబ్బుంది. మందులేసుకుంటున్నాను. మధుమేహం, అధిక రక్తపోటు లేవు. ఇటీవల రెండు నెలల నుంచీ చాలా బలహీనంగా అనిపిస్తోంది. దీంతో ఉదయం పూట విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోంది. బీపీ కొన్నిసార్లు 74/48, మరికొన్నిసార్లు 80/45 ఉంటోంది. అప్పుడప్పుడు తల తేలిపోతున్నట్టు అనిపించటం వల్ల రోజువారీ పనులు చేసుకోలేకపోతున్నా. ఉప్పు, ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలని డాక్టర్లు చెబుతున్నారు. ఇదేమైనా గుండెజబ్బా? నెలసరి నిలిచినప్పుడు తలెత్తే మామూలు సమస్యా? హఠాత్తుగా బీపీ పడిపోవటానికి కారణమేంటి? తగు పరిష్కారం తెలపండి. - పూర్ణ

డాక్టర్ సలహా

**సలహా:** మీరు థైరాయిడ్‌కు తప్ప వేరే మందులేవీ వేసుకోవటం లేదు కాబట్టి బీపీ తగ్గటానికీ మందులకూ సంబంధం లేదు. ఇదేమీ గుండె జబ్బులా కనిపించటం లేదు. సాధారణంగా గుండెజబ్బులో హఠాత్తుగా బీపీ పడిపోతుంటుంది. దీర్ఘకాలంగా తక్కువగా ఉండటమనేది గుండెజబ్బు లక్షణం కాదనే చెప్పుకోవాలి. ముందుగా మీరు గమనించాల్సింది బీపీ సరిగ్గా చూపించు కుంటున్నారో లేదో అని. ఎందుకంటే బీపీ పడిపోవటానికి కారణాలు తక్కువే. డిజిటల్ పరికరంతో రక్తపోటును పరీక్షించుకుంటున్నట్టయితే ఆసుపత్రిలో వాడే బీపీ పరికరం (మానోమీటర్)తో పోల్చి చూసుకోవాలి. ఫలితాలు కచ్చితంగా ఉన్నాయో లేదో బయటపడుతుంది. దీర్ఘకాలంగా రక్తపోటు పడిపోవటానికి మరో కారణం అడ్రినల్ గ్రంథి సరిగా పనిచేయకపోవటం. ఈ గ్రంథి కార్టికో, మినెరలో కార్టికో స్టిరాయిడ్లను ఉత్పత్తి చేస్తుంది. వీటి మోతాదులు తగ్గితే బీపీ పడిపోవచ్చు. పరగడుపున కార్టిజాల్ పరీక్షతో అడ్రినల్ గ్రంథి పనితీరును తెలుసుకోవచ్చు. ఒంట్లో సోడియం, పొటాషియం వంటి ఖనిజ లవణాల మోతాదులు తగ్గినా బీపీ పడిపోతుంది. పడుకున్నప్పుడు, కూర్చున్నప్పుడు రక్తపోటు మామూలుగా లేదా ఎక్కువగా ఉండి.. లేచి నిల్చున్నప్పుడు పడిపోతే స్వయం చాలిత నాడీ వ్యవస్థ సరిగా పనిచేయటం లేదని అనుకోవచ్చు. ధమనుల్లో పూడికలుంటే ఒక చేతిలో బీపీని పరీక్షిస్తే ఎక్కువగా, మరో చేతిలో పరీక్షిస్తే మామూలుగా ఉండొచ్చు. మీరు గుండె నిపుణులను గానీ జనరల్ ఫిజిషియన్‌ను గానీ సంప్రదిస్తే కారణమేంటన్నది పరిశీలిస్తారు. బలహీనతకు కారణం బీపీ తగ్గటమా? ఇతరత్రా అంశాలేవైనా దోహదం చేస్తున్నాయా? అనేది పరీక్షిస్తారు. ఆయా కారణాలను బట్టి చికిత్సలు సూచిస్తారు.



- డా॥ ఎన్.కృష్ణారెడ్డి, కార్డియాలజిస్ట్

మీ ఆరోగ్య సమస్యలను, సందేహాలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

# పందుల నుంచి మనుషులకు ఎలుక హెపటైటిస్ ఇ



సాధారణంగా ఎలుకల్లో కనిపించే హెపటైటిస్ ఇ (హెచ్ఈవీ) వైరస్ పందుల ద్వారా మనుషులకు సోకినట్టు తాజా పరిశోధన సూచిస్తోంది. మనుషుల్లో తొలి హెచ్ఈవీ ఇన్‌ఫెక్షన్ హాంకాంగ్‌లో 2018లో రోగనిరోధక శక్తి క్షీణించిన వ్యక్తికి సోకింది. రోగనిరోధక శక్తి మామూలుగా ఉన్నవారూ కనీసం 20 మంది దీని బారినపడ్డారు. నిజానికి వీళ్లెవరూ ఎలుకల ప్రభావానికి గురికాలేదు. దీంతో ఇన్‌ఫెక్షన్ ఎలా సోకిందనేది అంతుపట్టలేదు. ప్రపంచవ్యాప్తంగా మనుషుల్లో హఠాత్తుగా తలెత్తే కాలేయ వైరల్ ఇన్‌ఫెక్షన్‌కు హెపటైటిస్ ఇ ప్రధాన కారణం. ముఖ్యంగా పరిశుభ్రత అంతగా లేని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఎక్కువ. ఈ వైరస్ కొన్ని చోట్ల పందుల్లోనూ ఉంటుంది. కండలో కన్నా కాలేయంలోనే అధికంగా ఉన్నప్పటికీ వండినప్పుడు చనిపోతుంది. ఇది వానరాల వంటి వాటికి సోకదని ప్రయోగాల్లో తేలింది. ఇప్పుడిది మనుషులకూ సోకుతున్న నేపథ్యంలో కారణాన్ని గుర్తించాల్సిన అవసరమొచ్చింది. దీని బారినపడ్డవారిలో చాలామంది పచ్చి పంది మాంసం తినటం ఒహాయో యూనివర్సిటీ పరిశోధకులకు అనుమానం కలిగించింది. అందుకే దీనిపై దృష్టి సారించారు. మనుషుల నుంచి సేకరించిన ఎలుక హెచ్ఈవీ పందుల్లో ఇన్‌ఫెక్షన్ కలగజేస్తున్నట్టు గుర్తించారు. పందులను పెంచే బోనుల వద్ద ఎలుకలు ఎక్కువగా తిరుగుతుంటాయి. అందువల్ల మనుషులకు ఎలుక హెచ్ఈవీ సోకటానికి పంది మాంసం దోహదం చేసిందని భావిస్తున్నారు. కొత్తగా ఏయే వైరస్‌లు ఉద్భృతం కావొచ్చనేది తెలుసుకోవటానికి శాస్త్రవేత్తలు నిరంతరం ప్రయత్నం చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఎలుక హెచ్ఈవీ విస్తరించకుండా దీని జన్యువులను అర్థం చేసుకోవాల్సిన అవసరముందని అధ్యయనానికి నేతృత్వం వహించిన స్కాట్ కెన్నీ చెబుతున్నారు.

# పిల్లల్లో హ్రస్వదృష్టి సునామీ

ప్రపంచవ్యాప్తంగా చిన్న పిల్లల్లో, యుక్తవయసువారిలో హ్రస్వదృష్టి (మయోపియా) సునామీలా విరుచుకుపడుతోంది. వీరిలో ప్రతి ముగ్గురిలో ఒకరు ఈ దృష్టి దోషం గలవారేనని, 2050 కల్లా వీరి సంఖ్య 74 కోట్లకు చేరుకోవచ్చని తాజా అధ్యయనం పేర్కొంటోంది. హ్రస్వదృష్టి గలవారికి దూరంగా ఉన్నవి స్పష్టంగా కనిపించవు. ఇది సాధారణంగా చిన్న వయసులోనే మొదలవుతుంది. వయసు పెరుగుతున్నకొద్దీ ఎక్కువవుతుంది. దీని తీవ్రతను గుర్తించటానికి చైనాలోని సున్ యట్-సెన్ యూనివర్సిటీ పరిశోధకులు 2023, జూన్ వరకు ప్రచురితమైన 276 అధ్యయనాలను పరిశీలించారు. వీటిల్లో పాల్గొన్న 5-19 ఏళ్లకు చెందిన 54 లక్షల మందిని పరిశీలించి, హ్రస్వదృష్టి గల 19 లక్షల మంది వివరాలను విశ్లేషించారు. 1990-2000 సంవత్సరాల మధ్యలో 24 శాతంగా ఉన్న హ్రస్వదృష్టి 2001-10కి వచ్చేసరికి 25 శాతానికి పెరిగింది. అదే 2011-19 మధ్యలో 30 శాతానికి, 2020-23లో 36 శాతానికి ఎగబాకింది. ఈ సమస్య 1990-2023 మధ్యకాలంలో మూడు రెట్ల కన్నా ఎక్కువగా పెరిగింది. సంపన్న దేశాలతో పోలిస్తే అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో ఇది గణనీయంగా ఎక్కువ కావటం గమనార్హం. బాలికలు, తూర్పు ఆసియా వాసులు, పట్టణ ప్రాంతాల్లో నివసించేవారిలో ఇంకాస్త అధికంగా ఉంటోంది కూడా. మొత్తమ్మీద సుమారు మూడింట ఒక వంతు మంది పిల్లలు హ్రస్వదృష్టితో బాధపడుతున్నారని పరిశోధకులు చెబుతున్నారు. బాలుర కన్నా ముందుగా యుక్తవయసుకు చేరుకోవటం, ఆరుబయట ఎక్కువసేపు గడపకపోవటం వంటివి బాలికల్లో హ్రస్వదృష్టి పెరగటానికి దోహదం చేస్తుండొచ్చని భావిస్తున్నారు. దీన్ని తగ్గించటానికి పిల్లలను మరింత శారీరక శ్రమ చేసేలా ప్రోత్సహించాలని.. మొబైల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వంటివి చూసే సమయాన్ని తగ్గించాలని సూచిస్తున్నారు.



# చదువులకు నిద్ర భరోసా!

కొత్త విషయాలను నేర్చుకుంటున్నారా? అవి బాగా గుర్తుండాలని అనుకుంటున్నారా? అయితే కంటి నిండా నిద్రపోయేలా చూసుకోండి. రోజంతా ఏర్పడిన జ్ఞాపకాలు సుస్థిరం కావటానికి.. పాత, కొత్త జ్ఞాపకాల మధ్య సంబంధాలు ఏర్పడటానికి.. సృజనాత్మక ఆలోచనలకు నిద్ర తోడ్పడుతుంది. కాబట్టి నిద్ర ప్రాధాన్యాన్ని తెలుసుకొని, మసలుకోవాలి.

❖ ఏదైనా నేర్చుకోవటానికి ముందు బాగా నిద్రపోవటం మంచిది. ఎందుకంటే నిద్రలేమితో నేర్చుకునే సామర్థ్యం 40% వరకూ తగ్గుతుంది.

❖ నేర్చుకున్నాక 24 గంటల్లోపు రాత్రి పూట కంటి నిండా నిద్రపోయేలా చూసుకోవాలి. ఇది కొత్త జ్ఞాపకాలను సుస్థిరం చేస్తుంది. వేర్వేరు సమాచారాల మధ్య అనుసంధానాలను బలోపేతం చేస్తుంది.

❖ ప్రతి రాత్రీ తగినంత నిద్రపోండి. చాలామంది పెద్దవాళ్లకు 7-8 గంటల నిద్ర సరిపోతుంది. రాత్రిపూట 4 గంటలు, అంతకన్నా తక్కువసేపు నిద్రపోతే జ్ఞాపకాలు బలపడవు.

❖ పగటి కునుకు మేలు చేయొచ్చు, కీడు చేయొచ్చు. కొద్దిసేపు కునుకు తీస్తే జ్ఞాపకాలు సుస్థిరం కావటానికి తోడ్పడుతుంది. కానీ సాయంత్రం వేళల్లో కునుకు తీస్తే రాత్రి నిద్ర పట్టటం కష్టమవుతుంది.

# ఆ మిరుమిట్లు ఎందుకు?

పార్శ్వనొప్పి (మైగ్రేయిన్)లో కొందరికి తలనొప్పికి ముందు కాంతి మిరుమిట్లు గొలుపుతుంటాయి. చూపు మారటం.. లైట్లు వెలుగుతూ, ఆరుతున్నట్టు అనిపించటం వంటి లక్షణాలు గోచరిస్తుంటాయి. మెదడులో విద్యుత్ వ్యవస్థ పనితీరు అస్తవ్యస్తం కావటం దీనికి కారణమన్నది శాస్త్రవేత్తల భావన. కానీ ఇవి నొప్పిని ఎలా ప్రేరేపిస్తాయనేది తెలియదు. పార్శ్వ నొప్పికి దారితీసే నాడీ కణాలు మెదడు వెలుపలే ఉంటాయి. వీటికీ, మెదడుకు మధ్య సమాచార ప్రసరణను బ్లడ్-బ్రెయిన్ బ్యారియర్ అడ్డుకుంటున్నట్టు భావిస్తున్నారు. దీని గురించి మరింత తెలుసుకునే ప్రయత్నంలో పరిశోధకులు ఎలుకల మెదడు నుంచి మేరుద్రవం (స్పైనల్ ఫ్లూయిడ్) ఎలా బయటకు వస్తుందో పరిశీలించారు. పార్శ్వనొప్పిని నియంత్రించే నాడీకణాల సముదాయం చుట్టూ బ్లడ్-బ్రెయిన్ బ్యారియర్‌లో ఖాళీలు ఉంటున్నట్టు గుర్తించారు. సూది ద్వారా మెదడులోకి నేరుగా పంపించిన పదార్థాలు అరగంటలోనే ఈ నాడీకణాల్లోకి ప్రవహించాయి. కాంతి మిరుమిట్లు గొలపటానికి, తలనొప్పి రావటానికి మధ్య గల సమయంతో ఇది సరిపోవటం గమనార్హం. అనంతరం పరిశోధకులు ఎలుకల మెదడులో మిరుమిట్లను ప్రేరేపించి, నాడీకణాల్లోకి చేరిన ప్రొటీన్లలో మార్పులను గమనించారు. ప్రొటీన్లలో వచ్చిన చాలా మార్పులు తలనొప్పి కలగటంలో పాలు పంచుకుంటున్నట్టు కనుగొన్నారు.

# తల్లి ఊబకాయం బిడ్డలకు చేటు




గర్భధారణకు ముందు, గర్భం ధరించిన సమయంలో ఊబకాయం గల మహిళలకు పుట్టే పిల్లలకు ఆటిజమ్, ఏడీహెచ్‌డీ వంటి నాడీ అభివృద్ధి సమస్యల ముప్పు పెరుగుతున్నట్టు తాజాగా బయటపడింది. ఏడీహెచ్‌డీ పిల్లల్లో ఏకాగ్రత లోపిస్తుంది. కాసేపు అయినా దేని మీదా శ్రద్ధ పెట్టరు. అతి చురుకుదనంతో ప్రవర్తిస్తుంటారు. ఇక ఆటిజమ్ పిల్లలైతే ఒకే విధంగా పనులు చేస్తుంటారు. ఇతరులతో మాట్లాడటం, కలవటంలో ఇబ్బంది పడతారు. ఇవి ఎందుకొస్తాయనేది కచ్చితంగా తెలియదు గానీ కారణాలను అన్వేషించటానికి శాస్త్రవేత్తలు చాలాకాలంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియాతో పాటు ఇతర సంస్థలకు చెందిన పరిశోధకులు 42 అధ్యయనాలను సమీక్షించారు. సుమారు 36 లక్షల మాతా, శిశు జంటల వివరాలను పరిశీలించారు. గర్భధారణ సమయంలో మహిళల్లో ఊబకాయం మూలంగా పిల్లల్లో ఏడీహెచ్‌డీ ముప్పు 32% పెరుగుతున్నట్టు, ఆటిజమ్ ముప్పు రెట్టింపవుతున్నట్టు గుర్తించారు. అలాగే గర్భం ధరించటానికి ముందు అధిక బరువు, ఊబకాయం మూలంగా ఏడీహెచ్‌డీ ముప్పు వరుసగా 18%, 57% అధికంగా ఉంటున్నట్టు తేలింది. ఆటిజమ్ విషయానికి వస్తే- గర్భధారణకు ముందు అధిక బరువుతో 9%, ఊబకాయంతో 42% ఎక్కువగా ఉంటున్నట్టు బయటపడింది. ఈ పిల్లలకు ప్రవర్తన సమస్యలు వచ్చే అవకాశం 30%, తోటివారితో కలవలేకపోయే ముప్పు 47% అధికమనీ వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా సంతానం కనే వయసులో ఉన్న మహిళల్లో ఊబకాయం, పిల్లల్లో ఏడీహెచ్‌డీ వంటి సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లల మానసిక ఆరోగ్యం మీద ఊబకాయం దీర్ఘకాల ప్రభావాలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడిందని పరిశోధకులు చెబుతున్నారు.

# కొలెస్ట్రాల్‌కు కళ్లెం ఇలా..

రక్తంలో కొలెస్ట్రాల్ పరీక్ష చేసినప్పుడు ఎల్‌డీఎల్, హెచ్‌డీఎల్ మోతాదులను గమనించే ఉంటారు. ఎల్‌డీఎల్‌ను చెడ్డ కొవ్వుగానూ, హెచ్‌డీఎల్‌ను మంచి కొవ్వుగానూ పరిగణిస్తుంటారు. ఎల్‌డీఎల్ మరీ అధికంగా ఉంటే, అది రక్తనాళాల్లో పూడుకుంటుంది. దీంతో రక్త ప్రసరణ కోసం గుండె మరింత బలంగా పనిచేయాల్సి వస్తుంది. సాధారణంగా 20 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయసు గలవారికి రక్తంలో ఎల్‌డీఎల్ 100 ఎంజీ/డీఎల్ కన్నా తక్కువగా ఉండాలి. అదే 190 ఎంజీ/డీఎల్ కన్నా మించితే మాత్రం స్టాటిన్లు వాడుకోవటం తప్పదు. ఒకవేళ ఎల్‌డీఎల్ మోతాదులు 189 ఎంజీ/డీఎల్ ఉండి, గుండెజబ్బు ముప్పు అంతగా లేనట్టయితే జీవనశైలి పాటించొచ్చు. తగినంత నిద్ర, పొగాకు వాడకపోవటం, ఒత్తిడి తగ్గించుకోవటం వంటివి మేలు చేస్తాయి. అయితే వ్యాయామం, ఆహారం మరింత ఎక్కువ ప్రయోజనం కలిగిస్తాయి.

**అధిక కొలెస్ట్రాల్ గలవారిని రెండు బృందాలుగా విభజించొచ్చు. ఒకరు- గుండెజబ్బు ముప్పును తగ్గించుకోవటానికి స్టాటిన్ల వంటి మందులు అవసరమయ్యేవారు. రెండు- కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నా మందులు వేసుకోవాల్సినంత ఎక్కువగా లేనివారు. రెండో కోవలోకి వచ్చేవారికి జీవనశైలి మార్పులు చాలా ప్రధానం. ఇవి గుండెజబ్బు ముప్పును తగ్గించుకోవటానికే కాకుండా మొత్తంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికీ తోడ్పడతాయి.**



## వ్యాయామం మేలు


వ్యాయామం, శారీరక శ్రమ చేస్తున్నప్పుడు రక్తంలోకి మంచి కొవ్వు విడుదలవుతుంది. ఇది రక్తనాళాల్లో పోగుపడిన కొవ్వును ఊడ్చేసి, దాన్ని కాలేయానికి చేరవేస్తుంది. అనంతరం కాలేయం దాన్ని తొలగిస్తుంది. పెద్దవాళ్లందరికీ వారానికి కనీసం 150 నిమిషాల ఒక మాదిరి వ్యాయామం లేదా 75 నిమిషాల తీవ్ర వ్యాయామం అవసరమని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సిఫారసు చేస్తోంది. నడక, ఈత, బరువులెత్తటం, డ్యాన్స్ వంటి ఏవైనా చేయొచ్చు. గాయాల పాలు కాకుండా ఆనందంగా, సంతోషంగా చేసే శారీరక శ్రమ ఏదైనా ఎంచుకోవచ్చు. మొత్తమ్మీద గుండె వేగంగా కొట్టుకోవటం ముఖ్యం. వ్యాయామం చేస్తున్నప్పుడు పక్కవారితో మాట్లాడటానికి ఇబ్బంది పడుతున్నట్టయితే తగినంత వ్యాయామం చేస్తున్నట్టే అనుకోవచ్చు.

క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తుంటే కొలెస్ట్రాల్ తగ్గుముఖం పడుతుంది. అయితే ఇందుకు కొందరికి ఇతరుల కన్నా ఎక్కువ సమయం పట్టొచ్చు. అందువల్ల వెంటనే కొలెస్ట్రాల్ తగ్గటం లేదని నిరాశ పడొద్దు. మధ్యలో మానెయ్యొద్దు.

## ఆహారం ప్రధానం

కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవటంలో ఆహారం పాత్ర చాలా కీలకం. టోఫు వంటి సోయా ఉత్పత్తులు.. చిక్కుళ్లు, పప్పులు, శనగల వంటి శాకాహార ప్రొటీన్లు.. నీటిలో కరిగే పీచుతో కూడిన ఓట్స్, బార్లీ వంటి పదార్థాలు.. యాపిల్, బత్తాయి, నారింజ వంటి పండ్లు.. బాదం, పిస్తా వంటి గింజపప్పులు.. పొద్దుతిరుగుడు, గుమ్మడి వంటి వాటి విత్తనాలు.. ఆలివ్ నూనె వంటి ఆరోగ్యకర నూనెలు ఎంతో మేలు చేస్తాయి. కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండి, మందుల అవసరం లేనివారికి ఇలాంటి ఆహారంతో ఎల్‌డీఎల్ మోతాదులు 30% వరకూ తగ్గుతున్నట్టు ఏడు ప్రయోగపరీక్షల సమీక్షలో వెల్లడైంది. ఇది ఒకప్పుడు వాడకంలో ఉన్న పాత తరం స్టాటిన్లతో సమానం కావటం విశేషం. గుండెజబ్బు ముప్పు 14% తక్కువగా ఉంటున్నట్టూ మరో అధ్యయనంలో బయటపడింది.

శాకాహార ప్రధాన ఆహార పద్ధతిలోని వివిధ పదార్థాలు, పోషకాలు రకరకాల మార్గాల్లో కొలెస్ట్రాల్ తగ్గటానికి తోడ్పడతాయి. ఉదాహరణకు- సోయా పదార్థాలు, శనగలు, చిక్కుళ్ల వంటి శాకాహార ప్రొటీన్లనే చూడండి. ఇవి ఆహారంలోంచి శరీరం కొలెస్ట్రాల్‌ను గ్రహించుకోవటానికి తోడ్పడే అపోలైపోప్రొటీన్ బి ఉత్పత్తిని నిలువరిస్తాయి. నీటిలో కరిగే పీచేమో పేగుల్లోని కొలెస్ట్రాల్‌కు అంటుకు పోతుంది. దాన్ని కట్టడి చేస్తుంది. దీంతో శరీరం గ్రహించుకోవటం కష్టమవుతుంది. ఇక గింజ పప్పుల్లోని మంచి కొవ్వు ఆమ్లాలు, వృక్ష స్టెరాల్స్, పీచు చెడ్డ కొలెస్ట్రాల్ తగ్గేలా చేస్తాయి. అన్నీ కాకపోయినా కొన్నింటిని ఆహారంలో భాగం చేసుకున్నా మంచిదే. ఉదయం అల్పాహారం చేసేటప్పుడు కాసిన్ని బాదం పప్పుల వంటివి తిన్నా కొలెస్ట్రాల్ తగ్గుతుంది.



# సూర్యుడి ఉపరితలంపై.. చల్లటి ప్రాంతాలు!

సూర్యుడి నుంచి విడుదలయ్యే కిరణాల్లో (శక్తి) భూమి గ్రహించే సౌరశక్తిని సూర్యపుటం అంటారు. ఇది చిన్న తరంగాలుగా కిందకు వస్తుంది. భూమిపై నివసించే సమస్త జీవుల మనుగడకు ఇదే ఆధారం. జీవుల పుట్టుక, పెరుగుదల, అభివృద్ధి, కార్యకలాపాలు మొదలైనవన్నీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సూర్యపుటంపైనే ఆధారపడి ఉంటాయి.

టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జాగ్రఫీ

## సూర్యపుటం (Insolation)

### సూర్యుడు

సూర్యుడు మండే అగ్నిగోళం. ఇది ఘన, వాయు పదార్థం కాదు.

✦ మన సూర్యకుటుంబంలో ఉన్న గ్రహాలు, ఉపగ్రహాలు, ఉల్కలు, తోకచుక్కలు మొదలైనవన్నీ సూర్యుడి నుంచే ఆవిర్భవించాయి. ఇవి సూర్యుడి నుంచి వెలుతురు, వేడిని గ్రహిస్తూ; సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

✦ అణుసంఘటనం (Nuclear Fusion) అనే ప్రక్రియ ద్వారా సూర్యుడిలో నిరంతరం ఉష్ణం విడుదలవుతుంది.

✦ సూర్యుడితో పోలిస్తే భూమి చాలా చిన్నది. సూర్యుడి వ్యాసం భూమి వ్యాసం కంటే 100 రెట్లు ఎక్కువ.

✦ సూర్యుడి ఉపరితల ఉష్ణోగ్రత సుమారు 6000°C.

✦ సూర్యుడి వ్యాసం 1.4 మిలియన్ కి.మీ. బరువు $2.192 \times 10^{27}$ టన్నులు.

### సూర్యుడికి - భూమికి మధ్య దూరం

భూమి నుంచి సూర్యుడు 150 మిలియన్ కిలోమీటర్ల దూరంలో ఉన్నాడు. అయితే ఈ దూరం స్థిరంగా ఉండదు. దీనికి కారణం భూమి సూర్యుడి చుట్టూ తిరిగే కక్ష్య దీర్ఘవృత్తాకారంగా ఉండటం.

### అపహేళి (Aphelion)

సూర్యుడికి, భూమికి మధ్య దూరం పెరిగే స్థితిని అపహేళి అంటారు. ప్రతి సంవత్సరం జులై 4న అపహేళి కనిపిస్తుంది.

● అపహేళి సమయంలో సూర్యుడికి, భూమికి మధ్య దూరం 152 మిలియన్ కిలోమీటర్లుగా ఉంటుంది.

### పరిహేళి (Perihelion)

సూర్యుడికి భూమి దగ్గరగా ఉండే స్థితిని పరిహేళి అంటారు.

❖ పరిహేళి స్థితిలో సూర్యుడికి, భూమికి మధ్య దూరం 147 మిలియన్ కిలోమీటర్లుగా ఉంటుంది.

❖ సాధారణంగా ప్రతి సంవత్సరం జనవరి 3న పరిహేళి స్థితి కనిపిస్తుంది.

### కాస్మిక్ సంవత్సరం

దాదాపు నిమ్మపండు రంగులో, గుండ్రంగా ఉండే సూర్యుడు తన చుట్టూ తాను తిరగడానికి 25.9 రోజులు పడుతుంది. సూర్యుడు తాను ఉన్న గెలాక్సీ కేంద్రం చుట్టూ తిరగడానికి 250 మిలియన్ సంవత్సరాలు పడుతుంది. దీన్నే కాస్మిక్ సంవత్సరం అంటారు.

### అంతర్భాగం

సూర్యుడి అంతర్భాగాన్ని 4 పొరలుగా విభజించారు. అవి:

1) కరోనా (Corona)
2) క్రోమోస్ఫియర్ (Chormosphere)
3) ఫోటోస్ఫియర్ (Photosphere)
4) కేంద్రమండలం (Core)

**కరోనా:** సూర్యుడి ఉపరితలం బాహ్యపొరను కరోనా అంటారు.

◆ ఇది తెల్లగా, వెండి లాగా మెరుస్తూ, కొన్ని వేల కిలోమీటర్లు వ్యాపించి ఉంటుంది.

◆ ఈ ప్రాంతంలో సగటు ఉష్ణోగ్రత 200000°C వరకు ఉంటుంది.

◆ కరోనా ప్రాంతాన్ని కొందరు ఖగోళ శాస్త్రవేత్తలు సూర్యుడి బాహ్య వాతావరణంగా పేర్కొంటారు.

**క్రోమోస్ఫియర్:** సూర్యుడిలో రెండో పొర. ఇది కరోనా పొరను ఆనుకుని ఉంటుంది.

◆ ఇది ఎరుపు రంగులో సూర్యుడి చుట్టూ ఒక వలయంలా వ్యాపించి ఉంటుంది.

◆ ఈ పొర మందం సుమారు 10,000 కిలోమీటర్లు.

◆ ఈ పొర హైడ్రోజన్, హీలియం వాయువులతో కూడి ఉంటుంది.

◆ సూర్య గ్రహణం రోజున కరోనా, క్రోమోస్ఫియర్ పొరలను మనం చూడొచ్చు.

◆ ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రత సుమారు 10,000°C గా ఉంటుంది.

**ఫోటోస్ఫియర్:** ఇది చాలా ముఖ్యమైన పొర. ఇక్కడ ఉష్ణోగ్రత సుమారు 5500°C గా ఉంటుంది.

◆ ఈ పొర నుంచే మనకు వెలుతురు, వేడి ప్రసారం అవుతాయి.



రచయిత
పి.కె. వీరాంజనేయులు
విషయ నిపుణులు

### కేంద్ర మండలం

సూర్యుడి కేంద్రంలో ఉన్న పొరను కేంద్రమండలం అంటారు.

▮ ఇక్కడ ఉష్ణోగ్రత 15 మిలియన్ డిగ్రీల సెల్సియస్‌గా ఉంటుందని అంచనా. అయితే సూర్య కేంద్రమండలం గురించి ఎక్కువ సమాచారం అందుబాటులో లేదు.

◆ ఈ పొర నుంచి బయలుదేరిన సూర్యకాంతి భూమిని చేరడానికి దాదాపు 8.3 నిమిషాల సమయం పడుతుంది.

◆ సూర్యుడిలో 71% హైడ్రోజన్, 26.5% హీలియం, 0.71% ఆక్సిజన్, 0.29% కార్బన్ ఉంటాయి.

◆ హైడ్రోజన్ వాయువు థర్మో న్యూక్లియర్ ఫ్యూజన్ అనే ప్రక్రియ జరపడం వల్ల సూర్యుడిలో శక్తి (energy) ఉత్పత్తి అవుతుంది.

◆ ప్రతి సెకనుకు 657 మిలియన్ టన్నుల హైడ్రోజన్ వాయువు 652.5 మిలియన్ టన్నుల హీలియంగా మారుతుంది. మిగిలిన 4 టన్నుల హైడ్రోజన్ వాయువు శక్తిగా మారుతుంది. కాబట్టి సూర్యుడి నుంచి $10^{29}$ జౌల్స్ (Jouls) శక్తి విడుదల అవుతుంది. ఈ శక్తి నుంచి భూమి గ్రహించేది కేవలం ఒక చదరపు సెంటీమీటర్ విస్తీర్ణానికి నిమిషానికి రెండు కేలరీలు మాత్రమే.

◆ సూర్యుడి నుంచి భూమి శక్తిని గ్రహించడం వల్ల భూగోళంపై పడుతున్న సూర్యకిరణాల బరువు 75,000 టన్నులు.

**సౌర మచ్చలు (Sun spots):**

సూర్యుడి ఉపరితలంపై అక్కడక్కడ కొన్ని చల్లటి ప్రాంతాలు ఉంటాయి. వీటినే సౌర మచ్చలు అంటారు.

☛ ఈ చల్లని ప్రాంతాలు నల్లగా ఉండి దాదాపు 4000°C ఉష్ణోగ్రతలను కలిగి ఉంటాయి.

**సిక్సాంట్ (Sixant):**

సూర్యుడు, ఇతర గ్రహాలు ఎంత ఎత్తులో ఉన్నాయో తెలుసుకునేందుకు సిక్సాంట్ అనే పరికరాన్ని ఉపయోగిస్తారు.

### సౌర వికిరణం

సూర్యుడి నుంచి నిరంతరం విడుదలయ్యే శక్తిని సౌర వికిరణం అంటారు.

✹ సూర్యుడి నుంచి విడుదలైన సూర్య వికిరణం అనే సౌరశక్తి వాతావరణం మీదుగా ప్రయాణిస్తూ భూమిని చేరుతుంది. ఈ క్రమంలో అది వివిధ రకాల మార్పులకు గురవుతుంది. అందువల్ల దీనిలో కొంత సౌరశక్తి అన్యాక్రాంతం అవుతుంది. అది ఈ కింది ప్రక్రియల ద్వారా జరుగుతుంది.

1) పరావర్తనం చెందడం (Reflection)
2) పరిక్షేపణ చెందడం (Scattering)
3) పీల్చుకోవడం (Absorption)
4) ప్రసారం జరగడం (Transmission)

**పరావర్తనం చెందడం:** ఒక వస్తువుపై పడిన సూర్యకాంతిలో కొంత భాగం లేదా పూర్తి భాగం యథాతథంగా వెనక్కు తిరిగి పోవడాన్ని పరావర్తనం చెందడం అంటారు.

▼ భూమి గ్రహిస్తున్న సౌరశక్తిలో పరావర్తనం అవుతున్న శక్తి శాతాన్ని 'ఆల్బిడో' అంటారు.

▼ మధ్యాహ్న సమయంలో సూర్యకిరణాలు భూమిపై ఉన్న జల భాగాలపై లంబంగా పడతాయి. ఆ సమయంలో పరావర్తనం చాలా తక్కువగా ఉంటుంది.

▼ ఉదయం, సాయంత్రం సూర్యకిరణాలు ఏటవాలుగా పడతాయి. ఆ సమయాల్లో పరావర్తనం చాలా తక్కువగా ఉంటుంది.

▼ వేసవి కాలంలో ప్రజలు ఎక్కువగా వడదెబ్బకు గురవుతారు. సాధారణంగా ఉదయం 12 గంటల కంటే ముందు లేదా మధ్యాహ్నం 2 గంటల తర్వాత వడదెబ్బకు లోనవుతారు. కారణం ఆ సమయాల్లో సౌర వికిరణం (పరావర్తనం) ఎక్కువగా ఉండటం.

▼ భూమి ఆల్బిడో 30%, బుధగ్రహం ఆల్బిడో 78%, చంద్రుడి ఆల్బిడో 7% ఉంటాయి.

**పరిక్షేపణ చెందడం:** వాతావరణంలోని దుమ్ము కణాలు, వాయువుల పరమాణువులు మొదలైనవి సూర్యకాంతిని అన్ని దిశల్లో చెదరగొట్టడాన్ని 'పరిక్షేపణ చెందడం' అంటారు.

▼ లార్డ్ రాలీ (Lord Rayleigh) అనే ఇంగ్లిష్ శాస్త్రవేత్త పరిక్షేపణ అనే ప్రక్రియను అధ్యయనం చేశారు. అందుకే దీన్ని 'రాలీ పరిక్షేపణ' అని కూడా అంటారు.

▼ సౌరశక్తి/ సూర్యకాంతి హ్రస్వ తరంగాల రూపంలో భూమిని చేరి, దీర్ఘ తరంగాల రూపంలో తిరిగి వాతావరణ పొరల వద్దకు చేరుతుంది.

▼ సూర్యకాంతిని ఒక పట్టకం (Prism) మీదుగా పయనించేలా చేస్తే అది ఏడు రంగులుగా విడిపోతుంది. దీన్నే ఇంద్రధనస్సు అంటారు.

▼ ఇంద్రధనస్సులోని రంగులు (VIBGYOR): నేరేడు (Voilet), ఇండిగో (Indigo), నీలం (Blue), ఆకుపచ్చ (Green), పసుపు (Yellow), కాషాయం (Orange), ఎరుపు (Red).

▼ సూర్యకిరణాలు వాతావరణం మీదుగా ప్రయాణించేటప్పుడు వాతావరణంలోని దుమ్ము కణాలు, వాయువుల పరమాణువులు తదితరాల ద్వారా నేరేడు రంగు, నీలం, ఇండిగో మొదలైనవి సూర్యకిరణాలను బాగా చెదరగొడతాయి. కాబట్టి మనకు ఆకాశం నీలి రంగులో కనిపిస్తుంది.

▼ వాస్తవానికి ఆకాశం నలుపు రంగులో ఉంటుందని చంద్రమండలానికి వెళ్లి, అక్కడ నుంచి భూమిని చూసిన అమెరికా వ్యోమగాములు తెలిపారు.

**పీల్చుకోవడం:** సూర్యుడి నుంచి విడుదలైన సూర్యరశ్మిని భూమిపై ఉన్న వివిధ స్వరూపాలు, జీవులు తమకు కావాల్సినంత అందిపుచ్చుకోవడాన్ని పీల్చుకోవడం అంటారు.

**ఉదా:** భూ ఉపరితలంపై సరాసరి ఉష్ణోగ్రత 13°C నుంచి 15°C వరకు ఉంటుంది. అయితే అన్ని ప్రాంతాల్లో ఇది ఒకేలా ఉండదు.

**ప్రసారం:** సౌరశక్తి ప్రసారం అప్పుడున్న వాతావరణ స్థితి, సూర్యకిరణాలు వాతావరణంలో ప్రయాణించే విధానాన్ని బట్టి మారుతూ ఉంటుంది.

## 427 Word of the Day

### Ameliorate

***Telugu meaning:*** పెంపొందించు, మెరుగుపరుచు

***English meaning:*** The word 'ameliorate' is a verb that describes making something better or improving a situation.

***Synonyms:*** Improve, Enhance

***Antonyms:*** Worsen, Aggravate

***Usage:*** **1.** The government implemented new policies to ameliorate the living conditions of the underprivileged.

**2.** She took up meditation to ameliorate her stress and anxiety.

## Latest Updates

### 141th Technical Graduate Course

Applications are invited from eligible unmarried Male Engineering Graduates for the 141 Technical Graduate Course (TGC-141) commencing in July 2025 at the Indian Military Academy (IMA), Dehradun for Permanent Commission in the Indian Army. The total no. of posts is 30. The last date for online application is 17-10-2024.

### Teaching Posts

Ranga Reddy District Maheswaram Government Medical College (GMCM) is conducting interviews for filling up 96 teaching vacancies on a contractual basis. Eligible candidates can apply online before 4 October 2024.

### BA Programme Spot Admissions

Spot Admission round will be conducted at Sammakka Sarakka Central Tribal University (SSCTU), Mulugu to fill the vacant seats in the B.A. English (Honours), B.A. Social Sciences (Honours) programmes. The spot admission schedule date is on 3 October 2024.

### Apprentice Posts

Indian Council of Agricultural Research (ICAR) - National Research Center for Banana (NRCB) at Tiruchirappalli, Tamil Nadu invites applications from eligible candidates for Apprenticeship Training. The last date for online application is on 7 October 2024.

### Did You Apply..?

*Today (October 1) is the last date for the following Posts/ Scholarships*

☛ 26 Assistant Professor (Grade-I & II) posts in Indian Institute of Technology Indore, Madhya Pradesh. ***Qualification:*** Ph.D along with teaching experience.

☛ 176 Non-Executive posts in Mazagon Dock Shipbuilders Limited, Mumbai.

☛ 84 Anganwadi posts in DWCD, Anantapuramu District. ***Qualification:*** SSC(10th Class).

☛ 74 Project posts in CMERI, Durgapur. ***Qualification:*** Diploma, BE/B.Tech, ME/M.Tech, work experience etc.

☛ 819 Constable (Kitchen Services) posts in ITBP. ***Qualification:*** Matriculation/ 10th Class, Course in Food Production or Kitchen.

☛ SBIF Asha Scholarship Program 2024. ***Eligibility:*** Class 6 to 12, Degree, PG.

*For more information and other notifications - scan QR code*



## Current Affairs



India's Gulveer Singh won the gold medal in the men's 5,000 meters race at the World Athletics Continental Tour in Japan on 28 September 2024. He create a new national record with a time of 13 minutes and 11.82 seconds. This broke his own previous record of 13 minutes and 18.92 seconds, which he had set earlier this year (2024).

● Japan's Mebuki Suzuki took second place with a personal best of 13 min 13.80 sec. Another Japanese runner, Kotaro Shinohara, took third place with a time of 13 min 15.70 sec.

India signed 12 Memorandam of Understanding (MoUs) for High Impact Community Development Projects (HICDPs) in Nepal on 28 September 2024. These projects, supported by a grant from the Government of India, span across sectors such as education, health, agriculture, drinking water, and culture. The total estimated cost for these initiatives is NRs. 474 million (Rs.29.6 crores).

Lok Sabha Speaker Om Birla inaugurated the 21st Commonwealth Parliamentary Association (CPA) Zone III Conference at the Mizoram Legislative Assembly Complex on 27 September 2024. This gathering, which aims to foster legislative sanctity, brings together key political figures and representatives from across the northeastern region.

The Indian Army is celebrated the 198th Gunners Day on 28 September 2024. The day is observed to commemorate the raising of the first Indian Artillery Unit, namely, 5 (Bombay) Mountain Battery in 1827.

**For more Current Affairs: Scan QR code**

## RRB Exams
### Mathematics

#### Algebra

**1.** If $x - y = 17$ and $xy = 25$, then calculate the value of $x^2 + y^2$?
A) 363 B) 361
C) 350 D) 339

**2.** $\frac{(\sqrt{23}+\sqrt{11})^2+(\sqrt{23}-\sqrt{11})^2}{34} = ?$
A) 4 B) 2 C) 0 D) 34

**3.** If $3x + 4y = 12$ and $xy = 7$ then find the value of $27x^3 + 64y^3$?
A) –1500 B) –1000
C) –1296 D) –2048

**4.** $\frac{44^3 - 18^3}{44^2 + 18^2 + 792} = ?$
A) 26 B) 28 C) 32 D) 30

**5.** If $x + y + z = 5$ and $x^2 + y^2 + z^2 = 10$; then find the value of $xy + yz + zx$.
A) 8 B) 8.5 C) 6.5 D) 7.5

**6.** If $a + b + c = 20$; $a^2 + b^2 + c^2 = 80$; find the value of $ab + bc + ca$.
A) 130 B) 165
C) 150 D) 160

**7.** If $a + b = \sqrt{19}$ and $a - b = \sqrt{7}$ find the value of $5(a^2 + b^2)$.
A) 65 B) 68 C) 72 D) 60

**8.** If $a = 1240$; $b = 1244$; $c = 1248$ then find the value of $a^2 + b^2 + c^2 - ab - bc - ca$?
A) 48 B) 50 C) 52 D) 44

**9.** If $a - b = 6$; $b - c = 12$; $c - a = 8$; then find the value of $a^2 + b^2 + c^2 - ab - bc - ca$?
A) 122 B) 120
C) 128 D) 140

**10.** If $a^4 + b^4 + a^2b^2 = 15$ $a^2 + b^2 + ab = 5$ find the value of 10 ab.
A) 8 B) 5 C) 10 D) 15

**11.** If $ax + by = 12$; $bx - ay = 8$; $a^2 + b^2 = 4$ then find the value of $x^2 + y^2$.
A) 60 B) 52 C) 70 D) 82

**12.** If x = 20 then find the value of $x^5 - 21x^4 + 21x^3 - 21x^2 + 21x + 40$.
A) 65 B) 70 C) 50 D) 60

**13.** If $x + y + z = 10$; $\frac{1}{x}+\frac{1}{y}+\frac{1}{z} = 8$; $x^2 + y^2 + z^2 = 20$. Then find the value of xyz.
A) 8 B) 4 C) 6 D) 5



**14.** If $a^2 + b^2 + c^2 = ab + bc + ac$; then find the value of $\frac{15a^4 + 20b^4 + 25c^4}{16a^2b^2 + 14b^2c^2 + 30c^2a^2}$.
A) 2 B) –1 C) 0 D) 1

**15.** If $(x-5)^2 + (y-3)^2 + (z-6)^2 = 0$ then find the value of $x^2 + y^2 + z^2 + 2$.
A) 70 B) 84
C) 80 D) 72

**16.** If $x^4 - 4x^3 + 8x - 10$ is divided by $x - 3$; find the remainder.
A) –16 B) –9
C) –11 D) –13

**17.** If $x = \frac{1}{x-5}$ $(x > 0)$ then the value of $x^2 + \frac{1}{x^2}$ is.....
A) 18 B) 20 C) 24 D) 27

**18.** If $\frac{a}{b} = \frac{9}{5}$ then find the value of the expression $\frac{10a + 17b}{10a - 17b}$
A) 45 B) 40 C) 35 D) 30

**19.** If $x - \frac{1}{x} = 2\sqrt{3}$; What is the value of $x^6 + \frac{1}{x^6}$?
A) 2940 B) 2846
C) 2740 D) 2702

**20.** If $x - \frac{1}{x} = 3\sqrt{5}$ then find the value of $x^3 - \frac{1}{x^3}$?
A) $140\sqrt{5}$ B) $156\sqrt{5}$
C) $154\sqrt{5}$ D) $144\sqrt{5}$

*Scan the QR code for Key*

*These model questions were prepared by subject experts of **RACE Institute** Hyderabad*

ఈనాడు ప్రతిభ
హైదరాబాద్, మంగళవారం, అక్టోబరు 1, 2024
22
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## ప్రాక్టీస్ బిట్స్

1. కింది అంశాల్లో సరికానిదాన్ని గుర్తించండి.
   1) సెషన్స్ కోర్టు జిల్లాస్థాయిలో అత్యున్నత క్రిమినల్ కోర్టు.
   2) సెషన్స్ కోర్టు మరణశిక్షను కూడా విధించగలదు.
   3) సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్ష అమలు కావాలంటే జిల్లా జడ్జి ధ్రువీకరించాలి.
   4) ఆధీన కోర్టులు ఇచ్చిన తీర్పులను హైకోర్టులో అప్పీలు చేయొచ్చు. నిందితులు/సాక్షులను హైకోర్టు పిలవదు.

### ఇండియన్ పాలిటీ

2. కింది అంశాల్లో సరికాని దాన్ని గుర్తించండి.
   1) జర్మనీలో యూదులను వేధించి, లక్షలాది మందిని హిట్లర్ హతమార్చాడు.
   2) సౌదీఅరేబియాలో ముస్లింలు కానివాళ్లకు దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు నిర్మించుకునేందుకు అనుమతించరు.
   3) ప్రభుత్వం నుంచి మతాన్ని వేరు చేయడాన్ని 'లౌకిక వాదం' అంటారు.
   4) లౌకిక రాజ్యంలో ప్రభుత్వానికి ఒకే ఒక్క అధికార మతం ఉంటుంది.
3. అమెరికాలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఏ ప్రతిజ్ఞతో తమ పాఠశాలను ప్రారంభిస్తారు?
   1) విజ్ఞత ప్రతిజ్ఞ 2) విధేయత ప్రతిజ్ఞ
   3) విధాన ప్రతిజ్ఞ 4) వివేకానంద ప్రతిజ్ఞ


సమాధానాలు: 1-3, 2-4, 3-2.

### ప్రిపరేషన్ టెక్నిక్

ముఖ్యమైన అధ్యాయాలపై ప్రధానంగా దృష్టిపెడుతూ సిలబస్‌ను పూర్తిగా అర్థం చేసుకుని, అవగాహన పెంచుకోవాలి. మార్కుల వెయిటేజీ ప్రకారం చాప్టర్లకు తగినంత సమయం కేటాయించుకోవాలి.

డీఎస్సీ/టెట్ - 2024
హిందీ కంటెంట్

## పదోతరగతి
తెలుగు



### వీర తెలంగాణ

**3 మార్కుల ప్రశ్నలు**

**1) నాడు నేడును తెలంగాణ ఓడలేదు. ఎందుకో రాయండి.**

జ: రాజుల కాలం నుంచి ఏనాడూ తెలంగాణ ఓడిపోలేదు. కాకతీయ, చాళుక్య రాజులు శత్రువులపై పరాక్రమాన్ని చూపించారు. విజయం సాధించారు. వారి విజృంభణకు ఎవరూ ఎదురు నిలవలేదు. శత్రు రాజుల గుండెలు ఆగిపోయాయి. విజయ జెండాలు ఆకాశంలో రెపరెపలాడాయి. శత్రువుల దొంగ దెబ్బకు తమ భుజ పరాక్రమాన్ని చూపించారు. ఈ నేలలో బలం, ఇక్కడి వారిలో పరాక్రమం, ధైర్యం, అధికంగా ఉండటం వల్ల ఎప్పుడూ ఓడిపోలేదు.

**2) దాశరథి కృష్ణమాచార్యుల రచనాశైలిలో మీకు నచ్చిన అంశాలను తెలపండి.**

ప్రశ్నలు జవాబులు

జ: దాశరథి కృష్ణమాచార్యులు ప్రజలను చైతన్యపరిచిన ఉద్యమ కవి. ఆవేశానికి అక్షరాన్ని తొడిగి అభ్యుదయ పథాన తన కవిత్వాన్ని ప్రకటించాడు. ఆయన రచనా శైలిలో ఉత్తేజం కనిపిస్తుంది. తెలుగు రేగడిలో జిగిమెండు అని, నేల గొప్పతనాన్ని చాటారు. 'కల్లోలం రేపినారు భువిలో' అని తెలంగాణ వీరులను కీర్తించాడు. అంతేకాదు 'వీరు వీరులు పరార్థుల్ తెల్గుజోదుల్' అని వారి ఉన్నతిని స్పష్టం చేశారు. తెలంగాణను "శ్రావణాభ్రమటుల గంభీర గర్జాట్టహాసమలర నా తెలంగాణ పోవుచున్నది'' అనితెలిపారు.

**3) 'కల్లోలము రేపినారు భువిలో' అంటే మీకేమర్థమైంది?**

జ: తెలంగాణ స్వాతంత్ర్య పోరాటం భీకరంగా సాగింది. ఆ పోరాటం సముద్రం మాదిరిగా ఉప్పొంగింది. తెలంగాణ వీరులు అన్ని వైపుల నుంచి సముద్రానికి గండి కొట్టి తెలంగాణ నేలను స్వాతంత్ర్యపు నీటితో తడిపారు. భూమిపై కల్లోలాన్ని లేపారు. అది ఎలాగంటే నవాబుల ఆజ్ఞలను పట్టించుకోకుండా కాలం చెల్లినట్లుగా నిరూపించారు.

**4) 'వీరు వీరులు పరార్థులు తెల్గు జోదల్ భళా' – వివరించండి.**

జ: తెలంగాణ వీరులు విప్లవాత్మక భావాలున్నవారు. వారి కదలికలు ప్రకాశిస్తూ ఉన్నాయి. భూమి నంతయును ఆవరించాయి. వారు ఉజ్జ్వలమైన కాంతిమంతమైన సూర్యుడిని పిలిచి దేశమంతా కొత్త కాంతిని నింపారు. ఉద్యమ భావనలను ప్రాకేలా చేశారు. వీరత్వం ఉన్నవారుగా నిలిచారు. ఇతరులకు సాయం చేయడంలో ముందుండేవారు. యోధులుగా కీర్తి పొందారు. తెలంగాణ వీరులు సహనం, పరాక్రమం సమంగా ఉన్న నేర్పరులు. అందరిచేత భళా అని అనిపించుకున్నారు.

– అంజాగౌడ్

#### ముఖ్యమైనవి మరికొన్ని..


1) వీరతెలంగాణ ద్వారా మీరు గ్రహించిన విషయాలేమిటి? **(6 మా.)**

జవాబుల కోసం

2) తెలంగాణలో గడ్డిపోచ కూడా కత్తిబట్టి ఎదిరించింది. ఎందుకో వివరించండి. **(3 మా.)**

# విశ్వమంతా విస్తరించిన బలం!

బంతిని పైకి విసిరేస్తే కిందకే ఎలా పడుతోంది? నీరు ఎత్తు నుంచి పల్లానికే ప్రవహించడానికి కారణం ఏమిటి? అన్ని జీవరాశులు గుండ్రంగా ఉన్న భూమిని అతుక్కుని ఏ విధంగా ఉంటున్నాయి, ఎందుకు పడిపోవడం లేదు? అన్నింటికీ ఒకటే సమాధానం గురుత్వాకర్షణ. అంటే ప్రతిదీ ఒకదానిని మరొకటి ఆకర్షించే ప్రాథమిక బలం. ద్రవ్యరాశి పెరిగిన కొద్దీ ఆ ఆకర్షణశక్తి ఎక్కువవుతుంది. దాని వల్లే భూమి చుట్టూ చంద్రుడు, సూర్యుడి చుట్టూ గ్రహాలు తిరుగుతున్నాయి. భూమితో పాటు విశ్వమంతా విస్తరించిన ఈ శక్తిపై న్యూటన్ చెప్పిన గమన నియమాలే భౌతిక శాస్త్ర విజ్ఞానాన్ని, ఖగోళశాస్త్ర అధ్యయనాన్ని సమగ్రం చేశాయి. ఈ నేపథ్యంలో న్యూటన్ సూత్రీకరణలు, గురుత్వాకర్షణ సిద్ధాంతంలోని ప్రధానాంశాలు, వాటిలో కలిగే మార్పుల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. కృత్రిమ ఉపగ్రహాల పనితీరు, వాటి గమనంలో ఉన్న కొలతలు, గ్రహాల సార్వత్రిక నియమాలపై అవగాహన కలిగి ఉండాలి.



న్యూటన్

జనరల్ స్టడీస్
భౌతిక శాస్త్రం

### గురుత్వాకర్షణ

వస్తువుల చలనానికి కారణం బలం. వస్తువు వేగం లేదా చలన దిశలో మార్పు తీసుకురావడానికి బలం అవసరం. కొంత ఎత్తు నుంచి జారవిడిచిన వస్తువులు భూమి వైపు చలించడాన్ని గమనించవచ్చు. సూర్యుడి చుట్టూ అన్ని గ్రహాలు తిరుగుతుంటాయి. అలాగే భూమి చుట్టూ చంద్రుడు తిరుగుతాడు. అన్ని సందర్భాల్లో గ్రహాలు, చంద్రుడు లాంటి వాటిపై ఏదో బలం పనిచేస్తూ ఉండాలి. దాన్నీ కనిపెట్టేశారు. వీటన్నింటికీ ఒకే బలం కారణమని ఐజాక్ న్యూటన్ గ్రహించాడు. దాన్నే గురుత్వాకర్షణ బలం అంటారు.

చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతాడు. ఒక వస్తువును పైకి విసిరినప్పుడు అది నిర్దిష్ట ఎత్తుకు చేరుకుని కిందకు పడిపోతుంది. న్యూటన్ ఆపిల్ చెట్టు కింద కూర్చొని ఉన్నప్పుడు అతడిపై ఆపిల్ పడింది. ఆ విధంగా ఆపిల్ కిందకే పడటం న్యూటన్‌ని ఆలోచింపజేసింది. "భూమి ఆపిల్‌ను ఆకర్షించగలిగినప్పుడు చంద్రుడిని ఆకర్షించలేదా?'' అని అనుకున్నాడు. ఈ రెండు సందర్భాల్లోనూ ఒక రకమైన బలం పని చేయడానికి అవకాశం ఉంటుందని ఊహించాడు.

**విశ్వగురుత్వాకర్షణ సిద్ధాంతం:** విశ్వంలో ఏ రెండు ద్రవ్యరాశుల మధ్య అయినా ఆకర్షణ బలం ఉంటుందని, అది వాటి ద్రవ్యరాశుల లబ్ధానికి అనులోమానుపాతంలో, వాటి మధ్య దూరవర్గానికి విలోమానుపాతంలో ఉంటుందని తెలిపాడు.

$\therefore F \propto m_1 m_2$

$\therefore F \propto \frac{1}{d^2}$

★ $F \propto \frac{m_1 m_2}{d^2}$

$F = G\frac{m_1 m_2}{d^2}$ (G = విశ్వగురుత్వాకర్షణ స్థిరాంకం)

$G = 6.67 \times 10^{-11}\ Nm^2/kg^2$

**గురుత్వత్వరణం** (g) (Accelaration gravity) : స్వేచ్ఛాపతన వస్తువుపై భూమి కలిగించే త్వరణాన్ని గురుత్వత్వరణం అంటారు.

$\therefore g = \frac{GM}{R^2}$

$\therefore g = 9.8\ m/s^2$

* G = విశ్వగురుత్వ స్థిరాంకం * M = భూమి ద్రవ్యరాశి * R = భూమి వ్యాసార్ధం * g విలువ ప్రదేశాన్ని బట్టి మారుతుంది. * గురుత్వత్వరణం ద్రవ్యరాశిపై ఆధారపడదు.

**g విలువలో మార్పులు:** * ధ్రువాల వద్ద g విలువ - ఎక్కువ * భూమధ్యరేఖకు దగ్గరగా g విలువ - తక్కువ * భూకేంద్రం వద్ద g విలువ - శూన్యం * భూమి నుంచి ఎత్తుకు/లోతుకు వెళ్లే కొద్దీ g విలువ పెరుగుతుంది.

**భారం** (Weight) : ఒక వస్తువుపై పనిచేసే భూమ్యాకర్షణ బలాన్ని భారం అంటారు. * భారం (W) = mg. * m = ద్రవ్యరాశి. * g = గురుత్వత్వరణం.

* SI యూనిట్ - న్యూటన్ /kgwt
* CGS యూనిట్ - డైన్/ gmwt

* భారం అనేది ప్రదేశాన్ని బట్టి మారుతుంది. భూమిపై ఒక వ్యక్తి కలిగి ఉన్న భారంలో 1/6 వంతు భారం మాత్రమే చంద్రుడిపై కలిగి ఉంటాడు. అంటే చంద్రుడిపై భారం = భూమిపై భారం/6. * భారాన్ని స్ప్రింగ్‌త్రాసుతో కొలుస్తారు. * 1 kg ద్రవ్యరాశి ఉన్న వస్తువుపై భూమి కలిగించే భారం - 9.8 N
* 2 kg ద్రవ్యరాశి ఉన్న వస్తువుపై భూమి కలిగించే భారం -19.6 N

**ద్రవ్యరాశి** (mass): పదార్థ పరిమాణాన్ని ద్రవ్యరాశి అంటారు. ద్రవ్యరాశి విశ్వంలో ఎక్కడైనా స్థిరంగా ఉంటుంది. * SI యూనిట్ - Kg * CGS యూనిట్ - gm * దీన్ని సాధారణ త్రాసుతో లెక్కిస్తారు. ద్రవ్యరాశిని అత్యంత కచ్చితంగా కొలవడానికి ఎలక్ట్రానిక్ త్రాసులను ఉపయోగిస్తారు.

**గురుత్వకేంద్రం:** ఒక వస్తువుపై పనిచేసే భారం ఆ వస్తువుకు చెందిన ఏ బిందువు ద్వారా వెళుతుందో ఆ బిందువునే దాని గురుత్వకేంద్రం అంటారు. ఒక వస్తువుకు గురుత్వకేంద్రం ఒకటే ఉంటుంది. ఒక వస్తువుకు గురుత్వకేంద్రం వెలుపల లేదా లోపల ఉంటుంది. అంగుళ్యాకార వస్తువులకు గురుత్వకేంద్రం లోపల ఉంటుంది. ఉదా: ఉంగరం.

**స్థిరత్వం:** ఒక వస్తువు గురుత్వకేంద్రం దాని ఆధార వైశాల్యం ద్వారా వెళితే అది స్థిరత్వాన్ని కలిగి ఉంటుంది. ఒక వస్తువు అధిక స్థిరత్వాన్ని పొందడానికి రెండు అంశాలు ఉండాలి. అవి- 1) వస్తువు గురుత్వకేంద్రం ఎత్తు తక్కువగా ఉండాలి. 2) వస్తువు ఆధార వైశాల్యం ఎక్కువగా ఉండాలి. ఈ రెండు నియమాల ఆధారంగా పడవలను తయారు చేస్తారు. అందుకే సముద్రంలో ఎన్ని కెరటాలు వాటిని బలంగా తాకినా పడిపోకుండా ఉంటాయి.

* మూటలు మోసే వ్యక్తి కొంచెం ముందుకు వంగుతాడు. కారణం అతడు తన గురుత్వకేంద్రం ఎత్తు తగ్గించుకుని స్థిరత్వాన్ని పొందుతాడు.

**కెప్లర్ గ్రహ నియమాలు:**

1) **కక్ష్యా నియమం:** సూర్యుడిని ఒక నాభిగా చేసుకుని సూర్యుడి చుట్టూ వేర్వేరు గ్రహాలు, వేర్వేరు దీర్ఘవృత్తాకార కక్ష్యల్లో పరిభ్రమిస్తూ ఉంటాయి.

2) **విస్తీర్ణ నియమం:** సూర్యుడిని, గ్రహాన్ని కలిపే సదిశా త్రిజ్యా సమాన కాలవ్యవధుల్లో సమాన విస్తీర్ణాలను విరజిమ్ముతుంది.

3) **పరిభ్రమణ కాలనియమం:** సూర్యుడి చుట్టూ తిరిగే ఒక గ్రహం పరిభ్రమణ కాలవర్గం ($T^2$) ఆ గ్రహం సూర్యుడు చుట్టూ తిరిగే దీర్ఘవృత్తాకార కక్ష్య వ్యాసార్ధ ఘనానికి అనులోమానుపాతంలో ఉంటుంది.

$\therefore T^2 \propto r^3$

**భూస్థావర ఉపగ్రహం:** ఒక కృత్రిమ ఉపగ్రహం కక్ష్యావర్తన కాలం భూమి భ్రమణావర్తన కాలానికి సమానమైతే అలాంటి ఉపగ్రహాన్ని భూస్థావర ఉపగ్రహం అంటారు. ఇది పడమర నుంచి తూర్పు దిశకు పరిభ్రమిస్తుంది. దీని ఎత్తు 35,800 కి.మీ., కక్ష్యా వ్యాసార్ధం 42,250 కి.మీ., ఆవర్తనకాలం 24 గంటలు. ఇది వృత్తాకార కక్ష్యలో తిరుగుతూ ఉంటుంది.

**పలాయన వేగం ($V_e$):** ఒక గ్రహం గురుత్వాకర్షణ ప్రభావం నుంచి తప్పించుకునిపోవడానికి వస్తువుకు ఉండాల్సిన కనీస వేగాన్ని పలాయన వేగం అంటారు.

$\therefore V_e = \sqrt{2gR}$

**కక్ష్యావేగం ($V_o$):** ఒక గ్రహం చుట్టూ వృత్తాకార మార్గంలో పరిభ్రమించడానికి ఒక వస్తువుకు కావాల్సిన వేగాన్ని కక్ష్యావేగం అంటారు.


$\therefore V_o = \sqrt{gR}$



రచయిత: చంటి రాజుపాలెం

# నత్రజని కోసం కీటకాలను తినే మొక్కలు!

ప్రకృతిలో జీవ, రసాయన సంబంధిత అంశాల కలయికతో కూడిన సహజస్థితే పర్యావరణ వ్యవస్థ. ఇందులో రూపొందే ఆహార వనరుల ఆధారంగా నిర్ణీత ప్రాంతంలో శిలీంధ్రాలు, శైవలాలు, మొక్కలు, జంతువుల లాంటి విభిన్న జీవులు, జాతులు పరస్పర ఆధారితంగా మనుగడ సాగిస్తున్నాయి. ఆహార గొలుసులు, ఆవరణ వ్యవస్థలు, జీవవైవిధ్యం, కార్బన్ వలయం లాంటివన్నీ ఇందులో భాగమే. భౌతిక, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉండే ఈ జీవ వ్యవస్థల గురించి పోటీ పరీక్షార్థులకు కనీస అవగాహన ఉండాలి. ప్రాంతాలకు అనుగుణంగా మొక్కలు, జంతువుల నిర్మాణం, జీవక్రియల తీరు, భూతాపం లాంటి పర్యావరణ మార్పుల కారణంగా అన్నిరకాల ఆవరణ వ్యవస్థల్లో సంభవిస్తున్న మార్పులు, ప్రభావితమవుతున్న జీవుల గురించి తెలుసుకోవాలి.



డీఎస్సీ/టెట్ - 2024
పర్యావరణ అంశాలు

### ఆవరణ వ్యవస్థ

1. శిలల శైథిల్యం వల్ల పోషకాలు విడుదలై వాతావరణ చక్రంలోకి ప్రవేశించడానికి ప్రధాన మూలమైన బయోజియోకెమికల్ సైకిల్ కిందివాటిలో..
   1) కార్బన్ సైకిల్ 2) నైట్రోజన్ సైకిల్
   3) ఫాస్ఫరస్ సైకిల్ 4) సల్ఫర్ సైకిల్
2. కిందివాటిలో డెట్రిటివోర్స్ ఏవి?
   ఎ) వానపాము బి) జెల్లీ ఫిష్
   సి) మిల్లిపెడెస్ డి) సముద్ర గుర్రం
   ఇ) చెక్క పేను
   1) ఎ, బి, డి 2) బి, సి, డి, ఇ
   3) ఎ, సి, ఇ 4) ఎ, బి, సి, డి, ఇ
3. కిందివాటిలో ఇతర జీవులతో సహజీవన సంబంధాన్ని ఏర్పరచగల జాతులు ఏవి?
   ఎ) నిడేరియన్లు బి) శిలీంధ్రాలు సి) ప్రోటోజోవా
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
4. ప్రకృతిలో, నేల లేని ఉపరితలంపై ఎక్కువగా జీవించే అవకాశం ఉన్న మొక్కలు?
   ఎ) ఫెర్న్ బి) లైకేన్
   సి) నాచు మొక్కలు డి) పుట్టగొడుగులు
   1) ఎ, డి 2) బి మాత్రమే
   3) బి, సి 4) ఎ, సి, డి
5. కింది జీవులను పరిగణించండి.
   ఎ) కోపెపాడ్స్ బి) సైనోబ్యాక్టీరియా
   సి) డయాటమ్స్ డి) ఫోరామినిఫెరా
   మహాసముద్రాల ఆహార గొలుసుల్లో పైన పేర్కొన్న వాటిలో ప్రాథమిక ఉత్పత్తిదారులు ఎవరు?
   1) ఎ, బి 2) బి, సి
   3) సి, డి 4) ఎ, డి
6. కింది జంతువులను పరిగణించండి.
   ఎ) ముళ్లపంది బి) మర్మోట్ సి) పాంగోలిన్
   మాంసాహారుల నుంచి తప్పించుకునేందుకు పైన పేర్కొన్న జీవుల్లో ఏది దానికున్న హాని కలిగించే భాగాలను ఉపయోగించి రక్షణ పొందుతుంది?
   1) ఎ, బి 2) బి 3) సి 4) ఎ, సి
7. కిందివాటిలో సరైన ప్రకటనను గుర్తించండి.
   ఎ) వ్యవసాయ నేలలు పర్యావరణంలోకి నైట్రోజన్ ఆక్సైడ్‌లను విడుదల చేస్తాయి.
   బి) పశువులు అమ్మోనియాను పర్యావరణంలోకి విడుదల చేస్తాయి.
   సి) పౌల్ట్రీ పరిశ్రమ పర్యావరణంలోకి రియాక్టివ్ నైట్రోజన్ సమ్మేళనాలను విడుదల చేస్తుంది.
   1) ఎ, సి బి) బి, సి
   3) బి మాత్రమే డి) ఎ, బి, సి
8. ఎడారి ప్రాంతాల్లో ఉండే మొక్కల్లో నీటి నష్టాన్ని తగ్గించడానికి పత్రాలు పొందే మార్పులు?
   ఎ) గట్టి, మైనపు ఆకులు బి) చిన్న ఆకులు
   సి) ఆకులకు బదులుగా ముళ్లు
   1) బి, సి 2) బి 3) సి 4) ఎ, బి, సి
9. వ్యవసాయంలో నత్రజని ఎరువులు అధికంగా/అనుచితంగా ఉపయోగించడం వల్ల ఎలాంటి ప్రభావం ఉంటుంది?
   ఎ) నేలలో నత్రజని స్థాపిత సూక్ష్మజీవుల విస్తరణ సంభవించవచ్చు.
   బి) నేల ఆమ్లత్వంలో పెరుగుదల జరగవచ్చు.
   సి) భూగర్భ జలాలకు నైట్రేట్ లీచింగ్ సంభవించవచ్చు.
   1) ఎ, సి 2) బి 3) బి, సి 4) ఎ, బి, సి
10. కిందివాటిలో 'ఎకోసిస్టమ్' అనే పదానికి వివరణ ఏది?
    1) ఒకదాంతో మరొకటి సంఘర్షణ చెందే జీవుల సంఘం.
    2) జీవులు నివసించే భూమిలో భాగం.
    3) జీవుల సంఘం, అవి నివసించే పర్యావరణం.
    4) భౌగోళిక ప్రాంతానికి చెందిన వృక్ష, జంతుజాలాలు.
11. కింది ఏ చర్య వల్ల భూమిపై కార్బన్ సైకిల్‌కు కార్బన్‌డయాక్సైడ్ తోడవుతుంది?
    ఎ) అగ్నిపర్వత చర్య బి) శ్వాసక్రియ
    సి) కిరణజన్య సంయోగక్రియ
    డి) కర్బన పదార్థం కుళ్లిపోవడం
    1) ఎ, సి 2) బి మాత్రమే
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
12. కిందివాటిలో నిద్రాణ స్థితి దృగ్విషయాన్ని ఏ రకమైన జంతువుల్లో గమనించవచ్చు?
    ఎ) గబ్బిలాలు బి) ఎలుగుబంట్లు సి) ఎలుకలు
    1) ఎ, బి 2) బి మాత్రమే
    3) ఎ, బి, సి 4) ఏదీకాదు
13. లైకేన్లకు రాతిపై కూడా ఆవరణ అనుక్రమాన్ని ప్రారంభించే సామర్థ్యం ఉంటుంది. వాస్తవానికి ఇవి వేటి సహజీవనం వల్ల ఏర్పడతాయి?
    1) శైవలాలు, బ్యాక్టీరియా
    2) శైవలాలు, శిలీంధ్రాలు
    3) బ్యాక్టీరియా, శిలీంధ్రాలు
    4) శిలీంధ్రాలు, వైరస్
14. జీవసంబంధ కమ్యూనిటీల్లో, కొన్ని జాతులు పెద్ద సంఖ్యలో, ఇతర జాతుల సంఘంలో కొనసాగే సామర్థ్యాన్ని నిర్ణయించడంలో ముఖ్యమైనవి. ఇలాంటి జాతులను ఏమంటారు?
    1) కీస్టోన్ జాతులు 2) అల్లోపాట్రిక్ జాతులు
    3) సానుభూతి జాతులు 4) బెదిరింపు జాతులు
15. కింది పదాల్లో ఏదో ఒక జీవి ఆక్రమించిన భౌతిక స్థలాన్ని మాత్రమే కాకుండా, జీవుల సంఘంలో దాని క్రియాత్మక పాత్రను కూడా వివరించేది?
    1) ఎకోటోన్ 2) పర్యావరణ సముచితం
    3) నివాస స్థలం 4) ఇంటి పరిధి
16. ఆవరణ అనుక్రమంలో భాగంగా, ఏ కారణంగా గడ్డిభూముల ఆవరణ వ్యవస్థను వృక్షాలు భర్తీ చేయలేవు?
    1) కీటకాలు, శిలీంధ్రాలు
    2) పరిమిత సూర్యకాంతి, పోషకాల కొరత
    3) నీటి పరిమితులు, అగ్ని
    4) ఏదీకాదు
17. కిందివాటిలో మృత్తికలో నత్రజని భర్తీ కావడానికి కారణమైంది?
    ఎ) జంతువుల ద్వారా యూరియా విసర్జన
    బి) మానవుడు బొగ్గును కాల్చడం వల్ల
    సి) వృక్షసంపద క్షీణత
    1) ఎ మాత్రమే 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి
18. పర్యావరణ వ్యవస్థలో, వేటిని కుళ్లిపోయే జీవులు అని పిలుస్తారు?
    ఎ) వైరస్‌లు బి) శిలీంధ్రాలు సి) బ్యాక్టీరియా
    1) ఎ మాత్రమే 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి
19. పర్యావరణ వ్యవస్థల్లో ఆహార గొలుసుల సూచనతో, కిందివాటిని పరిశీలించి, సరైనవి గుర్తించండి.
    ఎ) ఆహార గొలుసు జీవుల గొలుసు ఒకదానికొకటి ఆహారం తీసుకునే క్రమాన్ని వివరిస్తాయి.
    బి) ఒక జాతి జనాభాలో ఆహార గొలుసులు కనిపిస్తాయి.
    సి) ఆహార గొలుసు ప్రతి జీవి సంఖ్యలను వివరిస్తుంది. వీటిని మిగతావి తింటాయి.
    1) ఎ మాత్రమే 2) ఎ, బి
    3) ఎ, బి, సి 4) ఏదీకాదు
20. ఉత్పాదకతను తగ్గించే క్రమంలో పర్యావరణ వ్యవస్థల సరైన క్రమం–
    1) మహాసముద్రాలు, సరస్సులు, గడ్డిభూములు, మడ అడవులు
    2) మడ అడవులు, మహాసముద్రాలు, గడ్డిభూములు, సరస్సులు
    3) మడ అడవులు, గడ్డిభూములు, సరస్సులు, మహాసముద్రాలు
    4) మహాసముద్రాలు, మడ అడవులు, సరస్సులు, గడ్డి భూములు
21. కిందివాటిలో ఏది ఒక భౌగోళిక ప్రాంతం జీవవైవిధ్యానికి ముప్పు కావచ్చు?
    ఎ) గ్లోబల్ వార్మింగ్ బి) ఆవాసం విఘటన
    సి) గ్రహాంతర జాతుల దాడి
    డి) శాకాహారాన్ని ప్రోత్సహించడం
    1) ఎ, బి, సి 2) బి, సి
    3) ఎ, డి 4) పైవన్నీ
22. మిలీనియం ఎకోసిస్టమ్ అసెస్‌మెంట్, పర్యావరణ వ్యవస్థ సేవలకు సంబంధించిన కింది ప్రధాన వర్గాలను వివరిస్తుంది – ప్రొవిజనింగ్, సపోర్టింగ్, రెగ్యులేటింగ్, ప్రిజర్వ్, కల్చరల్. కిందివాటిలో ఏది సపోర్టింగ్ సర్వీస్?
    1) ఆహారం, నీటి ఉత్పత్తి
    2) వాతావరణం, వ్యాధుల నియంత్రణ
    3) పోషకాల సైక్లింగ్, పంట పరాగసంపర్కం
    4) జీవవైవిధ్యం నిర్వహణ
23. కొన్ని కారణాల వల్ల సముద్రంలోని ఫైటోప్లాంక్టన్‌లు పూర్తిగా నాశనమైతే ఏం జరుగుతుంది?
    ఎ) కార్బన్ సింక్‌గా సముద్రం ప్రతికూలంగా ప్రభావితమవుతుంది.
    బి) సముద్రంలో ఆహార గొలుసులు ప్రతికూలంగా ప్రభావితమవుతాయి.
    సి) సముద్రపు నీటిసాంద్రత బాగా తగ్గుతుంది.
    1) ఎ, బి 2) బి మాత్రమే
    3) సి మాత్రమే 4) ఎ, బి, సి
24. కిందివాటిని పరిశీలించి, ఏది భూమిపై కార్బన్ వలయానికి కార్బన్ డయాక్సైడ్‌ను జోడిస్తుందో తెలపండి?
    ఎ) కిరణజన్య సంయోగక్రియ
    బి) శ్వాసక్రియ
    సి) సేంద్రియ పదార్థ క్షయం
    డి) అగ్నిపర్వత చర్య
    1) ఎ, బి 2) బి, సి
    3) బి, సి, డి 4) ఎ, డి
25. పర్యావరణ వ్యవస్థ ఉత్పాదకత సందర్భంలో, సముద్ర ఉత్పాదకతను పెంచడంలో సముద్ర ఉప్పెన మండలాలు ముఖ్యమైనవి.
    ఎ) డీకంపోజర్ మైక్రో ఆర్గానిజమ్స్ ఉపరితలంపైకి తీసుకొస్తాయి.
    బి) ఉపరితలంపైకి పోషకాలు వస్తాయి.
    సి) దిగువ–నివాస జీవులు ఉపరితలంపైకి వస్తాయి.
    పైన ఇచ్చిన ప్రకటనల్లో ఏది సరైంది?
    1) ఎ, బి 2) బి, మాత్రమే
    3) బి, సి 4) సి, మాత్రమే
26. క్లోరినేటెడ్ హైడ్రోకార్బన్ అయిన ఒక క్రిమిసంహారక మందును ఆహార పంటపై పిచికారీ చేస్తే, (ఆహార గొలుసు: ఆహార పంట–ఎలుక–పాము–డేగ) ఈ ఆహార గొలుసులో, పురుగు మందుల అత్యధిక సాంద్రత కిందివాటిలో దేనిలో పేరుకుపోతుంది?
    1) ఆహార పంట 2) ఎలుక
    3) పాము 4) డేగ
27. కొన్ని జాతుల మొక్కలు క్రిమిభక్షకాలు ఎందుకు?
    1) నీడ, చీకటి ప్రదేశాల్లో వాటి పెరుగుదల వల్ల తగినంత కిరణజన్య సంయోగ క్రియ కుదరదు. అందుకే అవి పోషణ కోసం కీటకాలపై ఆధారపడతాయి.
    2) అవి నత్రజని లోపం ఉన్న నేలల్లో పెరగడానికి అనువుగా ఉంటాయి. అందువల్ల తగినంత నత్రజని పోషణ కోసం కీటకాలపై ఆధారపడతాయి.
    3) అవి కొన్ని విటమిన్లను స్వయంగా సంశ్లేషణ చేయలేవు. అందువల్ల వాటి ద్వారా జీర్ణమయ్యే కీటకాలపై ఆధారపడతాయి.
    4) అవి జీవ శిలాజాలుగా, ఆటోట్రోఫ్‌లు, హెటిరోట్రోఫ్‌ల మధ్య లింక్‌గా పరిణామం చెందే నిర్దిష్ట దశలోనే ఉన్నాయి.
28. ఎపిఫైట్స్ వేటి కోసం ఇతర మొక్కలపై ఆధారపడే మొక్కలు?
    1) ఆహారం 2) యాంత్రిక మద్దతు
    3) నీడ 4) నీరు

### సమాధానాలు

1-3; 2-3; 3-4; 4-2; 5-2; 6-4; 7-4; 8-4; 9-3; 10-3; 11-3; 12-3; 13-2; 14-1; 15-2; 16-3; 17-3; 18-2; 19-1; 20-3; 21-1; 22-4; 23-1; 24-3; 25-2; 26-4; 27-2; 28-2.

# డ్యూయల్ డిగ్రీ ఏది మేలు?





**బీఎస్సీ బయోటెక్నాలజీ చదువుతున్నాను. దీంతోపాటుగా ఏ డ్యూయల్ డిగ్రీ చేస్తే మంచిది? – అఖిల్**

■ ఈ పోటీ ప్రపంచంలో మెరుగైన ఉపాధి అవకాశాల కోసం ఒకటికంటే ఎక్కువ సబ్జెక్టుల్లో నైపుణ్యాలు ఉండటం శ్రేయస్కరం. బీఎస్సీ బయోటెక్నాలజీతో పాటు కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మేనేజ్‌మెంట్, మైక్రో బయాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్, అగ్రికల్చర్‌ల్లో నచ్చిన సబ్జెక్టులో డ్యూయల్ డిగ్రీ చేయండి.

మీకు బయో ఇన్ఫర్మాటిక్స్, కంప్యూటేషనల్ బయాలజీ, బయోటెక్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, జీనోమ్ డేటా అనలిస్ట్, బయో స్టాటిస్టిక్స్ రంగాల్లో ఆసక్తి ఉంటే.. కంప్యూటర్ సైన్స్, బయో ఇన్ఫర్మాటిక్స్ లాంటివి ఎంచుకోండి. బయోకెమిస్ట్రీ, మాలిక్యులర్ బయాలజీ, ఫార్మాస్యూటికల్స్‌లో ఆసక్తి ఉంటే కెమిస్ట్రీ ఎంచుకోండి. పొల్యూషన్ కంట్రోల్, వేస్ట్ మేనేజ్‌మెంట్, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ రంగాల్లో ఆసక్తి ఉంటే ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ చదివే ప్రయత్నం చేయండి. బయోటెక్నాలజీ పరిజ్ఞానంతో పాటు మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు, స్వయం ఉపాధి, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బయోటెక్ కన్సల్టెన్సీ లాంటి రంగాల్లో స్థిరపడాలనుకొంటే బిజినెస్ మేనేజ్‌మెంట్ ఎంచుకోండి. బయో టెక్నాలజీ సబ్జెక్ట్‌లోనే లోతైన అవగాహన కోసం క్లినికల్ రిసెర్చ్, క్వాలిటీ కంట్రోల్, వైరాలజీ రంగాల్లో స్థిరపడాలనుకొంటే మైక్రో బయాలజీ ఎంచుకోవచ్చు. అగ్రికల్చరల్ బయో టెక్నాలజీ, జెనెటిక్ ఇంజినీరింగ్, ప్లాంట్ బయాలజీ, అగ్రోనమి లాంటి రంగాల్లో ప్రావీణ్యం కోసం అగ్రికల్చర్ సబ్జెక్టును ఎంచుకోండి.

డ్యూయల్ డిగ్రీ కోసం సబ్జెక్ట్ తీసుకొనేముందు స్వల్పకాలిక, దీర్ఘ కాలిక ఆశయాలు, మీ ప్రస్తుత నైపుణ్యాలు దృష్టిలో పెట్టుకోండి. డ్యూయల్ డిగ్రీ చేయడానికి చాలా ఆసక్తి, ఓపిక, సమయం కావాలి. అదనపు ఆర్థిక భారమూ పడొచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

### సాధారణ, ఆనర్స్ డిగ్రీల మధ్య తేడా ఏమిటి?

ఆనర్స్ డిగ్రీలో ప్రాథమిక అంశాలపై అవగాహనతో పాటు స్పెషలైజేషన్ సబ్జెక్టుపై లోతైన అవగాహన, అడ్వాన్స్‌డ్ అంశాలు, విపులమైన వివరణ, కఠినమైన పాఠ్య ప్రణాళిక, అసైన్‌మెంట్లు, పరిశోధన ప్రాజెక్ట్, సెమినార్లు, అసైన్‌మెంట్లు, ఉన్నత స్థాయి కోర్సులు, క్లిష్టమైన విశ్లేషణ, ఎక్కువ క్రెడిట్లు ఉంటాయి. సాధారణ డిగ్రీతో పోలిస్తే ఆనర్స్ డిగ్రీ కాల వ్యవధి ఒక సంవత్సరం ఎక్కువ. సాధారణ డిగ్రీలో మూడు సబ్జెక్టులు చదివితే ఆనర్స్‌లో ఒక సబ్జెక్టును మాత్రం చాలా విపులంగా, పరిశోధనాత్మకంగా చదువుతారు. ఆనర్స్ డిగ్రీతో నేరుగా పీహెచ్‌డీలో ప్రవేశం లభిస్తుంది. సాధారణ డిగ్రీ అయితే పీజీ చేశాకే పీహెచ్‌డీలో ప్రవేశం పొందాలి.

# కొలువుల కల్పవృక్షం

## అపార అవకాశాల ఫుడ్ ప్రాసెసింగ్

**శరవేగంగా పెరుగుతున్న ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తోంది. ఈ రంగ వృద్ధికి ఆటంకాలు కలగకుండా ఎప్పటికప్పుడు సులభతర విధానాలు రూపకల్పన చేస్తుంటుంది. దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ప్రస్తుతం 20 లక్షల మంది పని చేస్తున్నారు. అవ్యవస్థీకృతంగా 50 లక్షల మంది ఉన్నట్టు అంచనా. మొత్తంగా 70 లక్షల మందికి ఉపాధికి కల్పిస్తోంది.**




సరదాగా మూడు రోజుల టూర్‌కి బయల్దేరుతాం. దారిలో ఆటవిడుపుగా తింటానికి బాగుంటాయని చిప్స్ నుంచి కారా, కాజు వరకు పదిరకాల ప్యాకెట్లు కొని కారులో పడేసుకుంటాం. మరోసారి ఎక్కడికో ఏ విధమైన ప్లానింగ్ లేకుండా బయల్దేరుతాం. పని చూసుకొని తిరిగివస్తుంటే ఆకలేస్తుంది. ఆలోచిస్తే కారులో నూడుల్స్ ఉన్నట్టు గుర్తొచ్చి, ఫ్లాస్కులో వేడినీళ్లు ఉండడంతో రోడ్డు పక్కనే ఆపి ఆరగిస్తాం. చెప్పాపెట్టకుండా హఠాత్తుగా బంధువులు ఊడిపడ్డారు. ఇడ్లీ, దోశ పిండి రుబ్బే సమయం లేదు. సూపర్ మార్కెట్‌కి వెళ్లి చక్కగా రుబ్బి ప్యాక్ చేసిన ప్యాకెట్లు తెచ్చుకొని పరువు దక్కించుకుంటాం!

సందర్భాలు వేరైనా... అవసరాలు వేరైనా... మూడు సందర్భాల్లోనూ మనల్ని ఆదుకున్నవి ప్యాక్డ్ ఫుడ్. మన చిన్న చిన్న అవసరాలను తీర్చిన ఈ ఆహారం వెనుక భారీ పరిశ్రమ ఉంది. లక్షల కోట్ల వ్యాపారం ఉంది. లక్షల ఉద్యోగాలున్నాయి.

ఖర్చు పెట్టగల ఆదాయం పెరగడం, ప్రజల జీవనశైలిలో వచ్చిన మార్పు ఈ పరిశ్రమకు పురుడు పోసింది. సుమారు పాతికేళ్ల నుంచి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ దినదిన ప్రవర్ధమానమవుతోంది. దేశ జనాభా కూడా పెరుగుతుండటంతో మన ఫుడ్ అండ్ గ్రోసరీ మార్కెట్ ప్రపంచంలో 6వ స్థానంలో నిలిచింది. 2022లో 70 లక్షల కోట్లున్న ఫుడ్ ప్రాసెసింగ్ మార్కెట్ 2027 నాటికి మరో 30 లక్షల కోట్లు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

ప్రధానంగా పండ్లు, కూరగాయలు, చీజ్, ప్రాసెస్ చేసిన మెరైన్ ఉత్పత్తులు, వంటనూనెలు, సాఫ్ట్ డ్రింక్స్, పాడి (డెయిరీ) ఉత్పత్తుల పరిశ్రమల్లో ఎక్కువమంది పనిచేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పండ్లు, కూరగాయలు, పౌల్ట్రీ, మీట్, ఫిషరీస్, డెయిరీ, రిటైల్ ప్యాక్డ్ ఫుడ్ రంగాలను ప్రత్యేక దృష్టితో ప్రోత్సహిస్తోంది.

### నిల్వ ఆధారిత ఉత్పత్తులు

వ్యవసాయ ఉత్పత్తులను మనం తినగలిగే విధంగా నిల్వ ఆధారిత ఉత్పత్తులుగా అందించడమే ఈ పరిశ్రమ చేసేది. పెంచడం, శుభ్రపరచడం, గ్రేడింగ్, ప్యాకింగ్, చెడిపోకుండా నిల్వచేయడం, రవాణా దశల తర్వాత సూపర్ మార్కెట్లకు చేరతాయి. తాజా కూరగాయలు అమ్మేందుకు నగరాల్లో చెయిన్ షాపులు చేసే పని ఇదే. ఇప్పుడు మనకు అన్నిరకాల పండ్ల రసాలు సిద్ధంగా ప్యాక్ రూపంలో లభ్యమవుతున్నాయి. వీటి విషయంలో వ్యవసాయ ఉత్పత్తుల నుంచి రసాలు తీసి, చెడిపోకుండా ప్రిజర్వేటివ్స్ కలపడం, అవసరమైతే కాస్త రంగు, స్వీట్‌నర్స్ జత చేయడం వంటి మొత్తం ప్రక్రియ ప్రాసెసింగ్ కిందకు వస్తుంది. ఫ్రూట్ జ్యూస్ చేసే భారీ కంపెనీల ద్వారా ప్రతి దశలోనూ అనేకమందికి ఉపాధి లభిస్తోంది. బేకరీ తినుబండారాలు, షుగర్ ఫ్రీ ఐస్‌క్రీములు, ఆరోగ్యకరమైన వంటనూనెలు వంటి వాటి వెనుక ప్రాసెసింగ్ ప్రక్రియ ఉంటుంది.

### సాంకేతికత తోడుగా...

దేశానికి ఆదాయం సముపార్జించిపెట్టే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఉపాధిపరంగానూ వరంగా మారింది. ఏటా 10 లక్షల కొత్త ఉద్యోగాలను ఈ రంగం కల్పిస్తోంది. దేశంలో ఇంకా శైశవ దశలోనే ఉందీ రంగం. ఫుడ్ ప్రాసెసింగ్‌కి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అమెరికా, యూరప్‌లు బాగా ముందున్నాయి.

- మనదేశ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఆధునిక టెక్నాలజీతో పాటు ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలుచేసే క్రమంలో మరింత విస్తృతంగా ఐటీ రంగ నిపుణులకు అవకాశాలు రానున్నాయి.
- దేశంలో ఇప్పటికి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌లలో మాత్రమే ఈ రంగం కేంద్రీకృతమైంది. మిగతా రాష్ట్రాలకు విస్తరించే అవకాశాలు పుష్కలంగా ఉండగా, ఈశాన్య రాష్ట్రాలలో ఇంకా పాదం మోపలేదు. దీనివల్ల భవిష్యత్తులో ఎంతగా ఉపాధి అవకాశాలున్నాయో అంచనా వేయవచ్చు.
- పరిశ్రమకు అవసరమైన ముడిసరుకు దేశంలో సమృద్ధిగా లభ్యమవుతుండటం అందివచ్చే అవకాశం. మరోపక్క ఉన్నత ఆదాయవర్గాల పెరుగుదల మార్కెట్‌కు కలిసొచ్చే అంశం. ఈ పరిశ్రమ వృద్ధికి కన్పిస్తున్న బహుముఖ అవకాశాలు ఈ రంగంలో ఉపాధి మార్గాలకు భరోసా ఇస్తున్నాయి.

### ఈ- కామర్స్‌తో మరో మెట్టు

ప్రాసెస్డ్ ఫుడ్ మార్కెట్‌ను ఈ-కామర్స్ మరింతగా విశాలం చేసింది. గ్రోసరీ, ఫుడ్ పోర్టల్స్ ఈ బిజినెస్‌ని విస్తృతపరిచాయి. ఆన్‌లైన్ సర్వీసులు 24 గంటలపాటు అందుబాటులో ఉండటం, పోర్టల్స్ డెలివరీ విషయంలో పోటీపడుతుండటం వల్ల పరిశ్రమకు అవకాశాలు పెరిగాయి. స్టోర్‌కో, రెస్టారెంట్‌కో వెళ్లాల్సిన పనిలేకుండా వినియోగదారుని ఇంటికే ప్రాసెస్డ్ ఫుడ్ చేరవేయడంతో ఈ రంగం మరింత రాణిస్తోంది.

### ఉప విభాగాలు



ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఉద్యోగావకాశాలు కల్పించే వివిధ ఉప విభాగాలున్నాయి. ◆ పండ్లు, కూరగాయలు ◆ పౌల్ట్రీ ◆ మాంసం ◆ ఫిషరీస్ ◆ డెయిరీ ◆ ధాన్యాలు - నూనెగింజలు◆ ఆరగించేందుకు సిద్ధంగా ఉన్న ఆహారం ◆ వండడానికి సిద్ధంగా ఉన్న ఆహారం ◆ ప్యాక్డ్ ఫుడ్

వీటిలో ప్రతి విభాగమూ భారీ పరిశ్రమగా అవతరించింది. ఒక్కో పరిశ్రమలో వేల కంపెనీలు వ్యాపార లావాదేవీలు జరుపుతున్నాయి. లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఉదాహరణకు పాలు, డెయిరీ ఉత్పత్తుల్లో ఉన్న గుజరాత్‌లోని పాల ఉత్పత్తిదారుల సంస్థ- అమూల్ విభిన్న ఉత్పత్తులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 36 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది.

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ గురించి ఆమూలాగ్రం తెలుసుకొని, ఆసక్తి ఉన్న ఉప విభాగపు కోర్సులు చేస్తే ఆ రంగంలోకి ప్రవేశించవచ్చు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోని ప్రతి విభాగం యువతను ఆహ్వానిస్తోంది.



- యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

# నోటీస్ బోర్డు

## ఉద్యోగాలు

### బెల్‌లో ఇంజినీర్లు

బెంగళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్).. 13 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

- సీనియర్ అసిస్టెంట్ ఇంజినీర్: 12
- సీనియర్ అసిస్టెంట్ ఫెసిలిటీ ఆఫీసర్: 01

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా (ఎలక్ట్రానిక్స్/ మెకానికల్ / ఎలక్ట్రికల్) డిగ్రీతో పాటు పని అనుభవం.

**వయసు:** 1.09.2024 నాటికి 50 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

**వేతనం:** నెలకు రూ.40,000- రూ.1,20,000.

**ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 15-10-2024.

**వెబ్‌సైట్:** https://bel-india.in/

### నాబార్డ్‌లో గ్రూప్ సి పోస్టులు

ముంబయిలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) 108 ఆఫీస్ అటెండెంట్ - గ్రూప్ సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**అర్హత:** పదో తరగతి.

**వేతనం:** నెలకు రూ.35,000.

**వయసు:** 18-30 ఏళ్లు మించరాదు.

**ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** 02-10-2024.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు:** 21-10-2024.

▲ పోస్టుల ఖాళీలు, విద్యార్హత వివరాలు అక్టోబరు 2న అధికారిక వెబ్‌సైట్‌లో చూడవచ్చు. వెబ్‌సైట్: www.nabard.org/

### ఎడ్‌సిల్ లిమిటెడ్‌లో ఐటీ స్టాఫ్

దిల్లీలోని ఎడ్‌సిల్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన 20 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- సీనియర్ కన్సల్టెంట్: 01
- కన్సల్టెంట్- మేనేజ్‌మెంట్- 03
- సివిల్ ఇంజినీరింగ్- 02
- సాఫ్ట్‌వేర్ డెవలపర్- 04
- పబ్లికేషన్ అండ్ బ్రాండింగ్ ఎక్స్‌పర్ట్- 01
- అకౌంటెంట్- 03
- ఐటీ స్టాఫ్- 06

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీకాం, బీఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంకాం, బీటెక్/ ఎంటెక్‌తో పాటు పని అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం.

**వయసు:** సీనియర్ కన్సల్టెంట్ పోస్టుకు 50 ఏళ్లు; ఇతర పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.

**ఎంపిక:** విద్యార్హతలు, పని అనుభవం, రాత పరీక్ష, ఇంటర్వ్యూ, పీపీటీల ఆధారంగా.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 14-10-2024.

**వెబ్‌సైట్:** https://www.edcilindia.co.in/

### గ్రాడ్యుయేట్/డిప్లొమా ఇంజినీర్ ట్రెయినీలు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఎన్‌టీపీసీ లిమిటెడ్, కోల్ ఇండియా లిమిటెడ్‌ల జాయింట్ వెంచర్.. ఝార్ఖండ్ రాష్ట్రం సింద్రీలోని హిందుస్థాన్ ఉర్వరక్ అండ్ రసాయన్ లిమిటెడ్.. 212 గ్రాడ్యుయేట్/డిప్లొమా ఇంజినీర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

▲ గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ: 67

▲ డిప్లొమా ఇంజినీర్ ట్రైనీ: 145

**విభాగాలు:** మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్.

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, బీఈ/ బీటెక్‌తో పాటు పని అనుభవం. **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీకి రూ.40,000; డిప్లొమా ఇంజినీర్ ట్రెయినీకి రూ.23,000.

**వయసు:** జీఈటీలకు 30 ఏళ్లు; డీఈటీలకు 27 ఏళ్లు మించకూడదు.

**దరఖాస్తు ఫీజు:** జీఈటీలకు రూ.750; డీఈటీలకు రూ.500.

**ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 21-10-2024.

**వెబ్‌సైట్:** https://hurl.net.in/

# హెవీ వెహికల్ ఫ్యాక్టరీలో టెక్ పోస్టులు

**ఆర్మర్డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్ (ఏవీఎన్ఎల్)కు చెందిన చెన్నై, ఆవడిలోని హెవీ వెహికల్ ఫ్యాక్టరీ (హెచ్‌వీఎఫ్) టెక్నీషియన్ పోస్టులను ప్రకటించింది. ఒప్పంద ప్రాతిపదికన ఏడాది కాలానికి 271 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఒప్పంద కాలాన్ని నాలుగేళ్లకు పొడిగించే అవకాశం ఉంటుంది. దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో పంపాలి.**




డిజైన్, సివిల్, క్వాలిటీ అండ్ ఇన్‌స్పెక్షన్, బ్లాక్‌స్మిత్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఎలక్ట్రానిక్స్, మెషినిస్ట్, రిగ్గర్, వెల్డర్, లీగల్, పెయింటర్, ఫిట్టర్ ఆటో ఎలక్ట్రిక్, మిల్‌వెయిట్ మొదలైన విభాగాల్లో ఈ ఖాళీలున్నాయి.

1. **జూనియర్ మేనేజర్–2:** ఇంజినీరింగ్ డిగ్రీ (డిజైన్/ టూల్), ఎంటెక్ (డిఫెన్స్ టెక్నాలజీ) మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత రంగంలో రెండేళ్ల అనుభవం ఉండాలి.
2. **డిప్లొమా టెక్నీషియన్–9:** మెకానికల్/ ప్రొడక్షన్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ ఆటోమొబైల్ ఇంజినీరింగ్ డిప్లొమా పూర్తిచేయాలి. క్వాలిటీ అస్యూరెన్స్/ ఇన్‌స్పెక్షన్/ క్వాలిటీ కంట్రోల్‌లో డిప్లొమా/ సర్టిఫికేషన్ ఉండాలి. లేదా మెటలర్జీ ఇంజినీరింగ్ డిప్లొమాతోపాటు.. నాన్‌డిస్ట్రక్టివ్ టెస్టింగ్/ ఇండస్ట్రియల్ రేడియోగ్రఫీలో సర్టిఫికేషన్ ఉండాలి. లేదా కెమికల్ ఇంజినీరింగ్ డిప్లొమా/ బీఎస్సీ (కెమిస్ట్రీ), స్పెక్ట్రో అనాలిసిస్/ వెట్ అనాలిసిస్ లాంటి ల్యాబ్ టెస్టింగ్ విధానాల్లో సర్టిఫికేషన్ ఉండాలి.
3. **జూనియర్ టెక్నీషియన్–259:** బ్లాక్‌స్మిత్/ ఫౌండ్రీ/ ఫౌండ్రీమ్యాన్/ ఎలక్ట్రీషియన్/ పవర్ ఎలక్ట్రీషియన్/ ఎలక్ట్రానిక్స్ మెకానిక్/ ఫిట్టర్ జనరల్/ మెకానిక్ మెషిన్ టూల్ మెయింటెనెన్స్/ టూల్ అండ్ డై మేకర్/ ఆటో ఎలక్ట్రీషియన్/ ఫిట్టర్ జనరల్/ మెకానిక్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్ మెయింటెనెన్స్/ మెకానిక్ మెకట్రానిక్స్/ మెషినిస్ట్‌లో ఎన్ఏసీ/ ఎన్‌టీసీ కోర్సు పూర్తిచేయాలి.
4. **అసిస్టెంట్–1:** ఐదేళ్ల ఎల్ఎల్‌బీ/ గ్రాడ్యుయేషన్‌తో పాటు మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఫస్ట్‌క్లాస్‌లో పాసవ్వాలి.

- రెగ్యులర్/ ఫుల్‌టైమ్ విధానంలో డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసినవాళ్లు మాత్రమే దరఖాస్తు చేయాలి. ఉన్నత విద్యార్హతలు ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.
- వయసు 28 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, మాజీ సైనికోద్యోగులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

**దరఖాస్తు ఫీజు:** రూ.300. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మహిళలకు ఫీజు లేదు.

### ఎంపిక ఎలా?

విద్యార్హతలకు సంబంధించిన డిగ్రీ/ డిప్లొమా, ఇంటర్వ్యూ/ ట్రేడ్ టెస్టులో సంపాదించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.

జూనియర్ మేనేజర్ పోస్టుకు: ఇంజినీరింగ్ డిగ్రీ మార్కులకు 85 శాతం, ఇంటర్వ్యూకు 15 శాతం వెయిటేజీ ఇస్తారు.

డిప్లొమా టెక్నీషియన్: డిప్లొమా మార్కులకు 85 శాతం, ఇంటర్వ్యూకు 15 శాతం వెయిటేజీ ఇస్తారు.

జూనియర్ టెక్నీషియన్: ఎన్‌టీసీ/ఎన్ఏసీ తుది పరీక్షలో పొందిన మార్కులకు 100 శాతం వెయిటేజీ ఇస్తారు. ట్రేడ్ టెస్టులోనూ అర్హత సాధించాలి. ఏవీఎన్ఎల్ గ్రూప్ యూనిట్లలో అప్రెంటిస్‌గా చేసినవారికి ఐదు మార్కులు అదనం ఇస్తారు.

అసిస్టెంట్: ఎల్ఎల్‌బీ తుది పరీక్షలో సాధించిన మార్కులకు 85 శాతం, ఇంటర్వ్యూకు 15 శాతం వెయిటేజీ ఇస్తారు.

- విద్యార్హతలకు సంబంధించిన తుది పరీక్షలో 65 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు 55 శాతం సరిపోతుంది.
- డిగ్రీ/డిప్లొమా మార్కుల ఆధారంగా అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేస్తారు. తర్వాత ఇంటర్వ్యూ/ ట్రేడ్ టెస్టు నిర్వహిస్తారు.
- ఇంటర్వ్యూ/ ట్రేడ్ టెస్టులు, తుది ఎంపికకు సంబంధించిన తాజా సమాచారం కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

**చిరునామా:** ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ది చీఫ్ జనరల్ మేనేజర్, హెవీ వెహికల్స్ ఫ్యాక్టరీ, ఆవడి, చెన్నై-600054' చిరునామాకు పంపాలి.

**దరఖాస్తుకు చివరి తేదీ:** ప్రకటన వెలువడిన 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.

**ప్రకటన వెలువడిన తేదీ:** 21.09.2024

**వెబ్‌సైట్:** https://avnl.co.in/

### ఎన్ఆర్‌సీబీలో అప్రెంటిస్ ఖాళీలు

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్‌కు చెందిన తమిళనాడు, తిరుచిరాపల్లిలోని నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఫర్ బనానా (ఎన్ఆర్‌సీబీ)లో.. 11 అప్రెంటిస్‌లకు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను కోరుతోంది.

● గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 05 ● టెక్నీషియన్ అప్రెంటిస్: 06

**విభాగాలు:** కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అగ్రికల్చర్, హార్టికల్చర్. **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ (బీఎస్సీ/ బీసీఏ)తో పాటు పని అనుభవం. **శిక్షణ కాలం:** ఒక సంవత్సరం. **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9,000; టెక్నీషియన్ అప్రెంటిస్‌లకు రూ.8,000. **ఎంపిక:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూల ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 07-10-2024

**వెబ్‌సైట్:** https://nrcb.icar.gov.in/

**చదువు** — కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలు ఉన్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:

**చదువు, ఈనాడు కార్యాలయం,**
**అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,**
**రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512**
**edc@eenadu.in**

# తాజా ఇంటర్న్‌షిప్‌లు

## హైదరాబాద్‌లో

### ఫీల్డ్ సేల్స్

సంస్థ: సెలబ్రేషన్స్
నైపుణ్యాలు: ఇంగ్లిష్, హిందీ, తెలుగు మాట్లాడటం
స్టైపెండ్: రూ.12,000
☛ internshala.com/i/24da28

## హైదరాబాద్, విశాఖల్లో

### వీడియో ఎడిటింగ్/ మేకింగ్

సంస్థ: మార్క్అప్
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, కేన్వా, ఫైనల్ కట్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/b995b0

**వీటికి దరఖాస్తు గడువు: అక్టోబరు 2**

## తాడేపల్లిలో

### గ్రాఫిక్ డిజైన్

సంస్థ: నవజీవన్ హోమ్స్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, కోరల్‌డ్రా, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.8,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 4
☛ internshala.com/i/bd2b26

## వర్క్‌ఫ్రమ్‌హోమ్

### క్యాడ్ డిజైన్

సంస్థ: గౌరవ్ పాండా
నైపుణ్యాలు: ఆటోడెస్క్ ఫ్యూజన్ 360, క్యాటియా, సాలిడ్‌వర్క్స్
స్టైపెండ్: రూ.12,000
☛ internshala.com/i/39344b

### ఈవెంట్ మేనేజ్‌మెంట్

సంస్థ: విద్యాశాల
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఇన్‌స్టాగ్రామ్, లింక్డ్ఇన్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.4,000
☛ internshala.com/i/09f03e

### డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: సంపన్నతా ఎంటర్‌ప్రైజెస్
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/880783

### గ్రాఫిక్ డిజైన్

సంస్థ: బిజారో
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఫిగ్మా
స్టైపెండ్: రూ.5,000 (వారానికి)
☛ internshala.com/i/377099

### బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: ట్రిగరెగ్జామ్
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/b2fd3b

### వీడియో ఎడిటింగ్/మేకింగ్

సంస్థ: ఎక్రాస్ ది గ్లోబ్ (ఏటీజీ)
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.3,000
☛ internshala.com/i/4c0f2d

### మోషన్ గ్రాఫిక్స్

సంస్థ: క్రియేటివైజ్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్
స్టైపెండ్: రూ.8,000-15,000
☛ internshala.com/i/0d28a0

**వీటికి దరఖాస్తు గడువు: అక్టోబరు 26**

### ఆన్‌బోర్డింగ్ (తెలుగు)

సంస్థ: గురూజీ ఆస్ట్రో
నైపుణ్యాలు: ఇంగ్లిష్, తెలుగు మాట్లాడటం, లీడ్ జనరేషన్
స్టైపెండ్: రూ.3,000-5,000
☛ internshala.com/i/a04c8f

### యానిమేషన్

సంస్థ: మీడియస్ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: 3డీస్ మ్యాక్స్, అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఇలస్ట్రేటర్, ఆటోడెస్క్ మాయా, బ్లెండర్ 3డీ, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.8,000
☛ internshala.com/i/834f73

### గ్రోత్

సంస్థ: యార్డ్‌స్టిక్
నైపుణ్యాలు: కంటెంట్, డిజిటల్, ఈమెయిల్, లింక్డ్ఇన్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ.5,000-10,000
☛ internshala.com/i/20b712

### ఫొటోగ్రఫీ

సంస్థ: బుద్ధా ఎడ్యుకేషన్ అసోసియేషన్ ఇన్‌కార్పొరేషన్
నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, ఫొటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.10,000
☛ internshala.com/i/f1db64

### విజిబిలిటీ అండ్ మార్కెటింగ్ ఇంటర్న్

సంస్థ: వేన్స్పైర్ ఎడ్‌టెక్ ప్రై.లి.
నైపుణ్యం: మార్కెటింగ్
స్టైపెండ్: రూ.1,500-10,000 (ఒకేసారి)
☛ internshala.com/i/dac92f

**వీటికి దరఖాస్తు గడువు: అక్టోబరు 25**